ఈ నెలలో....

కథలు (మాసపత్రిక)

4. నకిలీ హత్య — సుజనశ్రీ.
25. నిరుద్యోగి-దొంగ సర్టిఫికేట్ — శ్యాంబాబు.
37. పొగచుట్ట — మణి నారాయణ.
46. దెయ్యాలున్నాయ్ జాగ్రత్త! — దివాకర్ల సన్యాసిరాజు.
73. పాపకూపం — ఏ. వీ. మోహన్రావ్.
86. సోమనాథుని వజ్రం — యం. విద్యుల్లత.
102. బ్లాక్ మెయిలర్స్ — పి. గోపాలరావు.
118. సాక్ష్యం ఇచ్చిన టెలిఫోన్ — అజీజ్.
132. పండిన పాపం — ఎల్. రామగోపాల్.
143. కొత్తపిట్ట — కంచర్ల రమణ.
157. రక్తంలేని శవాలు — కె. చందర్ రావ్.
173. పరలోక ప్రాప్తి (సీరియల్) — రమణశ్రీ.

నవలలు (సప్లిమెంట్)

3. వజ్రాల వేట — సుజనశ్రీ.
63. తమాషా దొంగలు — ఏ. వీ. మోహన్రావ్.
106. రహస్యం కావాలి — కె. విజయలక్ష్మి.
146. కాటేసిన యవ్వనం — టెంపోరావ్.
181. ఖైదీ (సీరియల్) — ఏ. వీ. మోహన్రావ్.

ఇవికాక — లాయరు సలహాలు, చెప్పుకోండి చూద్దాం, అపరాధ పరిశోధన పోటీ, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, సప్లిమెంట్ పోటీ, చివరి పేజి వినోదం, జోక్స్, మరెన్నో ఆకర్షణలు!!!

నకిలీ హత్య

సుజనశ్రీ

కడివెడుపాలను కలుషితం చెయ్యటానికి ఒక్క విషపు బొట్టు చాలు. అలాగే సాఫీగా, సుఖంగా, సాగిపోయే జీవితాన్ని తారుమారు చేయటానికి ఒక్క క్షణిక దుర్ముహూర్తం చాలు. నీటిమీద సూర్యకిరణాలు పడి తళుక్కున మెరిసినంత సేపట్లోనే పచ్చని సంసారాలు సైతం భగ్గున మసి అయిపోతుంటాయి.

రాఘవరావు జీవితంలో అదే విషబిందువు, ఎవ్వరూ ఊహించని పరిణామాల్ని కలుగజేసింది.

రాఘవరావుకి విజయవాడలో నాలుగైదురకాల వ్యాపారాలున్నయ్. అన్నీ లక్షలమీద నడుస్తున్నవే. అతడి వయసు నలభై పడిలో నడుస్తోంది. బిడ్డలు లేరు. మొదటి భార్య చనిపోయింది. సరోజ అతడి రెండో

కళత్రం. వారిద్దరి సంసారంలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా రోజులు గడుస్తున్నయ్.

రాఘవరావు చాల నెమ్మదస్తుడు. అతడికి శత్రువు లెవరూ లేరంటే అతిశయోక్తి కాదు. ఎవరినీ ద్వేషించి ఎరగడు. అటువంటిది ఆ క్షణంలో అతడు కోపంతో నిలువెల్లా వణికిపోయాడు. కసితో ప్రపంచాన్నే మసి చెయ్యాలనేంతవరకూ వచ్చాడు. తన భార్యను ఆ క్షణంలో అక్కడే తలవని తలంపుగా చూడడంతో ఆమెను అక్కడికక్కడే నిలువునా చంపాలనుకున్నాడు. కాని అలా చంపితే తన కసి తీరదు. అంతకన్న ఎక్కువది ఏదైనా చేయాలి.

వ్యాపారరీత్యా, రాఘవరావు కారులో చీరాల వెళ్ళాడు. తను ఆరురోజులవరకూ రానని చెప్పి వెళ్ళాడు ఇంట్లో. కానీ రెండో రోజు సాయంత్రానికి అతడికి చీరాలలో పనులు పూర్తయాయి. అక్కడ్నుంచి నెల్లూరు దాకా వెళ్ళాల్సి ఉంది. అయినా, ఇంటికి తిరిగి వచ్చి సరోజతో ఒకరాత్రి గడిపి మళ్ళీ వెళ్దామనుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఇంటికి తిరుగుముఖం పట్టాడు.

చేతికున్న రిస్టువాచీ రాత్రి పదిగంటలు చూపుతోంది.

మనిషి రోజంతా ప్రయాణంచేసి ఉండటంవలన రాఘవరావు బడలికగా ఉన్నాడు. కళ్ళు మూతలు పడుతున్నయ్.

ఇంటిదగ్గర సరోజ ఒంటరిగా పడుకుని నిద్రపోతుంటుంది. లేదా నిద్రపట్టకపోతే ఏదో నవలో, వారపత్రికో చదువుతూ బెడ్ మీద అటూ ఇటూ పొర్లుతూ ఉండచ్చు

తన హఠాత్ ఆగమనం ఆమెకు ఆశ్చర్యాన్నే కలుగ జేస్తుంది.

కారు విజయవాడను సమీపించింది. కళ్ళు మత్తుగా వున్నాయి.

దోవలో ఎక్కడైనా ఒక కప్పు వేడికాఫీ త్రాగితే, నరాలకు కొంచెం సత్తువ చేకూరి, తను క్షేమంగా, తిరిగ్గా ఇల్లు చేరుకోగలడు, అనిపించింది.

రాఘవరావు కారుని స్లోచేసి, రోడ్డువారగా అటూ ఇటూ చూశాడు.

తాడేపల్లి సూక్ప్య బ్రిడ్జికివతల చెక్‌పోస్టుకి కొద్ది దూరంలో ఇరానీ రెస్టారెంట్ ఉంది. అక్కడ రాత్రిళ్ళే వ్యాపారం ఎక్కువ. లారీల వాళ్ళూ, కార్లలో ప్రయాణం చేసే దూర ప్రయాణీకులూ అక్కడ ఆగి కాఫీ, టీ, కూల్ డ్రింక్స్ ఇత్యాదివి సేవిస్తుంటారు.

ఇరానీ రెస్టారెంట్ ముందు చాలా కార్లు, లారీలు, రోడ్డుకి అటూ ఇటూ ఆగివున్నయ్. వాటి మధ్యగా చోటు చూసుకుని తన కారునీ ఆపాడు రాఘవరావు. కళ్ళు నులుముకుంటూ వెళ్ళి రెస్టారెంట్‌లోకి అడుగుపెట్టాడు.

లోపల అన్ని టేబుల్స్ చుట్టూ జనం ఉన్నారు. జ్యూక్‌బాక్స్‌లోంచి హిందీ సినిమా పాటలు వస్తున్నయ్. ఒక మూలగా ఖాళీ దొరికింది రాఘవరావుకి. అందులోకి జేరగిలబడి స్ట్రాంగ్ కాఫీకి ఆర్డరిచ్చాడు.

పొగలు గ్రక్కుతూన్న వేడికాఫీ తెచ్చి అతడి ముందుంచాడు సర్వర్. రాఘవరావు ఆత్రంగా సిప్ చేయ సాగాడు. ఆ వేడికాఫీకి అతడి కళ్ళు బాగా తెరిపిడి పడ్డయ్.

ఆఖరి గుటక సిప్ చేసి, కాఫీ కప్పుని సాసర్‌లో ఉంచ బోతూ అప్రయత్నంగా ఫామిలీ రూమ్ కేసి చూశాడు రాఘవరావు. ఉలిక్కిపడ్డాడు. తను చూస్తున్నది కలా, నిజమా అని భ్రమపడ్డాడు. మరొక్క క్షణం పరికించి చూసి, తను వాస్తవాన్నే చూస్తున్నాడని నిర్ధారించు కున్నాడు.

ఫామిలీ రూమ్‌లో తన భార్య సరోజ, మేనేజర్ కృష్ణ ఎదురెదురుగా కూర్చుని, కబుర్లు చెప్పుకుంటూ నవ్వు కుంటూ స్ట్రాలోంచి కూల్ డ్రింక్‌ని పీలుస్తున్నారు.

మేనేజర్ కృష్ణ రాఘవరావు దృష్టిలో ఇంకా పసి వాడే. తన ఫరమ్‌లో ముందు సేల్స్‌మెన్‌గా చేరాడు కృష్ణ. కొద్దికాలంలోనే వ్యాపార మెళకువలన్నీ నేర్చుకుని రాఘవరావు మన్నన పొందాడు.

కృష్ణ సరోజకన్న అయిదేళ్ళు చిన్నవాడు. ఎర్రగా, కండలు దిరిగిన దేహంతో, అందంగానే ఉంటాడు. అతడి ప్రతిభను చూసి రాఘవరావు కృష్ణను ఏకాం టెంట్‌గా హోదా పెంచాడు. మరో రెండేళ్ళలోనే కృష్ణను ఒక ఫరమ్‌లో మేనేజర్‌గా చేశాడు. ఆ రోజున కృష్ణ ఆనందంతో ఏడ్చాడు. కళ్ళవెంట నీళ్ళు కారినయ్.

"సార్! మీరు మనుష్యులు కారు! నా పాలిటి దేవుళ్ళు!" అంటూ రాఘవరావు పాదాలు తాకి మరీ నమస్కరించాడు కృష్ణ, రాఘవరావు ఎంత వారిస్తున్నా వినకుండా.

అటువంటి వ్యక్తి ఈనాడు తనకే ద్రోహం తలపెట్టి, తన భార్యతో, తను లేనప్పుడు విలాసాలు అనుభవిస్తు న్నాడా?

సరోజ గూడ అందమైంది. ఆమె పెదాలు దొండ పండులాగుంటాయ్. మామిడిపండులా కొనదేలిన గడ్డం, కోలముఖం, మంచి ఆకర్షణీయంగా ఉంటుంది.

రెండో పెళ్ళి అని పేరుకేగానీ, భార్యాభర్తలు ఇద్దరూ అన్యోన్యంగా కలసి పోయారు. ఆమెకు ముప్ఫై సంవత్సరాలు దాటినా బహుశా పిల్లలు కలగకపోవటంతో, ఆమె శరీరం సడలలేదు. ఆడా, మగా, పిల్లా, జెల్లా అందరి చూపుల్నీ ఆకట్టుకోగల శక్తి ఉంది ఆమెలో. కృష్ణగూడ ఆమె చూపుల్లోంచి తప్పించుకోలేక పోయాడేమో!

సరోజ, కృష్ణ ఇద్దరూ, గాఢప్రేమికుల్లా, కొత్తగా పెళ్ళయిన జంటలా, ఒకరినొకరు చూసుకుంటున్నారు, చూపుల్ని మరల్చకుండా! అక్కడ, మిగతా జనం తమ వంక అసూయగా, ఆశగా చూస్తున్నారన్న విషయమే వాళ్ళకు పట్టలేదు.

సరోజ గులాబీరంగు నైలెక్స్ చీర కట్టుకుంది! దానికి మ్యాచ్ అయ్యే రంగులోనే స్లీవ్ లెస్ జాకెట్ వేసుకుంది. ఎర్రగా, ఆమె జబ్బలు, ఆ నిశీ రాత్రివేళ చూపరులకు మత్తెక్కించేలా, ఆమె జాకెట్లోని సంపదను, ఊహించుకునేలా చేస్తున్నయ్.

కృష్ణ ఏదో చెబుతుంటే, సరోజ తలాడిస్తూ వింటోంది చిరునవ్వుతో. సర్వర్ బిల్లు తెచ్చాడు సాసర్లో పెట్టుకుని. కృష్ణ అయిదురూపాయల నోటుని అందులో పడేశాడు. చిల్లర నీవే ఉంచుకో అని చెప్పినట్టున్నాడు, సర్వర్ అతి వినయంగా సలాం చేశాడు.

ఇద్దరూ చేతిలో చెయ్యివేసుకుని లేచారు. వాళ్ళు తన నెక్కడ చూస్తారో అని రాఘవరావు తలదించుకున్నాడు,

ఒక చేతిని ముఖానికి అడ్డంగా ఉంచుకుని. అతడలా చేయకపోయినా, ఆ పరిసరాల్ని గమనించే స్థితిలో లేరు కృష్ణ, సరోజలు. రెస్టారెంట్ దాటి బయటకు వెళ్ళారు. నల్లరంగు అంబాసిడర్ కారులో కూర్చున్నారు. సరోజ స్టీరింగ్ ముందు కూర్చుంది. ఆ కారూ తనదే!

కారు స్టార్ట్ అయి వెళ్ళిపోగానే, రాఘవరావు లేచాడు. బిల్లుచెల్లించి బయటకు వచ్చాడు ఆదరాబాదరాగా! తన కారుని గూడ ఆ కారు వెనుకనే పరుగెత్తించాడు.

మరీ చేరువకాకుండా ఆ కారుని వెంబడిస్తున్నాడు రాఘవరావు. ఆ కారు గమ్యం ఎక్కడకో అప్పటికే అతడి ఊహకు తోచింది. తన కళ్ళారా చూస్తేగానీ, దాన్ని నమ్మశక్యం కావటం లేదు.

నల్లరంగు కారు కృష్ణా బ్యారేజీకి ఇవతలే మలుపు తిరిగింది. మట్టిరోడ్డుమీద ఎర్రని దుమ్ము లేస్తోంది, కారు వేగానికి. సీతానగరం కొండను చుట్టుకుని, కోదండరామా లయాన్ని దాటి ఇంకా ముందుకు వెళ్ళింది. తర్వాత మరో మలుపు తిరిగింది.

ఆ మలుపువరకు వెంబడించిన రాఘవరావు అక్కడే ఆగిపోయాడు. ఆ మలుపు తిరిగితే, చెట్ల సముదాయం మధ్య తను కృష్ణవేణీ తీరాన కట్టుకున్న గెస్ట్‌హౌస్ వస్తుంది.

వ్యాపారరీత్యా వచ్చే తన అతిథులకు 'సకల మర్యాదలూ' చేయటానికి అనువుగా ఆ గెస్ట్‌హౌస్‌ని కట్టాడు. ఎప్పుడైనా తనకు విశ్రాంతి కావాలనుకున్నా తనొక్కడే అక్కడకు రావటం కద్దు. పెళ్ళయిన కొత్తల్లో సరోజతో తను చాలాసార్లు ఈ గెస్ట్‌హౌస్‌కి వచ్చాడు. ఈ మధ్యనే బిజినెస్‌తో తీరికలేక రావడం పడడంలేదు.

ఏదో ఆలోచనకు వచ్చినవాడిలా, రాఘవరావు కారుని వెనక్కి మళ్ళించాడు. ట్రంక్ రోడ్డెక్కాడు. తిరిగీ తను వచ్చిన దోవనే కారుని పోనిచ్చాడు. దూరంగా కనుపించే విజయవాడ నగరం దీపాల కాంతి అంతకంతకూ దూర మౌతోంది.

2

తన నిర్ణీత ప్రోగ్రాం ప్రకారం, మొత్తం ఆరురోజులు గడిచాకనే, తిరిగి ఇల్లు చేరాడు రాఘవరావు. నెల్లూరులో ఉన్న నాలుగురోజులూ అతడు తన భావి కార్యక్రమాన్ని గురించే తీవ్రంగా ఆలోచించాడు. తిరిగి ప్రయాణమయే నాటికి రాఘవరావు ఒక నిర్ణయానికి వచ్చాడు.

మామూలు ప్రశాంతతో, ఎల్లప్పుడూ ముఖాన తాండ వించే చిరునవ్వుతో ఇల్లుచేరాడు రాఘవరావు. అప్పటి వ్యక్తిని చూసిన వారెవరైనా, అతడి మనసులో హాలా హాలం జ్వాలలు విరజిమ్ముతున్నాయనిగానీ, త్రాచుపాము కన్న ఎక్కువ పగతో, నిలువెల్లా విషాన్ని నింపుకున్నాడని గానీ ఊహించలేరు.

ఆప్యాయంగా భార్యను కౌగలించుకుని, సున్నితంగా చుంబించాడు. సరోజ ప్రవర్తన గూడ రాఘవరావు ఊహించినట్టుగానే, సాధారణంగానే ఉంది.

రెండు వారాలు గడిచాయి. రాఘవరావు తన కార్య క్రమాన్ని అమలు చేసేందుకు ఉద్యుక్తుడైనాడు.

"కృష్ణా! మన ఇన్‌కమ్‌టాక్స్ ఎక్కౌంట్లు సరిచేయా ల్సిన రోజులు దగ్గర పడుతున్నయ్. మన గెస్ట్‌హౌస్‌కి వెళ్ళి రెండు రోజులు అదే పనిగా కూర్చోకపోతే అవదు. రేపు సాయంకాలమే అక్కడకు వెడదాం! జమాను

కామయ్యను అకౌంటు పుస్తకాల్ని అక్కడకు తెమ్మని చెబుతాను! అన్నట్టు నీ వెప్పుడూ మన గెస్ట్‌హౌస్ చూడ లేదు కదూ?''

''లేదండీ!'' కృష్ణ అదోలా నవ్వాడు. రాఘవరావు గూడ అతడివంక చూశాడు. ఇద్దరూ గుంభనంగా ఒకరి నొకరు చూసుకున్నారు.

వ్యాపార లెక్కలు సరిచేసే నిమిత్తం, తనూ, కృష్ణ, గెస్ట్‌హౌస్‌కి వెడుతున్నట్టుగా అటు భార్యకూ, ఇటు ఆఫీసులో అందరికీ వెల్లడిచేశాడు రాఘవరావు.

''అక్కడ మనం ఎకౌంట్స్‌తో విసుగెత్తిపోయి నపుడు, హాయిగా పక్షుల్ని షూటింగ్ చెయ్యొచ్చు. లేదా కృష్ణానదిలో ఈతలు కొట్టవచ్చు!'' అన్నాడు రాఘవ రావు.

''నాకు అంతబాగా రాదు రైఫిల్ షూటింగ్. పక్షిని కాల్చబోయి మీకు గురిపెట్టినా పెట్టగలను నేను!'' కృష్ణ విట్ వేసినవాడిలా నవ్వాడు.

అతడి మాటలకు మనసు చివుక్కుమన్నా, పైకి ఫ్రీగా నవ్వేశాడు రాఘవరావు ఆ మాటల్ని లక్ష్యపెట్టనట్టుగా. ఆఫీసులోని స్టాఫ్ అతడి మాటలకు తెల్లబోయారు.

అనుకున్న ప్రకారం సాయంత్రమే రాఘవరావూ, కృష్ణ ఇద్దరూ కారులో గెస్ట్‌హౌస్‌కి చేరుకున్నారు.

అదే ప్రథమంగా చూస్తున్నట్టుగా, ప్రతి గదినీ శోధించి చూశాడు కృష్ణ. ''చాలా బాగుందండీ! మీ అభిరుచులకు తగ్గట్టుగా దీన్ని తీర్చిదిద్దారు,'' అని మెచ్చు కున్నాడు.

రాత్రి పొద్దుపోయేదాకా కబుర్లు చెప్పుకున్నా రిద్దరూ.

రాఘవరావు రిఫ్రిజిరేటర్ తెరచి సీసాలూ, గ్లాసులూ తెచ్చాడు.

"అబ్బే! ఇప్పుడెందుకండీ ఇవన్నీ?" మొహమాట పడ్డాడు కృష్ణ.

"నీవు బాగా తాగుతావని నాకు తెలుసులేవోయ్! బాస్ ముందు తాగాలని బిడియపడుతున్నావా? నీకు ఫుల్ పర్మిషన్ ఇస్తున్నాను సరా?" రాఘవరావు నవ్వాడు.

సీసాల్లో ద్రవాన్ని పోసి, ఐస్ క్యూబ్స్ వేశాడు రాఘవరావు. ఐస్ వేసిన మద్యాన్ని ఎంత తాగినా తనివి తీరదు. రెండు పెద్ద సీసాలు ఖాళీ అయాయి. మూడోది తెరిచారు.

"బాస్! నాకు నిద్రా ముంచుకొస్తోంది!" అంటూ తూలుతున్నాడు కృష్ణ.

అతడి చేతిలోని గ్లాసుని మళ్ళీ నింపాడు రాఘవరావు. కృష్ణ చేతిలో గ్లాసుని సరిగా పట్టుకోలేకపోతున్నాడు. అయినా, ఆరాటపడే చిన్న పిల్లవాడిలా, ఆత్రంగా తాగేశాడు గట గట. అతడి కళ్ళు గట్టిగా మూసుకు పోతున్నయ్. చేతిలోని గ్లాసు క్రిందపడిపోయింది. గచ్చు నేలమీద పగిలి, పెంకులు చెల్లాచెదురుగా పడ్డయ్. ఆ చప్పుడుగూడ వినే స్థితిని దాటిపోయాడు కృష్ణ.

బెడ్ దగ్గర కెళ్ళాలని లేవబోయి, మళ్ళీ సోఫాలోనే, నిర్జీవిలా వాలిపోయాడు కృష్ణ.

రాఘవరావు మరోసారి అతడ్ని లేవదీశాడు బలవంతం మీద. పట్టు విడిపోంగానే, కృష్ణ వానపాములా జారి పోయి సోఫాలో పడ్డాడు.

కృష్ణ బాగా మత్తులో వున్నాడని నిర్ధారణ చేసు కున్నాడు రాఘవరావు. డ్రాయర్ తెరచి, తను ముందే

తెచ్చి సిద్ధం చేసిన సర్జికల్ నైఫ్‌ని తీశాడు. దాంతో తన చిటికెన వ్రేలిని తెగ్గోసుకున్నాడు. త్రాగిన మైకంలో అతడికి అంతగా బాధ తెలీలేదు. పైగా తనపై తానే ఆపరేషన్ చేయగల ధైర్యాన్నిచ్చింది ఆ మైకం.

తెగిపోయిన చిటికెన వ్రేలుకి మాణిక్యం పొదిగిన ఉంగరం కూడ ఉంది. ఆ ఉంగరంతో సహా తెగిన చిటికెన వ్రేలుని నేలమీద పడేశాడు. తెగిన వ్రేలినించి కారిన రక్తపుబొట్లు నేలమీదా, కృష్ణ శరీరంమీద పడేలా చేశాడు. మరో వస్తువు, కట్టెలుకొట్టే గొడ్డలి తెచ్చి కృష్ణ కాళ్ళదగ్గర పడవేశాడు. దానిమీదా నెత్తురుబొట్లు చిందించాడు. గొడ్డలిమీద రక్తం మరకలమీద కృష్ణ చేతి వ్రేలి ముద్రలు స్పష్టంగా పడేలా అద్దాడు.

తెల్లవారుతూనే ఆరు గంటలకల్లా అక్కౌంట్ పుస్తకాల దొంతరతో కామయ్యను రమ్మని చెప్పి ఉన్నాడు రాఘవరావు. కృష్ణ తన మత్తులోంచి తేరుకోక మునుపే కామయ్య వచ్చేస్తాడు. దాంతో, తను కృత్రిమంగా ఏర్పాటు చేసిన సాక్ష్యాధారాల్ని కృష్ణ తుడిచివేయలేడు.

కారుని గెస్ట్‌హౌస్ ముందే వదిలేసి, కాలినడకనే, అడ్డదోవన చెట్ల గుబుర్లలోంచి బయటకు నడిచాడు రాఘవరావు. తెల్లవారకముందే చేరువలోని స్టేషన్‌కి వెళ్ళి దక్షిణంగా వెళ్ళే ప్యాసింజర్ రైలెక్కాడు.

ఉదయం పదిగంటలకల్లా బాపట్లలో దిగాడు. చాకబారు లాడ్జిలో మారు పేరుతో రూము తీసుకున్నాడు. అలసటతో, నిద్ర లేమితో, మనోవ్యధతో బాధపడే వాడిలా మంచి నిద్రలోకి జారుకున్నాడు తీరిగ్గా.

3

ఆ రోజు సాయంత్రం ఎడిషన్‌లోనే, తాజావార్తల క్రింద, కృష్ణ హత్య ఉదంతం ప్రచురింపబడింది, రాఘవ రావు ఊహించినట్టుగానే.

కామయ్య అనుకున్నంత పనీ చేశాడు. ఆరు గంటలకే, అక్కౌంట్ పుస్తకాలు తీసుకువచ్చి, వారగా వేసి ఉన్న తలుపు తెరిచాడో, లేదో కెవ్వున కేక పెట్టాడు. అప్పటి కింకా కృష్ణ సోఫాలోనే ఒరగబడి నిద్రోతూన్నాడు. కామయ్య లోపల వేటినీ తాకలేదు. వెనువెంటనే పోలీసులకు కబురు పెట్టాడు.

పోలీసులు కుదింపి లేపాక గానీ కృష్ణ లేవలేదు. నేల మీద పడి ఉన్న తెగిపోయిన ఉంగరపు చిటికెన వ్రేలూ, రక్తపు మరకలూ, గొడ్డలినీ చూశాక, కృష్ణ తన యజమాని రాఘవరావుని హత్య చేశాడని నిర్ధారణ చేశారు పోలీసులు. అయితే చిటికెన వ్రేలు మినహా మిగతా శవాన్ని ఎలా మాయం చేసినట్లు? ఎక్కడన్నా గొయ్యి త్రవ్వి అందులో పూడ్చాడా? లేక కృష్ణానదిలో పార వేశాడా?

ఆ తర్వాత కృష్ణ ఈ హత్య చేయటానికి పురిగొల్పే కారణాల్ని అన్వేషించారు పోలీసులు. నౌకర్లను ప్రశ్నించినమీదట, కృష్ణకూ సరోజకూ అక్రమ సంబంధం ఉన్నదన్న విషయం బయటపడింది.

సరోజ భర్తా, సరోజ ప్రియుడూ ఇద్దరూ చిత్తుగా త్రాగేసి, మనసులోని పగను బయట పెట్టుకుని యుద్ధానికి తలపడైనా ఉండాలి. లేదా తమ మార్గాన్ని సుకరం చేసుకోటానికై సరోజ, కృష్ణ పథకం వేసుకుని, పథకం

ప్రకారం రాఘవరావును ఒంటరిగా ఏదో మిషపై గెస్ట్ హౌస్ కి తీసుకెళ్ళి, అతణ్ని హత్య చేసి వుండాలని అభిప్రాయ పడ్డారు పోలీసులు.

ఈ హత్యకు సరోజ ప్రోద్బలం ఉందని ప్రత్యక్ష సాక్ష్యాలేవీ దొరక్కపోవడంతో, ఆమెను వదిలేసి, కృష్ణను మాత్రం హత్యానేరంపై అరెస్టు చేశారు పోలీసులు.

దిన పత్రికలో వచ్చిన పై సంగతులను చదివి మనసారా సంతోషపడ్డాడు రాఘవరావు. కృష్ణ ఎటువంటి సందిగ్ధావస్థలో ఉంటాడో ఊహించుకున్నాడు. తనకేం తెలియదని కృష్ణ మొత్తుకుని ఉంటాడు. కానీ తన బాస్ ఏమైపోయాడో అర్థంకాక తన్నుకు చస్తుండాలి. నిజంగా తనే త్రాగిన మైకంలో, ఒళ్ళు పైని తెలీకుండా బాస్ ని హత్యచేసి ఉంటాడా? మరయితే శవం ఏమయినట్టు? అంతుపట్టని ప్రశ్నలకు సమాధానాలు దొరక్క కృష్ణ చచ్చే చావు చస్తూ ఉంటాడు.

పొట్ట రెండుచేతుల్లో పట్టుకుని నవ్వుకున్నాడు, రాఘవరావు.

పేపరు కథనం ప్రకారం, సరోజ ముందు బుకాయించినా, చివరకు తన రహస్య ప్రణయాన్ని ఒప్పుకుంది.

సరోజ గూడ కృష్ణ ఈ హత్య చేసి ఉండడనే అభిప్రాయంలో ఉంది. మరయితే ఆమె భర్త ఎలా మాయమయాడు? చిటికెన వ్రేలు నరకబడి శవం మాయం చేయబడిందా? ఈ ప్రశ్నలతో సరోజ నరకయాతనను అనుభవిస్తూ ఉంటుంది.

ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక మొదలైన

దినపత్రికలన్నీ కొనేవాడు రాఘవరావు. కృష్ణపై ఆరోపింపబడిన హత్యోదంతాన్ని తీరుబడిగా చదువుతూ, తను చేసిన పనికి సంతోషపడేవాడు.

ఎంతో జాగ్రత్తగా, ఆలోచించి మరీ తను పథకాన్ని వేశాడు. తనకై తను కావాలనే మాయమయాడని ఎవరూ అనుమానించలేరు. గుట్టుగా సంచరిస్తూ, అటు బ్యాంక్‌లోంచి డబ్బు విత్‌డ్రా చెయ్యటం కానీ, ఇటు మరేదైన విలువగల వస్తువుల్ని అమ్మటంగానీ చేయలేదు. అలా చేస్తే నిగూఢంగా తిరిగే ఈ నూతన వ్యక్తిపై ఎవరికైనా అనుమానం కలగవచ్చు. అందుకే పదివేల రూపాయలు రెడీ క్యాష్ దగ్గర పెట్టుకున్నాడు. అది పూర్తిగా అయిపోయేలోగానే కృష్ణ ఉరికంబం ఎక్కాలి.

అయితే తన ఎడమచేతి చిటికెన వ్రేలు తెగిపోయింది. అది సెప్టిక్ కాకుండా నిరోధించేందుకు తగిన మందుల్ని సిద్ధంచేసే ఉంచుకున్నాడు. ఆ చేతికి వైద్యం కోసరం డాక్టర్ దగ్గరికి వెడితే తన ఉనికి బయట పడే ప్రమాదం ఉంది.

రాఘవరావు ఆశించినంత వేగంగా కోర్టులో పనులు జరగలేదు. వారాల తరబడి వాయిదాలు పడ్డాక విచారణకు వచ్చింది. అప్పటికి పేపర్లలో గూడ ఆ హత్యను గురించిన వార్తలు పడడం ఆగిపోయింది. కానీ అటు జైల్లో మరణంకోసం ఎదురుచూస్తూ కృష్ణ, ఇటు ఇంట్లో ఒంటరిగా మానసిక వేదనను అనుభవిస్తూ సరోజ క్షణాల్ని యుగాలుగా గడుపుతున్నారని రాఘవరావు ఊహించకపోలేదు.

కోర్టు వాయిదా దగ్గర పడుతోందనగా, రాఘవరావు

గడ్డాలూ, మీసాలు పెంచి సాయిబులా తయారయాడు. తనున్న చోటునుంచి విజయవాడకు మారాడు. కోర్టు కెదురుగా ఉన్న చవకబారు లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. ఆ గదిలో కిటికీ దగ్గర కూర్చుంటే, పోలీస్ వ్యాన్ కోర్టు ఆవరణలోకి రావడం, అందులోంచి, చేతులకు బేడీలు వేయబడిన కృష్ణ కోర్టుకి హాజరవటం అన్నీ కనిపిస్తూనే ఉంటయ్.

ప్రేక్షకుడిలా తను కోర్టుకి హాజరవాలనుకున్నాడు రాఘవరావు. కానీ ఆ పని చేయడంవల్ల అస్సలుకే మోసం రావచ్చని ఝడిసి, ఎలాగో తమాయించుకున్నాడు. అసలు తనిక్కడకు రావడమే దుస్సాహసం!

ఇంతవరకూ తన పథకం విజయవంతం అవటంతో, రాఘవరావు తర్వాత అంశాన్ని అమలుపరిచేందుకు ఆలోచించసాగాడు.

ఆ రోజున విచారణ పూర్తయి, తీర్పు చెప్పబడింది. కృష్ణకు మరణశిక్ష విధించబడింది.

రాఘవరావు మనసులోని పగ సగం చల్లారింది. ఇక రెండో భాగాన్ని పూర్తి చేయటానికి ఉద్యుక్తుడయాడు.

బాగా చీకటి పడ్డాక తన బంగాళా దగ్గరకు చేరుకున్నాడు రాఘవరావు.

గేట్లో గూర్ఖా బీడి కాల్చుకుంటూ కూర్చున్నాడు. వెనకవైపుకి వెళ్ళి, గోడ దూకి లోపలకు జారబడ్డాడు.

ఊచలు లేని కిటికీతలుపు నెట్టుకుని డ్రాయింగ్ రూమ్‌లోకి దూకాడు.

సరోజ తన బెడ్ మీద ఒంటరిగా పడుకుని ఆలోచిస్తున్నది. ఆమె ముఖాన విచారరేఖలు అలుముకున్నయ్.

ఈ కొద్దిరోజుల్లోనే సరోజ ఎన్నో ఏళ్ళు గడిచినదానిలా అయిపోయింది. ముఖాన ముసలికళ పడింది.

వారగా వేసివున్న బెడ్ రూమ్ గదితలుపు తోసుకుని లోపలకు వెళ్ళాడు రాఘవరావు.

దయ్యాన్ని చూసినట్టుగా భయపడింది సరోజ. ఆ భయంలో కెవ్వున కేక వేయబోయింది. ఆమె అలా చేయొచ్చని ముందే ఊహించిన రాఘవరావు తనచేత్తో ఆమె నోటిని గట్టిగా మూసేశాడు.

"నేను రావడం నీకు ఆశ్చర్యాన్ని కలిగించింది కదూ?"

సరోజకు నోట మాట రాలేదు. అవునన్నట్టుగా తలాడించింది చిత్రంగా అతడినే చూస్తూ.

"చనిపోయాడనుకున్న భర్త, తిరిగి క్షేమంగా వచ్చాడని బాధ పడుతున్నావా?" కుర్చీ లాక్కుని బెడ్ కి దగ్గరగా వేసుకుని కూర్చున్నాడు రాఘవరావు.

సరోజ శిలాప్రతిమలా బెడ్ మీదే కూర్చుండిపోయింది. ఆమె కళ్ళు జ్యోతుల్లా వున్నయ్. కానీ ఆ ముఖంలో వెనుకటి కళాకాంతులు లేవు.

"అయితే, కృష్ణమీదకు హత్యానేరం మోపబడేలా పరిస్థితుల్ని నీవే సృష్టించావన్నమాట." ఎలాగో గొంతు పెగల్చుకొని అడిగింది సరోజ.

"నా మనసులోని మర్మాన్ని సరిగా గ్రహించావ్! కారణంకూడా నీకు తెలుసు."

"అయితే ఇక్కడికెందుకు వేంచేసినట్టు? నన్ను చంపేస్తారా?"

"లేదు. నేను బ్రతికే ఉన్నట్టు నీకూ తెలియజేసి, నీ మనసులో కల్లోలాన్ని సృష్టించాలని. నాకు చేసిన ద్రోహానికి ప్రతీకారం తీర్చుకోవాలని!"

"అంటే! మీరు జీవించేవున్నట్టు అటు పోలీసులకు గానీ, ఇటు సంఘానికిగాని తెలియనివ్వనంటారు?"

"అంతే గదా మరి!" తన ఎడమచేతికున్న గ్లోవ్‌ని తీశాడు రాఘవరావు.

అయిదు వ్రేళ్ళకు బదులు, నాలుగు వ్రేళ్ళే ఉన్నయ్.

"దీనికోసం మిమ్మల్ని మీరు ఇంతగా క్షోభ పెట్టుకున్నారా?"

"నా దయకోసం ప్రాకులాడుతున్నావా?" రాఘవరావు అనుమానంగా చూశాడు.

"దయ! నీలాంటి కసాయివాడి దగ్గర దయకోసం అర్థిస్తానా? దానికన్న, కరెంటు ముట్టుకుని చావనన్నా చస్తాను గానీ!"

"సరే! ఇక నేను వెడతాను. రేపు నీవు పోలీసుల దగ్గరకు వెళ్ళి చెబుతావా? నిన్నరాత్రి నా భర్త వచ్చి నాతో మాట్లాడి వెళ్ళాడని! అలా చెప్పకు. నీ మాటల్ని పోలీసులు ఛస్తే నమ్మరు. పైగా నీకు మతి భ్రమించిందనుకుంటారు" అంటూ జేబులోంచి జేబుగుడ్డను తీసి, సరోజ ముఖానికి అదిమిపట్టాడు రాఘవరావు.

క్లోరోఫారమ్ వాసనకు సరోజ ఒళ్ళు తెలీని పరిస్థితిలో బెడ్ మీద వాలిపోయింది.

5

ఆరోజే కృష్ణపై మరణశిక్షను అమలు పరచవలసిన తేదీ! పదకొండు గంటలకు కృష్ణ ఉరి తీయబడాలని న్యాయస్థానం తీర్పు.

సాయంత్రంవరకూ హోటల్ రూమ్‌లోనే ఉండిపోయాడు రాఘవరావు. ఆ తర్వాత తన ఇంటికి బయలుదేరాడు.

సరోజ అప్పుడే కారులో ఎక్కడకో వెడుతోంది. ఆమె వైఖరి చూస్తే ఉన్మాదంలో వున్నట్టుగా అనిపించింది రాఘవరావుకి.

మరో టాక్సీని పిలిచాడు. అందులో ఎక్కి సరోజను వెంబడించాడు.

సరోజ కారు కృష్ణా బ్యారేజీ దాటి, సీతానగరం వైపుగా మళ్ళింది.

టాక్సీని బ్యారేజీమీదే ఆపు చేయించాడు రాఘవరావు. ఛేర్ చెల్లించి వాడ్ని పంపేశాడు. కాలినడకనే గెస్ట్‌హౌస్ చేరుకున్నాడు.

అక్కడ సరోజ కాక ఇంకెవరన్నా వేచివున్నారేమో అని కొంచెంసేపు పరకాయించి చూశాడు రాఘవరావు.

ఎవరూ లేరని నిర్ధారణ చేసుకున్నాక, అతడు లోపలకు ప్రవేశించాడు.

డ్రాయింగ్‌రూమ్‌లో సరోజ సోఫామీద కూర్చుని వుంది. ఆమె ముందు టీపాయ్‌మీద విస్కీ సీసాలూ, గ్లాసులూ వున్నయ్. రెండు గ్లాసుల్లో విస్కీని వంచింది.

ఒక గ్లాసు ఎత్తి గటగట త్రాగేసింది. సరిగా అదే సమయానికి రాఘవరావు వచ్చి ఆమెకు ఎదురుగా సోఫాలో కూలబడ్డాడు.

ఈసారి సరోజ ఆశ్చర్యపడలేదు. "కృష్ణ ఉరి తీయబడ్డాడని తెలుసుకున్నాకనే వచ్చావ్ కదూ?" అంది సరోజ నెమ్మదిగా.

రాఘవరావు ఆమె వంక గర్వంగా చూశాడు.

"నీడలా నన్ను వెంటాడుతూనే ఉంటావని అనుమానిస్తూనే ఉన్నాను. ఇక్కడ ప్రశాంతంగా, ప్రాణాలు

విడుద్దామనుకుంటే, ఆ మాత్రం శాంతినిగూడ కరువు చేయాలనే వచ్చావ్. మీ మనసు చల్లబడిందా ఇప్పుడు?"
సరోజ ముఖం కందిపోయింది.

"ఇంటికి వచ్చిన వ్యక్తిని గౌరవించటంగూడ తెలీదల్లే ఉంది నీకు! నాకుగూడ విస్కీ ఇవ్వటం మర్చిపోయావా?"

"ఇక్కడ మీకు అడ్డం తగిలేవారెవరూ లేరు!" అంటూ సరోజ సీసా వంచి, ఇందాకనే విస్కీ పోసివున్న గ్లాసుకి మరింత నిండుగా పోసింది. తను ఖాళీచేసిన గ్లాసు లోకి కూడా మరికొంత వంచుకుంది.

"కృష్ణ ఆత్మశాంతికి!" అంటూ భర్త గ్లాసుకి 'టింగ్' మనేలా తాకించి, తన నోటిదగ్గర పెట్టుకుంది భర్తవంక చూస్తూ.

"కృష్ణ ఉరికంబాని కెక్కాక, కొద్దిరోజుల వ్యవధి తర్వాత నేను బయట పడాలనుకున్నాను. ఈ లోపల నేనెక్కడున్నదీ పోలీసులు వివరాలడిగితే అందుకు భలే అయిడియా వేసి వుంచాను. ఆరోజు నేనూ, కృష్ణ త్రాగిన మైకంలో దెబ్బలాడుకున్నాం. నా చిటికెనవ్రేలు తెగి పోయింది. కృష్ణ నా తలమీద గట్టిగా కొట్టాడు. దాంతో నాకు మతి భ్రమించింది. నేనెవరో ఏమిటో అంతా మరిచిపోయాను. గమ్యంలేని బాటసారిలా ఎక్కడెక్కడో తిరిగాను.

ఒకరోజు దోవంట నడుస్తూ, అరిటికాయ తొక్క మీద కాలువేసి జారిపడ్డాను. క్రింద పడటంలో తల రాయికి కొట్టుకుంది. అకస్మాత్తుగా తెలివి వచ్చింది. నేను కనబడక పోవటంతో కృష్ణను హత్యానేరంపై ఉరి తీశారని, తీరా ఇల్లుచేరాక తెలుసుకుని విభ్రాంతికి లోనైనాను...ఎలా ఉంది నా ఆలోచన!"

"బాగానే ఉంది! పోలీసుల్ని, న్యాయస్థానాన్ని బోల్తా కొట్టించి, నిర్దోషి అయిన కృష్ణను ఉరికంబాని కెక్కించిన మీ తెలివి సామాన్యమయిందా?"

"అలా అని నీవు నా ఆస్తిని నీ ఇచ్చవచ్చినట్టుగా అనుభవించవచ్చునుకుంటున్నావేమో! ఆ అవకాశం నీకు వీలులేకుండా చేస్తాను. తెలిసిందా?"

సరోజ మౌనంగా అతడివంకే చూస్తున్నది. ఆమె మౌనాన్ని చూస్తుంటే, రాఘవరావుకి కోపం చిర్రెత్తు కొచ్చింది.

"నీకూ, కృష్ణకూ మధ్య అక్రమ సంబంధం ఉన్నట్టుగా కోర్టులోనే ఋజువయింది. కనుక నీకు కానీ భరణం ఇవ్వనక్కరలేకుండా నేను విడాకులు పొందవచ్చు..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు రాఘవరావు.

ఎవరో అతడి కంఠాన్ని అదిమేసినట్టుగా అయింది. నోటంట మాట రాలేదు. కాళ్ళూ చేతులూ స్వాధీనం తప్పుతున్నాయ్.

"ఇక నీ ఆట కట్టింది రాఘవరావ్!" సరోజ ముఖాన విషాదమైన చిరునవ్వు వెలిసింది.

"అంటే! ఏమిటి నీవనేది?" గొంతులో గురగుర మన్నట్టుగా ఎంతో ప్రయత్నంమీద అనగలిగాడు.

"నీవు త్రాగిన విస్కీలో విషం కలిపాను," సరోజ మాటలు బాంబు పడ్డట్టుగా వచ్చినయ్.

"మరి నీవూ ఆ సీసాలోదే గదా వంచుకుని త్రాగావ్?"

"నీవు రాకముందే రెండో గ్లాసులో విషపు పొడిని వేసి విస్కీ పోసి ఉంచాను. దాన్నే నీవు త్రాగావ్!"

సరోజ సోఫాలోంచి లేచింది. అల్మారా తెరచింది. అందు లోంచి గొడ్డలి తీసింది. దాన్ని చేతిలో పట్టుకుని సుతారంగా ఊపుకుంటూ, మళ్ళీ అతడివద్దకు నడిచింది.

రాఘవరావు ముఖాన చెమట బిందువులు చేరుతున్నయ్.

"చట్టప్రకారం నీవు ఎప్పుడో చనిపోయావ్ తెలుసా? నీవు జీవించి ఉండే, నకిలీ హత్యతో కృష్ణను ఉరికంబ మెక్కించావ్! ఇప్పుడు నిన్ను అంతంచేసి, నీ శవాన్ని కృష్ణలో పారేస్తాను.అందుకు నన్నెవరూ అనుమానించరు. నీ తర్వాత నీ యావదాస్థికీ వారసురాలినై, లక్షణంగా అనుభవిస్తాను."

రాఘవరావుకి కొద్దికొద్దిగా స్పృహ తప్పుతోంది.

"డార్లింగ్! నన్ను అంతం చేయాలని వచ్చావ్! విష మిచ్చి నన్ను చంపి, ప్రియుడి ఎడబాటుకి సహించలేక ఆత్మహత్య చేసుకున్నట్టుగా కల్పిస్తావు కదూ? మనిద్దరిలో ఎవరో ఒకరే ఈ భూమ్మీద జీవించాలి! అవునా? కానీ నీ ప్లాన్ని నేనే అమలుచేశాను. కాకపోతే కొద్దిపాటి మార్పుతో! నా స్థానంలోకి నిన్ను రప్పించాను. నేను చావటానికి బదులు నీవే చస్తున్నావ్!" సరోజ వికటంగా నవ్వింది.

రాఘవరావు పూర్తిగా తల వాల్చేశాడు ప్రక్కకి. అతడి ముక్కుదగ్గర వేలుంచి, అతడి శ్వాస ఆగిపోయిందని నిర్ధారణ చేసుకుంది.

గెస్ట్‌హౌస్ తలుపు నెవరో ధడాలున తన్నారు. తలుపులు బార్లా తెరుచుకున్నయ్. ఇన్‌స్పెక్టర్ సురేష్ పోలీసులతో నిలబడి ఉన్నాడు.

సరోజ ఆశ్చర్యపోయింది, పోలీసులెలా రాగలిగారా ఇక్కడకు అని.

"నిన్ను వెంటాడుతూ వచ్చిన టాక్సీ డ్రైవర్ మాకు రిపోర్టిచ్చాడు. ఒక స్త్రీ ఒంటరిగా సీతానగరం వెళ్తోందనీ, ఆమెను అనుసరిస్తూ, మరో అనుమానాస్పదమైన వ్యక్తి వెంటాడుతున్నాడనీ! మాకు వెంటనే అనుమానం కలిగి వెతుక్కుంటూ వచ్చాం. కొద్దిక్షణాల ముందు వచ్చి ఉంటే, అతడి ప్రాణాన్ని కాపాడ గలిగి ఉండేవాళ్ళం!" అన్నాడు ఇన్‌స్పెక్టర్, రాఘవరావు మృతదేహం వంక సానుభూతిగా చూస్తూ.

"అతడు చేసిన ఘోరానికి తగిన శిక్షే పొందాడు. నేనిక ఏమైనా దిగుల్లేదు" అంటూ చేతులు ముందుకు చాచింది సరోజ. ఆమె చేతులకు బేడీలు పడ్డయ్.

"చాల్లే! స్త్రీ బుద్ధి ప్రళయాంతకః అన్నట్టు, కృష్ణతో అక్రమసంబంధం పెట్టుకుని నీ కాపురాన్ని నీవే కూలదోసుకున్నావ్! చేజేతులా కృష్ణను ఉరికంబానికెక్కించావ్! కట్టుకున్న భర్తను దారుణంగా హత్య చేశావ్!" అంటూ ఆమెను చీదరించుకున్నాడు ఇన్‌స్పెక్టర్ సురేష్. ★

తాపీగా సోఫాలో కూర్చొని పేపరు చదివిన ముసలాయన "ఏమేవ్, చైనా యుద్ధం ప్రారంభమయిందట," అన్నాడు.

భార్య ఆత్రంగా వచ్చి, "ఎప్పుడండి?" అంది.

"యిదిగో పేపర్లో వేశారు."

"అయ్యో, నా రాత! అది చాలా పాత పేపరండి. ఇందాక రవి ఏదో కావాలని, అది వెతికితీసి బయట పెట్టాడు." అంది భార్య చిరాకుగా.

—డాక్టర్ పెందుర్తి మాస్టర్జీ, విజయవాడ.

నిరుద్యోగి - దొంగ సర్టిఫికెట్

శ్యాంబాబు

లైబ్రరీలో అందరూ సీరియస్‌గా తలో పత్రికా పట్టుకొని దీక్షగా చదువుకొంటున్నారు. నేను చేతిలోని సినిమా పత్రికలోనుండి పదోసారి తలెత్తి ఎదురుగా కూర్చొన్న వ్యక్తి వైపు విసుగ్గా చూశాను.

గంటనుండి కనిపెడుతున్నా నతన్ని. 'హిందూ' డైలీ పేపర్ చదవడం మొదలెట్టి ఇంతవరకూ వదిలిపెట్టలేదు. పేపర్ హెడ్డింగ్ దగ్గరనుండి, చివరి పేజీ చివరి కాలమ్ 'ప్రింటెడ్ అండ్ పబ్లిష్డ్' అన్న అక్షరాల్లో సహా వదిలేట్టు లేదు...విసుగ్గా చేతిలోని సినిమా పత్రికను టేబిల్ మీద పారేశాను.

నా ప్రక్కనే వున్న వ్యక్తి మాంసం కొట్టువాడు

క్రింద పారేసిన ఎముకకోసం కాచుకున్న కుక్కలా చటు
క్కున ఆ సినిమా పత్రికను అందుకొన్నాడు. దానికోసం
అతగాడెంత సేపట్నుంచి కనిపెడుతున్నాడేమో మరి.

గోడగడియారం ఏడు కొట్టింది. అప్పటిగ్గానీ హిందూ
చదివే వ్యక్తికి ప్రపంచం తెలిసినట్లు లేదు. చటుక్కున
చేతిగడియారం చూసుకొని, పేపరు పారేసి లేచి వెళ్ళి
పోయాడు. మళ్ళీ ఎవరు తన్నుకుపోతారో అనే భయంతో
చటుక్కున అందుకొన్నాను నేను.

చకచక వాంటెడ్ కాలమ్స్ పేజీ త్రిప్పాను. నా
కళ్ళు ఒకొక్క ఎడ్వర్టయిజ్‌మెంటునూ ఆత్రుతగా వెతక
సాగాయి. రకరకాల ఉద్యోగాలకు రకరకాల ప్రకట
నలు. కొన్ని ప్రకటనలు చూస్తూంటే నవ్వాలో ఏడవాలో
అర్థం కాకుండా వుంటాయి. ఫస్ట్‌క్లాస్ గ్రాడుయేట్
కావాలి. వయసు ఇరవై అయిదు మించకూడదు. అనుభవం
పదేళ్ళకు తక్కువ వున్నవాళ్ళు దరఖాస్తు పంపనవసరం
లేదు.

మరికొంతమందికి మనదేశంలో చదువుకొన్నవాళ్ళు
పనికి రారు. గుమాస్తా పనికి కూడా సీనియర్ క్రేంబ్రిడ్జి
మెట్రిక్యులేట్ కాక సమానమైన విదేశ యూనివర్సిటీ
ఇచ్చిన పట్టాయే కావాలంట. ఇలాంటి ఎడ్వర్‌టయిజ్
మెంట్లు చదివి చదివి తల బొప్పికట్టింది.

రెండు పేజీల ప్రకటనలు చూసినా నా అర్హతలకు
తగిన ఉద్యోగం ఒక్కటి కనిపించలేదు. నిరాశగా పేపరు
పారేయబోయి, పేజీకి ఓ మూల బాక్సు కట్టివున్న ఓ ప్రక
టనను ఎందుకో మళ్ళీ చదివాను.

బొంబాయిలోని ప్రఖ్యాత సబ్బులు తయారుచేసే
కంపెనీ ప్రకటన అది. సేల్స్ ఆఫీసర్ ట్రెయినీలు కావా

లట. సైన్సు, ఆర్ట్సు, కామర్సు సబ్జక్టుల్లో పోస్ట్ గ్రాడ్యుయెట్ డిగ్రీ, వయస్సు పాతిక లోపు...అందమైన పర్సనాలిటీ, చాకచక్యంగా అమ్మకాల నిర్వహణ చేయగల నేర్పూ కావాలిట. జీతం వెయ్యి రూపాయలు...ప్చ్! లాభంలేదు. నాలాంటి బోడి సెకండ్ క్లాస్ బియ్యేగాడికి పనికొచ్చే ఉద్యోగం కాదది.

నిరాశగా పేపరు పారేసి లైబ్రరీలోనుండి బయట పడ్డాను, క్షణంసేపు రోడ్డుమీద అటూ ఇటూ పోయే ట్రాఫిక్‌ను చూస్తూ నిలబడ్డాను. ఎందుకో, ఎవరిమీదో తెలియని కసి కలుగుతోంది. ఇక ఈ జీవితంలో నాకు ఉద్యోగం దొరికే అవకాశం లేదనిపించింది. మెల్లిగా ఇంటివైపు నడక సాగించాను.

నేను బి. య్యే. పాసయ్యి నాలుగేళ్ళయింది. నాన్న చిన్నతనంలో పోయాడు. ఆ కష్టాల్లో ఆదుకొనే బంధువులు ఎవరూ లేకపోయారు. తను కష్టపడయినా తన కొడుకునో పెద్ద ఆఫీసర్ని చెయ్యాలనే ఉద్దేశ్యంతో అమ్మ పాచి పని చెయ్యడానికి కూడా సందేహించలేదు. అమ్మ ఆశలకు అనుగుణంగానే నేను బి. య్యే. ఫైనలియరు వరకూ ఎక్కడా తప్పకుండా, ప్రతి తరగతీ డిస్టింక్షన్‌లో పాసవుతూ కొద్దో గొప్పో మెరిట్ స్కాలర్‌షిప్ కూడా సంపాదించుకొంటూ చదివాను.

నిజానికి దరిద్రదేవత నన్ను జీవితాంతం వెంటాడాలనుకుంది కాబోలు...సరిగ్గా బి. య్యే. ఫైనలియరు పరీక్ష ఇంకా నెలరోజు లుండనగా టైఫాయిడ్ జ్వరంతో మంచాన పడ్డాను. అందులోనుండి తేరుకొనేప్పటికి పరీక్షః రెండు రోజుల్లో వున్నాయి. ఫలితంగా యూని

వర్సిటీ ఫస్టు రావడానికి బదులు బోడి సెకండ్ క్లాస్‌లో పాసైయ్యాను.

నేను బియ్యే పాసవడం, అమ్మ జబ్బుతో మంచాన పడడం ఒకేసారి జరిగాయి. ఇంకా పై చదువు చదివే అవకాశంగాని, స్తోమతగాని నాకు లేవనే విషయం సుస్పష్టమయింది. అనేక ఉద్యోగాలకోసం ప్రయత్నించాను. కొన్ని ఉద్యోగాలు అప్లికేషన్ పెట్టడం వరకే. మరికొన్ని ఇంటర్వ్యూల వరకు వచ్చి ఆగిపోయాయి. దక్షిణ ఉత్తరాయణాల్లో ఏదీ సరఫరా చెయ్యలేకపోవడంవలన ఇంతవరకూ కుదురైన ఉద్యోగం ఒక్కటీ లభించలేదు.

కొన్ని ఉద్యోగాలకు నా అర్హతలు సరిపోయినా, వాళ్ళు దరఖాస్తుతోపాటు పంపమన్న ఫీజు పంపలేక అవకాశాలు వదులుకోవలసి వచ్చింది. ఈ మధ్యకాలంలో చిన్నచిన్న వ్యాపారులకు కరెస్పాండెన్స్ చేసిపెడ్తూ, లెక్కలు వ్రాసిపెడుతూ నెలకి యాభై, డెభై సంపాదించేవాణ్ణి. ఈ పాడులోకంలో ఇక బాధలుపడలేనని అమ్మ స్వర్గాని కెళ్ళిపోయింది.

నాకీ జన్మలో సరైన ఉద్యోగం వస్తుందన్న ఆశ పోయింది. పలుకుబడో, డబ్బో లేకుండా కేవలం తెలివితేటలమీద ఆధారపడేవాళ్ళకు ఉద్యోగాలు దొరికే రోజులు కావివి. పైగా గుమస్తా ఉద్యోగానికి కూడా యమ్. ఎ. క్వాలిఫికేషను అడుగుతున్న రోజుల్లో నా సెకండ్ క్లాస్ బి. య్యే. డిగ్రీ నాలుగ్గిసుకోవడానికి కూడా పనికిరాదనిపిస్తోంది.

దిగులుగా అడుగులెయ్యసాగాను. సబ్బుల కంపెనీ ఎడ్వర్టయిజ్‌మెంట్ నా మనసులో మెదుల్తోంది. పోస్ట్ గ్రాడ్యేట్ క్వాలిఫికేషన్ కావాలి. నాకా అర్హత లేదు.

అయినా మనసెందుకో ఆ ఉద్యోంమీదే నిలిచిపోతుంది. ఎమ్. ఎ. చదవలేదన్న మాటేకాని, బియ్యేలో నేను చదివిన ప్రతి సబ్జెక్టులోనూ ఎమ్. ఎ. వాడికుండేంత నాలెడ్జి వుంది నాకు. అంతేకాక ఈ నిరుద్యోగపర్వంలో రోజూ వూరికే కూర్చోక కాసేపు లైబ్రరీ కెళ్ళి ఏదో ఒకటి చదువుతూ కూర్చునేవాణ్ణి. అయితే నేం, నీ నాలెడ్జి ఎవడికీ అక్కర లేదు.

"హలో! సుందరం!" ఎవరిదో పలకరింపు వినబడి వెనక్కి తిరిగాను.

రవికాంతారావు నవ్వుతూ కనిపించాడు. "హలో! రవీ!" అన్నాను.

రవి నా స్నేహితుడు.కాదు ప్రాణ స్నేహితుడు అనొచ్చు. కాలేజీలో పి.యు.సి. చదివిన రోజుల్నుండి స్నేహితులం. అంటే దాదాపు పదేళ్ళబట్టి. అయితే వ్యక్తిగతంగా, సామాజికంగా, ఆర్థికంగా వాడికీ, నాకూ పోలికేలేదు.

రవి లక్షాధికారి కొడుకు. ఉత్త అల్లరివెధవ. కాలేజీలో చదివే రోజుల్లో అమ్మాయిల్ని ఏడిపించడం, సినిమాలు చూడ్డంతప్ప వేరే వ్యాపకంలేదు వాడికి. కాపీకొట్టడంలో ఎక్స్‌పర్టు. వాడి జీవితంలో పుస్తకం పట్టిన పాపాన ఏనాడూ పోలేదు. కాపీలుకొట్టి అత్తెసరు మార్కుల్తో పాసయేవాడు. బియ్యే పాసయ్యాక వాళ్ళ నాన్న తన ఇన్‌ఫ్లుయెన్స్ ఉపయోగించి వాడికి యమ్. ఏ. సీటు తెప్పించాడు. ఆ తర్వాత — మన యూనివర్సిటీల్లో ఫస్టు క్లాసు తెచ్చుకోవడం అనేది స్వశక్తిమీద కాదని చాలా మందికి తెలియదు. రవి నాన్న డబ్బు, ఆ ప్రొఫెసరు వాళ్ళవాడే కావడం, ఇంకా మరికొన్ని రాజకీయాలు, ఇవన్నీ వాడికి ఎమ్. ఎ. ఎకనామిక్స్‌లో ఫస్టుక్లాసు వచ్చేట్లు చేసినయ్.

ఎమ్. ఎ. పరీక్షల్లో వ్రాయడానికి ఎస్సేలు తయారు చేసుకోవడం రాకపోతే, వాడి బదులు నేను పుస్తకాలు చదివి వాడికి ఎస్సేలు తయారు చేసిపెట్టేవాణ్ణి. ప్రస్తుతం వాళ్ళ నాన్న కమిటీ మెంబరుగా వున్న ఓ కాలేజీలో లెక్చరరుగా చేస్తున్నాడు. గాడ్ సేవ్ హిజ్ స్టూడెంట్స్!

"ఏరా ఎక్కడినుండి? తలొంచుకుని ట్రాజెడీ హీరోలా నడిచి వెళ్ళిపోతున్నావ్?" అడిగాడు రవి.

"ఏముంది. మామూలే. లైబ్రరీనుండి?"

"ఏమన్న కొత్త ఉద్యోగాలు కనిపించాయా?"

"చ్చ! ఆశ వదిలేసుకొన్నాను" అన్నాను నీరసంగా.

మోడరన్ కేఫ్‌లో కాఫీ త్రాగింతరువాత ఇద్దరం విడిపోయాము.

నా రూముకొచ్చి చిరిగిన చాపమీద నడుం వాల్చిం తరువాతకూడా, నా మనసులో నుండి ఆ ఉద్యోగం విషయం పోలేదు. వెయ్యిరూపాయల జీతం. ఎమ్. ఏ. క్వాలిఫికేషను. సబ్బుల కంపెనీ ప్రకటన మనసులో గిర్రున తిరుగుతోంది.

ఎలా వచ్చిందో తెలియదు. నా మనసులో ఆ ఆలోచన ఎలా ప్రవేశించిందో తెలియదు. ఝుమ్మన తిరిగే జోరీగలా ఆ ఆలోచన నా మనసులో ప్రవేశించింది. చటుక్కున లేచి కూర్చొని ఆలోచించసాగాను.

చాలీచాలని అతుకులబొంత జీవితంకన్నా, ఇంటిపేరు, స్వంతపేరూ మార్చుకోవటంలో తప్పు లేదనిపించింది. అవును; రవిగాడికి ఆ సబ్బుల కంపెనీలో సేల్స్ ఆఫీసర్ ప్టెయినీకి కావలసిన లక్షణాలన్నీ వున్నాయ్. ఎమ్. ఏ. ఎకనామిక్స్‌లో ఫస్ట్‌క్లాస్ డిగ్రీ వుంది. వయసు పాతికలో వుంది. వాడికి లేనిదల్లా నాలెడ్జి. వియోగానికి, ఉత్పత్తికి

తేడా తెలియని చదువు. కాని నాకు? వాడి బదులు వాడి పుస్తకాలన్నీ నేను చదవడంవలన ఆ యమ్మే డిగ్రీ లేక పోయినా ఆ సబ్జెక్టుమాత్రం క్షుణ్ణంగా వచ్చు. అంతకు మించిన తెలివితేటలు, లోకజ్ఞానం వున్నాయి. కాని లేనిదల్లా ఆ ఎమ్మే డిగ్రీ.

అది రవిగాడికుంది. వాడి సర్టిఫికేట్లు వుపయోగించుకొని, నేనే చింతపిక్కల రవికాంతరావులా ఆ ఉద్యోగానికి అప్లయి చేస్తే??

ఎందుకో గుండెలు దడదడలాడాయి. పట్టుబడితే శ్రీకృష్ణ జన్మస్థానం చేరుకోవలసి వస్తుందనుకోగానే భయం అనిపించింది. కాని, కాని ఈ చిరుగుల జీవితం, ఈ అర్ధాకృతి జీవితం, ఈ పేదరికపు జీవితం, ఈ నికృష్టపు జీవితం ఇంకా భయంకరంగా కన్పిస్తున్నాయి. యస్! తప్పులేదు! రవిగాడి సర్టిఫికెట్లనే నావిగా చూపించి ఆ సేల్స్ ఆఫీసరు ఉద్యోగం సంపాయించడంలో ఏమీ అన్యాయంలేదు.

రవిగాడు ఎలాగూ లెక్చరరు ఉద్యోగంలో స్థిరపడి పోయాడు. వాడు మరో ఉద్యోగానికెళ్ళే అవకాశంలేదు. అందుచేత సర్టిఫికెట్లతో వాడికేం పనికూడా లేదు. అంతగా అవసరమయితే డూప్లికేట్ కాపీలు తెప్పించుకోగలడు వాళ్ళ నాన్న సాయంతో.

ఇకపోతే ఆ బొంబాయి కంపెనీవాళ్ళకు నా అసలు పేరు వెర్రి సుందర్రావని, చింతపిక్కల రవికాంతరావు కాదనీ తెలుసుకొనే అవకాశం లేదు. ఒకవేళ యూనివర్శిటీకి రిఫర్ చేసినా రవికాంతరావనేవాడికి తామే ఫస్టుక్లాసు ఎమ్మే పట్టం గట్టామని ఒప్పుకొంటారు. నో ప్రాబ్లమ్.

ఆర్కిమెడీస్‌లా 'యురేకా' అంటూ అరవా లనిపించింది. దానికి బదులు రవిగాడి సర్టిఫికేట్లు ఏ రకంగా సంపాదించాలో ఆలోచించడంలో పడిపోయాను.

చటుక్కున ఓ చిన్న చిక్కుసమస్య ఎదురయింది. వాడి యస్సెల్సీ సర్టిఫికేట్‌లో వాడి ఐడెంటిఫికేషన్ గుర్తులుంటాయి. ఎవరయినా నాలో వాటికోసం వెతికితే దొరికిపోతాను. కాని యస్సెల్సీలో వ్రాసిన ఐడెంటిఫికేషన్స్ గురించి ఎవరూ అంతగా పట్టించుకోరని గుర్తొచ్చింది. వాటినిబట్టి ఆ సర్టిఫికేట్ అవి ప్రొడ్యూస్ చేసిన వాడిదా, కాదా అని ఎవరూ పరీక్ష చేసినట్లు ఎప్పుడూ విన్లేదు. చాలా చిన్న రిస్క్ అది. నెగ్లిజబుల్.

ఆ రాత్రి జాగ్రత్తగా కూర్చొని ఓ అప్లికేషన్ డ్రాఫ్టు చేసాను.

మర్నాడు సాయంత్రం మూడు దాటింతరువాత రవి వాళ్ళ ఇంటికెళ్ళాను. రవి కాలేజీనుండి ఇంకా రాలేదని చెప్పాడు నౌకరు. ఆ విషయం నాకు తెలుసు కనుక నే నేను ఆ సమయంలో వెళ్ళాను.

అయితే; రవి ఉన్నప్పుడూ, లేనప్పుడూ వాడి గదిలో కెళ్ళే చనువుంది గనుక వాడు వచ్చేవరకూ వెయిట్ చేస్తానని వాడి గదిలోకి వెళ్ళాను. ఇంట్లోవాళ్ళందరికీ నేను తెలుసు గనుక ఎవ్వరూ అడ్డుచెప్పరు.

హాల్లోంచి అప్పుడే బయటకు వెళ్ళబోతున్న రవి తండ్రి హేమచంద్రరావుగారు నన్ను చూసి పలకరించారు.

"నువ్వటోయ్ సుందరం! వాడింకా కాలేజీనుండి రాలేదల్లే వుంది" అన్నారు నేను చేసిన నమస్కారానికి సమాధానంగా.

హేమచంద్రరావుగారు తలుచుకొంటే నాకేదయినా ఉద్యోగం క్షణాల్లో యిప్పించగలరు. కాని తనకు తిరిగి ఏమీ ఉపకారం చెయ్యలేనివాడికి ఉపకారం చెయ్యడం అనవసరమనుకునే ఫిలాసఫీ మనిషి ఆయన. అంచేతే ఓసారి అడిగి లేదనిపించుకొని మరి అడగడం మానేశాను.

ఆయన బయటికి వెళ్ళిపోగానే చకచక రవి డ్రాయరు తెరిచాను. వాడి టేబిల్‌లో ఏ సొరుగులో సర్టిఫికేట్లు వుంటాయో తెలుసు నాకు. యస్సెల్సీ, డిగ్రీ ఎమ్. ఏ., డిప్లోమా, మార్క్సు లిస్టులూ అన్నీ చకచకా ఫైల్లోంచి తీసి మడతపెట్టి జేబులో పెట్టుకొన్నాను. డ్రాయరు మూసేసి గట్టిగా ఊపిరిపీల్చి వదిలాను.

తిరిగి సర్టిఫికేట్లతో అవసరం వచ్చినప్పుడుగాని వాడు ఆ డ్రాయరు తెరవడని నాకు తెలుసు. ఆ అవుసరం వాడి కిప్పుడప్పుడే వచ్చే అవకాశం లేదు. కాబట్టి సర్టిఫికేట్లు పోయాయని వాడు త్వరలో తెలుసుకొనే అవకాశం లేదు.

సన్నగా ఈల వేసుకొంటూ బయటికి నడిచాను.

"వెళ్ళిపోతున్నారేం బాబూ?" అడిగాడు నౌకరు.

"సాయంత్రం వచ్చి కలుస్తానని చెప్పవోయ్" అన్నాను నిర్లక్ష్యంగా.

* * *

"అండర్ ఎంప్లాయ్‌మెంట్ కీ, అనెంప్లాయ్‌మెంటుకూ తేడా ఏమిటి?" జనరల్ మానేజర్ మిలట్రీ మీసాలు త్రిప్పుకొంటూ విలాసంగా ప్రశ్నించాడు.

చచ్చుప్రశ్న అనుకొన్నాను మనసులో. "పనిచేసే శక్తివున్న వాడికి పనిచేసే అవకాశం ఆసలు లేకపోవడం అనెంప్లాయ్‌మెంటు, పనిచేస్తున్నవాడికి చేయగలిగినంత

పని లేకపోవడం అండరెంప్లాయ్‌మెంటు" అన్నాను రకీమని.

ఇంకా ఓ అరడజను ప్రశ్నలు వేశారు. చివరికి "మిస్టర్ రవికాంత్‌రావ్! మీకు బి. ఎలో థర్డ్‌క్లాస్ వచ్చింది. ఇలా జరగడానికి కారణమేమిటో చెప్పగలరా?"

చిన్నగా నవ్వుకొన్నాను మనసులో. "ఎమ్. ఎలో ఫస్ట్‌క్లాస్ ఎందుకు వచ్చిందో చెప్పడంకన్నా బి. ఏలో థర్డుక్లాసు ఎందుకు వచ్చిందో చెపితే సరిపోతుందను కొంటాను. మొదట కారణం."

నా డైలాగును మధ్యలోనే ఆపుచేశాడు, డి. యమ్. అవసరం లేదన్నట్లు. థర్డ్‌క్లాస్ రావడానికి అకార కారణాలు చెప్పొచ్చు. ఆ సంగతి అతనికి తెలుసు.

ఇంటర్వ్యూ విజయవంతంగా ముగిసింది. వారంలో ప్రఖ్యాత సబ్బుల కంపెనీలో నాకు—అదే చింతపిక్కల రవికాంతరావుకు, సేల్సు ఆఫీసర్ ట్రయినీగా అపాయింట్ మెంట్ వచ్చింది. నా అదృష్టం తిరిగింది.

* * *

నాకు ఉద్యోగం వచ్చిన విషయం తెలియజేస్తూ, త్వరలో అడ్రసు తెలియచేస్తానని వ్రాసి ఓ లెటరు పోస్టు చేశాను రవికి.

రెండు నెలలు గడిచాయి. వెయ్యిరూపాయల జీతంతో ఏంచెయ్యాలో తోచేదికాదు మొదటి నెల. రెండవ నెల వచ్చేప్పటికి వెయ్యి చాలదేమో అనిపించింది. రోజులు జల్సాగా గడుస్తోన్నయ్.

ఆరోజు సోమవారం. నాకు బాగా గుర్తు. ఉదయం ఆఫీసుకు రాగానే జనరల్ మేనేజర్ నుండి పిలుపు వచ్చింది. వెళ్ళాను.

జనరల్ మేనేజర్ గదిలో ఆయనేకాక, డిప్యూటీ మేనే జరు, పర్సనల్ ఆఫీసరు, పోలీసు యూనిఫాంలో వున్న ఇద్దరు వ్యక్తులు వున్నారు.

"సిడవున్ మిస్టర్ రావ్!" అన్నాడు జనరల్ మానే జరు పైప్ వెలిగించుకొంటూ.

నా గుండెల్లో తెలియకుండానే ఆందోళన బయలు దేరింది. కూర్చున్నాను.

"నీ పేరు ఏమిటి?" అడిగాడు పోలీసు ఇన్స్పెక్టర్.

"చింతపిక్కల రవికాంతరావు" అన్నాను అను మానంగానే.

"మీ స్వస్థలం ఏమిటి?" చెప్పాను.

చాలా ప్రశ్నలు అడిగాడు నన్ను గురించి—ఐ మీన్ రవి గురించి. అవి తెలుసును గనుక చెప్పాను.

"ఏమిటిదంతా? ఎందుకీ ఇంటరాగేషన్?" అన్నాను కోపంగా. మనసులో నా మోసం బయటపడిందేమో అన్న అనుమానం బలపడుతోంది.

జనరల్ మేనేజర్ ఒక్క నిముషంపాటు నావైపు తదే కంగా చూశాడు. అతని చూపులో నామీద జాలో, ఆశ్చర్యమో ఏదో తెలియని భావం కనిపిస్తోంది.

"అయామ్ సారీ మిస్టర్ రావ్! నీ అసలు పేరేమిటో నాకు తెలియదు. బట్ అయామ్ రియల్లీ సారీ! కాని నిన్ను పోలీసులకు అప్పగించక తప్పదు. నీలాంటి ప్రజ్ఞా వంతుడు, తెలివితేటలు గలవాడు ఇలాంటి పని ఎందుకు చేయవలసి వచ్చిందో, నీవు ఏ పరిస్థితుల్లో ఆ పని చేశావో నాకు తెలియదు. కాని నీ మోసం బయటపడింది. నీ పేరు రవికాంతరావు కాదని, నీవు నీ వని చెప్పిన సర్టిఫికెట్లు నీవి కావనీ మాకు తెలిసిపోయింది. నేరానికి శిక్ష

తప్పదు. అయామ్ రియల్లీ సారీ!'' అన్నాడు జి. యమ్... పోలీసు ఇన్‌స్పెక్టర్ వైపు చూస్తూ.

''ఎలా... ఎలా తెలిసింది!'' అన్నాను తడారిపోతున్న గొంతుతో.

''దటీజ్ యువర్ బాడ్‌లక్! మా కంపెనీలో నేను చేసిన ప్రతి అప్పాయింట్‌మెంటూ డైరెక్టర్ల బోర్డు రాటిఫై చెయ్యాలి. అలాగే నీ అప్పాయింట్‌మెంటూ బోర్డు ముందుకెళ్ళింది. సాధారణంగా మేము సెలక్ట్ చేసిన కాండిడేట్స్‌ను అప్రూవ్ చేసేస్తారు.

కాని; హేమచంద్రరావుగారు మా కంపెనీ డైరక్టర్లలో ఒకరని నీవు తెలియదు. బహుశా ఊహించి వుండవు. ఈసారి సెలక్ట్ చేసిన వాళ్ళలో ఆయన అబ్బాయి పేరుండడం చూసి ఆశ్చర్యపోయారు. సర్టిఫికేట్లు తెప్పించి చూశారు. వాటిని చూశాక అవి వాళ్ళ అబ్బాయివే అనే విషయం బయటపడింది. ఇక చెప్పక్కర లేదనుకొంటాను'' అన్నాడు జి. యమ్.

పాతాళానికి కృంగిపోతున్నట్లు అనిపించింది. దురదృష్టవంతుడు ప్రపంచంలో ఏమూల కెళ్ళినా అది అతన్ని వెన్నాడుతూనే వుంటుంది. లేకపోతే రవితండ్రి హేమ చంద్రరావు సరిగ్గా ఈ కంపెనీకే డైరక్టరు కావడ మేమిటి?

దొంగ సర్టిఫికేట్లతో కాదు, దొంగిలించిన సర్టిఫికేట్లతో మోసగించి ఉద్యోగం సంపాదించినందుకు జడ్జిగారు నాకు మూడేళ్ళు కఠిన కారాగారశిక్ష విధించారు.

ఆ మూడేళ్ళు గడిచాక ఏంచెయ్యాలి నేను? ఏమీ తోచడం లేదు. జైల్లో తీరిగ్గా కూర్చుని ఆలోచించాలి. త్రీ ఇయర్స్ ఈజె వెరీ లాంగ్ టైమ్!

★★★

పొగ చుట్ట?

మణీ నారాయణ

జోగినాథం నోట్లోని పొగచుట్ట విసురుగా పడేసి, చకచక నడువసాగాడు. అతని మనస్సులో ఆలోచనలు ఉవ్వెత్తున కెరటాల్లా ఎగిరి పడుతున్నాయి.

శర్మగాడు ఎంత మోసంచేశాడు! తనకున్న రోజుల్లో వాణ్ణి తనింట్లో అన్నంపెట్టి, ఫీజులు కట్టి, పుస్తకాలు కొని చదివించాడు. విశ్వాసఘాతకుడు. ఈరోజు వాడు నాలుగు తెచ్చుకొంటున్నాడంటె, తనవలనే కదా! ఈనాడు తన స్థితి మారిందని, చేయి చాచి సహాయం అడిగితే లేదంటాడా?

పైగా, వాడి కెవ్వరూ లేరు! ఇంకా పెళ్ళి కాలేదు. అన్నిటిని మించి తన ఉప్పు తిని బ్రతికాడు.

ఆలోచిస్తూ నడుస్తున్న జోగినాథం, అప్రయత్నంగా శర్మ ఇంటిముందు ఆగాడు. క్షణం తటపటాయించి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ, లోపలకు వెళ్ళాడు.

శర్మ ఉన్న గది తలుపు వేసివుంది. లోపల లైటు వెలుగుతోంది. కిటికీ ఓరగా తెరచివుంది. కిటికీ దగ్గరకు వెళ్ళి లోపలకు తొంగిచూసాడు.

శర్మ లోపల డబ్బు లెక్క పెట్టుకొంటున్నాడు. లెక్క పెట్టిన డబ్బు జేబులో పెట్టుకొని. బట్ట లేసుకొని, బయటకు వచ్చాడు.

చీకటిలో స్థంభం చాటుకి తప్పుకొన్నాడు జోగినాథం. అతని మనసు ఉడికిపోతోంది. ఇంత డబ్బు ఉంచుకొని, తనకు పదిరూపాయలు, ఇయ్యమంటే లేదంటాడా? దుర్మార్గుడు! అని కసితీరా తిట్టుకొన్నాడు శర్మను.

ఇంట్లో రేపటికి బియ్యం లేవు. ఊళ్ళో ఎవ్వరూ ఇంక తనకు అప్పు ఇయ్యరు! ఎలాగయినా ఆ డబ్బు శర్మనుండి సంపాదించాలి.

ఆలోచనలనుండి తేరుకొని, చుట్టూ చూసాడు జోగినాథం.

శర్మ అప్పుడే గేటు దాటేసి, పోస్టాఫీసువైపు వెళ్తున్నాడు. నైట్ డ్యూటీ ఉంది కాబోలు. ఇంకోసారి వెళ్ళి అడుగుతాను. ఇస్తాడా, సరే సరి! లేకపోతే బెదిరించి అయినా సరే డబ్బు తీసుకోవాలి! అంతకన్న వేరే గత్యంతరం లేదు.

వెనుకనే వడివడిగా, బయటకు నడిచాడు జోగినాథం.

జేబులో కత్తి సరిచూసుకుంటూ మెల్లగా పోస్టాఫీసు లోపలకు అడుగుపెట్టాడు జోగినాథం.

కుర్చీలో వున్న శర్మ మొహం చిట్లించి, 'రండి' అంటూ కుర్చీ జరిపాడు. ఎదురుగా వున్న టెలిగ్రాం మేటరును కొట్టడంలో లీనమైపోయాడు.

"శర్మా! అడుగుతున్నానని అనుకోవద్దు. ఒక్క పది ఇయ్యి చాలు. ఇంట్లో అసలు బియ్యం లేవు," అన్నాడు ప్రాధేయపడ్డట్టుగా.

"ఎన్నిసార్లు చెప్పాలండీ! ఈ నెల్లో అప్పుడే నలభై రూపాయలు ఇచ్చాను. ఇచ్చింది ఇంక తిరిగి రాదు. కృష్ణార్పణం! పైగా ఇంకా ఇమ్మంటారే!"

"ఈసారి నిజంగా తీర్చేస్తా!"

"ఎలా తీరుస్తారు? ఉద్యోగంలోంచి సస్పెండు అయ్యారు. ఆస్థి లేదు. మీరు మాత్రం ఎలా తీరుస్తారు, ఎక్కడనుండి తెస్తారు? నా దగ్గర లేవు. ఉన్నా ఇయ్యను! నాకేదో సహాయం చేశారంటారు, అందరితో! నేను మాత్రం ఎంతకని పెట్టను. మీ సహాయానికి వడ్డీతో సహా రుణం ఏనాడో తీర్చేశాను, ఏడాదినుండి. ఇంకేమి మాట్లాడద్దు. ప్లీజ్! దయచేసి వెళ్ళిపోండి" అన్నాడు కటువుగా శర్మ.

జోగినాథంకు వళ్ళు మండిపోయింది.

ఎంత పొగరు! ఎంత నిర్లక్ష్యం! తన సహాయాన్ని ఎలా తృణీకరించి పడేశాడు!

ఆవేశంతో జోగినాథం కళ్ళు ఎరుపెక్కాయి.

ఎవరికో టెలిగ్రాం వచ్చినట్లుంది. శర్మ రిసీవ్ చేసుకొంటున్నాడు. అతని వీపు జోగినాథంవైపు ఉంది. అతని జేబులోని డబ్బు కళ్ళముందు కనపడుతోంది.

అసహాయత, అవసరం, అవమానం అన్నీ కలిపి, జోగినాథంలో మంటను రగిల్చాయి. అంతే! ఆవేశం కట్టలు

ప్రేంచుకొంది. జేబులోంచి కత్తి తీసి, గభాల్న శర్మ వీపులో గుచ్చాడు.

ఒక్క మూలుగుతో తల వాల్చేశాడు శర్మ!

అతని జేబులో డబ్బు, ఇంకా పోస్టాఫీసులో ఉన్న డబ్బు గబగబా తీసి జేబులో కుక్కుకున్నాడు జోగినాథం.

అంతలో ఎవరో వస్తున్నట్లు అలికిడి అయింది.

కాళ్ళల్లోంచి వణుకు పుట్టుకొచ్చింది జోగినాథానికి. ఎవరొస్తున్నారో! మెసంజరు వస్తున్నాడో లేక ఎవరేన టెలిగ్రాం ఇవ్వడానికి వస్తున్నారో! ఇపుడేం చెయ్యాలి? తప్పించుకోవడం ఎలా?

అడుగుల చప్పుడు ఇంకా దగ్గరగా వినపడుతున్నాయి.

ఇంకేమీ ఆలోచించలేదు జోగినాథం. అక్కడున్న గోద్రేజి బీరువా వెనకాలకు వెళ్ళి నక్కి దాక్కున్నాడు.

"సార్" అంటూ మెసంజరు లోపలకు వచ్చాడు.

కుర్చీలో ఉన్న శర్మ శవాన్ని చూసి, 'కెవ్వు' మని అరుస్తూ, బయటకు పరిగెత్తాడు. క్షణంలో పోస్టాఫీసు ముందు జనం పోగయ్యారు.

బీరువా చాటున జోగినాథానికి చెమటలు పోస్తున్నాయి.

అరగంట తర్వాత పోలీసులు వచ్చారు. ఇన్ స్పెక్టరు గదంతా పరిశీలించాడు.

ఎక్కడా పెనుగులాడినట్లు లేదు. కత్తి చాలా దగ్గర నుండి పొడిచినట్టున్నాడు. అంటే, హంతకుడు, హతుడికి బాగా తెలిసున్నవాడై ఉండాలి.

సగం వ్రాసిన టెలిగ్రాం మేటరు చదివాడు ఇన్ స్పెక్టరు. అంటే, హతుడు మాట్లాడుతూ, టెలిగ్రాం

రిసీవ్ చేసుకోందుకని వెనక్కి తిరిగినపుడు బలంగా కత్తితో పొడిచివుండాలి హంతకుడు.

ఏ కిటికీ తలుపు తెరచి లేదు. హంతకుడు వచ్చిన త్రోవనే వెళ్ళి వుంటాడు.

ఆలోచిస్తూ, తల పరికించి, "శవాన్ని ఎవరు ముందు చూసారు?" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"నేను సార్" అంటూ మెసంజరు లోపలకు వచ్చాడు.

"నువ్వు చూస్తుండగా ఎవరెవరు లోపలకు వచ్చారు?"

"శర్మగారు డ్యూటీకి వస్తూనే, 'టీ' తీసుకొని రమ్మన్నా రండీ! హోటలుకెళ్ళి, నేను త్రాగి, ఆయనకు తీసుకొని 'సార్' అంటూ లోపలకు వచ్చాను. అప్పటికే శర్మగారు టేబిలుమీద పడున్నారు. వీపులో కత్తి స్పష్టంగా కనిపించింది. అంతే! నాకు భయంవేసి, కేకలేస్తూ బయటకు వచ్చాను," అన్నాడు భయం భయంగా.

ఫోటోగ్రాఫర్లు వచ్చారు. కత్తిమీదున్న వేలిముద్రలు ఫోటో తీసి, శవాన్ని మార్చురీకి తరలించారు.

ఇన్‌స్పెక్టరు ఎవరేనా పోస్టాఫీసునుండి బయటకు వెళ్ళడం గాని, లోనికి రావడంగాని చూశారేమోనని, చుట్టుప్రక్కల అందరినీ అడిగి, మరోమారు గదిని పరీక్షించి, బయటకువచ్చి తాళం వేయించాడు.

బీరువా వెనకాలవున్న జోగినాథం గుండె దడదడ లాడుతోంది.

ఇప్పుడు ఈ కేసులో ఇరుక్కుంటే; అసలే, సస్పెండులో వున్న ఉద్యోగం కాస్త గుటుక్కుమంటుంది. వళ్ళంతా చమటతో తడిసి ముద్దయింది.

ఇన్‌స్పెక్టరు గది పరిశీలిస్తుంటే జోగినాథంకు కాళ్ళల్లోంచి వణుకు పుట్టుకొచ్చింది. ఆ మూలనున్న తను

ఎక్కడ కనపడతాడోనని. అందరూ వెళ్ళిపోయారు.

బయట బహుశా పోలీసు కాపలా ఉండచ్చు.

జోగినాథం మెల్లగా బీరువా చాటునుండి బయటకు వచ్చాడు. పోలీసులకు కనపడకుండా దాక్కోడంకన్నా, ముఖ్యమయినది అక్కడనుండి తప్పించుకోవడం.

జోగినాథం జేబులోని చుట్ట తీసి వెలిగించాడు. గట్టిగా నాలుగు దమ్ములు లాగగానే బుర్ర పనిచేయసాగింది. నిముషం ఆలోచించి, నెమ్మదిగా కిటికీ దగ్గరకు నడిచాడు. చప్పుడు కాకుండా కిటికీ తలుపులు తీశాడు.

అతని మొహం ఒక్కసారిగా వికసించింది. ఆ కిటికీ లకు ఊచలు లేవు. అలానే నించుని బయటికి చుట్టు ప్రక్కల చూశాడు. ఎవరూ లేరు.

అంతే! ఒక్క గెంతులో అవతలకు దూకి చప్పుడు కాకుండా లేవబోయాడు.

ఎదురుగుండా ఉన్న బ్యాంకులోంచి నైట్ వాచ్‌మన్ ఇటే వస్తున్నాడు. కటకటాల తలుపులోంచి బ్యాటరీ వేసి, ఇటు తిప్పాడు.

చటుక్కున చీకటిలోకి తప్పుకొని, పరుగులాంటి నడకతో, ఇంటికి చేరుకొని, తేలిగ్గా నిట్టూర్చాడు జోగి నాథం.

ఊళ్ళో వింతగా చెప్పుకొంటున్నారు శర్మ హత్య గురించి. అది చిన్న ఊరు కావటం మూలాన, ఊరంతా పొగలా వ్యాపించింది ఆ వార్త.

జోగినాథానికి హఠాత్తుగా ఒక ఆలోచన వచ్చింది. ఆ బ్యాంకు వాచ్‌మెన్ తనను గుర్తుపట్టలేదు కదా! ఏమో! వాడు ఏమాత్రం అనుమానం బయటపెట్టినా,

వేలిముద్రలు పరిశీలించితే చాలు, ఇంక తిరిగి రాకుండా జైల్లోకి త్రోసేస్తారు.

అది గుర్తుకు రాగానే జోగినాధానికి భయం ఇంకా ఎక్కువ అయింది. ఇదేదో తేల్చుకోవాలి. ఆ వాచ్‌మన్‌తో బాగా పరిచయం కూడాను. ఒకవేళ వాచ్‌మెన్‌కు ఏమాత్రం అనుమానంగా వున్నా, అతడినికూడా శర్మ దగ్గరకే పంపేయాలి. జోగినాధం మనసులో దృఢంగా నిశ్చయించుకొని, బట్టలు మార్చుకొని, తిరిగి బయటకు నడిచాడు.

జోగినాధం మెల్లగా బ్యాంకు ముందునుండి తల వంచుకొని, క్రీగంట వాచ్‌మన్‌ను అబ్‌జర్వ్ చేస్తూ, వెళ్ళాడు.

వాచ్‌మన్ తననే తదేకంగా చూడడం గమనించాడు జోగినాధం. అలా బజార్‌లోకి వెళ్ళి తిరిగివస్తూ బ్యాంకు ముందు ఆగాడు.

జనసంచారం అట్టే లేదు.

వాచ్‌మన్ శేషయ్య తాళం తీసుకొని బయటకువచ్చి, "ఏం బాబుగారు బొత్తిగా కనపడటంలేదు ఈమధ్య? అంతా కులాసాయేనా?" జోగినాధాన్ని చూస్తూ అన్నాడు.

"ఈ ఘోరం చూశావా, శేషయ్యా? ఎలా జరిగి పోయిందో! మా శర్మను ఎవ్వరో చంపేశారు! ఎంత లేదంటున్నా పాతికో, పరకో సహాయం చేసేవాడు!" అన్నాడు జోగినాధం బాధగా.

"నిన్న శవాన్ని తీసుకొనిపోయాక బాబూ, నేను పోస్టాఫీసుకేసే చూస్తున్నానండి. అంతలో ఆ కిటికీ తలు

పులు తెరచుకొని, ఎవరో గభాల్న దూకారండి. నేను బ్యాటరీ వేసా అటువైపు. చీకట్లోకి మాయమయ్యాడు. నేను వెంబడించాను గాని లాభం లేకపోయింది. అప్పటికే అతను సందు మలుపు తిరిగి కనుమరుగయ్యాడు. పోలీసులకు కూడా తెలియపర్చాను" చెప్పాడు శేషయ్య.

జోగినాథానికి వాచ్‌మన్ శేషయ్య మాటలు ఆనందాన్ని కలిగించాయి. వాచ్‌మన్ తనను చూడలేదు. అసలు పోల్చలేదు కూడా. తను ఇక ఏమాత్రం భయపడనవసరంలేదు. తృప్తిగా జేబులోనుండి చుట్టతీసి వెలిగించాడు.

"శేషయ్యా! వస్తాను. ఇంటిదగ్గర పనులున్నాయి," అని చెప్పి ఇంటికి బయలుదేరాడు జోగినాథం.

అక్కడ అక్కడ తిరిగి గంట తర్వాత ఇంటికి చేరిన జోగినాథం నిశ్చేష్టుడైయాడు. ఇంటి దగ్గర ఇన్‌స్పెక్టర్, తన బలగంతో తయారుగా ఉన్నాడు. ఇంట్లోంచి తన భార్యాపిల్లల ఏడుపు సన్నగా వినిపిస్తున్నది.

"మిస్టర్ జోగినాథం! శర్మగారిని హత్యచేసిన నేరానికి మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాము," అంటూ జోగినాథం చేతులకు బేడీలు తొడిగాడు ఇన్‌స్పెక్టర్.

జోగినాథానికి నోట మాట రావటంలేదు. అతడు ఊహించనిది జరిగింది. మాటా పలుకు లేకుండా ఇన్‌స్పెక్టర్‌నే చూస్తూ ఉండిపోయాడు.

ఇన్‌స్పెక్టర్ హుందాగా చిరునవ్వు నవ్వి, చెప్పసాగాడు.

"నిన్ను పట్టిచ్చింది నీవు కాల్చే పొగచుట్ట అంటే ఆశ్చర్యపోతావు. నీవు పోస్టాఫీసు కిటికీ తలుపులు తెరిచినప్పుడు, చీకట్లో చుట్ట ఎర్రగా వెలుగుతుండటం వాచ్‌మన్ గమనించాడు. నీవు కిటికీనుండి దూకినప్పుడు ఆ

చుట్ట అక్కడే పడిపోయింది. తిరిగి నీవు వాచ్‌మన్‌ని కలిసి మాట్లాడుతూ చుట్ట తీసి వెలిగించావు. అది చూడ గానే వాచ్‌మన్‌కు అనుమానం వచ్చింది. పారిపోయిన వ్యక్తి కూడా ఎత్తు, లావు ఇంచుమించు నీ అంతే వుంటాడు. వెంటనే మాకు వచ్చి చెప్పాడు. బలగంతో ఇక్కడికి వచ్చి మీ ఇంట్లో దొరికిన వేలిముద్రలు పరిశీలించాము. హత్యాస్థలంలో దొరికిన వేలిముద్రలతో సరిపోయాయి" చెప్పుకుపోతున్నాడు ఇన్‌స్పెక్టర్.

జోగినాధానికి ఇంకేం వినిపించటం లేదు. అతని కళ్ళ ముందు జైలు గోడలుమాత్రమే కనిపిస్తున్నాయి. ★★★

ఒక వ్యక్తికి క్రికెట్ అంటే మహాపిచ్చి, కొంచెం టైం దొరికిందంటే క్రికెట్ ఆడుతుంటాడు, ఒంటిగానైనా సరే.

ఒకసారి తన ఇంట్లో డైనింగ్ హాల్లో ఆట సాగించాడు, నౌకరు కుర్రాడితో. ఇలా ఆడుతుండగా ఒకసారి ఆ బాల్ కిచెన్ రూంలోకి వెళ్ళిపోయింది. బోలింగ్ చేస్తున్న అతని నౌకరు ఆ బాల్ తేవడానికి కిచెన్‌లోకి పరుగెత్తాడు.

అక్కడ యజమానురాలు నౌకరును చూసి బజారు నుండి 'మసాల'లు తీసుకొని తెమ్మని పురమాయించింది.

నౌకరు బాల్ వదిలేసి బజారువెళ్ళి వచ్చాడు. తర్వాత బాల్ తీసుకొని డైనింగ్ హాల్లోకి ప్రవేశించగానే, అక్కడున్న క్రికెట్ హీరో "సెవన్ట్వంటీవన్, సెవన్ ట్వంటీ టూ"...అంటూ బ్యాట్ పట్టుకొని ఆయాసంతో రన్స్ చేయసాగాడు.

—కె. చందర్‌రావు, హైద్రాబాదు.

దెయ్యాలున్నాయ్ జాగ్రత్త!

దివాకర్ల సన్యాసిరాజు

"బాస్! అటు చూడు" అన్నాడు నారాయణ హఠాత్తుగా.

"దెయ్యాలున్నాయ్ జాగ్రత్త!" చిన్న బోర్డు ఒకటి చెట్టుకి వేలాడుతోంది. అది చింతచెట్టు. వెనుగ్గా, ఓ పాడుపడిన శిధిలావస్తలో ఉన్న భవనం—

"రాజా! మనం మాటల్లోపడి చాలాదూరం వచ్చేశాం. పదండి వెనక్కి వెళదాం" అంది మీనాక్షి నా ప్రక్కకొచ్చి.

"అవును బాస్! ఈ దారి మంచిదికాదు. పొద్దుపోతే ప్రమాదం కూడా. రండి వెళ్ళిపోదాం" అన్నాడు జగన్నాథ్ ఆగిపోయి.

జగన్నాథ్, మీనాక్షి యిద్దరి, ముఖకవళికలు మారి పోయాయి. నవ్వుతూ సరదాగా మాట్లాడిన యిద్దరి ముఖాల్లోనూ, భయం చోటు చేసుకుంది.

అర్థంకాక, నిలబడ్డవాళ్ళం, నారాయణ నేనూ మాత్రమే.

చాలా యిళ్ళముందు 'కుక్కలున్నవి జాగ్రత్త' అన్న బోర్డు చూశాను. కానీ 'దెయ్యాలున్నాయ్ జాగ్రత్త' అన్న బోర్డు చూడటం యిదే మొదటిసారి.

"బాస్ వెళ్ళిచూద్దాం" అన్నాడు నారాయణ ఉత్సాహంగా.

"వద్దండీ! ఆ యింటి గురించి మీకు తెలీదు. చాలా భయంకరమైన కథలు చెప్పుకుంటూరు. మీకు తెలీదు. రండిపోదాం" అంది మీనాక్షి ఆత్రుత అణుచుకుంటూ.

జగన్నాథ్, నారాయణ, నేనూ ఎం. ఏ. సైకాలజీలో క్లాస్‌మేట్సుం. రూమ్ కూడా ఒక్కటే. ఎక్కడికెళ్ళినా, ఏంచేసినా, ముగ్గురం కలిసే చేస్తాం. మాకు యూనివర్సిటీలో 'త్రిమూర్తులు' అని నిక్‌నేమ్ కూడా ఉంది. వయసులోనూ, అనుభవంలోనూ, చదువులోనూ, అన్నింటిలో నాది పైచెయ్యి గనక జగన్నాథ్, నారాయణ నన్ను 'బాస్' అని పిలుస్తారు.

నా రచనలు అప్పుడప్పుడు, పత్రికల్లో ప్రచురింపబడుతూ ఉంటాయి. చాలావరకూ దెయ్యాల కథలే. నా పేరు డి. యస్. రాజు. డెవిల్సు, స్పిరిట్సు రాజు అంటారంతా. దెయ్యాల కథలు ఎవరు చెప్పుకుంటున్నా, దెయ్యం పట్టింది ఫలానా వాడికి అని విన్నా, నేనూ, నారాయణ తక్షణం ఆ ప్రదేశం చేరుకుంటాం.

జగన్నాథ్ చెల్లెలు మీనాక్షి బి. ఎస్. సిలో నాకు పరిచయం. పరిచయం ప్రణయంగా మారింది. త్వరలో వివాహం చేసుకోడానికి కూడా నిర్ణయించుకున్నాం. బి. ఎస్. సి. పూర్తి చేసి, మీనాక్షి వాళ్ళ స్వగ్రామం వెళ్ళిపోయింది. వారానికి; నాలుగు ఉత్తరాలు తను రాస్తే. నాలుగు ఉత్తరాలు నేను రాయవలసిందే.

జగన్నాథ్ కూడా మా ఇద్దరి కలయిక మనస్ఫూర్తిగా కోరుతున్నాడు. ఎం. ఏ. పూర్తికాగానే, మీనాక్షిని పెళ్ళిచేసుకుంటాను. సమ్మర్ హాలీడేస్‌కి జగన్నాథ్ నన్నూ, నారాయణని వాళ్ళ గ్రామం తీసుకొచ్చాడు. మీన పదేపదే రాయడంవల్ల రాక తప్పింది కాదు.

ఉదయమే ఈ వూరొచ్చాం. సాయంత్రం షికారుకి యిలా తీసుకొచ్చాడు.

తీరా ఇంతదూరం వచ్చాం ఈ బోర్డు చూసి వెనక్కి వెళ్ళిపోదామంటున్నారు యిద్దరూ.

వాళ్ళ ముఖాల్లో తాండవిస్తున్న భయభీతులకి కారణం అర్థంకాలేదు నాకు. మీనాక్షికి దెయ్యాలంటే మహా భయం. దెయ్యాల గురించి కథలు రాస్తానని ఎన్నోసార్లు గొడవపెట్టింది. 'దెయ్యాల పరిశోధనలు వదిలేస్తేనే మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటా'నంటుంది కోపంగా. అందువల్ల ఈ విషయం ఇంతటితో ఆపేసి రాత్రి పడుకోబోయే ముందు జగన్నాథ్‌ని అడగొచ్చు అని– "పదండి పోదాం" అన్నాను వెనక్కి తిరుగుతూ.

"బాస్!!!" అన్నాడు నారాయణ ఆశ్చర్యపోతూ.

"పద" అన్నాను నారాయణకి కళ్ళతో సౌంజ్ఞ చేసి.

అంతటితో ఆ ప్రసక్తి వదిలినందుకు ఆనందంగా, ఎవరూ చూడకుండా నా చెయ్యి నొక్కి వదిలేసింది

మీనాక్షి. పశ్చిమాకాశంలో అరుణిమ అంతరించకుండానే ఇల్లు చేరాం. ఇంటిముందున్న రెండు లారీలు, అప్పుడే బయలుదేరి పట్నం వైపుగా దూసుకుపోయాయి.

సకల సౌకర్యాలతో ఆధునికంగా కట్టిన పెద్ద భవనం జగన్నాథ్ వాళ్ళది.

అన్ని వేళల్లోనూ ఎవరో ఒకరు వచ్చిపోతూనే ఉంటారు.

పట్నంలో ఏవో రెండు కంపెనీలున్నాయట. పది లారీలు అద్దెకి తిరుగుతున్నాయట.

ఇంపోర్టు, యక్స్‌పోర్టు వ్యాపారం ఉందట. ఆ ఆస్థి అంతటికీ జగన్నాథ్, మీనాక్షిలే వారసులు.

జగన్నాథ్ తండ్రి నాగభూషణంగార్కి పక్షవాతంలో కాలు, చెయ్యి పడిపోయింది. మంచంమీంచి లేవలేరు. పట్నంనుండీ ఓ డాక్టరు రోజూ కారులో వచ్చిపోతూ ఉంటాడు. నాగభూషణంగారి వ్యవహారాలన్నీ యిద్దరు మేనేజర్లు, పట్నంలో చూస్తున్నారు. ఈ గ్రామంలో లింగయ్య అని ఓ ముసలాయన చూస్తున్నారు. ఎప్పటి కప్పుడు నాగభూషణంగార్కి సమాచారం అందజేయ డానికి ఆయన రూమ్‌లో ప్రత్యేక ఫోను ఏర్పాటు చేసు కున్నారు.

ఆయన్ని ఎవరు చూడాలన్నా, చివరికి కుటుంబంలోని వారైనాసరే, లింగయ్య ఫోన్ చేసి ఆయన రమ్మంటే వెళ్ళాలి. మీనాక్షికి తల్లిలేదు. ఇంట్లో వంటమనిషి ఉంది. నౌకర్లున్నారు. ఒకే ఇంట్లో ఉన్నా అవసరం అయితే తప్ప తండ్రిని చూడరు జగన్నాథ్, మీనాక్షి. ఇవన్నీ నాకు చాలా వింతగా అనిపించింది. బహుశా గొప్పవారి

వ్యవహారాలు ఇలాగే ఉంటాయేమో. నేను కూడా నాగభూషణంగార్ని ఇంతవరకూ చూళ్ళేదు.

మీనాక్షి రేపు ఉదయం తండ్రికి పరిచయం చేస్తానని చెప్పింది. భవనం రెండో అంతస్తులో ప్రత్యేకమైన గదిలో ఉంటారాయన.

2

రాత్రి తొమ్మిదిగంటలైంది. డిన్నర్ పూర్తి చేసి, అప్పుడే కూర్చున్నాం. మీనాక్షి కొంతసేపు కూర్చొని నిద్రొస్తోందని తన గదికి వెళ్ళిపోయింది.

అప్పుడు అడిగాను—

"జనా! సాయంత్రం మనం చూసిన దెయ్యాల భవనం గురించి చెప్పు" అన్నాను.

"అరె! యింకా ఆ విషయం మర్చిపోలేదన్నమాట" అన్నాడు జగన్నాథ్ ఆశ్చర్యంగా.

"నేను మర్చిపోతానని ఎలాగనుకున్నావ్ జనా!? మీనాక్షి భయపడుతోందని, ఆమెకు ఈ ప్రసంగం నచ్చదని, అప్పటికి వూరుకున్నాం. ఇక చెప్పు."

"చెప్పడానికేంతో ఉంది. ఆ భవనంలో దెయ్యాలున్నాయ్!" అంటూ ఆగాడు జగన్నాథ్.

"అలాకాదు. డిటెయిల్సు చెప్పు" అన్నాడు నారాయణ కుతూహలంగా.

"చాలా ఏళ్ళ క్రితం ఆ భవనంలో ఓ బ్రాహ్మణుడు ఉండేవాడట. దైవభక్తుడు. ఎవరికైనా దెయ్యాలు, భూతాలు పట్టుకుంటే క్షణాల్లో బాగుచేసేవాడట. అందుకే అతను వూరికి అంతదూరంగా ఉండేవాడు.

ఎందరికో బాగుచేసిన అతనికి హఠాత్తుగా ఓ దెయ్యం

పట్టిందట. దెయ్యమో, భూతమో, గ్రహమో, ఏమిటో తెలీదు.

రాత్రి పడుకున్న ప్రదేశంలో ఉదయం ఉండడు. అంటే రాత్రి మంచంమీద పడుకుంటే ఉదయం క్రింద వుండే వాడట. రాత్రి గదిలో పడుకుంటే ఉదయం ఇంటి బయట ఉండేవాడట. అయితే ఎలాంటి ప్రమాదం జరగ లేదట. ఆ దెయ్యానికి అదేం సరదా పుట్టిందో పాపం ఆ బ్రాహ్మడ్ని రాత్రి పడుకున్న చోట ఉదయానికి ఉంచేది కాదు. క్రమంగా అతనికి, వూర్లో వారికి కూడా అలవాటై పోయింది. ఉదయం రోజుకో ప్రదేశంనుండీ నడిచి ఇల్లు చేరుకుంటూ ఉండేవాడు.

అలా ఉండగా ఒకనాడు ఈ ప్రక్క వూర్లో జమిందారు దొరైసామి అల్లుడూ, కూతురూ రాత్రి డాబా మీద, పడుకొని ఉంటే వాళ్ళిద్దరి మధ్యనా, పడుకో బెట్టింది బ్రాహ్మడ్ని- ఆ దెయ్యం. అంతే_ అర్థరాత్రి ఆ బ్రాహ్మడ్ని లేపి చితక బాదేశారు ఆ జమీందారు. 'నాకేం తెలీదు మొర్రో' అని గోలపెట్టాడు. చివరికి ఆ జమీం దారుతో పందెంకట్టాడు బ్రాహ్మడు.

"ఈ రాత్రి నన్ను ఓ గదిలో పెట్టి తాళం వేయండి. కట్టుదిట్టమైన కాపలా పెట్టండి. ఉదయానికి గదిలో ఉంటే నన్ను మీరేం చేసినాసరే భరిస్తాను" అన్నాడు దీనంగా.

'సరే'నని ఓ చిన్న గదిలో పెట్టి బంధించేముందు తన వూరు, పేరు చెప్పి లోపలకెళ్ళి హాయిగా పడుకున్నాడు.

అంతే. ఉదయం తననెవరో తట్టి లేపుతూండగా తెలివొచ్చింది బ్రాహ్మడికి.

తన వూర్లో, తన ఇంటిముందు, ఆ చింత చెట్టు క్రింద ఉన్నాడు. ఎదురుగా, జమిందారు, అతని అల్లుడు, మరో ఇద్దరు నౌకర్లు, రెండుగుర్రాల టాంగా వుంది.

"చూశారా బాబూ! ఇదీ నా కథ. రాత్రి పడుకున్న చోట ఉదయం వుండను. ఏ శక్తి నన్నిలా ఆడిస్తోందో తెలీదు. ఇది నా కలవాటైపోయింది. కానీ నా ఖర్మకాలి నిన్న పొరుగూర్లో వున్న మీ ఇంట్లో పడేసింది" అని దీనంగా విన్నవించాడు.

అనవసరంగా కొట్టినందుకు బాధపడి, జమీందారు కొంత పైకం యిచ్చి వెళ్ళిపోయారుట.

కొన్నాళ్ళకి ఆ బ్రాహ్మడు చనిపోయాడు. ఆ ఇంట్లో దెయ్యం వుందని ఆ ఛాయలక్కూడా ఎవరూ పోయేవారు కాదు.

ఇప్పటికీ రాత్రి వేళల్లో ఆ యింటిపైనుండీ దీపాలు వెలుగుతున్నట్లు, జనం హడావిడి, ఏవో అరుపులు, గోల వినిపిస్తాయి. పొరపాటున రాత్రి వేళల్లో అటు వెళ్ళిన యిద్దరు, ముగ్గురు మర్నాటికల్లా చచ్చి పడున్నారు. ఇది ఆ భవనం చరిత్ర..."

"నీ కెవరు చెప్పారు ఈ కథ?" అడిగాను నమ్మలేక.

"స్వయంగా మా నాన్నగారే చెప్పారు. ఈ వూళ్లో అందరూ చెప్పుకుంటారు" అన్నాడు జగన్నాథ్.

"చూడు భాయ్! ఈ కథలో వాస్తవానికి దగ్గరగా ఏదీ లేదు. నాకు నమ్మకం లేదు.

మనుషులకే యిల్లు లేక చస్తుంటే యిలా దెయ్యాలకీ, భూతాలకీ కూడా అంతలేసి భవనాలు వదిలేస్తే ఎలా?! ఇంతవరకూ మా పరిశోధనలో దెయ్యాలు, భూతాలు

ప్రత్యక్షంగా తారసపడలేదు. ఓసారి ఆ యింటిని చూడాలనుంది" అన్నాను.

"బాస్!!! వద్దు. ఈ పని మాత్రం చెయ్యొద్దు. కోరి కష్టాలు తెచ్చుకోవద్దు..."

"ఏమిటి బ్రదర్? అలా భయపడిపోతావ్! బాస్‌తో పాటు నేనూ ఉంటానుగా" అన్నాడు నారాయణ. నారాయణకి యిలాంటి పరిశోధనలంటే చాలా యిష్టం.

"అయినా వద్దు.నారాయణా! ఎవరూ వెళ్లొద్దు.మీలాగే ఎందరో పందేలు వేసుకొని కూడా ప్రమాదాలకు గురైయ్యారు. మా వూరు సరదాగా ఎన్‌జాయ్ చేయడానికి తీసుకొచ్చానుగాని, మిమ్మల్ని ప్రమాదాల్లోకి దించడానికి కాదు..."

"జనా! మాకేం భయంలేదు. వీలైతే ఓ రివాల్వర్ సంపాదించి యియ్యి. మీ టైగర్ ఉందిగా. టైగర్, నేను, నారాయణ రేపురాత్రి ఆ యింట్లో బస చేస్తాం. ఉదయం నౌకర్ని తీసుకెళ్ళి క్లీన్ చేయిద్దాం. మాకేం భయంలేదు. భయం లేకపోతే నువ్వు కూడా రా..." అన్నాను.

"ఏమిటి బాస్. ఇంతలా చెప్పినా అర్థం చేసుకోరు. నేను రాను. మిమ్మల్ని పంపను. నాన్నగారికి తెలిస్తే యింకేమైనా ఉందా? చంపేస్తారు. వద్దు. ఇలాంటి నిర్ణయాలు తీసుకోకు..."

"ఫరవాలేదు జనా! మా పరిశోధనలకెంతో ఉపయోగపడే మంచి సబ్జక్ట్ దొరికింది. నారాయణ నేను వెళతాం..."

"ఇక మీకు చెప్పి లాభం లేదు. చెల్లాయితో చెప్తాను. వెళ్ళమంటే వెళ్ళండి..." అన్నాడు కోపంగా.

అంటే మీనాక్షి నన్ను ఎలాగైనా వెళ్ళనివ్వదని తెలుసు జగన్నాథ్‌కి. అందుకే చివరిగా ఈ అస్త్రం ఉపయోగించాడు.

"వద్దు. జనా! ఈ విషయం మాత్రం మీనకి చెప్పకు. రేపు సాయంత్రం చిన్న పనిమీద పట్నం వెళ్ళి ఉదయానికి వచ్చేస్తామని చెప్పు. అసలీ విషయం ఎవరికీ చెప్పకు. మేం ఊరు విడిచి వెళ్ళినట్లే సాయంత్రం చీకటిపడుతూండగా వెళతాం" అన్నాను.

"రాజా! ప్లీజ్! మీకేమైనా ప్రమాదం జరిగితే మీనాక్షికి ఏం చెప్పేది?! నాకు నేనె నిన్ను పంపించానని తెలుస్తే ఎంత గొడవపెడుతుందో తెలుసా?! చెల్లాయి కోసమైనా వెళ్లొద్దు బాస్..." అన్నాడు జగన్నాథ్ రుద్ధకంఠంతో ప్రతిమాలుతూ.

జగన్నాథ్‌కి నామీదున్న అభిమానానికి మనసులోనే జోహార్లర్పించాను.

ఆదరంగా జగన్నాథ్ చెయ్యి పట్టుకొని—"మాకేం భయం లేదు. జనా! క్షేమంగా తిరిగొస్తాం. నీకు తెలుసుగా! ఈ పరిశోధనల్లో ఎన్నోసార్లు నారాయణ నేను పనిచేసి క్షేమంగా తిరిగొచ్చాం. డోంట్ వర్రీ. ఈ విషయం మీనకి తెలియకుండా మాత్రం చూడు. మన ముగ్గురికీ తప్పా మరొకరికి తెలియకూడదు. ఉదయం తెల్లారకుండానే తిరిగి వచ్చేస్తాం. ఏ పరిస్థితిలోనైనా ఆరు గంటలకి తిరిగి ఈ గదికి రాకపోతే మమ్మల్ని వెదికే ప్రయత్నాలు అప్పుడు మొదలెట్టు. అదైనా సాయంత్రంవరకూ నువ్వు మాత్రమే మాకోసం చూడు. సాయంత్రానికి కూడా మా జాడ తెలియకపోతే అప్పుడు నీకు తోచిన విధంగా చెయ్యి..."

"అంటే...నువ్వు కూడా ఏమైనా జరగొచ్చునను కుంటున్నావా బాస్" అన్నాడు జగన్నాథ్ ఆతృత నణచుకుంటూ.

"జరగొచ్చు, జరక్కపోవచ్చు, ఇలా ముందుగా ప్రోగ్రామ్ నిర్ణయించుకోవడం మంచిది. ఇది సమ్మర్ గనక ఫరవాలేదు. ఒక బ్లాంకెట్, వీలైతే ఫైవ్ సెల్సు టార్చి, లేకపోతే త్రీ సెల్సు రెండు, రివాల్వర్ పది మీటర్ల ప్లాస్టిక్ రోప్..."

"రోప్, నా దగ్గరుంది బాస్. మన ఎక్విప్ మెంటు బాక్సు తెచ్చాను. త్రీ సెల్సు టార్చి, నైఫ్, కూడా ఉన్నాయి. రివాల్వర్ ఉంటే చాలు" అన్నాడు నారాయణ.

"రివాల్వర్ యింట్లో ఉండాలి. చూస్తాను. టైగర్ని తీసుకెళ్ళండి. అవసరమైతే ఏ అర్ధరాత్రిలోనైనా నేను రావాలంటే టైగర్కి చెప్పిపంపిస్తే చాలు. కానీ చాలా జాగ్రత్తగా ఉండండి. నాకెంత మాత్రం యిష్టం లేదు. మీ పట్టుదలవల్ల వొప్పుకుంటున్నాను." అన్నాడు జగన్నాథ్.

ప్రోగ్రామ్ నిర్ణయించుకొని చాలా రాత్రి గడిచినందు వల్ల పడుకున్నాం.

3

మర్నాడు కావలసిన సరంజామా అంతా ఒక హేండ్ బాగ్లో సిద్ధంగా అమర్చి ఉంచాడు నారాయణ.

ఉదయం పదిగంటలప్పుడు, మీనాక్షి వచ్చి, "నాన్న గారు రమ్మన్నారు. మిమ్మల్ని పరిచయం చేస్తాను రండి" అంది నాతో.

"నారాయణ కూడా రావచ్చా?" అన్నాను.

"తప్పకుండా. మీ కుడిభుజంగా" అంది నవ్వుతూ.

"థేంక్స్" అన్నాడు నారాయణ కూడా నవ్వుతూ.

జగన్నాథ్, నేను, నారాయణ, మీనాక్షి వస్తున్నామని మళ్ళీ నాగభూషణంగారికి ఫోన్ చేసి మేడమీద కెళ్ళాం.

వరండాలోంచీ తిన్నగా వెళ్ళి రెండు గదులు దాటి, మూడో గుమ్మంలో నిలబడి కాలింగ్ బెల్ నొక్కింది మీనాక్షి.

మరుక్షణంలో తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా నున్న వ్యక్తిని చూసి గతుక్కు పడ్డాను. గుమ్మానికి సరిపడా లావు, పొడుగుతో, నల్లగా, భయంకరంగా, నిప్పుకణాల్లా ఉన్న పెద్ద కళ్ళతో పగలు చూస్తే రాత్రి కల్లోకొచ్చేటట్లున్నాడు. నాకిదంతా చాలా విచిత్రంగా, ఎందుకో అసహజంగా ఉంది.

"రండి!" అన్నాడు ప్రక్కకి తప్పుకొని.

సింహం గర్జించినట్లైంది. అతను నాగభూషణంగారి అసిస్టెంటు.

మీనాక్షి, జగన్నాథ్ తరువాత నేను, నారాయణ మెల్లగా లోపలకడుగుపెట్టాం. చల్లగా ఉంది. కూలర్ అమర్చినట్లున్నారు, సినిమాల్లో చక్రవర్తుల శయన మందిరంలా ఉంది. ఆధునిక పరికరాలతో, అయిశ్వర్యం అణువణువునా తొంగి చూస్తోంది. సోఫా సెట్లు, గాడ్రేజ్ టేబులు, ఏవేవో ఫైల్సు, రెండు స్టీల్ బీరువాలు, రెండు బుక్సు రాక్స్, యింటర్ కమ్యూనికేషన్, మరో రెండు ఎరుపు, ఆకుపచ్చని ఫోన్సు, ఒకవైపు టేప్ రికార్డర్,

మరోవైపు రేడియోలాంటి ఒక యంత్రం, పైన పన్నెండంగుళాల వ్యాసార్థంలో స్క్రీన్—మరో ప్రక్కగా నలుగురు మనుషులు సునాయాసంగా పడుకోగలిగే హంస తూలికా తల్పంలాంటి బెడ్. ప్రక్కనే చిన్న టీపాయ్ మీద ఏవేవో మందులు అక్కడ మరో ఫోన్, ఆ బెడ్ మీద మెడవరకు ఖరీదైన శాలువ కప్పుకున్న ఒక వ్యక్తి—మతిపోయింది మా యిద్దరికీ. ఆశ్చర్యానుమానాలతో చూస్తూ ఉండిపోయాం.

మీనాక్షి బెడ్ దగ్గర కెళ్ళి "నాన్నగారూ!" అంది.

అంతవరకూ కళ్ళు మూసుకొని పడుకున్న నాగభూషణంగారు, మెల్లగా కళ్ళు విప్పి—

"వచ్చావమ్మా! రండి...రండి. ఇలా దగ్గరగా వచ్చి కూర్చోండి," అన్నారు చిరునవ్వుతో.

దగ్గరగా వెళ్ళి—"నమస్తే..." అన్నాం నారాయణ, నేను.

"ఈయన పేరు రాజు, అన్నయ్యతో కలిసి చదువుతున్నారు. అతని పేరు నారాయణ. అన్నయ్య క్లాస్ మెట్. ముగ్గురు ఒకే రూమ్‌లో ఉంటున్నారు" అంది మీనాక్షి.

"సంతోషం. బాగా చదువుకుంటున్నారా! ఇక్కడ మీకు సదుపాయంగా ఉందా!!"అన్నారు నాగభూషణం గారు.

అదే సమయంలో యింటర్ కమ్యూనికేషన్ లోంచి చిన్న శబ్దమైంది.

మరుక్షణం ఆగదిలో లింగయ్య గొంతుక వినబడింది.

"బాంబే నుండీ ట్రంకాల్, మాట్లాడతారా?"

"అరగంట పోయాక కనెక్ట్ చెయ్" అన్నారు నాగభూషణంగారు అలా పడుకోనే.

"అలాగే సార్" అంది లింగయ్య కంఠం.

టేబుల్ మీదున్న మైక్రోఫోన్ అంతదూరంనుండీ నాగభూషణంగారి కంఠాన్ని ఎలా రిసీవ్ చేసుకుందో, అర్థం కాలేదు నాకు.

మరో పది నిమిషాలు ఉండి తిరిగొచ్చేశాం—నలుగురం.

నా మనస్సులో ఏవేవో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. పక్షవాతం వచ్చి మంచాన పడినా అతనికెందుకో ఈ తాపత్రయం అర్థంకాలేదు. జగన్నాథ్, తన చదువు తన సరదాలే తప్ప వ్యాపార విషయాలు, ఆస్థి వ్యవహారాలు అతనికేం తెలియవు. డబ్బుకోసం ఉత్తరం రాస్తే లింగయ్యగారే పంపిస్తారు. ఆ యింట్లో లింగయ్యగారే అన్ని వ్యవహారాలు చూస్తారు. అతని అతివినయం చూస్తే నాగభూషణంగారిని మోసం చేస్తున్నాడేమో అనిపించింది.

డైనింగ్ టేబుల్ దగ్గర మీనాక్షితో అన్నాను—

"సాయంత్రం నారాయణ, నేనూ పట్నం వెళుతున్నాం" అని.

"ఆ!! అదేమిటి? ఇక్కడ మిమ్మల్నెవరేనా, ఏమైనా అన్నారా? అన్నయ్యా!!! ఎందుకింత సడన్‌గా ప్రయాణం పెట్టుకున్నారాయన" అంది తింటున్నదల్లా మధ్యలో ఆగిపోయి.

"మీ అన్నయ్యతో తగువుపడి వెళ్ళిపోతున్నాం" అన్నాను నవ్వుతూ.

"నిజం చెప్పండి. నామీద కోపం వచ్చిందా! పది రోజులుంటానని వచ్చి, మర్నాడే వెళ్ళిపోతున్నారంటే ఏదో బలమైన కారణం ఉంటుంది. ఎవరు మిమ్మల్ని అవమానించారు? నాకు తెలుసు. మీ మనస్సు నొప్పించారెవరో..." అంటూ వెంటనే లేచి వెళ్ళిపోయింది.

ఆమె కళ్ళు అశ్రుపూరితాలవడం నాకే తెలుసు.

"చూశావా! చెల్లాయిని ఎంత బాధపెట్టావో?" అన్నాడు జగన్నాథ్.

"మీరిద్దరూ తింటూ ఉండండి. నేను వెళ్ళి మీనాక్షిని తీసుకొస్తాను" అంటూ వాష్ బేసిన్‌లో చెయ్యి శుభ్రం చేసుకొని, మీనాక్షి గదిలోకి కెళ్ళాను.

మంచానికి అడ్డంగా పడి ఏడుస్తోంది.

"మీనా!" అన్నాను మెల్లగా.

ఠక్కున లేచి, పరుగున వచ్చి నన్ను వాటేసుకుంది.

"నిజంగా వెళ్ళిపోతున్నారా!" అంది దుఃఖం ఆపుకుంటూ.

"పిచ్చి మీనా! నిన్నొదిలి ఎక్కడికిపోతాను డియర్. ఛ...ఛ... ఈ మాత్రానికే ఏడుస్తారా! టౌన్‌లో కొంచెం పనుంది. మళ్ళీ రేపు ఉదయానికల్లా వచ్చేస్తాం. ఈ పెంకి పిల్లని వదిలి నేను ఉండగలనా..." అన్నాను - మీన కళ్లు తుడుస్తూ.

బలంగా పెనవేసుకుపోయింది మీన. అనిర్వచనీయమైన మధురానుభూతికి లోనయ్యాను.

"మిమ్మల్ని వదిలి ఉండలేను రాజూ! అనుక్షణం మీ తలపులే. నాన్నగారితో చెప్పి త్వరలోనే స్వంతం చేసుకోవాలనుకుంటున్నాను..."

"ఆపండి... పైత్యం ఎక్కువైతే ప్రమాదం—చూశావా సాంబారు అన్నం తింటూ చెయ్యి కడుక్కోకుండానే పారిపోయొచ్చావ్. ఇప్పుడు నా బట్టలన్నీ పాడు చేశావు. ఈ అవతారంలో బయట కెళితే...ఏమనుకుంటారో తెలుసా..."

"ఏమనుకుంటారేం?"

"మనిద్దరం...పోట్లాడుకున్నామనుకుంటారు. పద... పద..." అంటూ యిద్దరం తిరిగొచ్చి కూర్చున్నాం—నవ్వుకుంటూ.

"అలక తీర్చడం—మరీ యింత సేపా!" అన్నాడు నారాయణ నవ్వుతూ.

సిగ్గుతో తలొంచుకుంది మీనాక్షి.

జగన్నాథ్ కూడా చెల్లెల్ని చూసి నవ్వేశాడు.

4

సాయంత్రం మామ్మూలుగానే నలుగురం షికారు కెళ్ళి ఆరుగంటలకి తిరిగొచ్చాం.

"నిజంగా వచ్చేస్తారు కదూ రేపు!" అంది మీనాక్షి నన్ను తన గదిలోకి పిలిచి.

"రాకపోతే ఈ దేవిగారు ఒప్పుకుంటారా?"

"అన్నయ్య కూడా వస్తున్నాడా మీతో?"

"లేదు. నారాయణా నేనూ వెళుతున్నాం. ఉదయానికి వచ్చేస్తాం" అన్నాను.

"ఈ రాత్రి నాకు నిద్ర ఉండదు."

"ఇవాళ శివరాత్రి అయినా బాగుండేది. ఫరవాలేదు. శనివారం కదా! ఆ శ్రీనివాసుడు నీ కోరిక నెరవేర్చు గాక" అన్నాను గదిలోంచి పైకొస్తూ.

జగన్నాథ్ టైగర్‌ని గొలుసుతో కట్టి, మమ్మల్ని రోడ్ వరకూ సాగనంపడానికన్నట్లుగా కొంతదూరం వచ్చాడు.

నారాయణ బేగ్ పట్టుకొని నా ప్రక్కనే నడుస్తున్నాడు.

"బాస్! ఇదిగో రివాల్వర్. సిక్స్ షాట్స్ లోడ్ చేసి ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఉపయోగించండి. ఉదయం మీ కోసం ఎదురు చూస్తాను—గుడ్ లక్—" అన్నాడు టైగర్ గొలుసు నా చేతికిస్తూ.

అది అల్సేషియన్. మంచిజాతి కుక్క. ఈ రెండ్రోజుల్లో అది నాకు బాగా చేరువైంది.

మీనాక్షికి టైగర్ అంటే ఎంతో ముద్దు. క్షణం వదలకుండా మీనాక్షి వెంటే తిరుగుతూ వుంటుంది.

చీకటి దట్టంగా వ్యాపించింది. దూరంగా నక్కల అరుపులు వినిపిస్తున్నాయి. పొలాల గట్లమ్మట నడుస్తున్నాం.

జగన్నాథ్ గుడ్ నైట్ చెప్పి వెనక్కి వెళ్ళిపోయాడు.

"బాస్! జగన్నాథ్ ఫాదర్ గురించి నీ అభిప్రాయం?" అన్నాడు నారాయణ సిగరెట్ ముట్టించి నా కొకటి యిస్తూ.

"నువ్వు కూడా నాగభూషణంగారి గురించే ఆలోచిస్తున్నావా?" అన్నాను.

"అతని మన స్తత్వం ఏమిటో అర్థం కావడంలేదు. ఈ పల్లెటూర్లో అంత పటిష్టమైన గదిలో, పక్షవాతంలో మంచం దిగలేకపోయినా డబ్బు గడించడానికి యింకా ఆ తాపత్రయం ఎందుకో..."

"మైడియర్ ఫ్రెండ్! వందరూపాయలు గడించేవాడికి వెయ్యిరూపాయలు కావాలనిపిస్తుంది. వెయ్యి వుంటే

పదివేలు, లక్షాధికారి, కోటికి పడగెత్తాలని చూస్తాడు. డబ్బు వస్తుంటే, ఏ రోగాన్నీ లక్ష్యపెట్టరు. డబ్బుతో కొనలేని సుఖంలేదు. ఈ తాపత్రయం, దురాశ, మనిషి-డబ్బు ఈ భూమ్మీద వున్నంతకాలం పోవు. మనిషికి, మనిషికీ లేని మహత్తర అనుబంధం డబ్బుకి - మనిషికి వుంది."

"బాస్! అటుచూడు. అదే దెయ్యాల భవనం. భవనం దగ్గర ఏదో లైటు వెలిగి ఆరుతోంది. ఈ సమయంలో ఎవరున్నారో..."

"అది లైటు కాదు. గాలిలో వుండే భాస్వరం. అది చూసే మనవాళ్ళు కొరివి దెయ్యాలంటారు."

ఆ భవనానికి కాపలాగా, భయంకర రాక్షసుడిలా, నిలిచివుంది చింత చెట్టు. ఏవో పక్షులు గోల చేస్తున్నాయి, మా అలికిడికి. ప్రక్కనున్న పొదల్లో ఏదో శబ్దమైంది. టైగర్ గట్టిగా అరిచింది. రెండు నక్కలు, మా ముందు నుండే దూసుకుపోయాయి. కన్ను పొడుచుకున్నా కానరాని అంధకారం.

"బాస్! టార్చి వెలిగిద్దామా?" అన్నాడు నారాయణ.

శిథిలావస్తలోనున్న గేటుదాటి భవనం ముఖద్వారం సమీపించాం—

"నారాయణ! టార్చి వెలిగించు. తలుపులు తీసున్నాయో, తాళంవేశారో చూడు" అన్నాను.

టార్చిలైటు కాంతిలో తాళంలేని ముఖద్వారం తలుపులు తోశాను. చిన్న శబ్దంతో తెరుచుకున్నాయి తలుపులు. అంతవరకూ లేని శబ్దం తలుపులు తెరవగానే సన్నగా వినబడుతోంది. ఏమిటా శబ్దం! చక... చక...

టక...టక... రకరకాలుగా వినబడుతోంది. అది పెద్ద హాలు. పాడుపడిన ఫర్నిచర్ కుప్పలా పడివుంది. ఒకవైపు బూజులు, సాలెగూళ్ళు, గబ్బిలాలు భయంకరంగా వ్రేలాడుతున్నాయి. నిజంగా ఈ ఇంట్లో దెయ్యాలున్నాయా! ఆ శబ్దం దెయ్యాలు చేస్తున్నదా!!?

"బాస్! ఏదో శబ్దం వినబడుతోందా?" అన్నాడు నారాయణ టార్చితో అన్నివైపులా పరిశీలిస్తూ.

"అవును. బాగా విను. రెండు రకాలుగా క్రమం తప్పకుండా వినబడుతోంది. అంటే!!"

"ఆగిపోయింది బాస్. వినబట్టం లేదు."

"అవును. మన ఉనికి తెలిసినట్లుంది."

అదేసమయంలో మేడమీద ఏదో తలుపు తీస్తున్న చప్పుడు, ఆ వెంటనే మేడమీద పెద్ద గోల, అరుపులు, కొట్టుకుంటున్నట్లు, ఏవో వస్తువులు విసిరేస్తున్నట్లు—

టైగర్ గట్టిగా అరుస్తూ, విపరీతంగా గింజుకుంటూంది, గొలుసు వదిలేయమని.

నారాయణ టార్చి ఆఫ్ చేసి, నా ప్రక్కన చేరాడు.

"బాస్. దెయ్యాలా!!!" నారాయణ కంఠంలో చిన్న వణుకు.

"నారాయణా! రోప్ తీసి పట్టుకో. మన మొదటి ప్రయోగానికి సిద్ధంగా ఉండు. టార్చి వెలుగులో చూసే వుంటావు మనకి ఎడంవైపు మేడమీదికి మెట్లున్నాయి. టైగర్ మేడమీదికి పరుగెత్తడానికి ఉరకలేస్తోంది. వదిలేస్తున్నాను. టార్చి నాకందించి, రోప్ సిద్ధంగా పట్టుకో" అన్నాను టార్చి అందుకొని, గొలుసు వదిలిపెట్టాను. టైగర్ ఒక్క ఉరుకులో మెట్లవైపు పరుగెత్తింది, అరుచుకుంటూ.

టైగర్ కట్లమెట్లు ఎక్కుతున్న శబ్దం, తరువాత పైకి వెళ్ళి అరుస్తున్న అరుపులు, మరుక్షణంలో ఆగిపోయాయి.

గోల, అరుపులు, చప్పుళ్ళు ఒక్కసారిగా ఆగి భయంకరమైన నిశ్శబ్దం చోటు చేసుకుంది.

ఆ వెంటనే మళ్ళీ పెద్ద కేక, గుండెలు బద్దలయ్యేటట్లు, భవనం, దద్దరిల్లేటట్లు, కట్లమెట్లమీంచీ దడ...దడ... ఎవరో దిగుతున్న శబ్దం.

టైగర్ ఏమైంది? కనీసం అరుపులు కూడా వినపడలేదే. నా మెదడు మొద్దుబారిపోయింది. భయం అంటే ఎరగని నాకు లిప్తకాలం శరీరమంతా చల్లబడినట్లైంది.

మెట్లవేపు 'దబ్'మని ఎవరో పడినట్లు పెద్ద చప్పుడైంది.

వెంటనే మళ్ళీ మెట్లు ఎక్కుతున్న చప్పుడు—

టార్చి మెట్లవేపు వేశాను. గుండె ఆగినంత పనైంది.

టైగర్ మెట్లదగ్గర అచేతనంగా పడివుంది.

"బాస్! ఈ యింట్లో దెయ్యాలు లేవు. మనుషులే వున్నారు. మెట్లవేపు శబ్దం కాగానే తాడు విసిరాను. ఏదో తగిలినట్లయింది. వెంటనే రెండువైపులా బలంగా లాగాను. వెంటనే ఎవరో పడిన శబ్దం అయింది. పడిన వ్యక్తి లేచి మళ్ళీ మెట్లెక్కి పారిపోయాడు" అన్నాడు నారాయణ.

"పద. టైగర్ పడుందక్కడ" అంటూ ఇద్దరం వెళ్ళి మెట్లదగ్గర పడున్న టైగర్‌పై టార్చి వెలిగించి చూశాం. ప్రాణం వుంది. ఎక్కడా దెబ్బలు తగిలినట్లు లేదు. హాయిగా నిద్రపోతున్నట్లుంది.

అదేసమయంలో మెట్లమీద పెద్ద శబ్దమైంది. "నారాయణా పక్కకి తప్పుకో" అని అరిచి టైగర్ కాళ్ళు

పట్టుకొని ఈడుస్తూ నేను కూడా తప్పుకున్నాను.

దడదడమని మెట్లమీంచి దొర్లుతూ ఒకదాని తరవాత ఒకటిగా నాలుగైదు డ్రమ్ములు వచ్చిపడ్డాయి. క్షణం ఆలస్యమైతే, నారాయణ, నేనూ, టైగర్ శరీరం ఆ డ్రమ్ముల క్రింద నలిగిపోయేవాళ్ళం.

అదేసమయంలో నా ప్రక్కన ఏదో కదిలిక.

వెంటనే నా తలమీద పిడుగుపడింది. వెయ్యి ఓల్టుల బల్బు నా కళ్ళముందు క్షణం ఆగిపోయింది. కపాలం బద్దలైనట్టు—దెబ్బ—అంతే. కళ్ళు బైర్లుకమ్మాయి. స్పృహ కోల్పోతున్నాను. అప్పుడే "బాస్" అని నారాయణ కేక. నూతిలోంచి వినబడినట్లుంది. తరవాత ఏమైందో కుప్పలా కూలిపోయాను.

5

మెల్లగా కళ్ళు విప్పాను. తలంతా దిమ్ముగా ఉంది. చెయ్యి కదపబోతే ఎవరో పట్టుకున్నారు.

"హౌ ఆర్ యూ! మిస్టర్ రాజూ!" పరిచయమైన కంఠం.

రెండుసార్లు రెప్పలాడించి చూశాక క్రమంగా చూడగలిగాను. ఎదురుగా సివిల్ డ్రస్‌లో ఇనస్పెక్టర్ దామోదర్ కూర్చున్నాడు. బి. ఎస్. సిలో నా క్లాస్‌మేట్. క్రైం బ్రాంచ్ ఇనస్పెక్టరై రెండేళ్ళయింది. దామోదర్ ఇక్కడికి రావడం ఎంతయినా ఆశ్చర్యంగా వుంది నాకు. అంతకంటే ఆశ్చర్యం నేను హాస్పటల్, స్పెషల్ వార్డులో ఉండటం.

"రాజూ! ఎలాగుంది?" దామోదర్ అడిగాడు ఆప్యాయంగా చెయ్యి పట్టుకొని.

"బాగానే ఉంది బ్రదర్. తల మాత్రం బాగా దిమ్ముగా, బరువుగా ఉంది అంతే. అసలేం జరిగింది? నే నిక్కడి కెలా వచ్చాను?? నేను హాస్పటల్లో ఉన్నట్లు నీ కెలా తెలిసింది??..."

"రాజూ! ఆగు. నిమిత్తంగా రెస్టు తీసుకో. సాయంత్రం వచ్చి అన్నీ మాట్లాడతాను. నిన్నెక్కువగా డిస్టర్బ్ చెయ్యొద్దన్నారు డాక్టర్" దామోదర్ మాటలకి మధ్యలో అడ్డొస్తూ, "అయామ్ ఆల్ రైట్ బ్రదర్. నువ్విప్పుడు చెప్పకపోతే సాయంత్రం వరకూ ఈ ఆలోచనలు నా మెదడుని దొలిచేస్తాయి—నా కోసం పై నెవరైనా వెయిట్ చేస్తున్నారా!"

"అవును బ్రదర్. జగన్నాథ్, మీనాక్షి నిన్నటినుండీ యిక్కడే వున్నారు. ఆ అమ్మాయి అయితే డైట్ కూడా తీసుకోకుండా ఏడుస్తూ కూర్చుంది. జగన్నాథ్ వల్ల చాలా వరకూ తెలుసుకున్నాననుకో. నీ నోటితో వినాలనుంది. చెప్పగలవా!"

"బ్రదర్, ఒక్క పదినిమిషాలు మీనాక్షితో మాట్లాడ నిస్తావా! తరవాత నీకంతా చెప్తాను" అన్నాను. మీనాక్షి నాకోసం నిన్నటినుండీ ఎదురుచూస్తోందంటే ఎంతో బాధనిపించింది. అయినా నిన్నటినుండీ స్పృహ లేకుండా పడివున్నానా?

"ఆల్ రైట్ రాజూ! మీనాక్షిని పంపిస్తాను, ఏ విధంగానూ ఉద్రేకపడకు. నీకు పూర్తి విశ్రాంతి అవసరమని డాక్టర్ చెప్పారు. ఇప్పుడే ఆమెను పంపిస్తాను" అంటూ వెళ్ళిపోయాడు క్రైం బ్రాంచి యిన్స్పెక్టర్ దామోదర్.

పుష్డోర్సు తెరుచుకున్నాయి. నీరసంగా, వాడిన

ముఖంతో చెక్కిళ్ళపై చారలు కట్టిన కన్నీళ్ళతో గుమ్మంలో నిలబడి వుంది, నా మీనాక్షి.

నా కళ్ళు చెమ్మగిల్లాయి. మీనాక్షిని అనవసరంగా బాధించాను. రెండుచేతులూ చాచాను.

ఒక్క పరుగులో వచ్చి నా హృదయంపై వాలి పోయింది, వెక్కి వెక్కి ఏడుస్తూ.

ఆమె వెనుకే వచ్చిన టైగర్, బెడ్ చుట్టూ తిరిగి నా పాదాలు నాకుతోంది.

"లే మీనా, నాకేమైందని? ఎందుకిలాగైపోయావు?" అన్నాను ఆప్యాయంగా తల నిమురుతూ.

"అసలు మీ రెండు కళ్ళారండీ, ఆ దెయ్యాల కొంపకి. నేను భయపడతానని, వెళ్ళనివ్వనని నాతో అబద్ధం చెప్పారు కదూ! అంత హఠాత్తుగా ప్రయాణం ఎప్పుడు పెట్టారో అప్పుడే నా కనుమానం కలిగింది. చూశారా! ఎంత ప్రమాదం తప్పిందో. నేటికి రెండు రోజులైంది మీరు స్పృహలేకండా పడివున్నారు. ఎంతగా తల్లడిల్లి పోయానో, ఎన్ని దేవుళ్ళకి మొక్కుకున్నానో, ప్రేమించిన హృదయానికే అర్ధం అవుతుంది ఆ ఆరాటం."

"అసలేం జరిగింది మీనా!" అన్నాను.

"మర్నాడు ఉదయానికొస్తానన్న మీరు పదిగంటలైనా రాలేదు. టైగర్ కూడా మీ వెంట ఎందుకు తీసుకెళ్ళారో అర్ధం కాలేదు. అన్నయ్య ఉదయంనుండీ కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. ఎంత అడిగినా, ఏదో ఆత్రుత, గాభరా పడుతున్నాడే గాని అసలు విషయం చెప్పలేదు.

పన్నెండుగంట లౌతూండగా నారాయణ తలకి పెద్ద కట్టు కట్టుకొని, వంటినిండా రక్తంతో యింటికొచ్చాడు.

అన్నయ్యా గదిలో వాళ్ళిద్దరూ ఏదో వాదించుకుంటు న్నారు. నన్నేదో భయం ఆవరించింది. ఇద్దర్నీ నిలదీసి చెప్పేవరకూ వొప్పుకోలేదు.

చివరికి నారాయణ జరిగినదంతా చెప్పాడు.

ఆ భవనం వెనకవైపు ఉన్న చింత తోపులో ఒక పెద్ద అగాధంలో పడి ఉన్నారట ఆయన. పదకొండు గంటలప్పుడు స్పృహ వచ్చిందట. తలమీద దెబ్బ తగిలి గాయమై రక్తం గూడుకట్టి ఉంటే బనీను తీసి తలకి కట్టు కొని, మీరు ఇంటికొచ్చేరేమోనని యిల్లు వెతుక్కుంటూ వచ్చారు.

టైగర్ జాడలేదు. మీరు కనబడలేదు. మీకేమైందో నా ప్రాణాలు విలవిల్లాడిపోయాయి. నారాయణ, జగ న్నాథ్ మిమ్మల్ని వెదకడానికి వెంటనే బయలుదేరారు. నేనుకూడా వద్దన్నా వినకుండా బయలుదేరాను. చెరువు గట్టు నుండీ వెళుతూండగా, టైగర్ మెల్లగా జోగుతూ వస్తోంది. నన్ను చూచి అరుచుకుంటూ పరుగెత్తు కొచ్చింది.

"టైగర్‌కి ఎవరో మత్తుమందు యిచ్చారు. రాత్రి దీన్ని కూడా యిక్కడ పారేశారు. తెలివొచ్చి ఇప్పుడే లేచివచ్చినట్లుంది" అని చెరువులోని నీటిలో దాని తల పూర్తిగా తడిపేశాడు నారాయణ.

మరుక్షణంలో అది తల విదిలించి శక్తిని పుంజుకుంది. దూరంగా కనబడుతున్న భవనంవైపు చూసి రెండుసార్లు మొరిగింది. తరవాత నా కొంగు పట్టుకొని లాగడం మొద లెట్టింది.

"టైగర్, ఆయనెక్కడున్నారు?" అన్నాను.

వదలకుండా నా కొంగు లాగుతోంది. ఎక్కడికో రమ్మంటోందని అర్థమై ముగ్గురం టైగర్‌ని అనుసరించాం.

చెరువుగట్టు అవలివైపు ఉన్న పాడుపడిన ఆలయ శిధిలాల్లో అచేతనంగా పడి ఉన్న మీ దగ్గరకి తీసుకు పోయింది.

భోరున ఏడ్చాను.బట్టలన్నీ రక్తంలో తడిసిపోయాయి. వంటి నిండా రక్తం — నా తల తిరిగిపోయింది. కెవ్వున అరిచి పడిపోయాను! కొంత సేపటికి తెలివి తెప్పించారు. వెంటనే మిమ్మల్ని యింటికి చేర్చాం.

నాన్నగారికి ట్రీట్ చేస్తున్న డాక్టర్ మిమ్మల్ని చూసి, "వెంటనే హాస్పటల్లో చేర్చాలి. చాలా రక్తం పోయింది. తలకి చాలా బలమైన గాయమైంది," అన్నారు.

కారు మూడు గంటలకి వచ్చింది. ఇక్కడికి తీసుకొచ్చి వెంటనే చేర్పించి, యింతవరకూ యింటికెళ్ళలేదు. ఆపరేషన్ చేసి, తలకి కుట్లు వేశారట. రక్తం బ్లడ్ బ్యాంకు నుండీ తెచ్చి ఎక్కించారు. నాన్నగారు నాలుగుసార్లు ఫోన్ చేశారు, మీ కెలాగుందని. భగవంతుని దయవల్ల మీరు బ్రతికారు, అంతే చాలు నాకు" అంది మీన.

"జరిగింది మీ నాన్నగార్కి చెప్పావా!" అన్నాను ఆలోచిస్తూ.

"నేను చెప్పడమేమిటి? ఆయనకే తెలిసింది. ఇంత గొడవ జరిగితే తెలియకుండా ఉంటుందా! మంచంమీంచి లేవలేకపోయినా ఏ క్షణంలో ఎక్కడేం జరిగినా ఆయనకి తెలిసిపోతుంది. వృద్ధిలోకి రావలసిన కుర్రాడు, ఎందుకమ్మా యిలాంటి ఆపదల్లో కోరి తల దూర్చడం. అదృష్టవంతుడు. ప్రాణం పోలేదు అన్నారు."

నా మనసులో ఏమేమో ఆలోచనలు గజిబిజిగా అల్లుకు పోతున్నాయి. దేనికీ లంగరందటం లేదు. లింకులు కలియడం లేదు. ఆ భవనం గురించే ఆలోచిస్తున్నాను.

"ఇకనైనా యిలాంటి విషయాల్లో తలదూర్చి ఆపదలు తెచ్చుకోకండి. మీ కోసం పరితపించే మరో ప్రాణి ఉందని అర్థం చేసుకోండి" అంది మీన.

అదే సమయంలో టక్ టక్ మని తలుపు చప్పుడైంది.

మీన లేచి నిలబడింది. "కమిన్" అన్నాను.

డాక్టర్, వెనుకే దామోదర్, జగన్నాథ్, నారాయణ వచ్చారు.

"హౌ ఆర్ యూ!! మై డియర్ యంగ్ మెన్" అన్నారు డాక్టర్ చిరునవ్వుతో.

"క్వయిట్ ఆల్ రైట్ సర్. థేంక్యూ వెరి మచ్" అన్నాను.

"వెరీ గుడ్. ఎక్కువ శ్రమ తీసుకోవద్దు. రెస్టు చాలా అవసరం.

మరో పదినిమిషాల్లో పెథీడిన్ యిస్తాను. ఇనస్పెక్టర్ టెల్ హిమ్, టెన్ మినిట్సు ఓన్లీ" అని వెళ్ళిపోయారు.

"బాస్! ఎలా ఉన్నారు" అంటూ జగన్నాథ్, నారాయణ నన్ను సమీపించారు.

"ఫరవాలేదు. నావల్ల అంతా శ్రమ తీసుకున్నారు" అన్నాను.

"మై డియర్ ఫ్రండ్స్. రాజుతో ఏకాంతంగా మాట్లాడాలి," అన్నాడు దామోదర్.

"అలాగే" అంటూ ముగ్గురూ బయటకెళ్ళిపోయారు.

"రాజూ! ఇప్పుడు చెప్పు. నీ అనుమానాలేమిటి? నారాయణ నిన్ను హాస్పటల్లో చేర్చగానే నా దగ్గరకొచ్చి

చెప్పాడు. వెంటనే వచ్చేశాను. దాదాపు నేనుకూడా నిన్నటినుండీ నీకు స్పృహ ఎప్పుడొస్తుందా అని యెదురు చూస్తున్నాను'' అన్నాడు దామోదర్.

''అవును బ్రదర్! ఆ యింట్లో దెయ్యాలున్నాయని ఆ ఊళ్లో అందరూ ఆ దరిదాపులకికూడా వెళ్ళడంలేదు. రక రకాలుగా కథలు చెప్పుకుంటున్నారు. నారాయణ, నేను ఆ దెయ్యాలగురించి తెలుసుకోడానికే వెళ్ళాం. దినదినాభి వృద్ధి పొందుతున్న ఈ అణుయుగంలోకూడా దెయ్యాలకి, భూతాలకి భయపడేవారున్నారు. దెయ్యాలున్నాయని ఓ యిల్లు వదిలేసి, అందులో రత్నాలరాసులు పోసి తలుపులు తీసి వదిలేసినా చెక్కు చెదరకుండా ఉంటాయి. ఆ ఇంట్లో ఏదో శబ్దం...అవును...ఇప్పుడు గుర్తుకొచ్చింది. ప్రింటింగ్ ప్రెస్ శబ్దంలా, ఆటోమిషన్సు పనిచేస్తున్నట్లు మెల్లగా వినబడింది. ఆ యింట్లో దెయ్యాలున్నాయో లేవో దేముడికి తెలియాలి గాని, మనుషులు మాత్రం ఉన్నారు. వాళ్ళె యినా సంఘ విద్రోహులో, దోపిడీ దొంగలో! చీకటి వ్యక్తులని నా అనుమానం'' అన్నాను. తల పట్టుకుంటూ. తలంతా నొప్పిగా ఉంది. ఎందుకో వికారంగా ఉంది.

''రాజూ! రెస్ట్ తీసుకో, ఆ భవనం సంగతి నేను చూసుకుంటాను. నీ అనుమానం మాత్రం ఎవరికీ తెలుపకు. ఆఖరికి మీనాక్షీ గారికికూడా తెలియగూడదు'' అన్నాడు దామోదర్ నవ్వుతూ.

''అలాగే బ్రదర్'' అన్నాను కళ్ళు మూసుకుంటూ.

*　　　*　　　*

మర్నాడు ఇన్‌స్పెక్టర్ దామోదర్ వచ్చి చెప్పిన విష యాలు విని నేను ఆశ్చర్యపోలేదు. నేనూహించినదే జరిగినది.

ఆ పాడుబడ్డ భవంతిని ఓ ముఠా స్థావరంగా చేసుకుని, కొన్ని సంవత్సరాలుగా దొంగనోట్లు ప్రింటు చేస్తున్నారట. ఇన్స్పెక్టర్ దామోదర్ తన బలగంతో హఠాత్తుగా ఆ భవనంపై దాడిచేసి, అందులో పనిచేస్తున్న సుమారు ఇరవైమందిని, ముఠా నాయకుడిని అరెస్టు చేశారట.

"ఇంతకూ ముఠానాయకుడు ఎవరు?" ఆసక్తితో అడిగాను, ఎవరో నేనూహించినప్పటికీ ఇన్స్పెక్టర్ నోటి వెంట వినాలని.

"ఆ ముఠాను నడిపిస్తున్నదీ,పోషిస్తున్నదీ ప్రక్కవూరు జమీందారు దొరైసామి. అతని ముఠా వ్యక్తులు దేశమంతటా వున్నారు. వాళ్ళనందరినీ వెంటనే పట్టుకోనే ఏర్పాటుకూడా చేశాను."

ఇన్స్పెక్టర్ మాటలతో కొయ్యబారిపోయాను నేను. అంతవరకు నా ఊహాలోనున్న వ్యక్తి వేరు.

"అంటే...అంటే, మీనాక్షి తండ్రి నాగభూషణం గారికి దీనిలో ప్రమేయం ఏమీ లేదా?" ఆశ్చర్యంతో అడిగాను.

"నో_నో. ఆయనకు గాని, ఆయన కుటుంబ సభ్యులకు గాని ఎటువంటి సంబంధమూ లేదు" అన్నాడు ఇన్స్పెక్టర్ దామోదర్ నా మాటలకు మరింత ఆశ్చర్యపోతూ.

'థాంక్ గాడ్!' మనసులోనే భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకుని, విశ్రాంతిగా కళ్ళు మూసుకున్నాను. ★★★

పాప కూపం!

ఏ. వీ. మోహన్రావ్

"బొంబాయి వచ్చింది!" చెప్తూనే ముందుకు వెళ్ళిపోయాడు అతనెవరో. పేరుకూడా నాకు తెలీదు. నాలాగే నౌకలో పనిచేస్తున్నాడు.

మెల్లగా త్రాటినిచ్చెనెక్కి డెక్ పైకొచ్చి నిలుచున్నాను. నేనున్న నౌకకు కొంచెం దూరంగా నీళ్ళవారగా, కాళ్ళు కడుగుకొంటున్నట్లుగా సముద్రంలోకే కట్టిన పెద్ద పెద్ద మేడలు కనుపించాయి.

బొంబాయి పేరు వినగానే నాకు మత్తెక్కిపోయింది. అందాల సినిమా తారలతోపాటు, డబ్బును అన్నిరకాల సంపాదించే ఐశ్వర్యవంతులు గూడా వున్నారు. నాకు ఎక్కడా ఉద్యోగం దొరకక్క, ఈ నౌకలో కెప్టెన్కు

వంటవాడిగా కుదిరాను. నా జీతం ఆయనిస్తున్నదే. ఆయన పేరు నాకు తెలీదు. అందరూ కెప్టెన్ అనే అంటారు ఆయన్ని.

మధ్యాహ్నం భోజనంచేసి చెయ్యి కడుగుకుంటూంటే డిష్ పట్టుకొని నిలుచున్న నాకు, అప్రయత్నంగానే ఆయన్ని ఊరు చూచి వచ్చేందుకు పర్మిషన్ అడగాలని పించింది. వెనుకా ముందూ ఆలోచించకుండా అడిగాను.

నవ్వి "పదింటి లోపు నేరా! ఆ తర్వాత రావాలన్నా రాలేవు!" అన్నారు.

"త్వరగానే వచ్చేస్తాను సార్!" అన్నాను.

షిప్‌లోంచి రెండు గంటలకు వెలుపలి కొచ్చాను. గేట్ వే ఆఫ్ ఇండియా ప్రాంతాలకు చేరుకున్నాను. సముద్రంవారగా కట్టిన రాతిగోడపైన కూర్చుని తాజ్-షిరతాన్ కేసి గుడ్లప్పగించి చూడసాగాను.

"మిస్టర్!" ఎవరిదో పిలుపు వినిపించింది దగ్గరగా. తలెత్తి చూశాను.

"నిన్నే!" అన్నాడతను. బాగా గమనించి చూశాను. కాస్త భయంకరంగా వున్నాడు. చూస్తూనే రౌడీ అని పసిగట్టాను.

"నన్నా?" అడిగాను అనుమానిస్తూ.

"నిన్నేనోయ్! ఏం పేరు?"

"తంగప్పన్" చెప్పాను.

"షిప్‌లో పనిచేస్తున్నావా?"

"అఁ! జలఉషలో. కెప్టెన్‌కు భాయ్‌గా వున్నాను."

"మీ షిప్ అమెరికా వెళ్తుందికదూ!" అడిగాడతను ప్రక్కనే కూర్చుంటూ.

"నేనడగలేదు. వాళ్లు చెప్పలేదు. మాటల్లో విన్నాను" అన్నాను.

"అసాధ్యుడివే! ఎంతిస్తారు జీతం?"

"తిండీ బట్టా కాక నెలకు రెండొందలు!" అన్నాను గర్వంగా.

"ఇంతేనా?" అదో పెద్ద జీతం కానట్లుగా మాట్లాడాడు.

"అంత జీతమున్నా దొరికే ఉద్యోగం నాలుగేళ్ళనుండి ప్రయత్నించినా దొరకలేదు!" అన్నాను, అతను నా జీతం గురించి చులకనగా మాట్లాడినందుకు నొచ్చుకుంటూ.

"నువ్వు తిరిగి వచ్చేసరికి పదివేలు నీకివ్వడానికి సిద్ధంగా వుంచే ఏర్పాటు చేస్తాను. నే చెప్పిన పని చేస్తావా?" అడిగాడతను.

అంత మొత్తం గురించి వినగానే నాకు ముచ్చెమటలు పోసుకొచ్చాయి. భయంకూడా పుట్టింది లోలోపల.

"అవును! పదివేల రూపాయలు కావాలా?"

"డబ్బు వద్దనే వాళ్ళెవరుంటారు?"

"అయితే నే చెప్పిన పని చేస్తావా?"

"కష్టమైందా?"

"తెలివైనవాళ్ళకు సులభమైందే! చేస్తానంటే రా! చెప్తాను!" అన్నాడు అతను.

పదివేలు సంపాదించే అవకాశం వచ్చినందుకు ఆనందం కలిగింది. దాంతో ఏదైనా చిన్న వ్యాపారం పెట్టుకొని, పెళ్ళి చేసుకుందామనిపించింది.

"పదండి! పోదాం!" అన్నాను.

అతను లేచాడు. నేనూ లేచి వెంటపడ్డాను. ఇద్దరం నాలుగైదు వీధులు గబగబ నడచి వెళ్ళాం. ఒక చిన్న

ఇంటిముందు తలుపుపైన తట్టాడు. తెరుచుకొన్నాయి తలుపులు.

ఇద్దరం లోనికి వెళ్ళాం. అక్కడో ముసలతను కూర్చుని వున్నాడు.

"రావోయ్ రా! కూర్చో! ఏం తాగుతావ్?" ఎప్పట్నించో నన్ను తెలిసినట్లు ఆప్యాయంగా పలకరించాడు.

"కాఫీ!" అని కూర్చున్నాను.

మరునిముషంలో కాఫీ తెచ్చాడు కుర్రాడు మా ముగ్గురికీ.

నన్ను తీసుకొచ్చిన మనిషి, అక్కడున్న వ్యక్తితో నాకు అర్థంగాని భాషలో ఐదునిముషాలపాటు ఏదేదో చెప్పాడు. అదంతా నన్నుగురించే అయివుండాలని అనుకున్నాను.

"నువ్వేం చెయ్యాలో తెలుసా?" అడిగాడు ముసలతను.

"తెలీదు!" అన్నాను.

"అయితే విను! గంజాయి తీసుకెళ్ళి, రెండో కంటికి తెలీకుండా, నేనిచ్చే అడ్రసుకు చేర్చాలి అమెరికాలో. చెయ్యగలవా?" అడిగాడు.

"చెయ్యడం తప్పా?" నాకు తెలీకనే అడిగాను.

"తప్పుకాదు! తెలిస్తే అందరికీ ముప్పే! చాలా జాగ్రత్తగా వుండాలి!" అన్నాడు.

"అవన్నీ నాకు తెలీదు. ఎలా తీసుకెళ్ళాలో, ఆ అడ్రసుకు ఎలా చేర్చాలో మొత్తం చెప్పండి. దాని ప్రకారం చేస్తాను. అంతకుమించి నన్నింకేమీ అడక్కండి!" అన్నాను.

వాళ్ళిద్దరూ మొహాలు చూసుకున్నారు. ఆ తర్వాత వెనక వేపు గదుల్లోకి వెళ్ళారు. పది నిముషాల తర్వాత తిరిగొచ్చారు.

"ఆల్ రైట్! అదిగో ఆ సంచులు కన్పిస్తున్నాయిగా" అడిగాడు ముసలతను. మూలనున్న టేబుల్ పైన వరుసగా పేర్చి వున్న చిన్న చిన్న పాలిథిన్ సంచులకేసి వ్రేలు పెట్టి చూపిస్తూ.

"కన్పిస్తున్నాయి" అన్నాను నేను.

"వాటిల్లో పదింటిని నువ్వు తీసుకెళ్ళాలి. నీ నడుం చుట్టూ వాట్ని కడతాను. నువ్వు జలఉషలో పని చేస్తున్నావు కాబట్టి కస్టమ్స్ వాళ్ళు కూడా నిన్ను చెక్ చెయ్యరు. సులభంగా లోనికి వెళ్ళగలవ్. లోనికి వెళ్ళాక ఎవ్వరూ చూచేందును వీలు లేకుండా వుండే చోట దాచుకో. ఆ తర్వాత అమెరికా చేరుకోగానే, వాషింగ్‌టన్‌లోని స్పుత్నిక్ హోటల్‌లో నీ స్వంత పేరు మీద రూం తీసుకో! నిన్ను ఒక వ్యక్తి వచ్చి కలుసుకుంటాడు. అతను నీ సంతకం వున్న కాగితం చూపిస్తాడు. అది తీసుకొని ఈ సంచులు ఇచ్చెయ్. ఆ కాగితం తెచ్చి నాకివ్వు. పదివేలిస్తాను. తీసుకెళ్ళు! సరేనా?" అడిగాడు.

"సరే! కానీ తీరా యిచ్చి వచ్చాక అడ్డం తిరగరుగా?" అడిగాను నా అనుమానం తీర్చుకుందామని.

"ఛ! అలా చెయ్యం" అంటూ ఒక కాగితం ఇచ్చి నన్ను సంతకం చెయ్యమన్నారు. చేశాను. అది తీసుకున్నారు. తర్వాత చిన్ని కెమెరా తెచ్చి నన్ను ఫోటో తీశారు. అదెందుకో అర్థంగాక వాళ్ళకేసి అయోమయంగా చూశాను.

"అమెరికాలో వున్న మా మనిషి నిన్ను గుర్తు పట్టేందుకు వీలుగా ఈ ఫోటో పంపుతాం ముందుగా" అన్నాడు నన్ను తీసుకెళ్ళిన వ్యక్తి.

ఆ తర్వాత వాళ్ళు చెప్పినట్టే నా నడుం చుట్టూ ఆ సంచులు వరుసగా పదింటిని పేర్చి సన్నటి సిల్కు గుడ్డతో రెండు పొరలు త్రిప్పి, కట్టివేశారు. బనీను తొడుక్కొని, దానిపైన స్వెట్టరు వేసుకోమన్నారు. అలాగే చేశాను. దానిపైన షర్టు వేసుకుని, కోటు తొడుక్కున్నాను.

అద్దంలో చూసుకున్నాను. పొట్ట కానీ, నడుం కానీ, అనుమానం కలిగే రకంగా లావుగా లేవనిపించింది.

వాళ్ళ దగ్గర శలవు తీసుకొని మెల్లగా వెలుపలికొచ్చాను. నాకు తొందరగా అమెరికాకు వెళ్ళి, ఆ సంచులు డెలివర్ చేసి, మళ్ళీ వెంటనే తిరిగి బొంబాయి వచ్చి, వీళ్ళను కలుసుకుని రావలసిన పది వేలు రాబట్టుకొందామనిపించింది.

అంతకు ముందు నిర్భయంగా షిప్‌లోంచి వెలుపలికి వచ్చినవాడ్ని, ఇప్పుడు వెళ్ళాలంటే భయం పుట్టింది.

అందరూ నావంకే చూస్తున్నట్లు అనుమానించసాగాను. త్రోవలో ఎవ్వరూ నన్నాపలేదు.

మెల్లిగా నా గది చేరుకున్నాను.

లోపలి కెళ్ళాక తలుపు బిడాయించి, కట్లు విప్పుకొన్నాను. పాలిథిన్ సంచుల్ని ఒక్కొక్కటీ తీసి, బట్టలు పెట్టేందుకు తెచ్చుకొన్న ఇనుప ట్రంకు పెట్టి తెరచి అందులో పెట్టాను. మూత వేసి, తాళం వేసి, తాళం చెవి తీసి మొల్లో కట్టుకున్నాను.

ఇప్పుడు నా మనసు తేలికగా వుంది. ఒక ఘట్టం ఏవిధ

మైన అడ్డంగి లేకుండా జరిగిపోయింది.

ఇలాగే అమెరికా వెళ్ళాక కూడా జరిగితే చాలా బాగుంటుందనిపించింది. నేను ప్రస్తుతం పదివేల రూపాయల కధికారినన్న భావం నాకెంతో ఆనందాన్నిచ్చింది.

కెప్టెన్ గారికి భోజనం వడ్డించాను టేబుల్ పైన. ఆయన బెడ్ రూమ్‌లో ఏదో పుస్తకం చదువుకుంటూ పడుకుని వున్నాడు. వెళ్ళి చెప్పాను భోజనం సిద్ధం చేసిన సంగతి. పుస్తకంతోనే లేచి వచ్చాడు టేబుల్ వద్దకు.

"తంగప్పన్! ఏమేం చూశావ్?" అడిగాడాయన అన్నం కలుపుకుంటూ.

"ఏం లేదు సార్! సముద్రపు ఒడ్డునున్న బిల్డింగులు చూశాను."

"ఊళ్లోకి వెళ్ళలేదా?"

"లేదు సార్!"

"ఎందుకని?"

"ఆలస్యమయిపోతుందని" అన్నాను అసలు విషయం చెప్పే వీలు లేదుగాబట్టి.

"నిన్నెవరన్నా క్రొత్త మనుషులు కలుసుకోనేందుకు ప్రయత్నించారా?" అడిగాడు వున్నట్టుండి.

"లేదు సార్!" నసుగుతూ చెప్పాను.

"లేకుంటే మంచిదే! ఈ మధ్య నీలాంటివాళ్ళను లోబరుచుకుని గంజాయి స్మగ్లింగ్ వ్యాపారం చేస్తున్నారు కొంతమంది ఇక్కడ్నించి. అది చాలా పెద్ద నేరం. అంతేకాదు దేశద్రోహం కూడాను. పట్టుబడితే పెద్ద శిక్ష వేస్తారు" అన్నాడు కెప్టెన్.

నాకు వొళ్ళు తిమ్మిరెక్కిందా మాటలతో.

"అలాగే సార్! ఆ గంజాయి అక్కడేం చేస్తారు సార్?" అడిగాను.

"గంజాయితో రక రకాల మందు బిళ్ళలు తయారు చేస్తారు. అవి వేసుకొంటే మనుషులు మత్తెక్కిపోతారు. ఆ మత్తుకలవాటు పడ్డ మనుషులకు ఈ మందుబిళ్ళలు లేకుంటే బ్రతకాలనిపించదు. వాళ్ళ నరాలు బలహీనపడతాయి. చాలామంది యవ్వనంలోనే పీనుగుల్లా తయారైపోతున్నారు దీని మహాత్యంతో" అన్నాడు ఆయన అన్నం తినడం ముగించి.

నేను భోజనం చేసి వెళ్ళి పడుకున్నాను.

ఎంత ప్రయత్నం చేసినా నిద్ర రాలేదు.

నాకు చిన్నతనం నుంచీ మతమంటే భయం. తెలిసి తెలిసి తప్పు చెయ్యడం దేవుడు క్షమించడని పెద్దవాళ్ళు చెప్తూంటే విన్నాను. మా వూరి చర్చికి వెళ్లేవాణ్ని. అక్కడి ఫాదర్ పదే పదే చెప్పేవాడు పాపాలు చెయ్యొద్దని, తెలియక చేసినా, భగవంతుడి ముందు ఒప్పుకొని మనసారా క్షమాపణ కోరుకుంటే, ఆ పాపంవల్ల మనకేమీ దోషం ఉండదనీ చెప్పేవాడు.

నాకు ఆయనే గుర్తొచ్చాడు.

నౌక కదలింది. బొంబాయి రేవు వదలి పెట్టింది.

మా వూరు ఫాదరీకి వుత్తరం రాశాను వివరంగా నేను చేసిన పాపం గురించి. అందుకు తగిన విముక్తి కూడా తెలుపమని రాశాను.

బోస్టన్ చేరేదాకా సమాధానం కోసం ఆతృతగా ఎదురు చూశాను. లాభం లేకపోయింది.

శాన్‌ఫ్రాన్సిస్‌కో నగరం చేరుకొన్నాం.

నాకు భయం భయంగా వుంది.

విషపు నాగుల్ని బుట్టలో పెట్టి తల క్రింద పెట్టు

కొన్నట్లుంది నాకు. అక్కడ దాదాపు మా నౌక పది రోజులుంటుందని చెప్పారు. కెప్టెన్ దగ్గర పర్మిషన్ తీసుకున్నాను.

రైలెక్కి వాషింగ్టన్ చేరుకున్నాను. గంజాయి సంచులు మాత్రం నౌకలోనే వదిలేసి పోయాను.

బొంబాయిలోని మనుషులు చెప్పినట్లే ఆ హోటల్ వెతుక్కుంటూ వెళ్ళి రూమ్ తీసుకున్నాను.

రిజిస్టరులో పేరు రాసుకొనేప్పుడు అడిగాడు రిసెప్షనిస్టు "మీ గురించి ఎవరో ఒకతను నాలుగు రోజుల్నుంచి వచ్చి వెళుతున్నాడు. రావటం ఆలశ్యమైందా?" అంటూ.

"అవును" అన్నాను.

"అతనొస్తే పంపేదా?"

"పంపు" అన్నాను.

నా దగ్గర లగేజీ ఏమీ లేదు. చిన్న ఎయిర్ బాగ్ మాత్రం వుంది. దాంతో మెట్లెక్కి పోబోయాను. నా రూమ్ నలభై ఆరో అంతస్తులో వుందని అతను చెప్పిన విషయం గుర్తువచ్చి, ఎలివేటర్ వేపు పరుగు తీశాను.

రూం చేరుకొనేందుకు పదినిముషాలు పట్టింది.

టైం చూసుకొన్నాను. మధ్యాహ్నం రెండయింది. రైలు ఖర్చులు, హోటల్ ఛార్జీలు కలిపి చాలా అయింది. ఈ డబ్బు ఆ పదివేలలో వాళ్ళు నన్ను సర్దుకోమని చెప్తారేమో ననుకున్నాను.

ఫాదరీకి రాసిన ఉత్తరం ఏమైందో అర్థం కాలేదు. ఆయన నన్నీ పాపంనుండి తప్పిస్తాడని ఆశగా యెదురు చూశాను. ఏ విధమైన సలహా లభించక పోవడంతో ఈ

పాపం పూర్తిగా చెయ్యటం తప్ప మరో మార్గం లేదని పించింది.

అలాంటప్పుడు అనవసరంగా ఈ ఖర్చులన్నీ నేను పెట్టుకోవడం అనవసర మనుకున్నాను.

తలుపు తట్టిన చప్పుడయింది. వెళ్ళి తెరిచాను.

ఎదురుగా ఆరడుగుల ఆజానుబాహు విగ్రహం కనుపించింది.

"తంగప్పన్ నువ్వేనా?" అడిగాడు అతను నన్ను చూసి.

"అవును. నువ్వు..." అంటూ ఆగాను.

"నా పేరు లింగ్ పింగ్. సరుకు తెచ్చావా?" అడిగాడు.

"ఆఁ!" అన్నాను.

"ఏదీ?" అడిగాడు.

"ఇక్కడలేదు. శాన్ ఫ్రాన్సిస్కోలో షిప్‌లో వుంచాను. వెంట తేవాలంటే భయం పుట్టింది. అక్కడికి రా ఇస్తాను" అన్నాను.

"ఇక్కడికి తేవలసింది!" అన్నాడతను.

"చెప్పాగా ఎందుకు తేలేదో?"

"ఎప్పుడు రమ్మంటావ్?"

"ఎల్లుండి రా! మరో కండిషన్. నీ కోసం రావటానికి చాలా ఖర్చయింది. ఆ ఖర్చులు నువ్వే ఇచ్చుకోవాలి!" అన్నాను.

"అలా అని నాకు ఇండియానుంచి ఉత్తరం రాలేదు!" అన్నాడు.

"అయితే తిరిగి తీసుకెళ్ళి సరుకు వాళ్ళకే ఇచ్చేస్తాను!" అన్నాను.

"ఆ పనిమాత్రం చెయ్యకు. ఏదో చూచి ఇస్తాను" అన్నాడు లింగ్ పింగ్ అయిష్టంగానే.

"నాకు దానం చెయ్యనవసరంలేదు!" అన్నాను కోపంగా.

"ఎంత కావాలి!"

"వెయ్యి రూపాయలు" అన్నాను.

"అలాగే ఇస్తాను" అంటూ జేబులోంచి డైరీతీసి చిన్న కార్డుమీద అడ్రసు రాసి ఇచ్చాడు. అది నా చేతికిస్తూ "నీకోసం ఎల్లుండి ఆ అడ్రసులో వుంటాను. వచ్చి, ఇచ్చి డబ్బు తీసుకో!" అన్నాను.

"అలాగే!" నని అతనిచ్చిన కార్డు జేబులో పెట్టుకొన్నాను.

అనుకున్న ప్రకారం శాన్ ఫ్రాన్సిస్కోలోని అడ్రసుకు సరుకు తీసుకుని వెళ్ళాను.

అతనితోపాటు మరో ఇద్దరు మనుష్యులు వున్నారు. "తెచ్చావా?" అడిగారు.

నడుంచుట్టూ కట్టుకున్న సరుకంతా తీసి టేబుల్ పైన పెట్టాను. మొత్తం పది సంచులున్నాయి. అన్నీ లెఖ పెట్టుకొన్నారు. ఆ తర్వాత ఒక్కొక్క సంచే విప్పారు. తొమ్మిది సంచుల్లో గంజాయి లేదు. మరేదో పిచ్చి ఆకు వుంది. పదో సంచిలో మాత్రం గంజాయి వుంది.

"ఏమిటదిది?" అడిగారు కోపంగా.

"నాకేం తెలీదు! అతనిచ్చినవే. తెచ్చి మీ కిచ్చానవి. నా కిస్తానన్న డబ్బివ్వండి!" అడిగాను.

"ఆ తొమ్మిది సంచులు ఏంచేశావ్? నిజం చెప్పు. లేకుంటే ప్రాణాలు తీస్తాను" అన్నాడు లింగ్ పింగ్.

నాకు ముచ్చెమటలు పోసుకొచ్చాయి. షిప్‌లో పెట్టాక నేనెప్పుడూ ఆ సంచుల్ని తీలేదు. ఇచ్చింది అలానే వుంచాను. అలాంటప్పుడు సంచుల్లోని గంజాయి

మారిపోయి మరేదో పిచ్చి ఆశ ఎలా వచ్చిందో అర్థం గాలేదు.

లింగ్ పింగ్ నల్లటి రివాల్వర్ తీశాడు. నా గుండెలకు గురిపెట్టాడు.

"త్వరగా చెప్పు! ఎక్కడ దాచావ్? ఆ సరుక్కు ముందే డబ్బు కట్టాను. ఇలా మోసపోవడానికి మేమేం దద్దమ్మలం కాదు!" ఘర్జించాడు సింహంలా.

నాకేం తెలియదంటూ కుయ్యో మొర్రోమని మొత్తుకున్నాను. తలుపు తోసినట్లయింది. మరుక్షణంలో నలుగు రైదుగురు, పోలీసులు లోనికొచ్చారు.

లింగ్ పింగ్ చేతిలోవున్న రివాల్వరు క్రిందపడిపోయింది. లిప్తకాలంలో ఆ ముగ్గురి చేతులకూ బేడీలు వేశారు.

"థాంక్స్! మిస్టర్ తంగప్పన్! నువ్వు ముందుగా తెలిపినందువల్ల ఆరేళ్ళనుండి ప్రయత్నం చేస్తున్నాం. చిక్కినట్లే చిక్కి తప్పించుకొన్నారు చాలాసార్లు. వాళ్ళ పాపం పండింది. చిక్కారు" అన్నాడు వాళ్ళల్లో అధికారిలా వున్న వ్యక్తి.

భయంతో బిక్కచచ్చిన నేను ఆ మాటలు విని నోరు వెళ్ళబెట్టాను.

నా దగ్గర స్టేట్‌మెంట్ తీసుకొన్నారు. సంతకం చెయ్యమన్నారు. చేశాను. నన్ను జీపెక్కించి షిప్‌కు పంపారు.

అసలీ హడావుడి ఎలా జరిగిందాని ఆలోచించసాగాను. నా పెట్లో భద్రంగా దాచుకున్న గంజాయి ఎలా బదిలీ అయిందాని బుర్ర బ్రద్దలుగొట్టుకొన్నాను.

ఈ విషయం కెప్టెన్ గారికి తెలీదు. చెప్పాలని నాకూ లేదు. తెలుసుకొని నన్ను ఉద్యోగంలోంచి పీకేస్తాడేమో

నన్ను భయం పుట్టింది. అందువల్లే ముఖ్యంగా ఆయన్నుంచి ఈ విషయాలు దాచాను. తిరుగు ప్రయాణం ప్రారంభమైంది.

నా కార్యక్రమాలు యథావిధిగా నడచిపోతున్నాయి. మరుసటిదినం బొంబాయి చేరుతామనగా, ముందురోజు రాత్రి కెప్టెన్‌కి అన్నం వడ్డిస్తుండగా "ఏమోయ్ తంగప్పన్! మీ వూరి చర్చి ఫాదరీ దగ్గరనుంచి ఉత్తరం రాలేదా?" అడిగాడు.

"లేదు సార్!" అన్నాను.

"లేదా? ఎందుకని?"

జవాబు చెప్పబోయి అసలు నేను ఉత్తరం రాసిన విషయం ఈయనకెలా తెలిసిందాని ఆశ్చర్యపోయాను. ఆ మాటే అడిగాను.

"ఇక్కడ ఉత్తరాలన్నీ సెన్సారు చేస్తారు. ఆ పని నేనే చూడాలి. నీ ఉత్తరం చదివాను. విషయం తెలుసుకొన్నాను. నీ తరఫున నేనే అమెరికన్ ప్రభుత్వానికి విషయం వివరించి, వెంటవచ్చి నిందితులను పట్టుకోవాలని రాశాను. వీలైనంతవరకు తెలీకుండా ఫాలో కావాలని కూడా రాశాను" అన్నాడు కెప్టెన్.

"ఇక్కడడ్రసు ఎలా తెలిసింది?" అడిగాను అర్థంగాక.

"నువ్వు రాత్రి తిరిగొచ్చాక జేబులు వెతికాను. అడ్రసు కార్డు కనుపించింది. పోలీసులకు ఫోన్ చేసి చెప్పాను" అన్నాడు కెప్టెన్.

నాకు ఆయన్ను ఎలా అభినందించాలో అర్థంగాలేదు. సహాయంకోసం నేను ఫాదరీని అర్థించాను. ఆయన సమాధానం కూడా రాయలేదు. నన్ను ఉద్యోగంలోంచి పీకేసే అధికారమున్నా అలా చెయ్యక, నన్ను పాపకూపంలోంచి వెలికిలాగిన కెప్టెన్ గారిపైన నాకు అమితమైన గౌరవం ఏర్పడింది. భక్తితో ఆయన కాళ్ళకు మ్రొక్కాను. ★ ★ ★

సోమనాథుని వ్రజం

యం. విద్యుల్లత

చలికాలం. ఆరు గంటలకే – అర్ధరాత్రిలా చీకట్లు ముసురు కున్నాయి. చలిగాలి రివ్వున వీస్తుంది.

ముల్లుకర్ర సాయంతో నెమ్మదిగా ఒణుకుతూ, తోట లోని తన ఇంటిలోకి వచ్చింది గుడి దాదిమా. ఆమె పేరు ఏమిటోగానీ అందరూ "దాదిమా" అంటారు.

నిజానికి ఆమె శుద్ధ బ్రాహ్మణ స్త్రీ. వృద్ధురాలు. నెర సిన జుత్తును చిన్న ముడి పెట్టుకుంది.

తడుముకుంటూ మెట్లు ఎక్కి బొడ్లోని తాళంచెవి తీసి తలుపులు తీసింది.

గుప్పున సిగరెట్టు వాసన ఆమె ముక్కు పుటాలకు సోకింది. ఆమెకు భయంతో రోమాలు నిక్కబొడుచు

కున్నాయి. గుడ్డి కళ్ళను రెపరెపలాడించింది.

ఒక్క నిమిషం ఆగి తన చేతికర్ర సాయంతో మెల్లగా లోనికడుగుపెట్టి లోపల్నుంచి తలుపులు వేసింది. నెమ్మదిగా తన మంచంమీద కూచుంది. ఆమెకు కళ్ళే లేవుగానీ - ఆలోచన, బాహ్యజ్ఞాన విచక్షణా అందరికంటే ఎక్కువే. ఇంట్లో ఎవ్వరూ లేరు.

తన కొడుకు పూజారి. పనిమీద పొరుగూరు వెళ్ళాడు. ఆంగ్ల సైన్యాలు శ్రీరంగ పట్టణాన్ని ముట్టడిస్తున్నప్పుడు- సోమనాథ దేవాలయంలోని సోమేశ్వరుని నుదుట గల చంద్రకాంతమణిని తీసుకువచ్చి తన ఇంట్లోనే దాచాడీ పూజారి. అది గొప్ప శక్తిగల వజ్రం. దేవుడిదగ్గర తప్ప ఎక్కడవున్నా అరిష్టమే జరుగుతుందని ప్రతీతి. దాయటమైతే దాచాడుగానీ - ఎన్నో జాగ్రత్తలు చెప్పి వెళ్ళాడతడు తల్లికి. ఐతే - తలుపులు మూసి వుండగా ఈ పుగాకు వాసన ఏమిటి?

ఆమె చెవులు నిక్కబొడుచుకున్నాయి. అవును. బరువుగా, నెమ్మదిగా వేస్తున్న అడుగుల శబ్దం. ఆమె గుండె ధడధడలాడింది. నెమ్మదిగా పడుకుంది. పూజ, ఉపవాసాలతో క్షీణించిన ఆమె బలహీనంగా వుంది.

ఎవరో ఇంటి లోపలకు ప్రవేశించారన్నది తథ్యం. సిగరెట్టు వాసన - బూట్లు - చూస్తుంటే - ఎవరో పరదేశసుడన్పిస్తుంది తనకి. ఎందుకు వచ్చినట్లు? వజ్రం కోసమేనా? ఆమె గుండె ధడధడ లాడింది.

అంతలో పెట్టె మూత తీసినట్లు వెతుకుతున్నట్లు అలికిడి. ధన్ మంటూ ఏదో కంచుగిన్నె క్రిందపడిన శబ్దం. అదురుతున్న గుండెలతో గబుక్కున లేచి కూచుంది.

"ఎవరది?" బిగ్గరగా అరిచింది.

మౌనం—నిశ్శబ్దం...

"ఎవరూ - చెప్పండి" తిరిగి అరిచింది.

అడుగుల శబ్దం...దగ్గరగా...ఇంకా దగ్గరగా... అంతే—ఆమె బలహీనపు కంఠం ఆ ఉక్కు చేతులమధ్య వుంది. నలిగిపోవడానికి సిద్ధంగా - అతడు ఇంగ్లీష్‌లో అడుగుతున్నాడు "వజ్రం ఎక్కడ దాచారని?" తెలీదంటూ గిలగిలలాడిందా వృద్ధురాలు. ఇంకా బిగుసుకున్నాయా చేతులు. గుడ్డికళ్ళు వెళ్ళుకొచ్చాయి. నాలుక వికృతంగా వ్రేలాడింది. వదిలేశాయా చేతులు. ఆమె విరుచుకు పడిపోయింది.

దీర్ఘమైన శ్వాస. తిరిగీ వెతుకుతున్న శబ్దం.

దొరికిందన్న సంతోషంతో వేసిన ఈల...

వెళ్ళిపోతున్న అడుగులు.

2

లండన్‌లో—ఒక ప్రాంతం.

ఆ ఇంట్లో ఏడుగురే వుంటున్నారు. మిసస్ లువీజా, ఆమె కూతురు మిస్ హెలన్. పనివాడు డానీ. అతని కుమార్తె లూసీ, మరొక సర్వెంట్ మేడ్ రోజ్ లెండ్.

అందరూ ఎవరి పనుల్లో వారుండగా టెలిగ్రాం వచ్చింది, జార్జి వస్తున్నట్లు. ముఖ్యంగా డానీ, లువీజా చాలా సంతోషించారు. అతడంటే వారికి చాలా అభిమానం. తన కూతురును అతడ్ని ఇచ్చి చేయాలని ఆ తల్లి ఆశ. కానీ హెలన్ ఫ్రాంక్లిన్‌ని ప్రేమిస్తుందట. లేకపోతే జార్జి ఆ ఇంటి అల్లుడవును.

అనుకున్న దానికంటే చాలా ముందుగా వచ్చాడు జార్జి. అంతా ఆనందంగా ఎదురు వెళ్ళారు. అతడు చాలా

అలసటగా, అశాంతిగా ఉన్నట్లు తోచింది డానీకి.

డానీ పేరుకు పనివాడు అనేగానీ - ఇంట్లో అందరి మన్నన పొందుతున్న మెంబరు. జార్జికి ప్రత్యేక సదుపాయాలున్న గది చూపెడుతూ—

"జార్జ్! ఏమిటీ చాలా కంగారుగా, అశాంతిగా ఉన్నారు?" అనడిగాడు.

అతడు కర్చీఫ్‌తో ముఖం రుద్దుకుంటూ "అవును. మా అంకుల్ స్పియర్ జాన్ చనిపోతూ ఒక వీలూనామా వ్రాసి- ఒక బాధ్యత కూడా నామీద పెట్టాడు. ఆయన ఇండియాలో సోల్జర్‌గా పని చేస్తున్న టైములో— శ్రీరంగపట్నం అనే వూరిలోని దేవుడి వజ్రం - పూజారి ఇంట్లోంచి కాజేశారట పూజారి తల్లిని చంపి. మనం కొన్ని నమ్మం దయ్యం గియ్యం అంటే. కానీ మా అంకుల్‌కి ఆ వృద్ధస్త్రీ దయ్యమై పీడించేదట వజ్రం ఇమ్మని.

ఈ వీలునామా - వజ్రం నాకు బ్యాంక్ ద్వారా అందజేశారు. కానీ ఆయన మాత్రం రక్తం కక్కుకుని మరీ మరణించారు. ఆ వజ్రం తన ముద్దుల కుమార్తె హెలన్‌కి, ఆమె 21 వ సం॥ పుట్టిన రోజుకు నాద్వారా అందజేయాలని బాధ్యతాపూరితమైన వీలునామా వ్రాశారు. నేను బయల్దేరింది ఇందుకే. ఈ నెలలోనే గదా – హెలన్ పుట్టిన రోజు. కానీ ఒకటి జరిగింది. నేను ప్రయాణిస్తున్న షిప్‌లోనే ఒక బ్రాహ్మణ పూజారి - ఇండియన్ ప్రయాణం చేశాడు. అతడి చూపులన్నీ నామీదనే. ఎలాగో తప్పించుకుని కార్లో వచ్చేశాను," అన్నాడు.

"అసలు ఏం వజ్రం అది?"

"దీనికి చాలా చరిత్ర వుంది. ఈ వజ్రం అమూల్యమైనది. చంద్రకళలతోపాటుగా ఈ వజ్రం కూడా కళలు

మారుస్తుందట. పౌర్ణమినాడు దేదీప్యంగా వెలుగుతుందట. అమావాస్యనాడు నల్లగా మారుతుందట. చిత్రమైన ఈ వజ్రం - శ్రీరంగపట్టణంలోని సోమనాధ దేవాలయంలోని సోమనాధుని నుదుట వుండేదట.

మహమ్మద్ ఘజనీ దండయాత్రలలో ఈ దేవాలయం నాశనం చేసినప్పుడు పూజారులు ఈ మణిని తీసికెళ్ళి వారణాసిలోనే మరో సోమనాధుని ఆలయం నిర్మించి అందుంచారట. 600 సం॥ తర్వాత దురాశాపరుడైన ఔరంగజేబు ఆ దేవాలయాన్ని నాశనంచేసి వజ్రం తెప్పించాడు. ఆ సైనికాధికారి చిత్రమైన ఒక వింత వ్యాధి సోకి మరణించాడట. అప్పుడే మొగల్ సామ్రాజ్యపతనం ప్రారంభమైంది.

తదనంతరం చేతులు మారిన ఈ వజ్రం టిప్పుసుల్తాను స్వాధీనమైంది. కానీ పూజారులు చాకచక్యంగా దానిని సంగ్రహించి తిరిగీ శ్రీరంగపట్నం - సోమేశ్వరుడి నుదుట పెట్టారట. మన ఆంగ్లేయుల దాడిలో తిరిగీ ఒక పూజారి ఈ వజ్రాన్ని తన ఇంట దాచగా మా అంకుల్ హత్య చేసి సంపాదించాడు.''

''కానీ జార్జ్... ప్రమాదాలతో కూడుకున్న ఈ మణి హెలన్ కెందుకు చెప్పు?''

''వాళ్ళ నాన్నగారి ఇష్టం. ఆయన వీలునామా ప్రకారం చేయాల్సిన బాధ్యత నాది.''

''పుట్టినరోజు ఎల్లుండే కదా.''

''అవును.''

''విశ్రాంతి తీసుకోండి'' డానీ వెళ్ళిపోయాడు.

3

ఇల్లంతా చక్కటి రంగులతో అలంకరించారు. చక్కటి దీపాలు, ఫ్లవర్ వాజులు, అందమైన ఫర్నిచర్, డోర్ కర్టెన్స్, రంగు కాగితాలు. ఇల్లు అలంకరణలో చాల శ్రద్ధ తీసుకున్నారు, ముఖ్యంగా జార్జి, సర్వెంట్ మెయిడ్ రోజీ.

రోజీ అందమైనది. అమాయకమైన ముఖం. చిన్న నోరు. నక్షత్రాల్లా చక్కటి కళ్ళు. ఆ కళ్ళల్లో జార్జిపట్ల ప్రేమారాధన. ప్రతి పనికీ అతనికి సాయం చేస్తూ అతడితో కేటే గడిపింది.

పార్టీకి అందరూ వచ్చారు. చాల సరదాగా బాగా జరిగింది. పార్టీలో జార్జి తన అంకుల్ వీలునామా ప్రకారం హెలన్ 21 వ సం॥ ఆ వజ్రాన్ని అందజేయడమైనదని తెలియజేశాడు. అద్భుతమైన ఆ వజ్రాన్ని చూసి హెలన్ మురిసిపోయింది.

ఆహుతులంతా అనేక బహుమతులిచ్చి వెళ్ళిపోయారు.

. కానీ ఆఖరుగా ఒకవ్యక్తి లోనికొచ్చాడు. అతడ్ని చూడగానే జార్జి, డానీ అదిరిపోయారు. అతడు పూజారి. డానీ ఒక్క ఉదుటున అతడిమీదకు దూకాడు. కానీ అతడు వెంటనే ప్రక్కకు తప్పుకుని హెలన్ మెడలోని వజ్రమున్న గొలుసు లాగబోయాడు. కెవ్వున అరిచింది హెలన్.

జార్జి, పూజారి మీదకు లంఘించాడు. అతడు మెరుపులా తప్పుకుని సంధించిన బాణంలా బయటకు దూసుకు పోయాడు.

అంతా నిశ్చేష్టులయ్యారు. హెలన్ మరీ భయపడి మూర్ఛపోయింది. వెంటనే ఫామిలీ డాక్టర్ని పిల్చారు.

గందరగోళంగా తయారయ్యింది ఇల్లు. డాక్టరు వెళ్ళి పోయాడు.

హెలన్ తనగదిలో పడుకుంది. ఆమె ప్రేమించిన ఫ్రాంక్లిన్ కూడా వచ్చాడు. అతనికి గెస్టురూమ్ ఇచ్చారు. ఎవ్వరి గదుల్లోకి వారెళ్ళిపోయారు.

అంతా నిశ్శబ్దం. గదుల్లో బెడ్ లైట్స్ మాత్రం డిమ్‌గా వెలుగుతున్నాయి. బయటంతా చీకటి. తోటలోనుండి చల్లగాలి వీస్తుంది.

రోజీ ఏమిటో ఆలోచిస్తుంది.

జార్జితో గడిపిన ప్రతీక్షణం అద్భుతంగా వుందామెకు. అతడి నవ్వు ఎంత చక్కగా వుంటుంది? కానీ, అతడు తనను పెళ్ళి చేసుకుంటాడా?

"ధబ్" మన్న చప్పుడుతో ఆమె ఆలోచనలు చెదిరి పోయాయి. ఉలిక్కిపడి లేచి కూచుంది. తోటవైపుగా శబ్దం విన్పించింది. కిటికీలోంచి చూసింది.

దూరంగా నల్లని పురుషాకారం. ఆ ఆకారం ఇండియన్ పూజారిలా వుంది.

మంచం దిగి ఇంట్లోవాళ్ళకి చెప్దామని తలుపులు తీసుకుని బయటకు వచ్చింది. అంతలో ఒక ఆకారం తన ముందునుంచే పరిగెత్తి వెళ్ళింది. భయంతో స్పృహ తప్పిందామెకు.

4

మర్నాడు ఉదయం ఇల్లంతా కోలాహలంగా వుంది. అందరూ ఆందోళనగా అటూ ఇటూ తిరుగుతున్నారు. వజ్రం మాయమైంది. డానీ వెళ్ళి నిద్రపోతున్న జార్జిని లేపాడు. సంగతి విని అతడు గాభరాగా హెలన్ దగ్గర కెళ్ళి "ఎలా పోయింది?" అనడిగాడు.

గంభీరంగా అతడివైపు చూసిందామె. ఆమె కళ్ళ నుంచి కన్నీరు జారింది.

"పోలీస్ రిపోర్ట్ ఇస్తాను," అంటూ వెనుదిరిగాడు.

అంతలో మిసస్ లువీజా వచ్చింది చింతనిండిన ముఖంతో. తిన్నగా కూతురి దగ్గరకెళ్ళి "బాధపడకు. దొరుకుతుందిలే" అని ఓదార్చసాగింది.

"ఆంటీ! పోలీస్ రిపోర్ట్ ఇస్తాను" అన్నాడు జార్జ్.

"ఒద్దు. పోలీసుల గొడవ మనం పడలేము. మిస్టర్ విలియమ్స్ మంచి పేరున్న డిటెక్టివ్. అతడితో సంప్రదించు" అన్నదామె.

మరో గంటలో తన కారులో డిటెక్టివ్ విలియమ్స్ దిగారు. మాంఛి పర్సనాలిటీతో, నోట్లో సిగార్‌తో, లోపలకొచ్చారు. ఒక్కొక్క అడుగు వేస్తున్నప్పుడే ఒళ్ళంతా కళ్ళుచేసుకుని ఆకళింపు చేసుకుంటూ ముందుకు వచ్చారు.

జార్జ్ ఎదురుగా వెళ్ళి రిసీవ్ చేసుకున్నాడు.

మొట్టమొదటినుంచీ ఆ వజ్రం కథా, జరిగిన సంఘటనలూ, ఇండియన్ పూజారి గురించీ అంతా తెలియ చెప్పాడు జార్జ్. ఇంట్లో వున్న ఒక్కొక్కరినీ పిల్చి పరిచయం చేశాడు.

"ఇంట్లో విలువైన వజ్రం పోయింది. అనుమానితులు ఇంట్లోవారు కారు" అన్నాడు జార్జ్.

"అయినా సరే. నా అనుమతి లేనిదే యెవ్వరూ బైటకు వెళ్ళకూడదు" అంటూ ఇల్లు చూడటానికి లేచారు విల్యమ్స్. అన్ని గదులూ చూసుకుంటూ హెలన్ రూమ్‌కి చేరుకున్నారు.

విల్యమ్స్ సూక్ష్మదృష్టి ఒకచోట పడి ఆగిపోయింది. అది...సరిగ్గా ఆరని పెయింట్. ఎవరో అనుకుంటే అంటుకుని చెరిగినట్లుగా వుంది. అతని కనుబొమలు ముడుచుకున్నాయి.

అంతా క్రిందకు దిగి హాల్లోకి వచ్చారు. డిటెక్టివ్ వైపు చూస్తున్నారు.

"మీ రెవ్వరూ మీ బట్టలు లాండ్రీకి వేయటం గానీ; ఉతకటం గానీ చేయకూడదు. అన్ని బట్టలు, అందరివీ నాకు చూపాలి," అని ఆదేశించారాయన.

అందరూ తమతమ దుస్తులు చూపారు. విల్యమ్స్ స్వయంగా వెళ్ళి వారి గదులలోని బట్టలు పరిశీలించసాగారు. ఎవరి దుస్తులకైతే ఆ మరక వుంటుందో_వారే_ ఆ రాత్రి హెలన్ రూమ్‌లో ప్రవేశించి ఆ వజ్రం దొంగతనం చేసివుంటారనే ఉద్దేశ్యం.

వారిలా వెతుకుతూ సర్వెంట్స్ రూమ్స్‌వైపు వచ్చారు. అక్కడి దృశ్యం వారిని కోపాశ్చర్యాలలో ముంచింది.

గది మధ్యగా మంటవేసి అందులో ఒక నైట్ గౌన్ కాల్చేస్తుంది మిస్ రోజీ. అది దాదాపుగా కాలిపోయింది.

"ఏమిటిది?" గద్దించి అడిగాడు విల్యమ్స్.

ఆమె నిర్లిప్తంగా జారివైపు చూసింది.

ఎంత అడిగినా ఆ డిటెక్టివ్‌కు ఏమీ జవాబు చెప్పలేదామె. చివరికి _"మీ రెంత వెదికినా ఆ వజ్రం మీకు దొరకదు," అని చెప్పి రివ్వున వారి మధ్యలోంచి బయటకు పారిపోయింది. అంతా ఆమె మాటలకు ఆశ్చర్యపోయారు.

"ఇటువంటి సమయంలోనా అటువంటి మాటలు?" విలియమ్స్‌కు కోపమూ, చికాకూ కల్గింది.

డానీ మాత్రం ఆమె వెనుకే వెళ్ళాడు. విల్యమ్స్ అనుమతి లేనిదే బయటకు వెళ్ళకూడదని చెప్పేకూడా రోజీ బయటకు వెళ్ళడంతోను, నైట్ గౌన్ కాల్చివేయడం తోనూ అందరికీ ఆమెపై అనుమానం కల్గించింది.

ఆమె తిన్నగా బీచ్ కెళ్ళింది. వెనుకే డానీ వచ్చాడు. ఒంటరిగా వున్న ఆమె దగ్గరకు వెళ్ళి కూచున్నాడు.

"రోజీ! నీ ప్రవర్తన వింతగా వుంది సుమా! అందరూ నిన్నే అనుమానించవచ్చు. నైట్ గౌన్ ఎందుకు కాల్చేశావు?" అనడిగాడు.

అందుకామె అరచేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. అంతలోనే ఫ్రాక్‌తో కన్నీళ్ళు తుడుచుకుని మౌనంగా కెరటాలు చూస్తూ కూచుంది. డానీ ఏమి అడిగినా ఏదో విరక్తిగా మాట్లాడి వూరుకుంది. నెమ్మదిగా ఓదార్చి ఇంటికి తీసుకువచ్చాడతడు.

రోజీమీద విల్యమ్స్‌కు చాలా కోపంగా వుంది, తన మాట ఉల్లంఘించినందుకు, నైట్ గౌన్ కాల్చేసినందుకు.

హెలన్‌ని తరచి తరచి అడిగారు - వజ్రం యెక్కడ దాచావని?

తను తీయలేదని మాత్రమే చెప్పిందామె.

5

మిసస్ లుయీజా గొడవచేసింది, వజ్రం గురించి ఇంకా ఏమీ కనుక్కోలేదని.

"నేనొకసారి హెలన్‌తో మాట్లాడాలి" అన్నారు విల్యమ్స్. కానీ ఆమె తన గది వీడి రాలేదు. ఎవ్వరితో మాట్లాడనని కబురు చేసింది. అంతేగాకుండా, తన మన స్సేమీ బాగోనందున యాత్రలుచేసి వస్తానని అంది.

ఎవ్వరూ తనతో సరిగ్గా సహకరించటం లేదని విసు

న్నారు విల్యమ్స్. "ఇక మీరక్కర లేదులెండి. వజ్రమూ ఒద్దు. పాడూవద్దు" అని మిసస్ లూవీజా నిష్కర గా చెప్పింది.

అసలు వజ్రం పోలేదనీ, తల్లీ, కూతుర్లు కలిసి ఆలా నాటకం ఆడుతున్నారనీ, 'పోయింది' అంటే ఆ ఇండియన్ తమ జోలికి రాడని ఈ ఎత్తువేసి వుంటారనీ, విల్యమ్స్ అనుకున్నాడు. తీరా దిగాక పరిశోధన మానుకోవటం తన కిష్టంలేదు. చివరవరకూ చూడాలనుకున్నారు. కానీ ఆ ఇంట్లో వుండదల్చుకోలేదిక. బయట వుండి పరిశోధించాలనుకున్నారు.

ఈలోగా ఒక గల్లంతు జరిగింది. రోజీ కన్పించటం లేదని.

విల్యమ్స్ బయటకు బయల్దేరారు. ఆమె బీచ్ కి వెళ్ళి వుంటుందనిపించింది. అటువైపుగా వెళ్ళారు.

ఇసుకలో స్పష్టంగా ఆమె బూటు ముద్రలు వున్నాయి. వాటి ననుసరించి వెళ్ళాడు. ఆ ముద్రలు తిన్నగా బీచ్ వైపు వెళ్ళలేదు. కొంచెం ప్రక్కకు తిరిగి మరో మార్గాన్ని చూపాయి. ఆ దారిలో పోగా పోగా హృదయవిదారక మైన దృశ్యం కన్పించిందతనికి.

అక్కడ ఒక ఊబి వున్నది. అందులో పూర్తిగా మునిగిపోతున్న రోజీ కన్పించింది.

రోజీ మరణం అందర్నీ కదిలించి వేసింది. ప్రతీ ఒక్కరూ హృదయపూర్వకంగా చింతించారు.

ఆ రోజు న్యూస్ పేపర్ లో ఒక వార్త పడింది. "బయ్యర్" అనే వడ్డీ వ్యాపారస్థుడ్ని ఒక ఇండియన్ పూజారి హత్యచేయబోగా ఆ ఇంటి యజమాని రావడంతో అతడు పారిపోయాడనీ, అయితే ఒక బ్యాంక్ రసీదు కన్పించటములేదని వార్త!

విల్యమ్స్ దీర్ఘంగా ఆలోచించాడు. అతడి మైండ్‌లో స్పాట్ లైట్ వెలిగినట్లనిపించింది. వెంటనే బయటకు వెళ్ళిపోయారు.

ఈలోగా హెలెన్ ప్రియుడు ఫ్రాంక్లిన్ ఆమెను కల్సుకున్నాడు. తాను తన గదిలో కూచుని పుస్తకాలు చూసుకుంటుండగా ఒక ఇండియన్ అదాటున లోపలికి వచ్చి తన తలపై బలమైన వస్తువుతో బాదాడనీ, తనకు స్పృహ పోయిందనీ తెలివివచ్చి చూస్తే ఇల్లంతా కలికి, వెదికినట్లుందనీ చెప్పాడు.

"ఆ ఇండియన్ నీ దగ్గరికి ఎందుకు వచ్చాడు?" అంది హెలెన్ సాలోచనగా.

"ఏమో. ఆ వజ్రం నేను దొంగిలిచానని నీకను మానమా?"

"లేదు ఫ్రాంక్లిన్. అమాయకుడిని నేరస్తుడనుకునే మూర్ఖురాలిని కాదు" అని వెక్కి వెక్కి ఏడుస్తూ "దొంగ ఎవరో నాకు తెల్సుగానీ చెప్పను" అంది దృఢంగా.

"తెల్సా!" నిర్ఘాంతపోయారంతా.

"ఐతే ఎవరు?"

"నువ్వే జార్జ్!"

"నేనా???"

"నువ్వే! ఇండియన్ నా మెడలో గొలుసుతో వున్న వజ్రం లాగ ప్రయత్నించినప్పుడు భయపడిపోయాను. దాన్నితీసి నా బట్టల బీరువాలో జాగ్రత్త చేశాను. నీవు కూడా చూశావు. అంతా నా గదిలోంచి వెళ్ళిపోయారు. కానీ భయంవల్ల నాకు వెంటనే నిద్రపట్టలేదు. అంతలో నా గది తలుపులు తెరుచుకున్నాయి. నీవు నెమ్మదిగా లోపలికి వచ్చి గోడకు ఆనుకున్నావు. నిన్ను స్పష్టంగా

చూశాను. నీలో నీవే ఏమిటో గొణుక్కుంటున్నావు. తర్వాత నా బీరువాతీసి వెతికి వజ్రం చేతిలోకి తీసుకుని నెమ్మదిగా వెళ్ళిపోయావు. నువ్వే ఇచ్చి నువ్వే కాజేశావు. నలుగురిలో నువ్వు దొంగవని చెప్పలేకపోయాను," అంది సీరియస్‌గా.

"హెలన్! నాకంతా అయోమయంగా వుంది. ప్రమాణంగా నాకేమీ తెలీదు. నా నిర్దోషిత్వం నిరూపించుకుంటాను. ఆ రాత్రి పార్టీలో ఎక్కువగా తాగేశానా? లేదే డాక్టర్ డేవిడ్ కూడా నా దగ్గరే వున్నారు. ఆయన్ని కల్చుకుంటాను. నీవు రెస్ట్ తీసుకో" అంటూ అతడు వెళ్ళిపోయాడు.

6

డా॥ డేవిడ్ జార్జిని సాదరంగా ఆహ్వానించాడు. గ్లాసుల్లోకి విస్కీ ఒంపి ఇచ్చాడు.

"డాక్టర్! హెలన్ బర్త్‌డే నైట్ ఏంజరిగిందో మీకు జ్ఞాపకముందా? నేనేమైనా ఎక్కువగా తాగానంటారా?"

"లేదే? కానీ మీకు తలనొప్పిగా వుందనీ, రాత్రులు సరిగ్గా నిద్రపట్టటం లేదనీ చెప్పారు. నేను మీకు తెలీకుండా మంచి నల్లమందు, టాబ్‌లెట్ అంటూ ఇచ్చాను. అంతే. ఏమయిందీ?"

"వజ్రం పోయింది. నేనే తన గదిలోంచి తీసికెళ్ళడం కళ్ళారా చూశానంటుంది హెలన్. నాకేం తెలీదు. నా నిర్దోషిత్వం ఎలా నిరూపించుకోను?"

దీర్ఘంగా ఆలోచించారు డాక్టర్.

"జార్జ్! ఒక పని చేయండి. అప్పుడు లాగానే మానసికంగా వజ్రంకోసం బాగా దిగులుపడండి. నేను మళ్ళా మీ ఇంట్లో అదేచోట, అదే టైముకి నల్లమందు మాత్ర

వేస్తాను. మీరు ఏమిచేశారో మేలుకుని వున్న వారు చూసి చెప్తారు. ఇదొక ఎక్స్‌పరిమెంట్ మాత్రమే సుమా!'' అన్నారు.

''ఓ. కె. అలాగే'' అంటూ కరచాలనంచేసి వెళ్ళిపోయాడు జార్జి.

ఆ రాత్రి అనుకున్నట్లుగా డాక్టరు వచ్చి దిగులుగా వున్న జార్జికి విస్కీలో నల్లమందు మాత్ర వేశాడు. అన్ని లైట్లు ఆర్పేశారు. చీకట్లో అయినా అందరూ చూస్తున్నారు ఊపిరి బిగపట్టి.

పోల్లో బాగా తాగిన జార్జి మైకంతో తూలుతూ లేచాడు. నెమ్మదిగా మెట్లెక్కి మేడమీదకు వెళ్ళాడు. హెలన్ గది తలుపులు తీశాడు. గోడకానుకున్నాడు.

''పాడు వజ్రం. బ్యాంక్‌లోంచి తీయకున్నా బాగుండును. నేనే తీసి తిరిగి బాంక్‌లో దాస్తాను. ఇండియన్ ఏంచేస్తాడు?'' అనే మాటలు అస్పష్టంగా ముద్దగా గొణిగాడు.

తర్వాత బట్టల బీరువా తీసి చేతితో తడిమి వజ్రం వుంచిన స్థానంలోనే వున్న గాజు గోలీ తీసుకుని బయటకు వచ్చాడు. నెమ్మదిగా తన గదిలోకెళ్ళి సోఫాలో కూచుని నిద్రపోయాడు. చేతిలోని గోలీ క్రిందపడింది.

* * *

అంతా విన్న విల్యమ్స్ అవును, అప్పుడూ సరిగ్గా అంతే జరిగివుంటుంది. అదేసమయంలో మిమ్మల్ని అనుసరిస్తున్న ఒక వ్యక్తి, మీ చేతినుండి జారిపోయిన వజ్రం తీసుకుని పరిగెత్తి తన రూమ్‌చేరి వుండచ్చు.

తర్వాత ఆ వజ్రం వడ్డీవ్యాపారస్థుడైన బయ్యారు దగ్గర తాకట్టుపెట్టి వుండాలి. బయ్యారు దానిని బ్యాంక్‌లో దాచి వుండవచ్చు. ఈ విషయమంతా ఇండియన్ పూజారి తెల్సు

పని వుంటాడు. అందుకే ఆరశీదు కాజేశాడు. ఐతే, తనకు తప్ప వేరెవ్వరికీ ఆ వస్తువు ఇవ్వద్దని బయ్యారు ముందుగా బ్యాంక్ వారికి చెప్పివున్నందున ఆ వజ్రం పూజారి తీసుకో లేకపోయాడు. ఇదుగో ఈ వారంలో ఆ వస్తువు బయ్యారు తీసుకుంటాడని తెల్సింది. సరిగ్గా అదేసమయంలో కాపు వేయాలి!" అన్నారు విల్యమ్స్.

7

బ్యాంకు ముందు ఒక కారు ఆగివుంది. బయ్యారు ఒక్కడే బ్యాంకు లోపలికి వెళ్ళి వున్నాడు. కారుదగ్గర మంచి బలిష్ఠులైన ఇద్దరు పహిల్వానులున్నారు.

బ్యాంకు బయట సర్వెంట్ డానీ వున్నాడు. లోపల జార్జి, విల్యమ్స్, ఒక చిన్న కుర్రవాడు వున్నారు. వారి దృష్టి ఏదో చిన్న పేకట్టుతో వస్తున్న బయ్యారుపై పడింది. అతడు తిన్నగా గేటువైపే వచ్చేశాడు.

ఇంకా గేటు రెండుగజాల దూరంలో వుందనగా, ఒక త్రాగుబోతులా వున్న నావీ డ్రెస్‌లో వున్నవాడు తూలుతూ బయ్యారుపై వాలడం, పేకట్టు అతడి చేతిలోకి మారడం, "సారీ!" అంటూ త్రాగుబోతు ప్రక్కనే వున్న ఒక టాక్సీలో కూర్చోవటం, తక్షణం అది ముందు కురకడం, మెరుపులా జరిగిపోయాయి.

పహిల్వానులు ఇద్దరూ బయ్యారుకి అటు, ఇటు వుండి కారులోకి ఎక్కారు. కారు వెళ్ళిపోయింది.

విల్యమ్స్ దగ్గర నిలుచున్న కుర్రవాడు కన్పించలేదు.

"జార్జ్! క్విక్!" అంటూ తన కారులో ఎక్కారు విల్యమ్స్. జార్జి కూచోగానే కారు ముందుకురికించారు.

ఐతే, ఆ రద్దీలో తాగుబోతు ఎక్కిన కారు ఎటు మాయమైందో వారు గుర్తించలేకపోయారు. బయ్యారు

కారుని అనుసరించడంవల్ల ఏమి లాభముంది? నెమ్మదిగా కొన్ని వీధులు దాటారు.

దూరంగా ఒక ఇంటిముందు జనం గుంపులు కూడి వున్నారు. ఆ ఇంటిముందు తన కారుని ఆపారు విల్యమ్స్. జార్జ్, ఆయనా లోపల ప్రవేశించారు "ఏమిటీ" అంటూ.

కన్పించిన దృశ్యం వారిని ఆశ్చర్యచకితుల్ని చేసింది. తాము ఎవరినైతే అనుసరించాలి అనుకున్నారో, ఆ నాఫీదుస్తుల తాగుబోతు ఘోరంగా చచ్చి పడివున్నాడు.

గుండెల్లో దిగిన బాకు మెరుస్తుంది రక్తంతో. ఇంకా రక్తం కొంచెం కొంచెం కారుతూ వుంది. అంటే హత్య జరిగి ఐదు, పదినిమిషాలై వుంటుంది.

గదంతా చిందరవందరగా వుంది, బల్లపై తెరిచిన సూట్ కేస్ వుంది. అందులో చిన్న చీటీ వుంది. అందులో "శాస్త్రి" అని ఇంగ్లీష్‌లో వుంది. "షాష్ట్రి" అంటూ కళ్ళు విప్పార్చి, "ఇటీజ్ యాన్ ఇండియన్ నేమ్" అన్నారు విల్యమ్స్.

త్రాగుబోతు దగ్గరగా వెళ్ళి ముఖం గట్టిగా రుద్దారు.

పల్చటి రబ్బర్ మాస్క్ చేతిలోకొచ్చింది. ఆ ముఖం చూసి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అతడు ఫ్రాంక్లిన్! విల్యమ్స్ తప్ప అంతా నిర్ఘాంతపోయారు.

* * *

"హెలన్! ఇప్పటికైనా నన్ను నిర్దోషిగా భావిస్తావా?"

అతడివైపు చూసిందామె, నీళ్ళు నిండిన కళ్ళతో. నెమ్మదిగా నడచి వచ్చింది. అతడి కుడిచేతిని తన చేతుల్లో ఇముడ్చుకుంటూ, "నిన్ను నమ్ముతున్నాను జార్జ్! నిన్నే నమ్ముకుంటున్నాను" అంది.

ఆమెను తన హృదయానికి గాఢంగా హత్తుకున్నాడతడు.

★★★

బ్లాక్ మెయిలర్స్

పి. గోపాలరావు

చీకట్లు కమ్ముకొస్తున్నాయి అప్పటికే. డెవలప్ చేసి, ప్రింట్ చేసిన ఫోటోలు టేబుల్ మీద అమర్చాను ఆరటానికి.

ఒక సిగరెట్టు తీసి వెలిగించాను. నా అసిస్టెంటు డ్రాయరులో కవర్లలో పేర్చినవి వరుసలుగా కనబడ్డాయి. ఉబుసుపోకకి ఒక పచ్చటి కవరులాగి, దాంట్లోని ఫోటోలు బయటికి తీశాను. నాకు దిగ్భ్రమ కలిగించింది.

ఫిల్మ్ రీలులో 12 నెగటివ్ లు వుంటాయి. వీటిలో ఒక్కటే ఎక్స్ పోజ్ అయివుంది. 11 ఖాళీ!

ఎవరో తెలివితక్కువవాడు, ఒకే స్నాప్ కొట్టి, ఫిల్మ్ లాగేశాడన్నమాట.

ఆ ఒక్కటీ పరిశీలించాను. బాగానే వచ్చింది. ఆప్యాయత కనబరుస్తూ ఒక యువతీయువకుల ఫోటో అది. ఆ అమ్మాయి తెల్లటి దుస్తులు ధరించింది. అతని మెడపై చేతులువేసి, కళ్ళల్లోకి చూస్తూ వుంది.

కళ్ళు నులుపుకొని మళ్ళీ చూశాను. అతను నాకు గుర్తే. వెంకట్రామరెడ్డి!! బడా ఆసామి. అతడిని అతడి భార్యని సభల్లో చాలాసార్లు చూచిన గుర్తుంది.

ఆ ఫోటోలో అమ్మాయి ఆయన భార్య మాత్రం కాదు!!

వెంకట్రామరెడ్డిని గురించి పెద్దగా చెప్పుకోవలసిందేమీ లేదు. అతను పెద్ద వ్యాపారం చెయ్యవచ్చునేమో కాని, డబ్బంతా అతని భార్యదే నంటారు. ఆమె పెద్ద కోటీశ్వరుని కుమార్తె. ఒక్కతే కూతురని చెప్పుకుంటారు.

ఆమెలో అందం లేదు. పైగా అనాకారి. అయినా, అదృష్టవంతుడు వెంకట్రామరెడ్డి! ఇంట్లో కావల్సినంత డబ్బు, వెలుపల అందమైన అమ్మాయిలతో స్నేహం!!

మరి, ఇలాంటి స్నేప్ లోకి వాళ్ళు రావడం ఎలా సంభవించింది?

బహుశా వెంకట్రామరెడ్డికి స్నాప్ తీస్తున్నట్టు తెలీదేమో!!

ఆరిపోతున్న సిగరెట్టును ఆష్ట్రేలో నొక్కి మరొకటి వెలిగించాను.

సినిమాలోలాగా ఒక ఐడియా నాలో మెదిలింది. బ్లాక్ మెయిల్ కి ఎవరో తీసుండాలి దీన్ని. అందుకు కావాల్సిన ఒక్క స్నాప్ తీసి, ఫిల్మ్ రోల్ తీసుకొచ్చారు ఇక్కడికెవరో!

పుస్తకం తీసి, సీరియల్ వారీగా, ఈ ఫిల్మ్‌రోల్ తెచ్చిందెవరో పరిశీలించాను. సుచిత్ర అనే పేరుమీద నిలిచాయి నా కళ్ళు.

నా సహాయం లేనిదే ఆ సుచిత్ర చెయ్యగలిగిందేమీ లేదు.

షాపు చుట్టూ పరికించాను. వానకు తడిసి, ఎండకు ఎండిన రూపం నన్ను వెక్కిరిస్తోంది. పెద్ద ఫర్నీచరేం లేదు. కార్పెట్స్ అసలే లేవు!

టెలిఫోన్ డైరెక్టరీలో సుచిత్ర పేరుతో నెంబరుంది. డయల్ చేసిన కాసేపటికి రెస్పాన్స్ వచ్చింది. బ్లాక్ మెయిలర్ గొంతులాగా లేదు ఆమె గొంతు.

నేను పరిచయం చేసుకోగానే, ఆమె "ఫోటో తయారైందా" అన్నది. ఆమె 'ఫోటోలు' అనకపోవడం గమనించాను.

చిన్నగా దగ్గేను. "రెడీగా వుంది. బాగా వచ్చింది. దాన్ని చూచినపుడు వెంకట్రామరెడ్డికి బాగా సరదా కలుగుతుందనుకుంటూ," అన్నాను.

కాసేపు నిశ్శబ్దం! "ఏమిటి నీ అభిప్రాయం" అందామె విసుగ్గా.

"ఏమీలేదు! ఆ ఫోటో తీసుకురానా మీ ఇంటికి?"

ఆమె గట్టిగా ఊపిరి తీస్తున్న ధ్వని రిసీవర్‌లో వినిపించింది. "అలాగే, తీసుకురండి," అన్నది.

2

నేను సుచిత్ర ఇల్లు చేరేటప్పటికి తొమ్మిది కావస్తోంది.

రాజాగారి వీధిలో రెండవ ఇల్లు సుచిత్రది. నాకోసమే అన్నట్టు ఆమె మేడమెట్లమీద నిల్చొని వుంది. ఆమెని

చూచి నేను మొదట్లో కాస్త ఆశ్చర్యపోయినా, కాసే పట్లో జరిగింది ఊహించుకోగలిగాను. వెంకట్రామరెడ్డితో ఫోటోలో నున్న యువతి ఆమే!

ఇంకెవరైనా ఈ ఫోటో తీశారా? లేక సుచిత్రే, టైమ్ స్విచ్ లాంటిది ఆపరేట్ చేసి, ఫోటో దిగిందా? అని ఆలోచించసాగాను.

ఆమె లోపలికి ఆహ్వానించింది. ఆమెని పరిశీలిస్తూనే కూర్చున్నాను. కన్ను ముక్కు తీరు, అందాన్ని ప్రసరింప చేస్తున్నది. భీతహరిణేక్షణలాగా కంపిస్తున్నట్లు తెలుస్తూనే వుంది.

నా మనస్సులో మెదులుతున్న బ్లాక్ మెయిలింగ్ చెప్పాను, దాపరికం లేకుండా.

"నాకేం చెప్పాలో తెలియడంలేదు. నాకంత తెలివి తేటలు లేవు. టర్నింగ్ లోవున్న మేసేజ్ సెంటర్ లో పని చేస్తాను" అన్నదామె.

నేను చిన్నగా నవ్వాను తల ఊపుతూ.

"మీరు నవ్వవలసిందేమీ జరగదక్కడ. అది గౌరవ ప్రదమైన వృత్తి."

"నాకు నచ్చచెప్పవలసిన అవసరమేం లేదనుకుంటూ!" అన్నాను ఆమె ధోరణికి అడ్డం వస్తూ.

"సరే. ఈ వెంకట్రామరెడ్డి అక్కడికి అప్పుడప్పుడూ వచ్చేవాడు; మేసేజ్ కోసం.

"ఒక వారం క్రితం నాకీ జాబు వచ్చింది" అంటూ ఆమె టేబుల్ డ్రాయర్ లాగి, ఒక ఉత్తరం తీసింది. ఉత్తరంపైన గరుడపక్షి బొమ్మ ముద్ర వుంది.

"మీ సెంటరుకి వారంవారం వచ్చే పెద్దమనిషి ఎవరో

తెలుసుకోండి. అతను బడా ఆసామి. డబ్బుగల భార్య వుంది. గాలి దుమారాలలో ఇరుక్కోవడం అతనికే ముప్పు" అని వుందా ఉత్తరంలో.

"బ్లాక్ మెయిలింగ్ ఉత్తరమే నంటారా ఇది?" అన్నాను నేను కాగితాన్ని సుచిత్రకు అందిస్తూ.

"అలాగే అనిపిస్తూంది. ఒక స్నేహితురాలివద్ద కెమరా తెచ్చి తీశానది. టైమ్‌స్విచ్ పద్ధతి ఆమే నాకు నేర్పింది."

"ఆమెకు తెలుసా ఈ వ్యవహారం?"

"తెలీదు."

"మనిద్దరికే నన్నమాట అసలు సంగతి తెలిసింది!"

"జరిగిందానికి నేను ఎంతైనా విచారిస్తున్నాను. ఫోటోను చింపెయ్యండి. నెగటివ్ కూడా కాల్చెయ్యండి," అన్నదామె ఆందోళనగా.

ఆమె కళ్ళలోకి సూటిగా చూశాను. "అది మంచి పని కాదేమో!" అన్నాను.

ఆమె సమాధానం చెప్పలేదు.

"మొదట్లో అనుకున్నదే చక్కటి పద్ధతి అనుకుంటాను. మీకు సహాయంకూడా అవసరం వెంకట్రామ రెడ్డితో మాట్లాడ్డానికి," అన్నాను.

పదినిమిషాలసేపు కూలంకషంగా అంతా చర్చించాము. 'ఫిఫ్టీ-ఫిఫ్టీ' అరేంజ్‌మెంటుకు వచ్చాం.

ముందు వెంకట్రామరెడ్డికి ఉత్తరం రాద్దామనుకున్నాం. అంతా తయారుచేసి, కవరులో పెట్టబోయ్యేటప్పుడు, డిటెక్టివ్ కథల్లో నేను చదివింది గుర్తొచ్చింది.

నా వేలిముద్రలు, చేతివ్రాత అతనికెందుకు దొరకాలి? అవి తరువాత విష పరిణామాలకు దారి తీయవచ్చు.

టెలిఫోన్ చేశాను వెంకట్రామరెడ్డికి. ఉపన్యాసాలు, బెదరింపులు నాకిష్టంలేదు. సూటిగా చెప్దామనుకున్నాను.

"రెడ్డిగారూ, నా దగ్గరొక ఫోటో వుంది. చూడ్డానికి మీకు ఆసక్తికరంగా వుంటుందనుకుంటా," అన్నాను 'మీకు' అనే పదాన్ని ఒత్తి పలుకుతూ.

గొంతులో కర్కశత్వాన్ని నింపుకుని "ఏమిటి నీ అభి..." అంటూ ఆగిపోయ్యాడు. బహుశా అతని భార్య గదిలోకి వచ్చిందేమో ననుకున్నాను. మాట మార్చి వాతావరణం గురించి కబుర్లు మొదలెట్టాడు.

నేను ఆపి, సుచిత్ర ఇంటివద్ద కలుసుకోమని టైము చెప్పి, ఫోన్ పెట్టేశాను.

వివరం తెలుసుకోగానే సుచిత్ర ముఖంనిండా ఆనంద రేఖలు పులుముకున్నాయి. ఫోటో కాపీ ఒకటి రెడ్డిగారి కిచ్చి, నెగటివ్ మా వద్దనే వుందని చెప్పడం, 10 వేలు రూపాయలు కోరడం—ఇదీ మా ప్లాను!

3

వెంకట్రామరెడ్డి ఠీవిగల మనిషి. రాగానే మర్యాద చేసి, డ్రింక్ ఆఫర్ చేశాం.

సగం గ్లాసుడు లోనికి దిగిన తర్వాత గ్లాసు టేబులు మీద పెట్టి, "ఈ అమ్మాయి ఇలాంటి పని చేస్తుందనుకోలేదు," అన్నాడు నిర్లిప్తంగా.

తిరిగి "నా భార్య ప్రభావతిని కలుసుకోలేకపోయారా? మీకు ఇంకా ఎక్కువ మొత్తమే ముడుతుంది" అన్నాడు రెడ్డి.

ఆయన మాటలు నన్ను ఆశ్చర్యచకితుణ్ని చేశాయి.

"ఏమిటి మీ రనేది! మీ ఆవిడకు ఇదంతా తెలీకుండా

వుండడమే కదా దీంట్లోని కిటుకు!" అన్నాను అయోమయంగా చూస్తున్నానేమోనని భయపడుతూ.

"ఓ! నా వ్యవహారాల్లో చాలాభాగం ఆమెకి తెలుసు" అన్నాడు రెడ్డి. అంటూ, పెద్ద కరోనా చుట్ట వెలిగించాడు. వయస్సు తక్కువైనా ఆయన చుట్ట కాల్చడం నాకు ఆశ్చర్యమే కలిగించింది.

"నాకు చాలామంది ఆడపిల్లల్తో సంబంధం వుంది. మా ఆవిడకు పబ్లిసిటీ అంటే గిట్టదు. అందుకని ఆమె పబ్లిసిటీ లేకుండా చెయ్యడానికి ఏమైనా చేస్తుంది. 30 వేలు అడగండసలు! మనం ముగ్గురం పంచుకుందాం," అన్నాడు రెడ్డి నిదానంగా.

వెంకట్రామరెడ్డి తెలివితక్కువ ఘటం కాదని తెలుస్తూనే వుంది.

సుచిత్ర ముఖం చూస్తే మబ్బుకమ్మిన చంద్రుడిలా నిస్తేజంగా వుంది. ఆమె భావాలను గ్రహించగలగడం కష్టమేం కాదు.

"నా చెయ్యి దీంట్లో వుందని మాత్రం మా ఆవిడకు తెలియరాదు" అన్నాడు రెడ్డి సూటిగా చూస్తూ.

ఆయన పోకడ నాకు విసుగెత్తిస్తోంది. "అసలు నీకు భాగం పంచక్కర్లేదని నా అభిప్రాయం. మీ ఆలోచన బాగుండవచ్చు. కాని నెగటివ్ వుండేది మా వద్ద," అన్నాను.

వెంకట్రామరెడ్డి చిన్నగా నవ్వాడు. "నాకు డబ్బు అవసరం చాలా వుంది. బాకీదార్లు కొందరు ఒత్తిడి చేస్తున్నారు. తొందర్లో పైసా చేజిక్కించుకోకపోతే, నేను దేశాంతరం పోవాల్సిందే. అందుకని వినండి జాగ్రత్తగా. నేను ఊరు విడిస్తే మీకా ఫోటో ఉండీ ఒకటే, లేక

పోయినా ఒకటే. అప్పుడు నా భార్య చెక్కుబుక్కు బయటికి తీసే ప్రసక్తే వుండదు'' అన్నాడు మరో చుట్ట వెలిగిస్తూ.

నాకు అర్ధమవుతోంది. రెడ్డి భార్య తమ సంసార జీవితం భగ్నం కాకుండా చూసుకునేందుకు డబ్బి యిస్తుంది. మేముతలా మరో పెగ్గు వేసుకుని మా పథకానికి రూపురేఖలు దిద్దాం.

నేను రెడ్డిగారి భార్యను చూడటం, ఫోటో చూపడం ఈ పథకం సారాంశం. నేను మొదట్లో కాస్త జంకక పోలేదు. కాని రెడ్డి నాకు ప్రోత్సాహం ఇచ్చాడు. తమ ఇంట్లో టేప్ రికార్డర్లూ, కెమెరాలు వుండవని, పోలీసుల ప్రమేయంకూడా వుండదని ధైర్యం చెప్పాడు.

4

మరుసటిదినం నేను వెంకట్రామరెడ్డి భవంతికి వెళ్లాను. డాబుసరిగా వుంది బంగళా, పెద్ద సోఫాసెట్లూ, అవీనూ.

ప్రభావతిదేవిని దగ్గరనుండి చూడగానే, ఆమె ఈ బ్లాక్ మెయిల్ డబ్బు ఇచ్చెయ్యటానికి అభ్యంతర పెట్ట దని ఊహించగలిగాను. అంత అనాకారిని నేను నా జన్మలో చూచివుండనేమో! డబ్బుకోసమే ఆమెను వెంకట్రామరెడ్డి పెళ్ళాడాడని ఎవరికైనా అర్ధమవుతుంది.

"మీకేం కావాలి?'' అన్నదామె వస్తూనే.

"నాకసలు ఏమన్నా కావాలని ఎందు కనుకుంటు న్నారు?'' అన్నాను ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"ఏమీ అవసరం లేకుండా ఎవ్వరూ ఇక్కడికి రారు. నాకు పనుంది లోపల. మా రెడ్డిగారికి సంబంధించిందేనా ఈ వ్యవహారం?''

నేను నెమ్మదిగానే నా రాకకు కారణం వివరించాను. ఫోటో తీసుకుని ఆమె "నెగటివ్ ఎక్కడున్నది?" అని అడిగింది.

ఆమె ధోరణి నాకు అర్థం కాకపోయినా, గొంతు పెకలించుకొని "అది కావాలంటే మీకు ఖర్చు తప్పదు," అన్నాను.

"ఎంతవుతుందని?"

ధైర్యంచేసి చెప్పేశాను "ముప్ఫయి వేలు!"

ఆమె ముఖంలో ఏ మార్పులూ నేను చదవలేక పోయ్యాను.

"సరే. రేపు నా సమాధానం అందుతుంది. మీకు ఫోటోగ్రాఫిక్ స్టూడియో వుందన్నారు కదా! అక్కడికే పంపిస్తాను" అందామె.

5

మర్నాడు వెంకట్రామరెడ్డి, సుచిత్ర ఉదయాన్నే నా స్టూడియోకి వచ్చారు.

ప్రభావతీదేవి తనకా ఉదయం ఏం చెప్పలేదని, కాని తప్పక డబ్బు పంపుతుందనే నమ్మకం తనకు వుందని, రెడ్డి అన్నాడు.

వెంకట్రామరెడ్డి, సుచిత్ర వెనుకనున్న గదిలో కూర్చున్నారు. వాళ్ళకి కాఫీ ఫలహారం ఏర్పాట్లు చేశాను.

అసలు సమాధానం వస్తుందా, రాదా అని మేము సతమతమవుతున్న సందర్భంలో, తలుపుకొట్టిన శబ్దం వినవచ్చింది. తలుపు తీశాను. ఎవరో కుర్రాడు పెద్ద కవరు పట్టుకుని నిలబడి వున్నాడు.

ఆ కవరు చూడగానే వెంకట్రామరెడ్డి ఎగిరి గంతేసి

నంత పనిచేశాడు. అందరం కలిసి, ఆ కవరును కాసేపు ఎగరేశాం. కేరింతలు కొట్టాం.

"ఇక చించండి" అన్నది సుచిత్ర ఉండబట్టలేక.

నా గుండె దడదడ కొట్టుకుంటోంది. పెన్ నైఫ్ తీసుకుని జాగ్రత్తగా ఒకవైపు కత్తిరించాను. రెడ్డి కవరును బోర్లించాడు. పచ్చటి వందరూపాయల నోట్ల ప్రవాహం కోసం మేము ఎదురుచూశామనుకుంటాను.

కాని...అందులోంచి మరో మూడు చిన్న కవర్లు క్రింద పడ్డాయి. ఒకదానిమీద నా పేరు, మరో దానిమీద సుచిత్ర పేరు, మూడోదానిమీద వెంకట్రామరెడ్డి పేరు వున్నాయి.

"ఏమిటిదంతా? నాకు దీంట్లో ప్రమేయం వుందని ప్రభావతి కెలా తెలుసు? నా కెందుకు రాసింది కవరు?" అన్నారు రెడ్డి.

తన కవరు చించాడాయన. దాంట్లో డబ్బు లేదు! న్యాయ సంబంధమైన కాగితాలు, విడాకుల కాగితాలు వున్నాయి!!

స్టాక్ మార్కెట్లో సర్వం కోల్పోయినవాడి మొహం పెట్టాడు రెడ్డి. చుట్ట ఆరిపోయిందికూడా ఆయన గమనించ లేదు. "నాకు విడాకు లెలా యిస్తుంది" అని జపించ సాగాడు.

సుచిత్ర కవరులో ఒక ఉత్తరం వుంది. ఇదివరలో ఆమెకు వచ్చిన ఉత్తరంలాంటిదే అది. ఆ గరుడపక్షి బొమ్మకూడా వుంది దానిమీద!

"నీకు కృతజ్ఞతలు. నీ సహాయం లేకుండా నా కింత మంచిబొమ్మ లభించివుండదు. వెంకట్రామరెడ్డికి విడాకు

లివ్వడానికి ఇక వేరే ఏం అవసరం లేదని నా వకీలు చెప్పాడు. ఆయనకి 'భరణం' కూడా ఇవ్వాల్సిన అవసరం వుండదట" అని వుందందులో.

"దుర్మార్గం మనిషి! ఇంత తెగిస్తుందని నేను అనుకో లేదు!! మనల్ని పసిపిల్లల్ని చేసి ఆడించింది" అన్నాడు రెడ్డి బుసలు కొడుతూ.

మా ఆశలు అణగారిపొయ్యాయి. నా కవర్లో మరేం వుంటుందోనని చూశాను.

"నువ్వు తెచ్చిన స్నాప్ చాలా బాగుంది. నీ దగ్గర నెగటివ్ వుందని చెప్పావనుకుంటా. నాకొక పనిచేసి పెట్టు. దాన్ని ఎన్‌లార్జ్ చేసి, జ్ఞాపక-చిహ్నంగా వుంచుకో నీ దగ్గర. నీకు నచ్చిన సైజు ఎన్నుకో. ఫ్రేమ్ కట్టించ డానికి వీలుగా వుండాలి!" అదీ నా లేఖలో సారాంశం.

మేము ముగ్గురం ఒకరినొకరు చూస్తూ దివాలా తీసిన వ్యాపారస్థుల్లా వుండిపోయాం! ★★★

ఒక దేశనాయకుడు వేదిక ఎక్కి అరగంటనుండి ఉప న్యాసం దంచేస్తున్నాడు.

"ఈ దేశానికి చీడపురుగులు దేశద్రోహులే! వారిని అరికట్టాలి, వారిని..." ఇలా చెప్పుకుపోతున్నాడు.

ఇంతలో జనంలోంచి ఒకడు లేచి "మీ విషయం తర్వాత చెప్పుకుందురుగాని, ముందు మా విషయం ఏమైనా చెప్పండి," అని అరిచాడు అసహనంగా. దేశనాయకుని ముఖం వెలవెలబోయింది.

—పెంటకోట సోమినాయుడు, యలమంచిలి.

సాక్ష్యం ఇచ్చిన టెలిఫోన్!

అజీజ్

కాలింగ్ బెల్ మ్రోగింది!

టైప్ జేస్తున్న మేటర్ వదిలి లేచాను. బాస్ పిలుస్తున్నాడు కాబోలు. పైట నిండుగా కప్పుకుని చీరకుచ్చిళ్ళు సర్దుకుంటూ బాస్ ఆఫీస్ రూంలోకి నడిచేను. ఏదో ఫైల్ చూస్తున్నాడు.

"ఎస్ సర్!" అన్నాను నమ్రతగా.

తలెత్తకుండానే, "జస్ట్ వెయిట్ ప్లీజ్!" అన్నాడు కాగితాలు తిరగేస్తూ.

అతనివేపు చూస్తూ అలాగే నిల్చున్నాను.

దాదాపు ముప్పై ఏళ్లుంటాయతనికి. పచ్చగా, పొడుగ్గా ఉంగరాలు తిరిగిన జుత్తుతో అచ్చు హాలీవుడ్ హీరోలా

వుంటాడు. మితభాషి. అవసరం వున్నంతవరకే ముక్తసరిగా మాట్లాడే తత్వం. అతని పెర్సనల్ సెక్రెటరీగా నేనా ఆఫీసులో అప్పాయింట్ అయి దాదాపు రెండేళ్ళు కావస్తున్నా, అతను నాతో నవ్వుతూ మాట్లాడ్డం ఎరగను.

అందుకే అతనిపట్ల నాలో ఒకరకం గౌరవభావం ఏర్పడింది. అతని స్థానంలో వేరొకరు ఉండివుంటే, ఎన్ని పకపకలు వికవికలు భరించవలసి వచ్చేదో?

అటువంటి పెర్సనాలిటీ గల వ్యక్తి భార్యని, అతని పక్కన చూస్తే ఎవ్వరైనా ఆశ్చర్యపడక మానరు. ఆవిడకి నలభైఏళ్ళు దగ్గరపడుతున్నాయి. లావుగా, పొట్టిగా రోడ్ రోలర్‌లా వుంటుంది. ఆఫీసు చెక్ జెయ్యడానికి ఒకటి రెండుసార్లు వస్తే చూసేను. అందంగా కనిపించడానికి ఆవిడపడే అవస్థ అంతా ఇంతా కాదు. భార్యాభర్తలిద్దరి మధ్యా పదేళ్ళ వత్యాసం!

ఆ కంపెనీ ఆవిడదే! విచిత్రం ఏమిటంటే బాస్‌తో ఆవిడకిది మొదటి పెళ్ళికాదు. మొదటి భర్త ఈ కంపెనీ మీద లక్షలు ఆర్జించి, కేన్సర్‌తో తీసుకుని మరణించేడుట. భర్తపోయి, విధవగా బ్రతుకుతున్న, వయసులో బాస్‌ని, పెళ్ళి చేసుకుంది.

ఫైల్ మూసి తలెత్తేడు బాస్. నా ఆలోచనలకి బ్రేకు పడింది.

“కొన్ని అర్జెంట్ కరస్పాండెన్స్ లెటర్స్ డిక్టేట్ జేసి పట్టుకెళ్ళు” అన్నాడు.

కుర్చీలో కూర్చుని, పెన్సిల్ నోట్ బుక్ అందుకున్నాను. ఆయన చెప్పసాగేడు. షార్ట్ హాండ్‌లో రాసుకోసాగేను. గంటపట్టింది పని ముగిసేసరికి.

"ఇక వెళ్ళు. సాయంత్రంలోగా అన్నీ టైప్ చేసి నా సంతకాలకోసం రెడీ జెయ్యాలి. అలాగే మన సోల్ డిస్ట్రి బ్యూటర్స్ తాలూకు ఫైలు కూడా పూర్తి చెయ్యాలి. ఈ రోజు నీకు కాస్త వర్క్ రిస్క్ వుంటుంది. ఏమీ అనుకో వద్దు!" అన్నాడు సిగరెట్ అంటిస్తూ.

తలూపి, బైటికి వచ్చేను. నా సీట్లో కూర్చుంటూ రిస్టు వాచీ చూసుకున్నాను. మధ్యాహ్నం పదకొండు గంటలు! సాధ్యమైనంత త్వరగా పని ముగించాలి. మెషీన్ మీద తెల్లకాగితాలు ఎక్కిస్తూ, చకచక టైప్ జెయ్యసాగేను.

అరగంట తర్వాత కాబోలు నా టేబిల్ మీది ఫోన్ మోగింది. రిసీవరు అందుకని, "ఎస్!" అన్నాను.

"ఎవరు మాట్లాడేది?" అడిగేరు అవతలినించి.

ఆ కంఠం గుర్తుపట్టేను. అది మా బాస్ కిరణ్ కుమార్ భార్య సువర్చలాదేవిది.

"నేనండీ, ద్రాక్షవేణిని! నమస్తే!" అన్నాను.

"నమస్తే! నీతో ఓ ముఖ్యవిషయం మాట్లాడాలి. మీ లంచ్ టైమ్ ఒంటిగంటకి కదూ? తిన్నగా హోటల్ సవేరాకి రా! అక్కడ 16వ నెంబర్ కేబిన్ మనకోసం బుక్ జేసి వుంచేను. ఈ రోజు నీ భోజనం అక్కడే! నీ కోసం వెయిట్ జేస్తుంటాను. ఏమంటావ్?"

నాకు తెలీకుండానే, "అలాగేనండీ!" అన్నాను. అవతల క్లిక్ మంది.

రిసీవర్ దించేసేను. ఎన్నడూ లేనిది ఆవిడ నాకు ఫోన్ జెయ్యడం, లంచ్ కు ఆహ్వానించడం నాకు చాలా విడ్డూరంగా తోస్తోంది.

ఒంటిగంట అయేసరికి సహం లెటర్స్ మాత్రమే టైప్ జెయ్యగలిగేను. అది లంచ్ టైమ్. మిగతా ఉద్యోగులంతా

ఫైల్సూ గట్రా మూసి టిఫిన్ డబ్బాలందుకుని డైనింగ్ రూంవేపు వెళుతున్నారు. మిగతా లెటర్స్ సంగతి తరవాత చూసుకోవచ్చు. నా సీట్లోంచి లేచి బైటికి నడిచేను.

అక్కడికి ఫర్లాంగు దూరంలోనే వుంటుంది హోటల్ సవేరా! ఫుట్ పాత్ మీద గబగబ నడుస్తూ ఐదునిమిషాల్లో హోటల్ జేరుకున్నాను. లోపల వరసగా కట్టిన కేబిన్ నెంబర్స్ చెక్ జేసుకుంటూ 16వ నెంబర్ కేబిన్ ముందు ఆగేను. కేబిన్ లోంచి గాజుల శబ్దం వినిపించగానే, స్ప్రింగ్ డోర్ తోసేను. కిర్రుమంటూ తెరుచుకుంది.

"రా!" అంది సువర్చలాదేవి నవ్వుతూ.

కాస్త తటపటాయిస్తూ వెళ్ళి ఆవిడకెదురుగా కూర్చున్నాను.

"ముందు భోజనం కానివ్వు. తరవాత మాట్లాడుకుందాం!" అంది.

నే రాకముందే ఆర్డరిచ్చింది కాబోలు. బేరర్ భోజనం తెచ్చి టేబిల్ మీద అమర్చేడు.

"నీవు బ్రాహ్మణ పిల్లవికదూ? అందుకే విజిటబుల్ మీల్స్ తెప్పించేను. మొహమాటపడక! తిను" అంది సువర్చలాదేవి.

నవ్వి, బేసిన్ లో చేతులు కడుక్కొని ప్రారంభించేను. చాలా విలువైన భోజనం. ఎన్నో ఐటమ్స్ ఉన్నాయి. నాలాంటి మధ్య తరగతి జీవులకి అంత సులభంగా అందని భోజనం అది. ఆవిడ అంతగా చెప్పినా, కాస్త మొహమాట పడక తప్పలేదు. నా వ్యక్తిత్వం అటువంటిది.

భోజనం ముగిసేక, టేబిల్ క్లీన్ జేసి, కాఫీలు తెచ్చేడు బేరర్.

కాఫీ ముగించి కప్పు టేబిల్ మీద పెడుతూ, "ఇక అసలు విషయానికి వద్దాం. నే నడిగే ప్రశ్నలకి ఏమీ దాచకుండా జవాబివ్వాలి మరి!" అంది సువర్చలాదేవి గంభీరంగా.

తలూపేను, ఏమడుగుతుందా అని ఆలోచిస్తూ. గుండె కాస్త వేగం అందుకుంది.

"ఈ మధ్య నా భర్త ప్రవర్తనలో ఏదో మార్పు కనిపిస్తోంది. అంటే, నాపట్ల అతని బిహేవియర్ మారిపోయింది. నీవు అతని పెర్సనల్ సెక్రటరీవు. రోజూ ఉదయం తొమ్మిది గంటలనించి, సాయంత్రం ఐదుగంటల వరకూ మీ ఇద్దరికీ ఒకరితో ఒకరికి పని వుంటుంది.

నా ఉద్దేశం ఏమిటంటే, ఈమధ్య అతనికోసం ఎవ్వరైనా అమ్మాయి ఆఫీసుకు రావడంగానీ, అతను మాటిమాటికీ ఆఫీసునించి బైటికెళ్ళడంగానీ జరుగుతోందా అని?" అడిగింది సువర్చలాదేవి నన్ను పరీక్షగా చూస్తూ.

"ఆఁ... అబ్బే! అలాటిదేమీ లేదే!" అన్నాను తొట్రుపడుతూ.

"చూడమ్మాయ్! నీమీద నాకు పూర్తి నమ్మకం, విశ్వాసం వుంది. ఇది పొగడ్త కాదు. నిన్ను బాగా స్టడీజేసే ఈ మాట అంటున్నాను. నిజాన్ని దాచి ప్రయోజనం లేదు. నీకు తెలిసినంతవరకూ దాచకుండా చెప్పేయ్!" అంది సువర్చలాదేవి ఈసారి లాలనగా.

క్షణం ఆగి, కంఠాన్ని అదుపులో పెట్టుకుంటూ అన్నాను. "నే నా విషయాలేవీ గమనించలేదండీ! ఆయన్ని ఆఫీసులో కలుసుకోడానికి ఎందరో వస్తుంటారు. వారిలో సోల్ డిస్ట్రిబ్యూటర్స్ తాలూకు లేడీ రిప్రజెం

టేటివ్స్ కూడా ఉంటారు. నే నా దృష్టితో వాళ్ళని ఎన్నడూ గమనించలేదు. అఫీషియల్ వర్క్ తో తప్ప నాకు ఇతర విషయాల్లో ఎలాటి ఇంట్రస్టు ఉండదు. అయామ్ ఎక్స్ట్రీమ్లీ సారీ ఫర్ దిస్ డిసప్పాయింటింగ్ టు యూ మేడమ్!''

ఆవిడ భారంగా నిట్టూర్చి అంది. ''సరే! నీ సంగతి తెలిసీ నిన్నిలా పిలిపించి అడగడం నాదే పొరబాటు. ఏది ఏమైనా, అతను మారేడు. నామీద మోజు పోయింది. ఎవతినో వల్లో వేసుకుని తిరుగుతున్నాడు. ఆరేళ్ళ క్రితం ఓ పార్టీలో చిన్న పరిచయంతో నే నాకు చేరువై, భర్త పోయి విధవగా బ్రతుకుతున్న నన్ను పెళ్ళిజేసుకుంటానని తనే ముందు ఆఫర్ జేసేడు. ప్రలోభంలో పడి ఒప్పు కున్నాను. ఆ పరిస్థితి అటువంటిది.

నీవు చెప్పకున్నా, ఈమధ్య అతను ఓ యువతిని వెంటేసుకుని క్లబ్బులూ, హోటల్లూ, బీచ్ లూ, సినిమాలూ సర్వే జేస్తున్నాడని నాకు తెలిసింది. ఆ వ్యవహారం ఎంత వరకూ వచ్చిందో నీ ద్వారా తెలుస్తుందేమోనని ఇలా పిలి పించేను. ఇప్పుడిప్పుడే అర్థమౌతోంది. అతను కేవలం నా డబ్బు చూసి నన్ను చేసుకున్నట్టు. వాళ్ళిద్దరి వ్యవహారం ముదరక ముందే అతనికి విడాకులివ్వాలని నా నిర్ణయం! అప్పుడు తెలుస్తుంది విచ్చలవిడిగా డబ్బు వెదజల్లుతూ ఎలా జీవిస్తాడో? ఇక నువ్వు వెళ్ళవచ్చు!''

బ్రతికించేవురా భగవంతుడా, అనుకుంటూ లేచేను. ఆవిడకి నమస్కారం పెట్టి ఇవతల పడ్డాను.

నాకేమీ తెలీదని ఆవిడకి అబద్ధం చెప్పినమాట నిజమే! ఆవిడ అన్నట్టు ఈమధ్య తరుచూ కిరణ్ కుమార్ ని కలుసు

కోడానికి ఓ పాతికేళ్ళ యువతి ఆఫీసుకి వస్తోంది. ఆమె రాగానే, ముభావంగా ఉండే కిరణ్ కుమార్‌లో ఏదో హుషారు కనిపిస్తుంది. ఆమె వెంట బైటికెళ్ళాడంటే ఎప్పటికో గానీ తిరిగి రాడు. అందుకే ఈమధ్య ఆఫీస్ వర్క్ కాస్త కుంటినడక నడుస్తోంది.

ఈ విషయాలన్నీ సువర్చలాదేవికి దేనికి చెప్పాలి? ఒకరిమీద ఒకరికి చాడీలు చెప్పడం, వారి మెప్పుకోలు పొందడం మా ఇంటా వంటా లేదు. నొప్పింపక తా నొవ్వక తప్పించుకు తిరుగువాడే ధన్యుడు సుమతీ, అనే నానుడి వాతావరణంలో పుట్టి పెరిగేను. సాధ్యమైనంత వరకూ ఇతర్ల స్వంత విషయాలకి కాస్త ఎడంగా ఉండటమే మంచిది.

వడివడిగా నడుస్తూ ఆఫీసు జేరుకున్నాను. మిగిలివున్న లెటర్స్ తీసి చకచక టైప్ జెయ్యసాగేను. నాలుగున్నర కల్లా అవి పూర్తి జేసి కిరణ్ కుమార్ సంతకాలకోసం అతని రూంలోకి పట్టుకెళ్ళేను. సంతకాలు పూర్తయ్యేక, వాటిని ఎవరెవరికి పంపాలో ఇన్‌స్ట్రక్షన్స్ తీసుకుని బైటికి వస్తుండగా వచ్చింది ఆ యువతి.

ఆమెని కిరణ్ కుమార్ ఒకటి రెండుసార్లు అరుంధతీ అని సంబోధించినట్టు జ్ఞాపకం. చాలా అందంగా ఉంటుంది.

నన్ను చూసి, "కిరణ్ ఉన్నాడా?" అడిగింది.

తలూపి, నా సీట్లోకి వెళ్ళి కూర్చున్నాను.

అరుంధతి లోనికెళ్ళిన తరవాత, కాసేపు నవ్వులూ, జోకులూ వినిపించేయి లోపలినించి. తరవాత ఇద్దరూ బైటికి వచ్చేరు.

"నా కోసం వెయిట్ చెయ్యకండి. టైమ్ అవగానే ఆఫీసుకి లాక్ చేసి అందరూ వెళ్ళిపోవచ్చు!" అన్నాడు నన్ను చూస్తూ కిరణ్ కుమార్.

తలూపేను. ఇద్దరూ వెళ్ళిపోయేరు.

ఐదు గంటలకల్లా పాచ్ వర్క్ ముగించి లేచేను. అప్పటికే మిగతా గుమాస్తాలు ఒక్కరొక్కరే జారుకుంటున్నారు. చివర్న నేనూ, హెడ్ క్లర్క్ ఆఫీసుకి తాళాలు బిగించి బైటపడ్డాము. ఆఫీసు తాళం స్పేర్ కీస్ నా దగ్గరా, హెడ్ క్లర్క్ దగ్గరా, కిరణ్ కుమార్ దగ్గరా ఉంటాయి. ఆఫీసు కాంపౌండ్ గేటుముందు ఉదయం ఒక గూర్ఖా, రాత్రి ఒక గూర్ఖా డ్యూటీమీద ఉంటారు.

బస్ స్టాండ్ వేపు గబగబ అడుగులు వెయ్యసాగేను. ఈరోజు తెలిసినవాళ్ళింట్లో పేరంటం ఉంది. అమ్మ తయారయి నా కోసం ఎదురు చూస్తుంటుంది. రిస్టువాచీ చూసుకున్నాను. ఆరు గంటలు. అప్పటికే నగరంలో లైట్లు వెలిగేయి.

బస్ స్టాండ్ చేరుకున్న రెండు నిమిషాలకే వచ్చి ఆగింది బస్. ఎక్కి తోక్కి లోన దూరేను. అందరికీ తొందరే. ఆ దొమ్మీలో ఎప్పుడే ఎముక విరుగుతుందో తెలీదు. రోజూ జరిగే ఆ కుమ్ములాట ఇక భరించలేను బాబూ! నెలసరి బాడుగకి ఓ రిక్షా కుదుర్చుకుంటే సరి.

క్షేమంగా ఇల్లు చేరుకుని, ఆదరాబాదరా తయారయి అమ్మతో పేరంటానికెళ్ళి తిరిగి వచ్చేసరికి ఏడుంబావైంది. భోజనాలు ముగిసేక ఇవతలి గదిలో మడతకుర్చీలో కూర్చుని కాస్త రిలాక్స్ అవుతున్నాను. అమ్మ వంటింట్లో కంచాలు సర్దుతూ తమ్ముణ్ని కేక లేస్తోంది.

"కోతి వెధవా, పగలంతా పరాయి ఇళ్ళ జామచెట్లు ధ్వంసంజేసి భోజనాలయిందే ఆలస్యం అన్నట్టు అలా ముసుగుతన్నుకుంటే, రేపటి హోంవర్కు చేసుకు తగలడ రాదూ? రేపు స్కూల్లో మేస్టారు చేతులువాయ గొట్టేరని ఇంట్లో గునుస్తావ్. ఎప్పటి పని అప్పుడు చేసిపారేస్తే పై వాళ్ళు దేనికి నోరు మెదుపుతారు?"

అప్పుడు జ్ఞాపకం వచ్చింది నాకు! ఉదయం కిరణ్ కుమార్ చెప్పిన సోల్ డిస్ట్రిబ్యూటర్స్ తాలూకు పెండింగ్ ఫైల్ విషయం! ఈనాటి గందరగోళంలో దాని సంగతే మరిచేను.

ఇప్పుడెలా? రేపుదయంలోగా దాని పని ముగించి అతని ముందుంచాలి. చెప్పిన పని సమయానికి చేసిపెట్టకుంటే కిరణ్ కుమార్ మొహం ఎర్రబడుతుంది. చాలా కఠినంగా మాట్లాడతాడు. నాకు ఆత్మాభిమానం విపరీతం! ఇంటా బయటా ఒకరిమాట పడటం నా తత్వానికి విరుద్ధం.

ఆ ఫైల్ జ్ఞాపకం రాగానే గుండె వేగం అందుకుంది. ఏం జెయ్యాలి? ఆఫీసుకెళ్ళి ఆదరా బాదరా దాని పని ముగిస్తే? బైట ఎలాగూ, గూర్ఖా ఉంటాడు. భయం దేనికి? లేచి, పర్సు అందుకుని, కాళ్ళకి చెప్పులు తొడుక్కో సాగేను.

"ఎక్కడికే?" అడిగింది అమ్మ అప్పుడే యివతలకి వస్తూ.

నిజం చెబితే వెళ్ళనివ్వదు. "ఇప్పుడే వస్తా!" అంటూ తలుపువేపు నడిచేను.

"ఆ కథలు రాసే నీలమణి ఇంటికేనా?"

"ఆc!" అంటూ ఇవతల పడ్డాను.

గబగబ అడుగులు వేస్తూ వీధి చివర్న కనిపించిన రిక్షా ఎక్కి బైలుదేరేను. ఆఫీసు మెయిన్ గేటు ముందు రిక్షా ఆపించి దిగేను.

చప్పుడు విని, "కౌన్ హై?" అంటూ గేటుదగ్గరికి వచ్చేడు గూర్ఖా.

రిక్షావాడికి డబ్బులిచ్చి పంపి, "గేటు తెరువ్!" అన్నాను గూర్ఖాతో.

ఆ సమయంలో నేను రావడం ఆశ్చర్యం కలిగించి ఉంటుం దతనికి. గేటు తెరిచేడు. లోనికెళ్ళి ఆఫీసు తలుపుకి వేళాడుతున్న తాళం తెరిచేను. లోపల చీకటి! తలుపుపక్క గోడ తడిమి స్విచ్ వత్తేను. లైటు వెలిగింది. లోన సూదిపడితే వినిపించే నిశ్శబ్దం! పగలంతా గందర గోళంగా ఉండేచోటు ఇదేనా అనిపించింది. స్మశానంలో కూడా అంతటి నిశ్శబ్దం ఉండదేమో!

కిరణ్ కుమార్ ఆఫీసు గదివేపు నడిచి, స్ప్రింగ్ డోర్‌ని తీసేను. కిర్రుమంటూ తెరుచుకున్నాయి. లోన అడుగు పెట్టేను. బైట గూర్ఖా గనక లేకపోతే ఆ నిశ్శబ్దం నిజంగా నన్ను భయపెట్టి ఉండేది. గోద్రెజ్ టేబిల్ సొరుగు లాగి ఆ ఫైల్ తీసి వెనుదిరగబోయేను. అంతే!

ఆ నిశ్శబ్దంలో, గది మారుమోగేలా గణగణ మోగింది ఫోన్. ఆ హఠాత్సంఘటనకి నా గుండె గుభిల్లుమంది. క్షణం కాళ్ళూ చేతులూ వణికేయి. అంత రాత్రివేళ, ఆఫీసు మూసి ఉంటుందని తెలిసీ ఎవ్వరు ఫోన్ జేస్తున్నారు? రాంగ్ నెంబర్ కాదుకదా?

వణికే చేతులతో రిసీవర్ అందుకుని, "హలో!" అన్నాను.

"ఆఁ...ఎవరు...ఎవరు మాట్లాడుతోంది?" అవతలి కంఠంలో తొట్రుపాటూ, ఆశ్చర్యం ధ్వనించేయి. ఆ కంఠం ఎవ్వరిదో కాదు. మా బాస్ కిరణ్ కుమార్ ది!

"నేనండీ, ద్రాక్షవేణిని!" అన్నాను దిగ్భ్రాంతితో.

ఈ సమయంలో తన ఆఫీసులో ఊరపిచ్చుక ఉండదని తెలిసీ కిరణ్ కుమార్ దేనికి ఫోన్ జేస్తున్నాడు?

"ఇంత రాత్రివేళ ఆఫీసులో ఏం జేస్తున్నావ్? ఇంటికి వెళ్ళలా?" అడిగేడు కిరణ్ కుమార్ ఆశ్చర్యంగా.

"వెళ్ళానండీ! కానీ, మి...మీరు చెప్పిన సోల్ డిస్ట్రిబ్యూటర్స్ తాలూకు పెండింగ్ వర్క్ మర్చిపోయి వెళ్ళాను. ఇంట్లో జ్ఞాపకం వచ్చి, దాన్ని పట్టుకెళ్ళి ఇంట్లోనే పూర్తి జెయ్యాలని ఇలా వచ్చేను. ఈ విషయంలో మీ కభ్యంతరం ఉంటే మన్నించండి!"

"అబ్బే! నాకేం అభ్యంతరం లేదు. పట్టుకెళ్ళు. ఈ మధ్య నాకూ మతిమరుపు వచ్చినట్టుంది. ఓ ఫ్రెండ్ ఇంటికి ఫోన్ జెయ్యాలని, పరధ్యానంలో ఆఫీసు నెంబర్ రింగ్ జేసేను. సరే, గుడ్ నైట్!" అవతల క్లిక్ మంది.

హమ్మయ్య అనుకుంటూ రిసీవర్ క్రెడిల్ జేసి వెనుదిరిగేను. గదిలోంచి బైటికి వచ్చేక అనిపించింది, ఈ ఫైల్ ఇంటివరకూ తీసికెళ్ళడం దేనికని. ఇక్కడే కూర్చుని గబగబ పూర్తి జేస్తే సరి. ఇంట్లో అమ్మ రాసుకోనివ్వదు. ఆమెకి నా నిద్రాహారాలమీద ధ్యాస ఎక్కువ!

నా సీట్లో కూర్చుని, ఫైల్ తెరిచేను. పని పూర్తయ్యే సరికి గంటన్నర పట్టింది. దాన్ని టేబిల్ సొరుగులో పడేసి లేచేను. నిదర ముంచుకు వస్తోంది. ఇక ఆఫీసు లోంచి బైటపడాలని తలుపువేపు అడుగు వేసేను. సరిగ్గా అదే సమయంలో, కిరణ్ కుమార్ ఆఫీసు గదిలోంచి గణ

గణ మోగసాగింది టెలిఫోన్. ఆ గంటతో బాటు నా గుండెకూడా దడదడ కొట్టుకోసాగింది.

కిరణ్ కుమార్ ఇప్పుడూ పరధ్యానంలో ఆఫీస్ నెంబర్ రింగ్ జేసేడా? కళ్ళు విప్పార్చి అలాగే స్ప్రింగ్ డోర్స్ వేపు చూడసాగేను. ఫోన్ ఆగకుండా మోగుతోంది. వెళ్ళి ఎత్తనా? వద్దా? నా పని పూర్తయింది. దానితో నాకేమిటి పని? అనుకుంటూ ఆఫీసులోంచి బైటపడ్డాను. తిరిగి యథాతథంగా తలుపుకి తాళంవేసి మెయిన్ గేటు వేపు నడిచేను.

ఆఫీసులో ఇంకా మోగుతున్న టెలిఫోన్ శబ్దం లీలగా వినిపిస్తూనే ఉంది!

2

"గుడ్ మార్నింగ్ సర్!" అన్నాను లేచి నిల్చుంటూ.

తల వంచుకుని, "మార్నింగ్!" అంటూ తన ఆఫీసు లోకి నడిచేడు కిరణ్ కుమార్.

రిస్టువాచీ చూసుకున్నాను. తొమ్మిదిన్నర. సరిగ్గా తొమ్మిదిన్నరకి ఆఫీసులో అడుగు పెడతాడు కిరణ్ కుమార్. మేమంతా పదిహేను నిమిషాలు ముందు వచ్చేస్తాం.

డెస్కులోంచి రాత్రి పూర్తిజేసిన ఫైల్ తీసి, కిరణ్ కుమార్ గదివేపు నడిచేను.

స్ప్రింగ్ డోర్స్ దగ్గిర ఆగి, "మే ఐ కమిన్ సర్?" అడిగేను.

"ఎస్!" అన్నాడు లోపలినించి.

డోర్స్ తోసుకుంటూ లోన అడుగుపెట్టేను. ప్రశ్నార్థకంగా చూసేడు. ఫైల్ తెరిచి అతని ముందుంచేను.

"సువర్చలతో మాట్లాడాలి! కాస్త మా ఇంటికి రింగ్ జేసి, లైన్ దొరికితే నాకు కనెక్ట్ జెయ్!" అన్నాడు ఫైల్ అందుకుంటూ.

తలూపి వెనుదిరిగేను. ఆ తిరగడంలో నా చేతిలోని పెన్ జారి కిందపడింది. వంగి దాన్ని అందుకుని లేచేను. కిరణ్ కుమార్ తన కుడివేపు స్టూల్ మీదున్న ఫోన్ రింగ్ జేస్తున్నాడు. ఆ ఒక్క క్షణంలో అనుకోకుండా నా దృష్టి అతను రింగ్ జేస్తున్న డయల్ మీద పడింది. అతని వేళ్ళు 145 అనే నెంబర్స్‌ని రింగ్ జేస్తున్నాయి. అంతవరకే చూడగలిగేను.

గదిలోంచి బైటపడి, నా టేబిల్ వేపు నడిచేను. టేబిల్ మీది పేడ్‌లో కొన్ని ఇంపార్టెంట్ ఫోన్ నెంబర్స్ నోట్ జేసి పెట్టుకున్నాను. అందులో కిరణ్ కుమార్ ఇంటి ఫోన్ నెంబర్ చూసేను. 145204. ఇంత క్రితం టెలిఫోన్ డయల్ మీద కిరణ్ కుమార్ వేళ్ళు కదలాడిన నెంబర్స్ తళుక్కుమన్నాయి నా బుర్రలో.

నన్ను లైన్ కోసం తన ఇంటికి ఫోన్ జెయ్యమని చెప్పి, తను దేనికి రింగ్ జేస్తున్నాడు? ఏమీ అర్ధంగాక, భుజాలు ఎగరేస్తూ రిసీవర్ అందుకుని అతని ఇంటికి రింగ్ జేసేను.

"ఎక్స్‌క్యూజ్ మీ. ఆ ఫోన్ ఎంగేజ్‌లో ఉంది!" అంది టెలిఫోన్ ఆపరేటర్.

బహుశా, సువర్చలాదేవి మరెవ్వరితోనో మాట్లాడుతోంది కాబోలు. రిసీవర్ దించి సీట్లో కూలబడ్డాను. ఇంతలో కాలింగ్ బెల్ మోగింది. లేచి కిరణ్ కుమార్ ఆఫీసులోకి నడిచేను.

"ఏం? లైన్ కలవలేదా?" అడిగేడు.

"లేదండీ! మీ ఫోన్ ఎంగేజ్ లో ఉన్నట్టు చెప్పింది ఆపరేటర్!" అన్నాను.

"అలాగా! సరే, కాసేపయ్యేక లైన్ కలిపి నాకు కనెక్ట్ జెయ్!" అన్నాడు.

తలూపి వెనుదిగేను. నా డెస్క్ తెరిచి ఇన్ కమ్ టాక్స్ తాలూకు ఎకౌంట్ షీట్ కాపీ తీసి సీట్లో కూలబడ్డాను. టైప్ రైటర్ మీద కార్బన్ పేపర్, తెల్ల కాగితాలు ఎక్కించి చకచక ట్రూ కాపీస్ టైప్ చెయ్యసాగేను. టైం ఎంత గడిచిపోయిందో తెలీదు.

ఎవ్వరో నా సీటు దగ్గరికి వచ్చినట్టు బూట్సుల టకటక శబ్దం విని తలెత్తేను.

పోలీసు ఇన్ స్పెక్టర్! అతని వెనక సార్జంట్!!

నా కనుబొమలు ముడివడ్డాయి.

అతను నవ్వి, "అయామ్ ఇన్ స్పెక్టర్ రాజారెడ్డి ఫ్రమ్ క్రయింబ్రాంచ్. ఇతను నా అసిస్టెంట్ సార్జంట్ డేవిడ్. మేము మిస్టర్ కిరణ్ కుమార్ని చూడాలి! ఆయన ఉన్నారా?" అడిగేడు.

తలూపి, అతని ఆఫీసువేపు చూపెట్టేను!

ఇద్దరూ చకచకా అటు నడిచి లోనికెళ్ళారు. ఐదు నిమిషాల తరవాత కిరణ్ కుమార్ బైటికి వచ్చారు. కిరణ్ కుమార్ మొహం విషాదంతో, గాంభీర్యంతో జేవురించి ఉంది. నాకేమీ అర్థం కావడంలేదు. గుడ్లు తేలేసి వాళ్ళని చూస్తున్నాను. ఇన్ స్పెక్టర్, కిరణ్ కుమార్ ఇద్దరూ బైటికి వెళ్ళిపోయేరు.

సార్జంట్ డేవిడ్ నన్ను సమీపించి, "కిరణ్ కుమార్ గారి సెక్రెటరీ, మిస్ ద్రాక్షవేణి మీరే కదూ?" అడిగేడు.

తలూపేను.

"మీతో కాస్త మాట్లాడాలి!"

"కూర్చోండి!" అన్నాను నాకెదురుగా ఉన్న కుర్చీ చూపిస్తూ.

అతను కూర్చుంటూ, నింపాదిగా అన్నాడు "కిరణ్ కుమారిగారి భార్య సువర్చలాదేవి ఇంట్లో చచ్చిపడు న్నారు!"

దిగ్భ్రాంతితో నా మస్తిష్కం క్షణం స్తంభించి పోయింది. అతి కష్టంమీద తేరుకుని, "ఎలా?" అడిగేను హీనస్వరంతో.

"ఉదయం సువర్చలాదేవి మేడమీది పడగ్గది బాత్ రూంలో స్నానం జెయ్యడానికి వెళ్ళింది. టబ్ వేడి నీళ్ళతో నిండి ఉంది. దురదృష్టవశాత్తు ఆ టబ్లో ఆవిడ కాలుజారి, గోడలో బిగించి ఉన్న వాటర్ పైప్ రౌండ్ ఫ్రేడ్కు తల వెనుక భాగం బలంగా గుద్దుకుని, నీళ్ళలో పడిపోయింది. అలా హఠాత్తుగా తల వెనుక దెబ్బ తగల డంతో ఆవిడకి వెంటనే మూర్ఛపోయింది. మొహం పూర్తిగా నీళ్ళలో మునిగి ఉండటంవల్ల ఊపిరి అందక ప్రాణం వదలింది. ఇది కేవలం మా తార్కిక వాదం. శవం ఉన్న తీరును చూసి మేమీ నిర్ణయం తీసుకోవలసి వచ్చింది."

"ఆవిడ మరణించినట్టు మీకెవ్వరు తెలియజేసేరు?" అడిగేను.

"వంటమనిషి! మధ్యాహ్నం భోజనంలో ఏవి ఐటమ్స్ వండాలో సువర్చలాదేవిని అడగడానికి పైకి వంటింట్లోంచి బైటికి వచ్చి, మేడ మెట్లు ఎక్కబోయిందట. సరిగ్గా అదే సమయంలో పైన వారి పడగ్గదిలోంచి టెలిఫోన్ గణగణ

మోగసాగిందిట. వంటమనిషి మెట్లెక్కి గదిలో అడుగు పెట్టేవరకూ ఫోన్ ఆగకుండా మోగుతూనే ఉందిట.

అంత శబ్దం అవుతున్నా, బాత్ రూంలోంచి ఎలాటి చప్పుడు వినిపించక పోవడంతో వంటమనిషికి అనుమానం వేసి, తలుపు తోసిందట. లోపలి దృశ్యం చూడగానే కేకలు పెడుతూ వీధిలోకి పరిగెత్తిందట. ఇరుగు పొరుగు పోగయ్యేక జరిగిన విషయం చెప్పిందిట. వాళ్ళు క్రయిం బ్రాంచి హెడ్ క్వార్టర్స్‌కి ఫోన్ జేసేరు. ఎస్. పి. మమ్మల్ని తక్షణం దర్యాప్తు జేసి రమ్మని పంపేడు.

ఇక అసలు విషయానికి వద్దాం. మీరు మిస్టర్ కిరణ్ కుమార్ పెర్సనల్ సెక్రటరీ కదా? ఆ భార్యాభర్తల మధ్య ఏవైనా పెర్సనల్ గ్రడ్జస్ ఉండేవా? దయజేసి నా ప్రశ్నలకి దాచకుండా జవాబివ్వండి!"అన్నాడు సార్జంట్ డేవిడ్ సిగరెట్ అంటిస్తూ.

"అయామ్ సారీ సర్! వాళ్ళతో నా సంబంధం కేవలం ఆఫీసువరకే, వారి వ్యక్తిగత విషయాలు నాకేమీ తెలీవు. ఇంతకీ, మీకీ అనుమానం దేనికి కలిగింది?" అడిగేను.

అతను నవ్వేడు. "అది మా వృత్తి దోషం! భర్త పోయిన, నాలుగు పదులు దగ్గరపడుతున్న ముసలి స్త్రీని కిరణ్ కుమార్ వంటి స్మార్ట్ చాప్టర్ దేనికి పెళ్ళి జేసుకుంటాడు? డబ్బు! డబ్బు మహాత్యం! ఆ కోణంనించే మేము ముందుకు సాగేది. ఈ ఉదయం కిరణ్ కుమార్ ఎన్ని గంటలకి ఆఫీసుకి వచ్చేడు?"

"సరిగ్గా తొమ్మిదిన్నరకి!"

"వచ్చేక మళ్ళీ బైటికెళ్ళాడా?"

"లేదు! వచ్చిన పావుగంటకి నన్ను పిలిచి, తన ఇంటికి ఫోన్ జెయ్యమనీ, లైన్ కలిస్తే తన ఫోన్‌కి కనెక్టు జెయ్య

మనీ, భార్యతో మాట్లాడాలనీ చెప్పేడు. నేను అతని ఆఫీసులోంచి బైటికి వస్తుండగా, నా చేతిలోని పెన్ జారి కిందపడింది. వంగి దాన్ని అందుకుని లేచి చూసేసరికి కిరణ్‌కుమార్ తన కుడిపక్క స్టూల్ మీదున్న ఫోన్ రిసీవర్ ఎత్తి తన ఇంటి నెంబరే రింగ్ జేస్తున్నాడు. నేను మౌనంగా బైటికి వచ్చి, నా టేబిల్ మీది ఫోన్ ద్వారా, వాళ్ళింటికి ఫోన్ జేసేను. వాళ్ళ ఫోన్ ఎంగేజ్‌లో ఉన్నట్టు చెప్పింది ఆపరేటర్. బహుశా, సువర్చలాదేవి ఎవ్వరితోనో మాట్లాడుతుందని రిసీవర్ పెట్టేసేను. అంతే!"

సార్జంట్ ఆతృతగా ముందుకి వంగేడు. "బాగా జ్ఞాపకం జేసుకుని చెప్పండి. మీరు పెన్ కోసం వంగి లేచినప్పుడు అతను తన ఇంటి నెంబరే రింగ్ జేస్తున్నాడా?"

"ఖచ్చితంగా చెప్పలేను. డయల్ మీద అతని వేళ్ళు 145 అనే అంకెలు తిప్పడం వరకే చూసేను. వాళ్ళ ఇంటి ఫోన్ నెంబర్ 145204 కనక అలా ఊహించేను!"

"ప్లీజ్! త్వరగా టెలిఫోన్ ఎక్స్ఛేంజికి ఫోన్ జేసి, అతను ఎక్కడికి ఫోన్ జేసేడో కనుక్కోండి!" సార్జంట్ కంఠంలో ఆతృత.

టేబిల్ మీది ఫోన్ లాక్కుని, ఎక్స్ఛేంజికి రింగ్ జేసేను.

"ఎస్!" అంది ఆపరేటర్.

కిరణ్‌కుమార్ ఇంటి ఫోన్ నెంబర్ చెప్పి, గంట క్రితం ఆ నెంబర్‌కి యెక్కణ్ణించి కాల్ వచ్చిందని అడిగేను.

"710852 నించి!" చెప్పింది ఆపరేటర్.

ఆమెకి థాంక్స్ చెప్పి రిసీవర్ దించేను. సార్జంట్ ప్రశ్నార్థకంగా చూసేడు.

"నా అంచనా నిజమే అయింది!" అన్నాను.

సార్జంట్ నవ్వేడు. నా కెందుకో ఆ నవ్వు ఎబ్బెట్టుగా తోంది.

"మిస్ ద్రాక్షవేణీ! కేసు తేలిపోయింది. మిమ్మల్ని సాక్షిగా ఉపయోగించడానికి కిరణ్ కుమార్ బ్రహ్మాండమైన ఎత్తు వేసేడు. జరిగిందేమిటో మీకు వివరంగా చెబుతాను వినండి. ఉదయం, బేతింగ్ టబ్‌లో స్నానం జేస్తున్న తన భార్యని ఏ ఇనప వస్తువుతోనో మెడమీద బాది మూర్ఛపోగొట్టేడు కిరణ్ కుమార్. తెలివి కోల్పోయిన ఆమెని పూర్తిగా టబ్‌లో ముంచి, ఇవతలపడ్డాడు. నీళ్ళలో ఊపిరాడక, సువర్చలాదేవి కొద్ది నిమిషాలకే మరణించి ఉంటుంది.

ఇంటినించి తిన్నగా ఆఫీసు జేరుకున్నాడు కిరణ్ కుమార్. మిమ్మల్ని పిలిచి భార్యతో మాట్లాడాలనీ, లైన్ కలిపి ఇవ్వమనీ చెప్పి, మీకన్నా ముందు తనే తన ఇంటికి రింగ్ జేసేడు. రిసీవర్ ఎత్తేవరకూ అవతల ఫోన్ మోగుతూనే ఉంటుంది. అదే సమయంలో మీరు వాళ్ళింటికి రింగ్ జేసేరు. ఆ ఫోన్ ఎంగేజ్‌లో ఉన్నట్టు చెప్పింది ఆపరేటర్. మీరు సువర్చలాదేవి ఎవ్వరితోనో మాట్లాడుతోందని భ్రమించేరు. కిరణ్ కుమార్‌కి కావలసింది కూడా అదే. తను ఆఫీసులో ఉన్న సమయంలో తన భార్య ఫోన్ వాడుతూ బ్రతికే ఉన్నట్టు మీద్వారా సాక్ష్యం చెప్పించడానికి ఈ ఎత్తు వేసేడు. ఇప్పుడు బోధపడిందా?" అన్నాడు సార్జంట్ మెరిసే కళ్ళతో.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది నాకు! రాత్రి నేను ఆఫీసుకి రావడం, ఉన్నట్టుండి ఫోన్ మోగడం, నేను రిసీవర్ ఎత్తేసరికి కిరణ్ కుమార్ కంఠంలో ఖంగారు ధ్వనించడం పని పూర్తి జేసి నేను వెళ్ళేటప్పుడు తిరిగి ఫోన్ మోగడం, ఆగకుండా మోగుతుండటం! ఆ సంగతే చెప్పేను సార్జంట్ కి.

అంతా విన్న అతను సాలోచనగా తలూపేడు. "ఐతే, కుమార్ రాత్రే ఈ ఫోన్ తతంగాన్ని రిహార్సిల్ జేసే డన్నమాట! మిస్ ద్రాక్షవేణీ! మీవల్ల వెంట్రుకవాసిలో ఇనపసంకెళ్ళనించి తప్పుకోబోతున్న ఓ హంతకుడు పట్టుబడ్డాడు. రేపు కోర్టులో మా తరఫు సాక్షిగా మిమ్మల్ని ప్రవేశపెడతాం. నిర్భయంగా మీకు తెలిసినవన్నీ చెప్పాలి. థాంక్యూ, వస్తాను!" అంటూ లేచేడు. బూట్సు టకటక లాడిస్తూ బైటికి వెళ్ళిపోయేడు.

బరువుగా నిట్టూర్చేను. మౌనంగా, గుంభనంగా కనిపించే కిరణ్ కుమార్ లో ఇంతటి కాలకూట విషం దాగి ఉందా? ప్చ్! మనిషి నైజాన్ని పసిగట్టడం, మనిషిని సృష్టించిన ఆ పరంధాముడికే సాధ్యం! ★★★

బోర్డుమీద చేసి చూపిస్తున్న ఆల్జీబ్రా లెక్క సాల్వ్ కాక, ఆన్సర్ రావటాన్కి తెగకొట్టుకు పోతున్నాడు టీచరు. భీమారావ్ లేచి "సార్" అన్నాడు.

"ఏం నీకు వచ్చిందా ఆన్సర్" అన్నాడు టీచర్.

"అబ్బే లేదండి. చెరిపేస్తే సరిపోలా. ఏ బాధ ఉండదు," అన్నాడు భీమారావ్ కూర్చుంటూ.

—గంధం శ్రీహరి, క్రాప.

పండిన పాపం

ఎమ్. రామగోపాల్

భారంగా కణతలు నొక్కుకున్నాడు రాజారావు. ఆలోచనలతో తల పగిలిపోతోంది. విసుగ్గా కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు.

"సార్! కాఫీ తెప్పించమంటారా?" అడిగాడు ప్యూన్ రంగయ్య.

రాజారావు కళ్ళు తెరిచి, "రెండు సారిడన్ కూడ తెప్పించు" అన్నాడు.

రంగయ్య తల ఊపి వెళ్ళిపోయాడు.

రాజారావు కోటు జేబులోంచి కాగితం తీసి చదవటం ప్రారంభించాడు.

"మిస్టర్ రాజారావ్...

నీకు మహాబలిపురం జ్ఞాపకం ఉందా? నాల్గు సంవత్స రాల క్రితం నువ్వు, నీ స్నేహితులు, సుధాకర్, రవి, ఆనంద్, కలిసి చేసిన ఘోరం జ్ఞాపకం ఉందా? ఆ విషయం ఉన్నా లేకపోయినా మళ్ళీ ఒకసారి గుర్తు చేస్తాను.

నాల్గు సంవత్సరాల క్రితం, నువ్వూ, నీ స్నేహితులు కలిసి, మహాబలిపురం పిక్నిక్ వెళ్ళారు. అక్కడొక అంద మైన అమ్మాయి, మతి స్థిమితం తప్పి తిరుగుతూ కన్పిం చింది. ఆమెలోని దుర్గతకు మీకు జాలికల్గలేదు సరికదా! పైపెచ్చు ఆమె అందానికి మీరు పరవశించిపోయారు. మీలో రాక్షసత్వం ప్రబలింది.

మతి స్థిమితంలేని ఆ యువతిని, మీరు నల్గురు, అతి దారుణంగా, రాక్షసత్వంగా అనుభవించారు. పాపం! ఆ అమాయకురాలు మీ రాక్షసత్వానికి తాళలేక అక్కడి కక్కడే ప్రాణాలు విడిచింది.

ఆ నేరం మీమీదకు వస్తుందని భయపడి ఆమె శవాన్ని పక్కనే వున్న సముద్రంలోకి విసిరి పారిపోయారు. మీ అదృష్టవశాత్తు పోలీసులకు మీమీద కన్ను పడలేదు. హాయిగా కాలం గడుపుతున్నారు మీరు నల్గురూ! ఇప్పటి కైనా గుర్తుకు వచ్చిందా మహాబలిపురం?

కాని, మీ పాపం పండింది. మీ రనుకున్నట్లు ఆమె చనిపోలేదు. బ్రతికే వుంది. మీమీద పగతీర్చుకునే అవకాశం కోసం ఎదురుచూస్తుంది. ఆమె పేరు ఏమిటో తెలుసా? 'సరస్వతి'. ఏం భయంగా వుందా? సరస్వతే! సాక్షాత్తు, రెండు నెలలక్రితం నువ్వు వివాహమాడిన

సరస్వతే! ఖబడ్దార్! ఇక నీ జీవితం నరకమే! మీరు చేసిన పాపానికి శిక్ష అనుభవించి తీరాలి! ముందు నీ చావు కళ్ళారా చూడాలి!

సెలవ్!

నీ చావుకోరే..."

ఇప్పటికి పదిసార్లు చదివాడు ఆ ఉత్తరాన్ని. ఈ రోజు ఉదయం పోస్టులో వచ్చింది ఉత్తరం. అప్పటినుంచి ఈ ఉత్తరం ఎవరు వ్రాసి వుంటారో ఊహించలేకపోతున్నాడు. ఇంకొక విషయం కూడ అర్థంకాకుండా వుంది. ఈ ఉత్తరంలో వ్రాసినట్లు ఆ యువతి తన భార్య సరస్వతేనా?

కాదు! అలా కావడానికి వీల్లేదు. ఆ యువతి మొహం తనకు బాగా గుర్తుంది. సరస్వతిలో ఆమె పోలికలు కొన్ని వున్నాయి కాని, ఆమే సరస్వతి కావడానికి వీల్లేదు. ఆ రోజు అందరం పరీక్షించి, ఆమె చనిపోయిందని నిర్ధారణ చేసుకున్న తర్వాతనే ఆమెను సముద్రంలోకి విసరివేసారు. ఆమె మళ్ళీ బ్రతికి రావడం అసంభవం.

మరయితే ఈ విషయం ఎవరికి తెల్సింది? ఎలా తెల్సింది? నాల్గు సంవత్సరాల క్రిందట జరిగిన విషయాన్ని గురించి ఇప్పుడు రాయడంలో అతని ఉద్దేశ్యం ఏమిటి? ఇంత కాలం ఏంచేస్తున్నాడు?

ఒకవేళ నిజంగా ఆ అమ్మాయి, సరస్వతే అయితే, ఈ ఉత్తరం వ్రాసిందెవ్వరు? ఒకవేళ సరస్వతే ఈ ఉత్తరం వ్రాసి వుంటే, తన పేరు బైటపెట్టుకొని, తన జీవితాన్ని ఆపదలలోకి నెట్టుకుంటుందా?

ఒకవేళ ఈ ఉత్తరం వ్రాసింది మరొక వ్యక్తయితే, తనమీద అతనికి అంత కసి ఎందుకు?

ఇవన్నీ అర్థంకాని ప్రశ్నలు, ఉదయంనుంచి ఆలోచించి తల పగిలిపోతుంది.

రంగయ్య కాఫీ, సారిడన్ టాబ్లెట్లు తెచ్చి టేబిలు మీద పెట్టాడు.

సారిడన్ టాబ్లెట్సు వేసుకొని కాఫీ త్రాగాడు రాజారావు. ఈరోజు ఆఫీసులో పని సరిగ్గా చేయలేక పోతున్నాడు. అర్థంకాని ప్రశ్నలతో తల పగిలిపోతుంది. అంతే కాదు. గుండెల్లో ఏదో భయం గూడు కట్టుకుంది. ఇంత కాలం రహస్యంగా వుండిన విషయం, ఈనాడు బట్ట బయలయింది. ఏవిధంగా కూడ తనకు శాంతి వుండే అవకాశం లేదు. ఏంచేయాలి?

తల విదిలించి లేచి నిలబడ్డాడు రాజారావు. 'బ్రీఫ్ కేస్' తీసుకొని బయటకు నడిచాడు.

"సార్! అర్జెంటు కాగితాలు" అన్నాడు మేనేజర్ రంగనాథం.

"నా టేబిలుమీద వుంచండి! రేపు చూస్తాను!" అంటూ చకచక కారు దగ్గరకు నడిచాడు.

కారు స్టార్ట్ చేసి ఇంటివైపు పోనిచ్చాడు. పదినిముషాల తర్వాత కారు దిగి చకచక ఇంట్లోకి నడిచాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

"గోపయ్యా! అమ్మగారేరి?" అడిగాడు రాజారావు.

"అమ్మగారు మేడమీద గదిలో వున్నారండీ" అన్నాడు నౌకరు గోపయ్య.

రాజారావు తల ఊపి మేడమీద గదిలోకి నడిచాడు. సరస్వతి గదిలో టేబిలుముందు కూర్చొని ఏదో వ్రాసుకుంటూంది. రాజారావు అడుగుల చప్పుడువిని చటుక్కున వెనక్కి తిరిగింది.

"మీరా? అప్పుడే వచ్చేసారా?" అంది తడబడుతూ. రాజారావు అప్పటికే గమనించాడు, సరస్వతి ఏదో కాగితాన్ని పుస్తకంలో వుంచడం.

"ఆ! తలనొప్పిగా వుండి వచ్చేసాను?" అన్నాడు నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"కాస్సేపు పడుకోండి! కాఫీ తెస్తాను!" అంది సరస్వతి బయటకు వెళుతూ.

రాజారావు చటుక్కున వెళ్ళి అంతకుముందు సరస్వతి దాచిన కాగితాన్ని బైటికి తీసాడు. ఏదో ఉత్తరంలా వుంది. ఇంకా పూర్తిగా వ్రాయలేదు. ఎవరో స్నేహితురాలికి వ్రాస్తున్న ఉత్తరం అది.

ఉన్నట్లుండి ఏదో అనుమానం వేసి, ఉదయం తనకు పోస్టులో వచ్చిన ఉత్తరాన్ని తీసి, సరస్వతి వ్రాసిన ఉత్తరంతో పోల్చి చూచాడు.

ఒక్క నిముషం గుండె దడదడలాడింది. రెండు ఉత్తరాల్లో చేతివ్రాత ఒక్కటే! అంటే! ఆ ఉత్తరాన్ని తనకు సరస్వతే రాసిందన్నమాట? అయితే నిజంగా, ఆ అమ్మాయి సరస్వతేనా? పిచ్చిగా తల పీక్కున్నాడు బాధతో.

"ఏమండీ కాఫీ!" అంది సరస్వతి ద్వారందగ్గర నిలబడి.

సరస్వతివైపు చిరాగ్గా చూచి "అక్కడ పెట్టివెళ్ళు!" అన్నాడు రాజారావు. సరస్వతిని చూస్తుంటే కంపరం పుడుతుంది.

సరస్వతి కాఫీ టేబిలుమీద పెట్టి వెనక్కు తిరిగింది.

"సార్!" క్రింద ఎవరో పిలిచారు.

"ఎవరో పిలుస్తున్నారు చూడు!" అన్నాడు రాజారావు మంచంమీద కూర్చుంటూ.

రెండు నిముషాల తర్వాత సరస్వతి గదిలోకి వచ్చింది.

"ఎవరూ?" అడిగాడు రాజారావు.

సరస్వతి పెదిమ విరిచి, "ఎవరో చిన్న కుర్రాడు! ఈ ఉత్తరం మీ కియ్యమన్నాడు!" అంది కవరు అందిస్తూ.

రాజారావు కవరు అందుకొని, "సరే నువ్వెళ్ళు" అన్నాడు కవరు చింపుతూ.

నాలు మడతల కాగితం అది. చిన్న చిన్న అక్షరాలతో ముచ్చటగా వుంది వ్రాత.

"రాజారావ్...

నా ప్రయత్నం ఫలించిందన్నమాట. ఆ విషయం నువ్వు ఆఫీసు గదిలోంచి బైటకు రాగానే నీ మొహం చెప్పింది. ఇప్పుడు నీ గుండెల్లో పర్వతాలు పగులుతున్నాయి కదూ? నీకా శిక్ష చాలదు. ఇంకా కుళ్ళి కుళ్ళి చావాలి! అప్పుడే నా మనస్సుకు శాంతి! ఇప్పటికిది చాలు! మళ్ళీ కలుస్తాను.

శెలవ్!

నీ చావుకోరే..."

ఉత్తరాన్ని వుండలా నలిపి, విసుగ్గా నేలకేసి కొట్టాడు.

ఇడియట్! ఎవడు వీడు? నా చావుతో వీడికేం అవసరం? చటుక్కున అనుమానం సరస్వతి మీదకు పోయింది. ఊహు! సరస్వతి వ్రాసి వుండడానికి వీల్లేదు. తను ఆఫీసులోంచి విసుగ్గా,బాధగా బైటకువచ్చిన విషయం సరస్వతి చూడలేదు కదా? మరెవరు వ్రాసి వుంటారు?

తను ఆఫీసులోంచి బైటకు రాగానే ఎదురైన మనిషి ఒక్క రంగనాథమే? రంగనాథం వ్రాసి వుంటాడా? ప్చ్! అతనికి ఆ అవసరం కన్పించదు. మరెవరు వ్రాసారు?

ఆలోచనలతో పిచ్చెక్కినట్లయింది రాజారావుకు! అసహనంగా కళ్ళు మూసుకొని కణతలు నొక్కుకున్నాడు.

ఈ ఒక్క రోజుకే తనకు పిచ్చెక్కినట్లయింది. ఇంకెంత కాలం ఇలా చిత్రహింసను అనుభవించాలి! లాభంలేదు! ఎంతోకాలం తనీబాధ భరించలేడు. ఆ వ్యక్తి ఎవరైనా గాని వెతికి పట్టుకొని చిత్రహింసచేసి చంపాలి! అంత వరకు తనకు శాంతిలేదు.

ఆలోచిస్తూనే నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు రాజారావు.

2

రాజారావుకు మెలకువ వచ్చేసరికి బాగా తెల్లవారింది. క్రింద హాల్లో ఎవరివో మాటలు విన్పిస్తున్నాయి. సిగరెట్ వెల్గించి గది బయటకు వచ్చి ఆశ్చర్యపోయాడు.

సుధాకరం, రవి, ఆనంద్, హాల్లోవున్న టేబిలు దగ్గర కూర్చొని పేకాడుకుంటున్నారు.

"ఎప్పుడు వచ్చారు? ఏమిటి అందరూ ఒక్కసారిగా ఊడిపడ్డారు!" ఆశ్చర్యంగా అడిగాడు వాళ్ళ వైపు చూస్తూ.

రాజారావు మాటలు వినగానే అందరూ ఆశ్చర్య పోయారు.

"అదేమిట్రా! నువ్వేకదూ! వెంటనే ఒకసారి రమ్మని టెలిగ్రామ్ ఇచ్చింది!" అన్నాడు సుధాకరం.

"నేను టెలిగ్రామ్ ఇచ్చానా?" రాజారావు ఆశ్చర్య పడ్డాడు.

సుధాకరం, రాజారావు వైపు ఒకసారి అనుమానంగా, చూచి, "అయితే, ఈ టెలిగ్రామ్స్ ఇచ్చింది ఎవరంటావ్?" అడిగాడు టెలిగ్రామ్స్ చూపిస్తూ.

రాజారావు వాటివైపు చూచాడు.

"స్టార్ట్ ఇమ్మిడియట్లీ! వెరీ అర్జెంటు!" అని వుంది అన్నిట్లో!

రాజారావుకు అంతా అయోమయంగా వుంది. వాళ్ళకు తానెలాంటి టెలిగ్రాములు ఇవ్వలేదు. తనకింకా మతి స్థిమితం తప్పలేదు! తనివ్వలేదు! మరి వాళ్ళకు టెలిగ్రాములు ఎవరిచ్చారు? వాళ్ళ అడ్రస్సులు ఎవరికి తెలుసు? అనుమానంతో పాటు భయంకూడ పట్టుకుంది రాజారావుకు.

రాజారావు ముఖకవళికలు పరీక్షిస్తూ, "రాజా! ఏమిటిది? ఏం జరిగింది?" అడిగాడు ఆనంద్.

రాజారావు మొహం గంభీరంగా మారిపోయింది. ఒక్క నిముషం ఆలోచించి, ఏదో నిశ్చయానికి వచ్చాడు.

"ఏమీ లేదు. మీరు ఆడుతూ వుండండి. అయిదు నిముషాల్లో స్నానంచేసి వస్తాను!" అంటూ లోపలికి నడిచాడు.

వంట గదిలో సరస్వతి వంటచేస్తుంది. "మీ కోసం ఎవరో వచ్చారు! హాల్లో కూర్చోబెట్టాను!" అంది.

రాజారావు మాట్లాడలేదు. ఒక్కనిముషం సరస్వతి మొహంలోకి సూటిగా చూచి "సరేలే! అందరికి కాఫీలు పెట్టు!" అన్నాడు బాత్‌రూమ్ వైపు నడుస్తూ.

రాజారావు స్నానంచేసి హాల్లోకి వచ్చేసరికి, ఎవరికి వారే తీవ్రంగా ఆలోచిస్తూ కన్పించారు.

"ఏమిటి? విషయమేమిటో చెప్పు! ఈ సస్పెన్స్ భరించలేక పోతున్నాను!" అన్నాడు రవి, కుర్చీ దగ్గరగా లాక్కుంటూ.

రాజారావు సిగరెట్ కాలుస్తూ వాళ్ళ వైపొకసారి పరీక్షగా చూచి, "ఎవ్వరికి తెలియనిది, మన నల్గురికి మాత్రమే తెలిసిన విషయం ఒకటుంది. అదే! మనం మహాబలిపురంలో చేసిన ఘోరమైన పని. మనకు తెలిసినంత

వరకు అక్కడ మనల్ని ఎవ్వరూ చూడలేదు!" చెప్పడం ఆపి ఒక్క నిముషం ఊపిరి పీల్చుకున్నాడు.

ముగ్గురూ ఔనన్నట్లుగా తలలూపారు. ఆ ప్రసక్తి ఇప్పుడెందుకు వచ్చిందో ఎవరికీ అర్థంకాలేదు.

"కాని, మనమందరం అక్కడే పొరపడ్డాం. ఆ విషయం తెలిసిన వ్యక్తి ఇంకొకతను వున్నాడు, అతనెవ్వరో నాకు తెలియదు," అంటూ జరిగిందంతా విపులంగా చెప్పాడు. "ఈ పరిస్థితులలో ఏంచేయాలో నాకు అర్థంకావడం లేదు. సమయానికి మీరు కూడ వచ్చారు. మీరు ఇక్కడకు రావడానికి కూడ కారణం అతనే అయివుండాలి. ఈ విషయం గురించి బాగా ఆలోచించి మీ అభిప్రాయాలు చెప్పండి!" అన్నాడు రాజారావు చిన్నగా నిట్టూర్చి.

సుధాకరం ఒక్క నిముషం తీవ్రంగా ఆలోచించి, "నీ భార్యమీద నీకు అనుమానంగా వుందా?" అడిగాడు.

"అదీ అర్థంకావడం లేదు. ఉత్తరాల్లో దస్తూరి మాత్రం సరస్వతిదిలాగే వుంది. కాని ఆమెకు అవకాశం తక్కువ. ఆమెకు అంత తెలివి, ధైర్యం వుంటాయని నేననుకోను!" అన్నాడు రాజారావు.

"పోనీ! ఈ విషయం గురించి నీ భార్యను అడిగితే?" అన్నాడు ఆనంద్.

"వద్దు! అలా చేయటంవల్ల, నిజంగా ఒకవేళ ఆమెకేమీ తెలియకపోయినా, ఇప్పుడంతా తెలుస్తుంది. అది మంచిదికాదు!" అన్నాడు రాజారావు.

ఏంచేయాలో ఎవ్వరికి అర్థంకాలేదు. ఆలోచిస్తూ వుండిపోయారు.

రెండు నిముషాల తర్వాత సుధాకరం ఏదో నిశ్చయానికి వచ్చినట్లు తలపంకించి, రాజారావు వైపు తిరిగాడు.

"రాజా! నీ భార్యను పిలువ్! తమాషాగా ఆమెను కొన్ని ప్రశ్నలు వేస్తాను. మీరేమీ మాట్లాడవద్దు. భయ పడకు. అసలు విషయం బైటపెట్టనులే!" అన్నాడు సుధాకరం.

రాజారావు ఏదో అనబోయాడు.

"ఏమండీ! కాఫీ!" అంది సరస్వతి గుమ్మందగ్గర నిలబడి.

"రా, సరస్వతీ! లోపలికి తీసుకురా!" అన్నాడు రాజారావు.

సరస్వతి నెమ్మదిగా గదిలోకి వచ్చి కాఫీ ట్రే టేబిలు మీద పెట్టింది. అందరూ కాఫీలు తీసుకున్నారు.

"సరస్వతీ కాస్సేపు అలా కూర్చో! నీతో కొంచెం మాట్లాడాలి!" అన్నాడు రాజారావు.

సరస్వతి మాట్లాడకుండా కూర్చుంది.

"ఏమండీ! మీరెప్పుడైనా మహాబలిపురం వెళ్ళారా?" అడిగాడు సుధాకరం కాఫీ త్రాగి, సిగరెట్ వెలిగిస్తూ.

"ఎందుకు?" అడిగింది సరస్వతి చిన్నగా నవ్వి.

"ఏంలేదు! అందరం కలిసి మహాబలిపురం పిక్నిక్ వెళదామనుకుంటున్నాం. మీరింతకుముందు చూడలేదేమో! వస్తారేమో అని!" అన్నాడు సుధాకరం నెమ్మదిగా.

సరస్వతి చిన్నగా నవ్వి, "అవసరంలేదు. నేను మహా బలిపురం చూచాను. ఇప్పుడుకాదు. నాలుగు సంవత్సరాల క్రితం వెళ్ళాను. పిక్నిక్‌కు కాదు. మతి స్థిమితంలేని అక్కయ్యను వెదకటానికి."

అందరూ ఒక్కసారిగా గతుక్కుమన్నారు.

"అయితే! ఆ ఉత్తరాలు వ్రాసింది నువ్వేనా?" అడి గాడు రాజారాజా అనుమానంగా.

"అవును. నేనే వ్రాసాను? ఏం? నాకింత ధైర్యం ఎక్కడిదా అని ఆశ్చర్యపోతున్నారా? మీ అందరికంటె

తెగించినదాన్ని నేను.

నేనంతగా ప్రేమించిన మా అక్కయ్య మతిస్థిమితం తప్పి తిరుగుతుంటే, మీరు నల్గురూ కలిసి దాన్ని నాశనం చేసి, దాని చావుకు కారణమయ్యారు. మీ దురాగతం కళ్ళారా చూశాను. ఆనాడే శపథం చేసాను మిమ్మల్ని చంపాలని!

అందుకే ప్లాన్ వేసి, రాజారావు భార్యగా రెండు నెలల క్రితం ఈ ఇంటికి వచ్చాను. మీ నల్గురిని కలిపి చంపాలనే, మీ ముగ్గురికి టెలిగ్రాములు ఇచ్చాను. ఇన్నాళ్ళకు నా కసి తీరబోతుంది!'' వికటంగా నవ్వింది సరస్వతి.

సుధాకరం పెద్దగా నవ్వి, ''నువ్వొక్కదానివి, మేం నల్గురం! మమ్మల్నేం చేయగలవు?'' వెక్కిరింపుగా అడిగాడు.

సరస్వతి చిన్నగా నవ్వి, ''అటు చూడండి'' అంది ఆనంద్ వైపు చూపిస్తూ.

అందరూ అటువైపు తిరిగారు. ఆనంద్ తల టేబిల్ మీదకు వాలిపోయింది. అతనిలో చలనం కన్పించలేదు.

''అంటే!'' అనుమానంగా అడిగాడు రాజారావు.

''అవును! కాఫీలో విషం కలిపి ఇచ్చాను. ఇంక కొద్ది సేపట్లో మీరందరూ చచ్చిపోతారు! ఈ కొద్దిసేపట్లో అయినా, మీరుచేసిన ఘోర పాపానికి పశ్చాత్తాప పడండి! మీ అందరి చావు ఇలా, ఇక్కడ రాసి వుంది! గుడ్ బై!'' అంది సరస్వతి ఫోన్ దగ్గరకు నడుస్తూ.

మూతలు పడుతున్న కను కొలకుల్లోంచి, ఓరగా చూచారు సరస్వతివైపు. ఫోన్‌లో పోలీస్ ఇన్‌స్పెక్టర్‌తో ఏదో చెప్పటం వినిపించింది. అంతే! అందరి కళ్ళు మూతలు పడ్డాయి.

★★★

కొత్త పిట్ట!

కంచర్ల రమణ

ఫొటోలు తీయడం నా వృత్తి. అయితే, రకరకాల పక్షుల్ని పరిశీలించడం నా హాబీ.

విశాఖపట్నం మెయిన్ రోడ్డులో నాకో ఫొటో స్టుడియో వుంది. అంతేకాదు. అందమైన ఆడవాళ్ళని నగ్నంగా ఫొటోతీసి, 'రంభ' అనే బొమ్మల పత్రికకు పంపుతూంటాను ప్రచురణకు.

అందమైన ఆడవాళ్ళను సంపాయించడం, వాళ్ళని నగ్నంగా ఫొటో తియ్యడం అంతా నాదే బాధ్యత. అమ్మాయిల్ని సంపాయించేందుకు అయ్యే ఖర్చులు పోను, ఫొటోకి మూడొందలిస్తుంది పత్రిక. నా ముఖ్య సంపాదన అదే.

గత రెండేళ్ళబట్టి, 'రంభ' పత్రికలో పనిజేస్తున్నాను. నెలకు అయిదొందలు కాపీలు అమ్ముడు పోని పత్రిక, ఇప్పుడు ఇరవైనాలుగు వేలు పోతోంది.

పత్రిక అమ్మకాలకు నా ప్రజ్ఞాపాటవాలు చాలామట్టుకు కారణమైనా, ఆ పత్రిక సంపాదకుడు తక్కువ వాడేం కాడు. చాలా గట్టి పిండం. ఫొటో బాగోకపోయినా, నా ఫొటోలో అమ్మాయి బాగోకపోయినా, ఆ ఫొటోలు తిరగ్గొట్టి, వాటితోపాటుగా, నా ఫొటోల్ని యేకుతూ ఓ ఉత్తరం కూడా రాస్తాడు.

అలాంటి లేఖలు వచ్చినప్పుడల్లా, నాకు చిర్రెత్తుకొస్తుంది. కొంతకాలం ఫొటోలుతీసి పంపడం మానేస్తాను. పక్షుల్ని పరిశీలించడానికి, ఏ తోటలోకో వెళ్ళిపోతాను.

గత వారం, పైె చెప్పినటువంటి లేఖ ఒకటి వచ్చింది సంపాదకుడి వద్దనుంచి.

వెంటనే ఫొటో స్టుడియో మూసేసి, కెమేరా భుజాన్నేసుకుని, పెద్ద సూట్‌కేసులో నాలుగు రోజులకు సరిపడా గుడ్డలూ వగైరా సామానులు పడేసుకుని, చింతపల్లి వచ్చిపడ్డాను.

చింతపల్లికి బాగా దూరంగా, ఓ కొండమీద చిన్న బంగ్లా వుంది. ఏ లక్ష్మీపుత్రుడు దాన్ని కట్టించారో యేమోగాని, క్రితంసారి వచ్చినపుడు, ఆ బంగ్లా వాచ్‌మెన్ అయిన దుశ్శాసన్ అనే కొండవాడ్ని మచ్చిక చేసుకొన్నాను.

ఈసారి కూడా అక్కడికే వెళ్ళాను.

వెనుకా, ముందూ వరండాలు, శీతాకాలంలో వాడుకోవడానికి ఓ ఫైర్ ప్లేసూ ఉన్న ఆ నాలుగు గదుల

బంగ్లా ఎంతో నచ్చింది నాకు. నాకే బాగా డబ్బుంటే, చింతపల్లిలోనో, అరుకులోనో, అటువంటి బంగ్లా కట్టించుకోవాలన్న కోరిక, ఆ బంగ్లా చూసాకనే కలిగింది నాకు.

నా ఒంటరితనంతో నాకు విసుగనిపిస్తే తప్ప, నేను వూళ్ళోకి వెళ్ళక్కర్లేదు. మరీ అంత రుచికరంగా కాకపోయినా, తినేందుకు వెగటు కలగకుండా వండుతాడు దుశ్శాసన్ యే పదార్థమైనా.

ఆవాళ మధ్యాహ్నం రెండుగంటలకల్లా బంగ్లా చేరుకున్నా నేను, దుశ్శాసన్ నా కోసం బంగ్లా తెరవగానే, పడకగదిలో నా బెడ్డింగ్ పడుచుకుని పడుకున్నాను.

సరిగ్గా సాయంకాలం అయిదు కావస్తుండగా, మెలకువ వచ్చింది నాకు. ముఖం కడుక్కుని, భుజాన్ని కెమెరా, బైనాక్యులర్స్ తగిలించుకుని, బంగ్లా బయటకొచ్చాను.

బంగ్లా కివతల కొంతమేర ఓ మైదానం వుంది. మైదానానికి అవతల ఓ యేరు వుంది. యేటి కవతల దట్టమైన అడివి. ఆ అడివికి అంతులేదుట. దుశ్శాసన్ చెప్పాడు చాలాసార్లు.

పట్నాల్లోకన్నా, పల్లెపట్టుల్లో విస్తారంగా పక్షులు అవుపిస్తాయి. అయినా, పల్లెల్లో అవుపించే పిట్టలు చాలా మట్టుకు మనకు తెలిసినవే.

కాని, కొత్త రకాల్ని చూడాలంటే, అడవులకు పోవాల్సిందే. కొత్తజాతి పక్షిని చూసినప్పుడల్లా నా ఆనందానికి అవధులుండవు. నాకు అదో గొప్ప అనుభూతి.

మైదానం దాటి యేటికి అవతల వెళ్ళాను. బైనాక్యులర్స్ తీసాను. అద్దాల్ని రుమాలుతో గట్టిగా రుద్ది శుభ్రం చేసాను. మెల్లగా యెత్తి, కళ్ళదగ్గర ఉంచుకుని, నా ప్రియతమ పక్షిరాజాల గురించి వెదకనారంభించాను.

పెద్దగా అవుపిస్తున్న చెట్లకొమ్మలు, వాటిపన్న ఆకుల మధ్య విశ్రాంతిగా కూచున్న ఒకటి రెండు పక్షులు అవుపించాయి. అయితే అవి నాకు బాగా తెలిసినవే. చిలకలు, మైనగోరలు.

ఇంకా ముందుకు నడిచాను అడివిలోకి.

మామూలుగా చూసేదానికన్నా, బైన్యాకులర్స్‌లోంచి అవుపించే ప్రకృతి దృశ్యం ఎంతో అద్భుతంగా, అపూర్వంగా ఉంటుంది.

ప్రతి కొమ్మనీ, ప్రతి రెమ్మనీ, ప్రతి ఆకుల జంటనీ ఆసక్తిగా పరిశీలిస్తున్నాను బైనాకులర్స్‌లోంచి, కొత్త రకం పక్షులు అవుపిస్తాయేమోనని.

నా దృష్టిని ఆకట్టుకుంటూ, ఓ కొమ్మమీద యేదో కదులుతున్నట్టు అవుపించింది.

పక్షుల విషయం మర్చిపోయి, నా చూపు నాకట్టుకొన్న దానిమీద నిలిపాను బైనాక్యులర్స్‌ను.

అది ఓ పురుగు. గోధుమ రంగులో ఉంది. గొంగళీ మాదిరిగా, కణుపులుగా, కణుపులమీద చిన్న కొసలతో ఉంది.

దాని కదలిక ఎంతో నింపుగా, కష్టపడి చేస్తున్నట్టుగా అవుపించింది.

కారణం?

నా చూపు నిదానించాను.

ఆ క్షణం వరకూ అగపడలేదుగాని, ఆ పురుగుకి ఎర్ర చీమలు పట్టి ఉన్నాయి. కాళ్ళదగ్గర, మూతి దగ్గర, తోక దగ్గర చీమలు గట్టిగా కరచి పట్టుకుని ఉన్నాయి.

వాటిని వదిలించుకోవడానికి వృథా ప్రయత్నం చేస్తోంది పురుగు.

అది కదిలే తీరు చూస్తుంటే, యింకో అయిదు నిముషాల్లో చచ్చేటట్టుగా ఉంది. చస్తే, దాన్ని ఎత్తుకుపోయి, చీమలు విందు చేసుకొంటాయి కాబోలు.

అది ఒట్టి పురుగే అయినప్పటికీ, అది పడే చావు బాధ వ్యక్తం కావడానికి, దానికో మొహంలాంటిది లేకపోయినప్పటికీ, దాని ప్రతి కదలికలోనూ, అది పడే యాతన స్పష్టంగా అవుపిస్తోంది నాకు.

క్షణక్షణానికీ, పురుగులో చైతన్యం మందగిస్తోంది.

కొద్దిక్షణాలు గడిచాయి.

పురుగులో కదలిక నిలిచిపోయింది.

అంటే, అది చచ్చిపోయిందన్నమాట!

టక్కున, కొమ్మమీంచి జారి నేలమీద పడింది పురుగు, పురుగుతోబాటు దాన్ని కరిచి పట్టుకొన్న చీమలు.

వెల్లకిలా పడ్డ పురుగును చూసాకగాని, చీమలెలా దాన్ని అన్నివైపులా చుట్టుముట్టి కరచి చంపాయో, నాకు తెలియలేదు.

పురుగు చనిపోయిందని చీమలు అర్థం చేసుకొన్నట్టున్నాయి, దాన్ని గొరగొరా ఎటో యీడ్చుకుపోవడం మొదలుపెట్టాయి.

పురుగుమీది నా ఆసక్తి తరగిపోయింది.

నా బైనాక్యులర్స్ యింకో దిక్కుకు మళ్ళిద్దామనుకుంటుంటే, నా ఊహల్ని తారుమారు చేసి, నన్ను ఆశ్చర్య చకితుడ్ని చేసే సంఘటనొకటి జరిగింది.

ఎక్కడ్నించో ఓ పిచ్చుక యెగిరొచ్చింది. టక్కున పురుగుని ముక్కున కరచుకుని, ఎలా వచ్చిందో అలాగే మెరపులా ఎగిరి వెళ్ళిపోయింది.

ఎంత తమాషా అయిన మలుపు ఒక్క క్షణంలో!

చీమలకు విందు అవుతుందనుకున్న పురుగు పిచ్చుకకు ఫలహారమైంది.

అప్పటికి బాగా సాయంకాలమైంది. పక్షుల పరిశీలన కట్టిపెట్టి, బంగ్లాకు మరలాను.

2

రెండు ఆమ్లెట్‌లు, బ్రెడ్ జాం, గ్లాసునిండా స్ట్రాంగ్ కాఫీతో బ్రేక్‌ఫాస్ట్ ముగించి, మరి రెండు కప్పుల కాఫీ ఫ్లాస్క్‌లో పోయించుకుని, ప్రియురాల్ని కలుసుకోవడానికి బయలుదేరి వెళ్ళే ప్రియుడిలా, ఆరాటంగా, తపనగా అడివిలో పడ్డాను.

అప్పుడే సూర్యుడు ఆకాశంలో లేస్తున్నాడు. వాతావరణం చిరు చలిగా ఉంది.

ఉత్సాహం పరవళ్ళు తొక్కుతోంది ఒంట్లో.

కళ్ళకు బైనాక్యులర్స్ ఆనించుకుని, చెట్ల కొమ్మల మీద, ఆకుల సందుల్లోనూ పక్షులకోసం వెతకడం ఆరంభించాను.

ఉదయం వేళ కాబట్టి, అడవిలో పక్షులకు కొదవలేదు. కోకొల్లలు! కొమ్మలమీద కూచుని కిచకిచలాడుతూ, ఎగురుతూ, వింతగా కేకలుపెడుతూ ఉన్నాయి పిట్టలు. అయితే, అవన్నీ, నే నెన్నోసార్లు పరిశీలించి వదిలేసినవి.

కాని నాకు కావలసింది కొత్త పిట్టలు.

ఆసక్తిగా కొమ్మకొమ్మను వెతకసాగాను.

హఠాత్తుగా నా కళ్ళు జిగేల్‌మన్నాయి.

కారణం?

ఒక కొమ్మమీద, నే నెన్నడూ చూడని ఓ రంగు రంగుల పక్షి ఉంది. దాని ముక్కు, కళ్ళు కాకి మాదిరిగా

ఉన్నా, ఒంటి రంగుమాత్రం నల్లగా గాకుండా, నీలంగా ఉంది. గుండె భాగం అంతా మట్టిరంగులో ఉంది. భుజాలకు తగిలించుకున్న భుజకీర్తుల్లా, పసుపురంగులో చిన్న ఫించాలు, రెక్కలు ఆరంభమయ్యే చోట, ఉన్నాయి.

దాని అందం అంతా దాని తోకలో ఉందని అనిపించింది నాకు. ఎందుకంటే, దాని తోక ఇంకా అందంగా ఉంది.

పిట్టంతా కలిపి, జానెడున్నర ఉంటే, తోక ఒకటీ మూరెడు ఉంది. తోకంటే, రెండు వ్రేళ్ళ వెడల్పున ఉన్న రెండేరెండు పొడుగాటి ఈకలు; వాటి ప్రక్కన సన్నని కుంచెల్లాంటి అంతే పొడుగున్న మరి రెండు ఈకలు.

ఆ పక్షి అలా కాసేపు కూచుని, రెక్కలల్లాడించి ఎగిరింది.

ఎగిరిన ఆ పక్షి యింకా అందంగా, అద్భుతంగా, అపూర్వంగా అవుపించింది.

దాని వెనుక పరుగెత్తడం ఆరంభించాను. దాన్నొకటి నేను పట్టుకోగలిగితే?...దాని ఫొటోలు రంగుల్లో తీసి విదేశ పత్రికలకు అమ్మితే?...ఎన్నో ఆశలు...ఊహలు... ఉద్దేశాలు... కెరటాల్లా లేస్తున్నాయి నా మనసులో.

అలా యెంతదూరం పరుగెత్తానో నాకే తెలీదు.

దట్టంగా, గుబురుగా వున్న చెట్లనుబట్టి, అంతటా పరచుకొన్న కొమ్మల నీడలవల్ల యేర్పడ్డ చీకటిబట్టి, నేను వచ్చింది నట్టడివికి అని అర్థం చేసుకొన్నాను.

ఎందుకో గుండెల్లో గుబులు పుట్టింది. అయినా, కొత్త పక్షిని చూసానన్న సంతోషం నన్ను ఆ ఫీలింగుని నిర్లక్ష్యం చేసేలా చేసింద.

ఆ పక్షి చివరకు ఓ చెట్టుమీదకు వచ్చి వాలింది.

ఆ చెట్టుమీదొక గూడుంది. నిశ్శబ్దంగా, ఆ పిట్ట, గూడుకు దగ్గరగా వెళ్ళింది.

ఆ క్షణంవరకూ, ఆ గూడు దానిదే అనుకున్నాను. కాని అది దానిది కాదు.

చటుక్కున అది గూడులోకి ముక్కు పెట్టి, లోపలినించి ఓ గుడ్డుని బయటికి తెచ్చి, వెంటనే అక్కడ్నించి యెగిరి పోయింది.

మళ్ళీ దాని వెంట పరుగెత్తాను.

కొద్దిదూరం పోయాక, ఓ పెద్ద రాతిబండమీద వాలిందా పక్షి. నోటిలోని గుడ్డుని రాతిమీద ఉంచింది. టక్కున ముక్కుతో గుడ్డుని పొడిచింది. గుడ్డు పగిలి, సొన బయటపడింది. క్షణాలమీద ఆ సొనంతా నోట్లోకి పీల్చుకోనసాగింది.

మిగతా పక్షిగుడ్లు దీనికి ఆహారమన్నమాట!

క్షణంసేపు ఆ పక్షిమీద ఏహ్యత కలిగింది. కాని, దాని అందం, ఆ భావాన్ని తొలగించేసింది.

వెంటనే నా కెమేరా అందుకుని, మంచి యేంగిల్ చూసి, దాని సౌందర్యమంతా నా ఫొటోలోకి వచ్చేలా సెట్ చేసాను. ఇహ, క్లిక్ చెయ్యడమొక్కటే మిగిలింది.

అదే సమయంలో, ఆ పిట్ట, ఎవరో రాయి విసిరి అదిలించినట్టు, రాతిబండమీంచి లేచి, యెగురుకుంటూ పోసాగింది.

నిరాశతో క్రుంగిపోతున్న మనస్సుతో, ఆ పక్షి యెగిరి వెళ్తున్న దిక్కుకి కెమెరా చేతపట్టుకుని మళ్ళీ పరుగెత్తడం ఆరంభించాను.

ఈసారి ఆ పక్షి మధ్యలో యెక్కడా ఆగకుండా, ఏకబిగిన ఎగురుకుంటూ పోసాగింది.

నా కాళ్ళకు నిజంగా అది గొప్ప పరీక్షాసమయం! కాళ్ళు పీకేస్తున్నా, పిక్కలు రాళ్ళల్లా అయిపోయి సలుపు పెడుతున్నా, మళ్ళీ కనిపిస్తుందో, లేదో ననే ఆత్రుతతో ఆ పక్షిని వెంటాడసాగాను.

అరగంటకు పైగా పరుగులు పెట్టాను.

ఎంతదూరం వెళ్ళానో యేమో?

ఉన్నట్టుండి ఆ పక్షి జాడ కన్పించలేదు. ఏమైందది?

బైనాక్యులర్స్ కళ్ళకు తగిలించుకుని, నాలుగువైపులా జాగ్రత్తగా చూసాను. అయినా ఆ పక్షి కన్పించలేదు.

ఇంత శ్రమా వృథా కావల్సిందేనా?

నాకు పిచ్చెత్తినట్టయింది.

ఆ పిట్ట అక్కడెక్కడో వుండి తీరాలి. వెతికితే, కనిపించకపోదు.

పట్టుదలతో వెతక నారంభించాను.

నిముషాలు దొర్లిపోతున్నాయి. పక్షి, ఎవరో మంత్రించినట్లు ఒక్కసారిగా మాయమైంది.

కాస్త యెగువకు వెళ్ళాను. నేను యిప్పుడు ఉన్నది బాగా యెత్తైన ప్రదేశం. అక్కడ్నించి అంతా దిగుచోటు. ఇంచుమించు వందగజాల మేర, నా దృక్పథంలో ఉంది.

ఆ ప్రాంతం అంతా ఒక్కో అంగుళం వెతక నారంభించాను.

నాకు ఎదురుగా అవుపించే, మామిడిచెట్ల వరుసకు అవతల చిన్న యేరు ఉంది. ఆ యేటి నీరు ఓ చోట నిలిచి, చిన్న చెరువులా ఉంది.

ఆ చెరువులో యెవరో మనిషి ఉన్నట్టు అవుపించింది.

బైనాక్యులర్స్ నిలిపి చూసాను, ఆ మనిషెవరో తెలుసుకుందామని.

ఆ మనిషి చెరువులో స్నానం చేస్తున్నాడు.

కాస్త మేర ముందుకు వెళ్ళి,ఒక రాతిబండమీంచి, తదేకంగా చూడసాగాను.

ఆ మనిషి రూపం యిప్పుడు స్పష్టంగా అవుపిస్తోంది.

ఆ మనిషి ఓ కొండ యువతి. సుమారు పాతిక సంవత్సరాలుంటాయి, ఒళ్ళు రాగి రంగులో వుంది.

చేతులతో నీళ్ళు ఎత్తి, ఒంటిమీద జల్లుకుంటుంటే ఏపుగా, బలిష్ఠంగా ఎదిగిన, గుండ్రని కండల్లాంటి ఆమె స్తనాలు తమాషాగా అదిరిపడ్తున్నాయి.

పచ్చని అడవిచెట్ల మధ్యన, యేటి నీటిలో స్నానం చేస్తున్న ఆమెను అలా చూస్తుంటే, విచిత్రమైన అనుభూతి కలుగుతుంది నాకు.

పక్షి కనిపించలేదన్న దిగులు యెగిరిపోయింది. అసలు ఆ పక్షి విషయమే మర్చిపోయాను.

ఆ కొండ యువతిని చూస్తుంటే, ఏవేవో ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి.

'రంభ' పత్రిక సంపాదకులు నా ఫోటోలు తిరగగొట్టడం, కొత్త తరహా, వెరైటీగా ఉన్న అమ్మాయిల ఫోటోలు అడగడం గుర్తొచ్చింది.

ఇన్నాళ్ళూ, లాడ్జీ అమ్మాయిల్నో, మోడల్స్‌నో, డబ్బుకు కక్కుర్తి పడి,తమ శరీరాల్ని రహస్యంగా ఫోటో వెయ్యడానికి అంగీకరించే ఆడవాళ్ళనో, కృత్రిమమైన బేక్‌గ్రౌండ్ పెట్టి, ఫోటోలు తీసేవాడ్ని.

సహజమైన వాతావరణంలో సహజంగా అంటే,

యేలాంటి మేకప్పూ లేకుండా ఉన్న నగ్న సుందరుల్ని ఎన్నడూ నేను చూళ్లేదు, ఫొటోలు తీయలేదు.

కొండయువతి జలకాలాడుతున్న ఆ దృశ్యం నాకో కొత్త లోకానికి తలుపులు తీసినట్టయింది.

ఆ యువతి ఫొటోలు తీసి 'రంభ' పత్రికకు పంపడానికి నిశ్చయించుకున్నాను ఆ క్షణంలో.

ఆ ఆలోచన కలగ్గానే, ఆమె వెంటనే స్నానంచేసి వెళ్ళిపోతుందేమోనన్న భయం కూడా పట్టుకుంది నాలో.

క్షణం ఆలస్యం చేయకుండా యేరుని సమీపించాను.

ఆమె నన్ను గమనించలేదు. స్నానం చెయ్యడంలో నిమగ్నమై ఉంది.

ఏటి ఒడ్డున, ముఖ్యంగా ఆమె స్నానంచేసే ప్రదేశానికి దగ్గరగా, తుప్పలు, బండలు చాలా వున్నాయి. నా పనికోసం, వాటిలో కొన్నింటిని ఆశ్రయించాను.

ఆమె నిజంగానే చాలా అందంగా ఉంది. అందంగా, ఆరోగ్యంతో మెరుస్తోంది ఆమె ఒళ్ళు. ఆమె రూపు రేఖలు ప్రత్యేకంగా వుండి, ఎంతో ఆకర్షణ ఉట్టిపడుతోంది ఆమెలో.

కెమేరా సెట్ చేసి జాగ్రత్తగా పట్టుకున్నాను.

ఆమె మెడ వెనక్కి విరిచి, చేతులతో నీళ్లెత్తి భుజాల మీద జల్లుకుంటుండగా, రెండు స్నాప్స్ లాగాను.

స్నానంచేస్తూ, మధ్యలో దోసిట్లోకి నీళ్ళు తీసుకుని తాగింది.

అప్పుడు సైడు ఫోజులో తీసిన రెండు స్నాప్స్‌తో, చేతులకూ, నడుంకీ మధ్య తమాషాగా పొడుచుకు వచ్చినట్టు అవుపించే కుడి రొమ్ము మాంచి సెక్సీగా అవుపిస్తూ ఉండాలి.

ఇంకొద్ది నిముషాల్లో ఆమె స్నానం పూర్తి చేసి ఒడ్డుకి వచ్చింది. సమయం కనిపెట్టి, యింకో చోటుకు మారాను, ఆమెకు బాగా చేరువలో ఉండేలా చూసుకున్నాను.

వంగి, ఒడ్డున విడిచిన తన బట్టలు అందుకుంటుంటే ఆమె ముందరిభాగం అంతా స్పష్టంగా అవుపించేలా రెండు స్నాప్స్, ఆమె బట్టలు కట్టుకుంటూండగా ఇంకో రెండు స్నాప్స్ లాగాను.

చింతపల్లికి కాలక్షేపం కోసం వచ్చిన నా ప్రయాణమిలా లాభించే వ్యవహారంగా మారినందుకు, నా హృదయం ఆనందంతో గంతులేసింది.

నన్ను ఏమార్చి పారిపోయిన పక్షి గురించి ఇప్పుడు పూర్తిగా మర్చిపోయాను.

కెమేరాను ముడిచేసి, ఉత్సాహంగా వెనుదిరిగి, బంగ్లాకు బయలుదేరాను.

నాలుగు గజాల దూరం వెళ్ళానో లేదో, రివ్వుమంటూ వచ్చి, నా జబ్బలో బలంగా ఏదో గుచ్చుకుంది.

“అమ్మా!” అంటూ పెద్ద కేకపెట్టి నేలమీద పడిపోయాను, జబ్బ పట్టుకుని.

అంతే నాకు గుర్తుంది. ఆ తరువాత నాకు స్పృహ పోయింది.

3

నాకు తిరిగి స్పృహ వచ్చేసరికి, నేను చింతపల్లి ఆస్పత్రిలో ఉన్నట్టుగా, నా బెడ్ తీరునిబట్టి, ఆస్పత్రి వాసనబట్టి, యూనిఫాంలో నా ముందర తిరుగుతున్న నర్సుల్ని బట్టి పోల్చుకున్నాను.

“ఏం జరిగింది?... నేనెందుకిలా యిక్కడున్నాను?” అన్నాను నా బెడ్ ప్రక్కన నిల్చున్న నర్సుతో.

ఆమె మాటాడలేదు. మాటాడవద్దని సైగ చేసింది.

"సార్! మీరు చాలా నీరసంగా ఉన్నారు. మాట్లాడకండి" అన్నాడు దుశ్శాసన్—అంతవరకూ నా వెనుక నిలుచున్నాడు కాబోలు—నా యెదురుగా వచ్చి.

ఇంజక్షన్ యిచ్చి నర్సు వెళ్ళిపోయింది.

"ఒరే ఫూల్!... చెప్పు! నేనెందుకిలా యిక్కడున్నాను?" ఆవేశంగా అన్నాను.

"ఆవేశపడకండి సార్! శాంతంగా వుండండి" అన్నాడు దుశ్శాసన్. చేరువగా వచ్చి.

"అయితే కారణం చెప్పు. నేనెందుకిక్కడున్నాను."

"మీరెందుకెళ్ళారు అడివికి?"

"పిట్లల్ని ఫొటోలు తీయడానికి."

"అయితే మీరేం చేసారు?"

"స్నానం చేస్తున్న కొండ యువతి ఫొటోలు తీసాను."

"అదే మీ ప్రాణంమీదకు తెచ్చింది."

"అంటే?"

"ఆ కొండ యువతి అందాన్ని చాటునించి చూస్తున్న ఆమె ప్రియుడు కూడా మీకు సమీపంలోనే వున్నాడు. మీరేం చేస్తున్నారో చూసాడు. అయితే, వాడికేమీ అర్థంకాలేదు. కాని, మీ రామెను చూపులతో తడిమి చూస్తుండడం వాడికి ఆగ్రహం తెప్పించింది. మిమ్మల్ని బాణంతో కొట్టాడు. ఆ పిల్ల వూరు, మా అత్తవారి ఊరు ఒక్కటే. ఆ పిల్ల గోలపెట్టుకుంటూ వచ్చి, తల్లిదండ్రులతో చెప్పింది జరిగిందంతా. మధ్యాహ్నం మా అత్తవారి వూరికి వెళ్ళిన నేను పరిస్థితి అర్థంచేసుకొన్నాను. వెంటనే పరుగెత్తుకొచ్చి, మిమ్మల్ని ఇక్కడకు చేర్చాను. ఏమైనా, మీరు బ్రతికేరు," చెప్పాడు దుశ్శాసన్.

ఆదే సమయంలో ఆస్పత్రి డాక్టరు అక్కడకు వచ్చాడు.

"కంగ్రాచ్యులేషన్స్! మొత్తంమీద పెద్ద గండం గడిచింది."

"అంత ప్రమాదమా డాక్టర్?" అన్నాను.

"ప్రమాదమా! ఇంకో అరగంట ఆలస్యం అయివుంటే, మీ ప్రాణాలే పోయి వుండేవి. మీ దుశ్శాసన్ మిమ్మల్ని యిక్కడకు తీసుకొచ్చేసరికి, మీ ఒంట్లో చాలా రక్తం కారిపోయి, విషం బాగా ప్రాకిపోయింది. మిమ్మల్ని బ్రతికించుకోవడానికి, వెంటనే ఆపరేషన్ చేసి, మీ కుడి చెయ్యి తీసేయాల్సి వచ్చింది."

"ఆఁ..." నా నెత్తిమీద బాంబు పేలినట్టు ఫీలయ్యాను. నా కుడిచెయ్యి...తీసేసారా? నా యెడమ చెయ్యితో కుడిచెయ్యి వైపు తడిమాను.

బేండేజ్‌తో కట్టిన మొండి చెయ్యి తగిలింది నా చెయ్యికి. నా గుండెల్లో దుఃఖం కెరటంలా లేస్తోంది.

"థేంక్ హెవెన్ మైడియర్ ఫ్రెండ్. చెయ్యి పోయినా మీరు బ్రతికారు" అన్నాడు డాక్టరు నా చెంపలమీంచి కన్నీరు తుడిచి.

ఆ వింతపక్షి నా కళ్ళముందు ఆడుతోంది. స్నానం చేస్తున్న ఆ యువతి రూపం నా మనోనేత్రం ముందు అగపడుతోంది.

కుడిచెయ్యిలేని నా రూపం నా కళ్ళముందు ఆడింది. దుఃఖం ఉప్పెనలా పొంగింది నా గుండెల్లో.

లోకం యేమనుకుంటుందో ఆలోచించకుండా, ఏడవ సాగాను గట్టిగా బయటికి.

★★★

రక్తం లేని శవాలు??

కె. చందర్‌రావ్

ఆబిడ్స్ బస్సు స్టాండులో నిల్చున్న ఆ యువకుడి వైపు తదేకంగా చూస్తూ కొంచెం దూరంలో నిల్చున్నది ఒక యువతి. చేతిలో మనీ పర్సు పట్టుకొని అతనివైపే చూస్తున్నది.

అతడు అనుకోకుండా ఇటు తిరిగి ఆమె చూపులో చూపు కలిపాడు. అలా ఒక్క క్షణం చూసి ఆమె ఏమయినా అనుకుంటుందేమోనని వెంటనే చూపు మరల్చుకున్నాడు.

అతని మనస్సు ఉత్సాహంతో ఉరకలు వేసింది. బ్యూటీ క్వీన్ అనుకున్నాడు. మెల్లగా ఓర చూపుతో మళ్ళీ చూశాడు. ఆమె అందాన్ని త్రాగెయ్యాలనిపించింది.

ఆమె తనను చూసి చిన్నగా నవ్వినట్లు గమనించాడు. అయిదునిమిషాలు తరువాత ఆమె పరిచయస్తురాలిలాగా అతని ప్రక్కకు వచ్చి నిలబడింది.

"ఎంతవరకు వెళ్తున్నారు మిస్టర్ శేఖర్," అడిగింది ఆ యువతి.

ఆ యువకుడు వులిక్కిపడ్డాడు.

"ఆ... రాణీగంజీకి. మీకు నా పేరెలా తెల్సు" అన్నాడు ఏమనాలో అర్థంకాక.

"రెండు రోజులనుండి గమనిస్తున్నాను ఆ మాత్రం మీ పేరు తెలియదా?" అని క్షణం ఆగి "నేనూ అటే వెళ్తున్నాను. బస్సు రావడానికి ఆలస్యం కావచ్చు. రండి అలా వెళ్ళి కాఫీ త్రాగి వద్దాం!" అన్నది.

ఇంత మంచి ఛాన్సు కల్పించినందుకు భగవంతుడ్ని అభినందించకుండా వుండలేకపోయాడు. ఆలోచనలలో పడి ఆమెవెంట నడుస్తున్న విషయం ఆమె శరీరం అతనికి తగిలిన తరువాతగాని గుర్తుకు రాలేదు.

'అబ్బ! ఎంత మెత్తటి స్పర్శ. ఈవిడ అదే బాపతు సరుకు అయివుంటుంది. కాకపోతే మరి ఇంత బరితెగించి తనకుతాను పరిచయం చేసుకునే ఆడవాళ్లు ఎవరుంటారు. ఎవడ్నో ఒకడ్ని వలలో వేసుకుని రాత్రంతా వాడితో గడిపి వాళ్ళిచ్చింది పుచ్చుకుని పోతుంటారు' ఆలోచిస్తూండగానే తాజ్ మహల్ హోటల్ వచ్చింది.

ఇద్దరు ఫ్యామిలీ రూంలోకెళ్ళి టిఫిన్ చేశారు. టిఫిన్ చేస్తున్నంతసేపు పిచ్చాపాటి సినిమాలు గురించి చర్చించుకుంటున్నారు. కాఫీ త్రాగి సర్వర్ తెచ్చిన బిల్లు ప్లేటులో అతడు వద్దంటూ వారించిన కూడా ఆమె ఆ ప్లేటులో పది రూపాయల నోటు పడవేసి, బయటకు నడిచింది.

"మా యింటికి వెళ్దాం," అన్నాడు ఆమె ఏమను కుంటుందోనని ఒకవైపు భయపడుతూ.

"దానికేముంది అలాగే..." అంటూండగానే ఆమె ముందు ఒక నల్లటి అంబాసిడర్ కారొకటి వచ్చి ఆగింది.

"ఇది మా కారు. రండి ఇందులో వెళ్దాం. నాకోసం వచ్చి, బస్సు స్టాండులో నేను కనబడక పోయేసరికి తిరిగి ఇంటికి వెళ్తున్నట్లున్నాడు డ్రైవరు. అతడు మనల్ని మీ ఇంటిదగ్గర డ్రాప్ చేసి వెళ్తాడు" అంటూ బ్యాక్ డోరు తెరచి వెనుకసీట్లో కూర్చుంది. ఆమె ప్రక్కనే అతడు కూడా కూర్చున్నాడు.

"డ్రైవర్ మమ్మల్ని రాణీగంజిలో డ్రాప్ చేసి నీవు ఇంటికి వెళ్ళు. నేను మా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళానని అమ్మతో చెప్పు" అన్నది.

డ్రైవరు తల ఊపి కారు స్టార్టు చేశాడు. కారు స్పీడుగా లిబర్టీ వైపుకు దూసుకు పోతున్నది.

ఇంతలో డ్రైవర్ సడన్‌గా బ్రేకు వేశాడు. వెనుక సీట్లో వున్న శేఖర్ తూలిపడి ముందుసీటుకి తల కొట్టు కున్నాడు.

ప్రక్కనున్న ఆ యువతి "అరే" అంటూ అతని భుజాలు పట్టుకొని పైకి లేపుతున్నట్లే నటిస్తూ, చేతిలో వున్న కర్చీఫ్‌ను అతడి ముక్కుదగ్గర గట్టిగా అదిమి పట్టింది. ఒక్క క్షణంసేపు క్లోరోఫాం శ్వాసను పీల్చి స్పృహ తప్పి పడిపోయాడు శేఖర్ ఆమె ఒడిలో.

"ఖాన్ తొందరగా పోనియ్. స్పృహ వస్తే కొంప లంటుకుంటాయి" అన్నది తొందరగా.

రాణీగంజి వెళ్ళే రూటు మార్చి ఖైరతాబాద్‌కు వెళ్లే రోడ్డుకు తిరిగి స్పీడందుకుంది కారు.

2

పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టరు రంగనాథ్ ఎదురుగా కూర్చున్న డిటెక్టివ్ విజయ్ చేతిలోవున్న సిగరెట్టును గట్టిగా పొగ పీల్చి "అసలు ఏమయిందో క్లుప్తంగా చెప్పండి," అన్నాడు.

ఇన్‌స్పెక్టరు తన కుర్చీలో సర్ది కూర్చుని చెప్ప సాగాడు: "మా కానిస్టేబుల్స్ ఇద్దరు నైట్ గస్తీ డ్యూటీ చేసి తిరిగి ఈరోజు ఉదయం 'ట్యాంక్ బండ్' పై నుండి స్టేషన్‌కు వస్తుండగా 'హుస్సేన్ సాగర్' లో ఒడ్డుకు తేలివున్న ఒక యువకుని శవం అగుపించింది. వాళ్ళలో ఒకడు అక్కడేవుండి రెండవవాడు వచ్చి నాకు రిపోర్ట్ చేశాడు. నేను వెంటనే జీపులో అక్కడికి వెళ్ళాను. శవం నీటిలో బోర్లగిల పడివుంది. ఉదయం ఆరు, ఏడు గంటల సమయం కాబట్టి ఏమంత జనం పోగవలేదు. వెంటనే ఫోటోగ్రాఫర్లను పురమాయించి అక్కడి తతంగం తొందరగా ముగించి శవాన్ని పోస్టుమార్టంకై హాస్పిటల్‌కు పంపించాను..."

"ఆ శవం ఎవరిదో కనుగొన్నారా?" మధ్యలో ప్రశ్నించాడు డిటెక్టివ్ విజయ్.

"ఆ తెలుసుకున్నాం. అతడు ఎల్. ఐ. సి. లో పని చేస్తున్నట్లు, పేరు శేఖర్ అని తెల్సింది. అతడి మనీ పర్సులో ఎల్. ఐ. సి. వాళ్ళిచ్చిన 'ఐడెంటిఫికేషన్' కార్డు వుంది. దాన్నిబట్టి తెల్సింది. పర్సులో కొన్ని రూపాయినోట్లు, కొంత చిల్లరడబ్బుమాత్రం వుంది. అతడి ఇంటి అడ్రసు ఇంకా తెలియలేదు."

"అతడు ఆత్మహత్య చేసుకున్నాడేమో?"

"ముందు నేను అలాగే అనుకున్నాను. కాని పోస్టు మార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాత నా ఊహ తప్పయింది. అందుకనే నిన్ను పిలిపించాను" అన్నాను ఇన్‌స్పెక్టరు ఆవేదనగా.

"పోస్టుమార్టం రిపోర్టులో ఏముంది?"

"ఆ శవంలో ఒక్క రక్తం చుక్కకూడా లేదు."

ఆ మాట వింటూనే విజయ్ అదిరిపడ్డాడు. చేతిలోని సిగరెట్ జారి క్రింద పడిపోయింది. "వ్వాట్?"

"యస్, అతడి శరీరంలో ఒక్క చుక్కకూడా రక్తం లేదు. ముక్క 'టిష్యూ'లు బాగా ఉబ్బి వున్నందున ఎవరో అతడికి 'క్లోరోఫాం' ఇచ్చి స్పృహ పోగొట్టి అతడి రక్తం తీసేసి వుండాలి, అన్నాడు డాక్టర్ సిన్హా."

"ఐ సీ. అయితే రక్తం తీసినట్లు ఏమయిన గుర్తులు కనుగొన్నారా?"

"లేదు. శరీరంలోని రక్తం ఎలా పోయిందో అంతు చిక్కడం లేదని, శరీరంపై అనుమానించదగ్గ ఏ ఒక్క చిన్న గాయంకూడా ఎంత పరీక్షించినా తెలియలేదని, డాక్టర్ రిపోర్టులో వుంది. ఒక వ్యక్తి శరీరంలోని రక్తం అంతా ఎలా పోయిందో చాలా ఆశ్చర్యంగా వుంది మిష్టర్ విజయ్" అన్నాడు ఇన్‌స్పెక్టర్ రంగనాథ్.

"ఈ కేసు చాలా ఇంటరెస్టింగ్‌గా వుంది. ఓ. కె. హాస్పిటల్‌కెళ్ళి ఆ శవాన్ని ఒక్కసారి చూసివద్దాం. పదండి" అన్నాడు విజయ్ కుర్చీలోంచి లేస్తూ.

3

ఇన్‌స్పెక్టర్ రంగనాథ్‌కు ఫోన్‌కాల్ రాగానే డిటెక్టివ్ విజయ్‌ని వెంట తీసుకుని హిమాయత్ నగర్‌లోని ఒక ఇంటికి వెళ్ళాడు.

ఆ ఇల్లు ఏమంత పెద్దది కాకున్నా డాబా ఇల్లు అన వచ్చు. ఇంటిముందు జనం గుమిగూడి వున్నారు.

జీపు ఆగిన చప్పుడు విని ఆ గుంపులోనుండి ఒక వ్యక్తి గబగబ ఇన్‌స్పెక్టర్ దగ్గరకు వచ్చి "రండి శవం లోపల వుంది" అన్నాడు ఏడుపు ముఖంతో. అతన్ని అనుస రించారు ఇద్దరు.

లోపలి గదిలో మంచంపై ఒకవ్యక్తి చచ్చి పడి వున్నాడు. అతడికి ముప్పది సంవత్సరాలు వయస్సు వుండ వచ్చునని డిటెక్టివ్ విజయ్ చూస్తూనే గ్రహించాడు. ఫోటోగ్రాఫరు, డాక్టరు చకచక తమపని పూర్తిచేశారు.

"రాత్రి పన్నెండు పన్నెండున్నర మధ్యలో ప్రాణం పోయినట్లు తెలుస్తుంది. అతడిలో ఏమాత్రం కూడ రక్తం లేదు. పోస్టుమార్టం చేస్తేగాని పూర్తివివరాలు చెప్ప లేము" అన్నాడు పోలీసు డాక్టర్.

అతడు చెప్పిన మాటలను ఆశ్చర్యంగా విన్నారు.

"ఇక్కడ శవం వున్నట్లు నీకు ఫోన్ చేసిందెవరు?" అడిగాడు డిటెక్టివ్ విజయ్.

జీపు దిగినపుడు వారికి ఎదురుగా వచ్చిన వ్యక్తి వారి మాటలు విని దగ్గరగా వచ్చాడు. "నేనేనండి మీకు ఫోన్ చేసింది. నా పేరు చలపతి" అన్నాడు అతడు. అతనిలో కొద్దిగా హతుని పోలికలు వున్నాయి.

"ఏమి జరిగింది? హతుడు నీకేమవుతాడు?" అన్నాడు విజయ్.

ఆ వ్యక్తి బాగా ఏడ్చినందువల్ల ముఖం అంతా ఎర్రగా ఉబ్బి వుంది. మధ్యమధ్య కారుతున్న కన్నీటిని వత్తు కుంటూ, "వాడి పేరు మూర్తి. నాకు తమ్ముడవుతాడు.

'ఎలక్ట్రానిక్ కార్పొరేషన్'లో అసిస్టెంట్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. ఇంకా పెళ్ళి కాలేదు. రాత్రి వాడి స్నేహితులు ఇద్దరు వాడ్ని చేతులపై మోసుకొచ్చారు. నేను 'ఏమయింది' అని ఆత్రుతకొద్దీ అడిగాను.

'ఏమీ కాలేదండి, మా స్నేహితుని పెళ్ళికి వెళ్ళాము. అక్కడ కొద్దిగా బ్రాంది త్రాగాము. వీడు ఎక్కువగా తీసుకోవడంలో నిషాలో పడి నడవలేకపోతున్నాడు. అందుకని మేమే ఇంట్లో డ్రాపు చేసి వెళ్దాం అని తీసుకొచ్చాం' అన్నారు వాళ్ళు. వాడి గది చూపించగానే వాడ్ని గదిలో పడుకోబెట్టి వెళ్ళిపోయారు. నేను లైటార్పి తలుపులు దగ్గరకువేసి వచ్చి నా గదిలో పడుకున్నాను.

ఉదయం వాడికి ఆఫీసు టైం కావచ్చినా ఇంకా లేవకపోవడంతో మా ఆవిడ గదిలోకెళ్ళి చూచింది. ఆమె కెవ్వుమని వేసిన కేక విని నేను పరుగెత్తుకెళ్ళాను. మా ఆవిడ వణికిపోతూ నన్ను వాటేసుకు పోయింది. నేను మంచంవైపుకు చూచాను. ఏముంది? ముఖం అంతా తెల్లగా పాలిపోయి, శరీరం అంతా సన్నగా మారి, ఎముకల గూడువలె పడివున్నాడు. తర్వాత మీకు ఫోన్ చేశాను'' అని వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

''ఆ వచ్చిన వ్యక్తులను మీరెపుడయినా చూచారా?'',

''లేదండి, ఎపుడూ చూడలేదు.''

''మీ తమ్ముడికి త్రాగుడు అలవాటు ఇదివరలో వుందా?''

''ఉందండి. నా చాటుగా అపుడపుడు బయటే త్రాగి వస్తుంటాడు. ఎంత త్రాగినా నిలద్రొక్కుకోగలడు. కాని రాత్రి నిషాతో పడిపోయాడంటే నేనే నమ్మలేకుండా వున్నాను'' అన్నాడు.

అతడికి ధైర్యం చెప్పి విజయ్, రంగనాథ్ బయటకు వచ్చి జీపెక్కారు.

4

"మిష్టర్ విజయ్, ఇంతవరకు కేసు ఏమీ బోధపడ లేదు. రక్తంలేని శవాలు ఇప్పటికి ఆరు దొరకాయి. నా సర్వీసులో ఇప్పటివరకు ఎన్నో శవాలను చూశాను కాని, ఈ రక్తంలేని శవాలు దొరకడం ఆశ్చర్యంగా వుంది. పై నుండి కమీషనర్ గారు నన్ను పిలిచి, గట్టిగా మంద లించారు, తొందరగా కేసు పరిశోధించి నేరస్థులను బంధించమని" అన్నాడు ఇన్‌స్పెక్టర్ రంగనాథ్ దిగులుగా.

డిటెక్టివ్ విజయ్ శాంతంగా ఏదో ఆలోచిస్తున్నాడు. అతని మస్తిష్కంలో ఏదో సుడిగాలిలా తిరుగుతూ పైకి లేస్తున్నది. ఈ కేసును ఎక్కడనుండి మొదలు పెట్టడానికి చిన్న క్లూకూడా ఇంతవరకు దొరకలేదు. ప్రతి శవంలోనూ ఒక్క రక్తపు బొట్టుకూడా లేకుండ హరించుకుపోయింది. చచ్చిన శవాలలోని రక్తం ఏమయినట్లు? ఆరు హత్యలు జరిగాయంటే ఏదో బలమైన కారణమే వుండాలి. చచ్చిన ఆరుగురుకూడా మగవాళ్ళే. మగవారినే చంపి రక్తం తోడినవారు ఎవరు?

ఉన్నట్టుండి డిటెక్టివ్ విజయ్ పెదవులపై సన్నని చిరునవ్వు వెలిసి మాయమైంది.

"మిష్టర్ రంగనాథ్! నీవు వెంటనే హత్యకాబడిన ఆరుగురూ మరణించేముందు అంటె ఒక నెల రెండు నెలల లోపు వాళ్ళు ఏమేమి చేసేవాళ్లు, ఎక్కడికెళ్ళేవారు, మొదలయిన సమాచారం సేకరించు. ఈ లోపల నేను 'మార్చురీ'లో వున్న ఆ శవాలను మరోసారి పరీక్షించి వస్తాను," అంటూ గబగబ బయటికి నడిచాడు.

5

'మార్చ్యూరి' గది ఎయిర్ కండిషన్డ్ చేయబడి చాలా చల్లగా వుంది. ఆ గది గోడలకు క్రిందనుండి పది అడుగుల ఎత్తు వరకు చిన్న చిన్న తలుపుల లాంటివి బిగించబడి వున్నాయి. తలుపుల లోపల శవాలను వుంచుతారు. శవానికి సంబంధించినవాళ్ళు రాగానే, ఆ శవాన్ని వారికి ఒప్పచెపుతుంటారు.

డిటెక్టివ్ విజయ్ 'సివిల్ సర్జన్ సిన్హా'తో కలసి, మార్చ్యూరీ గది ఇన్‌చార్జిని కలుసుకొని, ఆ గదిలోకి ప్రవేశించారు.

గది ఇన్‌చార్జి ఒక మూలకెళ్ళి గోడకు వున్న ఒక తలుపును లాగి అందులోనుండి ఒక పొడవైన పెట్టెను బయటకు లాగాడు. ప్రక్కనున్న మరో తలుపు తీసి అందులోనుండి మరొక పెట్టెను లాగాడు.

బయటకు తీసిన రెండు పెట్టెల్లో రక్తం లేని శవాలున్నాయి. ముఖంపైనున్న తెల్లటి గుడ్డను తొలగించి ప్రక్కకు నిలబడ్డాడు ఇన్‌చార్జి.

"మిస్టర్ సిన్హా! మీరు వ్రాసిన పోస్టుమార్టం రిపోర్ట్‌లో శరీరంలో ఏమాత్రం రక్తం లేనందువల్లా వీరి రక్తం గ్రూపు ఏమిటో తెలియలేదని వ్రాశారు. నాకొక వూహా తట్టింది. దాని ప్రకారం మనకు రక్తం దొరకవచ్చు. దాని సహాయంతో రక్తం కనుగొంటె మన కేసు కొంచెం ముందుకు వెళ్ళే అవకాశం వుంది. శవాల పెదవులను, నాలుకను కోసి స్టెరి చేయి అక్కడ కండలుగా వున్న రక్తనాళంలో కొంత రక్తం దొరకవచ్చు. ఎందుకంటె వ్యక్తి మరణించగానే ఆ ప్రదేశాలలోని రక్తం కండలుగా అలాగే అక్కడే నిలిచిపోతుంది. మిగత భాగాలలోలాగా

ప్రవహించదు. ఇంకో విషయం. శవాల తల వెంట్రుకలు తీసి క్షుణ్ణంగా పరీక్షించండి. ఏదయిన సన్నని సూది లాంటిది గ్రుచ్చి రక్తాన్ని తీసే అవకాశం వుంది. చేతి గోళ్ళ క్రింద కాలిగోళ్ళ క్రింద కూడా చెక్ చేయండి. సన్నని సూదిలాంటి రంధ్రమేదయినా వుండివుంటుంది. నా వూహ సరియైనదే అయితే మనం కేసును పూర్తిగా పరిశోధించినవాళ్ళమే అవుతాము. మీరు తొందరగా పరీక్షించి రిపోర్ట్ ఇవ్వండి. నేను నా ఆఫీసులో వుంటాను'' అంటూ చకచక బయటకు వెళ్ళిపోయాడు.

అతి చిన్న విషయాన్ని గుర్తు చేసినందుకు విజయ్ని అభినందించకుండా వుండలేక పోయాడు సర్జన్ సిన్హా. అంత చిన్న విషయాన్ని తను సర్జనై కూడా తెల్సుకోనందుకు సిగ్గుపడ్డాడు. శవాలను ట్రాలీపై వేయించి ఆపరేషన్ థియేటర్లోకి తరలించాడు సివిల్ సర్జన్ సిన్హా.

6

ఇన్స్పెక్టరు రంగనాథ్ మరణించిన ఆరుగురు గురించి సేకరించిన రిపోర్ట్ను చదివి ఆలోచిస్తూ కూర్చున్నాడు, డిటెక్టివ్ విజయ్.

'ఆరుగురు ఒకటి రెండు నెలల తేడాలో ఉస్మానియా హాస్పిటల్లో కొన్ని రోజులు పేషంట్గా వుండివచ్చిన వాళ్ళు. వారికి టాన్సిల్స్, హార్ట్పెన్ జబ్బు వుంటె బాగు అయి డిశ్చార్జ్ అయ్యారు. వారిలో నలుగురికి బ్లడ్ చార్జింగ్ చేశారు.'

అంతలో టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ అందుకొని ''హల్లో విజయ్ హియర్'' అన్నాడు.

''నేను మిష్టర్ విజయ్, డాక్టర్ సిన్హాను. ఆ శవాలను చెక్ చేశాను. మీ వూహ కరక్టయినది. నాలుగు శవాలకు

చేతి వ్రేళ్ళ గోళ్ళ క్రింద చాల సన్నని రంధ్రాలున్నాయి. మిగతా వాటికి తల వెంట్రుక రంధ్రాలలో కలిసినట్లు కొన్ని రంధ్రాలున్నాయి. వీటిని 'మైక్రోస్కోపు'తో పరీక్షిస్తేగాని తెలియలేదు. ఈ రంధ్రాలద్వారా రక్తం పోయినట్లు తెలుస్తుంది. ఇంకో విషయం పెదవులలో వున్న చిన్న రక్తం కండనుబట్టి అన్ని శవాల రక్తం 'O' గ్రూపుకు చెందినదని తెలిసింది. మిష్టర్ విజయ్ మనుషులలో A, B, C, E, మరియు 'O' గ్రూపులకు చెందిన రక్తం వుంటుంది. ఇందులో 'O' గ్రూపు చాల విలువైనది" అన్నాడు సిన్హా.

"అలాగా" అన్నాడు డిటెక్టివ్ విజయ్ ఆశ్చర్యంతో. క్షణం ఆగి మళ్ళీ "మిష్టర్ సిన్హా! మీరొక చిన్న సహాయం చేయాలి, ఎవరికి తెలియకుండా" అంటూ ఫోన్‌లో పది నిమిషాలు ఏదో మాట్లాడి కనక్షన్ కట్ చేసి, ఇన్స్పెక్టర్ రంగనాథ్‌కు ఫోన్ చేసి అతనికి కూడా కొన్ని ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చాడు.

7

సాయంత్రం ఆరుగంటలు.

కోఠీ బస్సుస్టాప్‌లో ఒక వ్యక్తి ఇంగ్లీషు 'మ్యాగజైన్' తిరిగేస్తూ నిలుచున్నాడు. అతడు చాలా బలిష్టంగా వున్నాడు. అవలీలగా ఇద్దరిని ఒకే దెబ్బతో పడగొట్టగల సమర్థత అవుపిస్తుంది అతనిలో.

అతడు సిగరెట్ కాలుస్తూ మధ్య మధ్యలో తల పైకెత్తి ఇటూ అటూ చూడసాగాడు. వచ్చే పోయే ఆడవాళ్ళ అందాన్ని చూస్తూ మురిసిపోతున్నాడు.

ఒక యువతికి సుమారు 25 సంవత్సరాలు వుండవచ్చు.

వచ్చి అతని పక్కగా నిల్చుని "హల్లో మిస్టర్ మూర్తి" అంది చిన్నగా కన్నుకొట్టి.

ఆశ్చర్యంతో ఆమెను చూసి మర్యాదకై "హలో" అన్నాడు. ఒకప్రక్క తన పేరెలా తెలుసుకుందోనని ఆశ్చర్యపోతున్నాడు. ఆమె ఎవరో అతనికి తెలియదు.

చాలా అందంగా వుంది. తల వెంట్రుకలు ముడిచి కొప్పు వేసి తలలో గులాబి పువ్వు ఒకటి పెట్టింది. చిన్న చేతుల బ్లౌజ్ వేసి, బొడ్డుకు క్రిందుగా ఫారిన్ నైలెక్స్ చీర కట్టింది. కాళ్ళకు చెప్పులు, చేతిలో హ్యాండ్ బాగ్, మెడలో ఒంటి పేట గొలుసు, చెవులకు రింగులు, బొట్టు పెట్టిన ఆమె ఎర్రని ముఖానికి వింత అందాన్నిస్తున్నాయి. ఆమె సన్నని నడుము, లావైన పిరుదులను చూస్తూ అతడు మాట్లాడకుండా వూరుకున్నాడు.

"ఇందాకటినుండీ గమనిస్తున్నాను. మీరు ఆడవాళ్ళను త్రాగేసేలా చూడడం మంచిది కాదు" అన్నది ఆమె.

"అయితే ఇటువంటి అందగత్తెలు మగవారిని ముగ్ధుల్ని చేయడం మంచిదేమో" అన్నాడు.

"భలేగా మాట్లాడుతారే మీకు ఆడవాళ్ళంటె ఇష్టం వుండవచ్చుననుకొని వచ్చాను నిజమేనా?" అంటూ కన్ను కొట్టింది.

"ఓ... ఓ... చాలా తొందరగా తెలుసుకున్నారే ఇంకేం మంచి కంపెనీ దొరికిందన్నమాట. బిజినెస్సా" అన్నాడు మెల్లగా.

"ఒకందుకు అదేననుకోండి. సామాన్యంగా నేను ఎవరి దగ్గరకు వెళ్ళను, ఎపుడో నెలకు ఒకటి రెండుసార్లు తప్ప. అదీకూడా చేతిలో డబ్బులు లేనపుడే" అన్నది.

"అరే నిల్చుండే మాట్లాడుతున్నారు రండి అలా హోటల్ కెళ్ళి ఏదయినా టిఫిన్ చేస్తూ మాట్లాడుకుందాం" అంటూ హోటల్ కామత్ వైపుకు దారితీశాడు.

టిఫిన్ చేసి కాఫీ త్రాగి బయటకు వచ్చారు ఇద్దరూ.

"నా రూంకెళ్దాం. అక్కడ నేను తప్ప ఎవరుండరు" అన్నది ఆమె.

"ఓ. కే. అందాన్ని జుర్రుకోవడానికి ఎక్కడయితే నేం" అన్నాడు నవ్వుతూ.

ఇంతలోకి వాళ్ళ ముందునుండి ఒక నల్లటి అంబాసిడర్ కారు వెళ్తుంటే ఆమె చప్పట్లు కొట్టి ఆపింది. "ఇది మా ఫ్రెండ్ వాళ్ళ కారు. డ్రైవర్ నాకు తెల్సు. మంచివాడు. మనకి లిఫ్టు ఇస్తాడు రండి," అంటూ ఆగివున్న కారులోకి ఎక్కింది. ఆమె వెనుకనే అతడుకూడా ఎక్కాడు.

"డ్రైవరు నన్ను మా ఇంటిదగ్గర డ్రాపుచెయ్" అన్నది.

కారు స్టార్టు అయింది. వేగం అందుకొంది. ఇంతలోకి పరుగెత్తుతూన్న కారు సడన్ బ్రేకుతో ఆగిపోయింది. వెనుక సీట్లోవున్న వాళ్ళు ఇద్దరు ముందుకు తూలారు. అతని తల ముందు సీటుకు గుద్దుకుంది.

వెంటనే ఆమె చేతిలోవున్న 'క్లోరోఫాం' గుడ్డతో అతడి ముక్కును అదిమి పట్టింది. అతడు శ్వాసను బిగపట్టి స్పృహ కోల్పోయినట్లు తల ప్రక్కకు వాల్చేశాడు. అతడు డిటెక్టివ్ విజయ్. మారువేషంలో వున్నాడు.

"డ్రైవరు తొందరగా కారు మన స్థావరానికి పోనియ్" అని కేక వేసింది. కారు స్పీడందుకొంది. ఆ కారు వెనుకాల ఇనస్పెక్టర్ రంగనాథ్ వున్న జీపు, ఆ కారును ఫాలో చేయడం ఎవరూ గుర్తించలేదు.

8

ఆ గది చిన్న ఆపరేషన్ థియేటర్‌లా వుంది. గదిమధ్య ఒక పొడవైన టేబిల్ వుంది. దానిపైన డిటెక్టివ్ విజయ్ పడుకొని వున్నాడు. స్పృహ కోల్పోయినట్లు తల ఒక ప్రక్కకు వాల్చి వుంచాడు. మెల్లగా ఒక కన్ను తెరచి వుంచి ఆ గదిని గమనించసాగాడు.

టేబిల్‌కు ఒకప్రక్క స్టాండ్‌పై కొన్ని రబ్బరు ట్యూబ్స్ వ్రేలాడి వున్నాయి. వాటి చివర సన్నని 'ఇంజక్షన్ నీడిల్స్' వున్నాయి. ఆ 'ట్యూబ్స్' రెండవ చివర గోడవారగా వున్న చిన్న 'మినీ_సైజు' పంపుసెట్ లోకి కలపబడి వుంది. అక్కడినుండి ఒక పెద్దసైజు రబ్బరు గొట్టము పెద్ద సీసాలోకి వుంది. డిటెక్టివ్ విజయ్ ఆ విషయం అర్థం చేసుకోవడానికి ఎంతోసేపు పట్టలేదు.

ఇంజక్షన్ నీడిల్స్‌ను ఎవరు గుర్తుపట్టని చోట మనిషి శరీరంలోని గోళ్ళక్రింద, తలవెంట్రుకల రంధ్రాలలో గ్రుచ్చి, కరంటుతో స్టార్టు అయ్యే ఆ 'మినీ_సైజు' పంపు సెట్‌ను స్టార్ట్ కాగానే బావిలోనుండి నీళ్ళను తోడే పంపులాగా ఇది శరీరంలోని రక్తాన్ని పూర్తిగా తోడి ఆ పెద్ద సీసాలోకి పంపింగ్ చేస్తుంది. ఎంత తెలివిగా చేశారు. తన ఊహ కరెక్టే అయింది.

డాక్టర్ సిన్హా ఫోనులో మాట్లాడినపుడు మారుపేరును వ్రాసి తాను ఈ మధ్యనే హాస్పిటల్‌నుండి డిశ్చార్జ అయినట్లు తన బ్లడ్ 'O' అని రిజిష్టర్‌లో వ్రాయించి, ఎమర్జన్సీలో అపుడపుడు ఉపయోగించే తన పాత ఇంటి అడ్రసు వ్రాయించి పెట్టమని చెప్పాడు. రెండు రోజులు ఆ యింటినే ఉపయోగించాడు. దాని ఫలితమే తాను ఇక్కడకు తీసుకు రాబడ్డాడు.

హాస్పిటల్ 'స్టాఫ్'లో ఎవరో 'O' గ్రూపు రక్తం గలవారి అడ్రసులు సేకరించి ఇతరులకు ఇస్తున్నట్లు తెలుస్తున్నది. తర్వాత ఆ వ్యక్తులను వెంటాడి ఇక్కడకు తెచ్చి రక్తాన్ని ఈ విధంగా తీసి శవాలను చెరువుల్లోనో, రోడ్డుప్రక్కనో, తెల్సినవాళ్ళలాగా ఇళ్ళలోను వదలి పీడ వదిలించుకుంటున్నారన్నమాట. మనిషిలో వుండే సుమారు ఎనిమిది, పది లీటర్ల రక్తాన్ని తీసి ఏమిచేస్తున్నట్లు? ఎవరికయినా అమ్ముతున్నారా...

అతని ఆలోచనలను భగ్నంచేస్తూ తలుపులు తెరుచుకున్నాయి.

వెంటనే డిటెక్టివ్ విజయ్ కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

డాక్టర్‌లా తెల్లకోటు వేసుకున్న ఇద్దరు వ్యక్తులు లోపలికి వచ్చారు. వాళ్ళు విజయ్ వున్న టేబిల్ దగ్గరకు వస్తూ "ఇతని రక్తంతో మరికొంత రక్తం సేకరించి మొత్తం రక్తాన్ని చైనాకు చేర్చాలి. వాళ్ళదగ్గరనుండి ఇప్పటికే లక్ష రూపాయలు అడ్వాన్సుగా తీసుకున్నాము. వాళ్ళకు పూర్తిగా వెయ్యి లీటర్లు సప్లయి చేశామంటే మనకు పూర్తిగా పాతిక లక్షలు ఇస్తారు. ఇంతవరకయితే మన ఆచూకి ఎవరికి దొరకలేదు" అంటూ ఒకతను చేతిలో వున్న ఇంజక్షన్ నీడిల్‌ను డిటెక్టివ్ విజయ్‌కు గ్రుచ్చడానికి ముందుకు వంగాడు.

అంతే... అతని చేతిలోని ఇంజక్షన్ సిరంజి ఎగిరి ఒక మూలకు పడింది. వారిద్దరు ఎగిరి ఒకపక్క పడ్డారు. మెరుపులా ఎగిరి క్రింద నిలబడ్డాడు విజయ్ చేతులు దులుపుకుంటూ.

ఆశ్చర్యంతో పైకి లేస్తున్న దుండగుల ఇద్దరి ముఖంపై ఈడ్చి తన్నాడు. పళ్ళు కదిలి రక్తం కారసాగింది.

"ఇడియట్స్. మనుషుల రక్తాన్ని అమ్మి మీరు సుఖపడ్తాం అనుకున్నారా? రక్తం ధారపోసి కష్టించే మన భారత పౌరులు రక్తాన్నే పీల్చి మీరు ఇతరులకు ఇస్తారా? ఎన్ని కుటుంబాలు నాశనమయ్యాయో ఒక్కసారి ఆలోచించారా? ఇదేనా మీరు దేశానికి చేయవలసింది. విదేశీయులతో చేతులు కలిపి ఇంతటి నీచమైన వ్యాపారం చేస్తారా? మిమ్మల్ని ఆ భగవంతుడు కూడా క్షమించడు" ఉద్రేకంతో అంటూ క్రిందపడ్డ వాళ్ళిద్దర్ని షర్ట్ కాలర్స్ పట్టుకొని పైకి లేపాడు.

"మిష్టర్ విజయ్" అని వినబడిన వైపుకు తల తిప్పాడు. గది తలుపులదగ్గర ఇనస్పెక్టర్ రంగనాథ్ నిల్చున్నాడు.

"ఈ బంగళాను పూర్తిగా స్వాధీనం చేసుకున్నాను. దీనికంతటికీ నాయకులు డాక్టర్ల రూపంలో వున్న వాళ్ళిద్దరే. వ్యభిచార స్త్రీలను ఎరగా పెట్టుకొని, మనుష్యులను రాబట్టుకొని, వారి రక్తం పీల్చేది ఈ రాక్షసులే. ఈ ఇంట్లో వున్న వారందర్ని కస్టడిలోకి తీసుకున్నాను. వారిద్దర్ని..." ఇనస్పెక్టర్ అంటుండగానే విజయ్ చేతుల్లో వున్న ఇద్దరు దుండగులు దుబ్బుమని క్రిందపడి కాళ్ళు, చేతులు తన్నుకొని క్షణంలో ప్రాణాలు వదిలారు. తను అటుతిరిగి ఇన్‌స్పెక్టరును చూస్తున్నపుడు విషపు మాత్రలు తిని వుంటారని వూహించాడు విజయ్.

"ఆ శవాలను తీసుకెళ్ళి మిగతా మీ కార్యక్రమం చూడండి. ఇంకో విషయం ఉస్మానియా హాస్పిటల్ లో 'O' గ్రూపుకు చెందిన రక్తం కలిగిన పేషంట్స అడ్రసులు ఎవరో తస్కరించి, వీళ్ళకు ఇస్తున్నారు. వారిని కూడా కస్టడీలోకి తీసుకోండి" అంటూ బయటకు నడిచాడు డిటెక్టివ్ విజయ్.

★★★



21

అర్ధరాత్రి పన్నెండుగంటలు దాటి పదినిమిషా లవుతుంది. అమావాస్య చీకటి లోకంపై నల్లని ముసుగు వేసినట్లుంది.

హెడ్ లైట్స్ లేకుండా ఓ కారు వేగంగా ప్రయాణిస్తోంది. ఆ కారులో డ్రైవరు గాక ఇద్దరు వ్యక్తులు వున్నారు. రెండు బ్రీఫ్ కేసులు ఇద్దరి ప్రక్కన వున్నాయి.

నలభై నిమిషాల ప్రయాణానంతరం కారు బీచ్ ఒడ్డుకు చేరుకుంది. డ్రైవర్ ను కారుతోసహా అక్కడే వుండమని చెప్పి, ఆ యిరువురు వ్యక్తులు బ్రీఫ్ కేసులు తీసుకొని ఇసుకలో ముందుకు నడవడం ప్రారంభించారు.

అలా ఓ అరగంట నడిచిన తర్వాత ఇరువురూ సముద్ర తీరాన్ని చేరుకున్నారు. అక్కడ తీరంలో నాలుగైదు బోటులు వున్నాయి.

ఒక బోటులోనుండి టార్చిలైటు మూడుసార్లు వెలిగి ఆరిపోయింది. వెంటనే ఆ యిరువురు వ్యక్తులు తమ చేతుల

లోని టార్చిలైట్లను సిగ్నలింగ్‌గా మూడుసార్లు వెలిగించి ఆర్పారు.

వెంటనే ఆ బోటులోనుండి యిద్దరు వ్యక్తులు మరో రెండు బ్రీఫ్ కేసులతో బయటకు వచ్చారు.

"మిస్టర్ మాణిక్యలాల్!" బోటులోనుండి దిగినవ్యక్తి పిలిచాడు.

"ఎస్ మిస్టర్ మాన్‌సింగ్!" రెస్పాన్స్ పలికేడు మాణిక్యలాల్.

"మొత్తం ఎంత?" అడిగాడు మాన్‌సింగ్.

"రెండు అయిదులు, మొత్తం పది కిలోలు!"

"వెరీ గుడ్! ఇవి రెండు రెండున్నరలు, మొత్తం ఐదు లక్షలు."

ఇరుపక్షాలవారి చేతులలో వున్న బ్రీఫ్ కేసులు తారుమారయ్యాయి.

"మళ్ళీ ఎప్పుడు?"

"సరిగ్గా పదిరోజులకు!"

"ఈసారి పాతిక కిలోలు తీసుకురండి!"

"ప్రయత్నిస్తాను!"

"గుడ్ బై! మళ్ళీ కలుద్దాం!"

"గుడ్ బై!"

మాన్‌సింగ్, అతని అనుచరుడు బోటులోకి వెళ్ళిపోయారు.

మాణిక్యలాల్, అతని అనుచరుడు బరువైన సూట్ కేసులు తీసుకొని కారుదగ్గరకు నడిచారు.

డ్రైవర్ వీరిని చూడగానే త్రాగుతున్న సిగరెట్ అవతల పారేసి సెల్యూట్ చేశాడు.

"సక్సెస్! మిష్టర్ యాకూబ్, మనం యిప్పుడు సేట్ గోవిందదాస్ దగ్గరకు వెళ్ళాలి" చిన్నగా అన్నాడు మాణిక్యలాల్.

"అలాగే సార్!" కారు స్టార్ట్ చేశాడు యాకూబ్.

మరో పది నిమిషాలలో కారు మెయిన్‌రోడ్ మీదకు వచ్చేసింది.

మరో అరగంట ప్రయాణం చేసిన తర్వాత అన్నాడు మాణిక్యలాల్.

"మిష్టర్ యాకూబ్, మనం గోవిందదాస్ యింటికి వెళ్ళాలని చెప్పాను. అప్పుడే దారి మర్చిపోయావా?"

చిన్నగా నవ్వాడు యాకూబ్!

"నేను దారి మర్చిపోలేదు మిష్టర్! దారి మర్చిపోయిన వాళ్ళకు సరైన దారి చూపిస్తున్నాను."

ఉలిక్కి పడ్డాడు మాణిక్యలాల్! అనుచరుడు చటుక్కున రివాల్వర్ తీశాడు.

"మిష్టర్ నీ రివాల్వర్‌లోని గుళ్ళు నన్నేమీ చేయలేవు. కావాలంటే ట్రై చేసి చూడు" నవ్వాడు యాకూబ్.

అనుచరుడి చేతిలోని రివాల్వర్ ధన్‌మంటూ పేలింది. అంతే బుల్లెట్ ఓ అడుగుదూరం వెళ్ళి దేనికో టప్‌మని కొట్టుకొని క్రింద పడిపోయింది.

"చూశావా మిష్టర్! నేను ఏర్పాట్లు లేకుండా రంగంలోకి దిగను," చిన్నగా నవ్వాడు యాకూబ్.

"ఎవరు నువ్వు?" గర్జించాడు మాణిక్యలాల్.

"యాకూబ్‌ని!"

"నో, నువ్వు యాకూబ్‌వి కావు!"

"ఎందువలన కాగూడదు?"

"యాకూబ్ నమ్మకద్రోహం చేయడు."

"హుఁ. నమ్మకద్రోహం! నువు చేసేది నమ్మకద్రోహం కాదా? నువ్వు నమ్మకద్రోహం చేస్తూ మరొకరు చేయ రనుకోవడం హాస్యాస్పదం!"

డోర్ హాండిల్ మీద చేయి వేశాడు మాణిక్యలాల్!

"మిస్టర్ మాణిక్యలాల్! అనవసరంగా శ్రమపడకు. అవి ఎప్పుడో లాక్ అయిపోయాయి."

"ఇప్పుడు మమ్మల్ని ఏం చేస్తావ్?" మాణిక్యలాల్ కంఠంలో పూర్వపు ధారుఢ్యత లోపించింది.

"సరాసరి పోలీస్ స్టేషన్ కు."

అదిరిపడ్డాడు మాణిక్యలాల్.

"తీసుకువెళ్ళి ఏం చేస్తావ్? నిన్ను ఏదో రకంగా జైల్లో తోయించగలను జాగ్రత్త!"

"నన్ను నువ్వు ఏమీ చేయలేవు. నీ గురించి నువ్వు ఆలోచించుకో! నీ స్మగ్లింగ్ అంతా మూవీ తీశాను. ఆ కెమేరా యిక్కడే వుంది. అది చాలు, నిన్ను జెయిల్లో వుంచడానికి."

"ఆల్ రైట్! నీకెంత డబ్బు కావాలి? ఆ మూవీ నాకు తక్షణం కావాలి. క్విక్!"

"సారీ, డబ్బులకు ఆశపడేవాడిని కాదు."

"డబ్బులంటే వందలు వేలు కాదు, లక్షలు! ఎన్ని లక్షలు కావాలో చెప్పు?"

"అయాం సారీ! నేను నిన్ను బ్లాక్ మెయిల్ చ్యేయ డంలేదు. నా క్కావలసింది నువ్వు. మర్యాదగా నీ రాకెట్ గురించి వివరాలు చెప్పు. నా పని సానుకూల పడుతుంది."

"అది అంత తేలిక గాదు!"

"నాకు తెలుసు. అందుకే కష్టమైనా సాధించాను. నీ చేత మీ రహస్యాలు ఎలా చెప్పించాలో నాకు తెలుసు."

"అసలు నువ్వెవరివి? మాలో ఎలా ప్రవేశించావు?"

"కొంచం శ్రమపడవలసి వచ్చింది. మా ఏజంట్ నీ ప్రతి కదలికను ఫాలో అయి మాకు రిపోర్ట్ యిచ్చాడు. ఈరోజు నువ్వు బంగారం మార్పిడి చేస్తావని మాకు తెలుసు. అందుకే రహస్యంగా నీ కారు డిక్కీలో ప్రవేశించాను. మీరు కారు దిగి వెళ్ళిపోగానే యాకూబ్‌ను దెబ్బతీసి వాడి వేషం నేను ధరించాను. ఇప్పుడు మీ యాకూబ్ కారుడిక్కీలో వున్నాడు."

"అన్నీ తెలిసి మరి అక్రమ రవాణా ఎందుకు అరికట్ట లేకపోయారు?" కుతూహలంగా అడిగాడు మాణిక్య లాల్.

"మిష్టర్, దీని కంతటికీ కారణం నువ్వొక్కడివేనని నేను అనుకోవడంలేదు. మీకో లీడర్ వున్నాడు. మిమ్మల్ని పట్టుకుంటే అంతటితో చెల్లు! కానీ మీ స్థావరం మాకు తెలియాలి. మీ గాంగ్ మొత్తం మా స్వాధీనం కావాలి."

"అసంభవం! అది అంత తేలిక గాదు!"

"అఫ్‌కోర్స్! నాకంత కష్టం లేదు."

"ఇంతకూ నువ్వెవరు?" గర్జించాడు మాణిక్యలాల్.

"డిటెక్టివ్ ధర్మేంద్రను!" చిన్నగా నవ్వాడు.

22

ఫోన్‌లో అవతలనుండి టకటకమని శబ్దం విన్పించింది. ధర్మేంద్ర కళ్ళు మెరిశాయి. ఆ శబ్దం సీక్రెట్ బ్రాంచ్ స్పెషల్ కోడ్! ఎస్. బి. డైరెక్టర్ కమల్‌నాధ్ సిగ్నల్స్ పంపిస్తున్నాడు.

తనూ నోటితో ఫోన్‌లో శబ్దం చేశాడు. ఆ తరువాత అటునుండి మాటలు విన్పించాయి.

"హల్లో ధర్మేంద్ర! చాలా కాలానికి మాట్లాడుతున్నాను. ఈ రోజు మా వాళ్ళింట్లో ఏదో ఫంక్షన్ వుంటే హైద్రాబాద్ వచ్చాను."

"హాయ్ కమల్! హైద్రాబాద్ వచ్చేముందు నాకు కబురు చేయలేకపోయావాం? నేనక్కడకు వచ్చేవాడిని కదా!"

"ఓ. నాకు మాత్రం నిన్ను కలుసుకోవాలని, నీతో అనేక విషయాలు మాట్లాడాలని లేదేమిటి? అందుకే అక్కడకు వస్తున్నాను."

"థాంక్యూ. మరి వుంటా!"

ఫోన్‌లో క్లిక్ వినిపించగానే రిసీవర్ క్రెడిల్ చేసి రంజన్ కళ్ళలోకి చూశాడు ధర్మేంద్ర!

"ఎవరు ఫోన్ చేసింది?"

"ఎస్. బి. డైరెక్టర్ కమల్‌నాథ్!" చెప్పాడు ధర్మేంద్ర.

ఉలిక్కిపడ్డాడు రంజన్.

"మైగాడ్! కమల్‌నాథ్! పెద్ద విశేషం లేనిదే ఆయన యిక్కడకు రాడు."

"అవును. ఇప్పుడు మన ముందు వుంది పెద్ద విశేషం కాదా?" నవ్వాడు ధర్మేంద్ర.

అప్పుడే స్టేషన్ ముందు ఆటో ఆగింది.

దాసు ఓ కానిస్టేబుల్‌ని పిలిచి ఆటోలోవున్న వ్యక్తిని లాకప్‌లోకి తీసుకొమ్మని చెప్పి స్టేషన్‌లోకి నడిచాడు.

ధర్మేంద్ర, దాస్ వైపు చూసి అర్ధవంతంగా నవ్వాడు.

"సక్సెస్ సర్! మీరు చెప్పినట్లు చేసి అతన్ని బంధించాను" చెప్పాడు దాసు.

"ఎవరిని? ఎక్కడున్నాడు?" ఆతృతగా ప్రశ్నించాడు రంజన్.

"ప్రస్తుతం మీ లాకప్‌లో! ఎవరో తెలుసుకోవాలి. పద" లేచాడు ధర్మేంద్ర.

ముగ్గురూ లాకప్ రూంలోకి నడిచారు. అప్పటికే అతనికి స్పృహ తెప్పించారు పోలీసులు.

"మిస్టర్ ఎవర్నువ్?"

"అదే నా కర్థం కావడంలేదు!"

ఒళ్ళు మండింది రంజన్‌కు. "మిస్టర్! అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పవ్?" గర్జించాడు.

"ఏం చెప్పమంటారు సార్! నా పేరు రవీంద్ర. సెంటర్‌లో నడుస్తూంటే యీ కుర్రాడే సైకిల్‌తో డాష్ యిచ్చాడు. అంతా అతనిని పోలీసులకు పట్టిమ్మంటే నేనే జాలిపడి వదిలేశాను. చివరకు అతనే నన్ను స్టేషన్‌కు తీసుకు వచ్చాడు. ఇప్పుడు నేనెవర్ని అంటే ఏం చెప్పను?"

"ఓహో! మిస్టర్ రవీంద్ర! మా యింటివద్ద మూడు గంటలనుండి బీటు వేస్తూ, మా మురళి బయటకు రాగానే, చేస్తున్న పని ఆపి అతన్ని ఎందుకు వెంబడించినట్లు?" అడిగాడు ధర్మేంద్ర సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ.

"మీరేం మాట్లాడుతున్నారో నా కర్థం కావడంలేదు. నేను ఎవరినో వెంబడించడమా? నాకు భోజనంకు టైమ్ కాగానే నేను పని ఆపి బయలుదేరాను. మీరేదో పొరబాటు పడినట్లున్నారు. నన్ను వదిలిపెడితే నా పని నేను

చూసుకుంటాను” ప్రాధేయపూర్వకంగా అడిగాడు రవీంద్ర.

“ఆల్ రైట్! నిన్ను సెర్చ్ చేసి అనుమానం ఏమీ లేక పోతే వదిలేస్తాం!”

“నో! నన్ను సెర్చ్ చేయడానికి మీరెవరు? మీకు వారంట్ వుందా?” అరిచాడు రవీంద్ర.

“బాధ్యతగల అధికారులం! వారంటులతో మాకు పని లేదు” కానిస్టేబుల్స్‌కు సైగ చేస్తూ అన్నాడు ధర్మేంద్ర.

మరుక్షణం యిద్దరు కానిస్టేబుల్స్ రవీంద్రను శోధించడం ప్రారంభించారు.

ఒక రివాల్వర్, అరడజన్ స్మోకింగ్ పిల్స్, చార్మినార్ సిగరెట్ పెట్టె! ఐదువందలనలభైరెండు రూపాయలు కరెన్సీ, కొంత చిల్లర దొరికాయి. అన్నింటికన్న అధికారులకు ఆశ్చర్యం కలిగించే విశేషమేమిటంటే, అతని పర్ట్ లోపలిజేబులో ఒక వెండి కాయిన్ దొరికింది. దాని మీద 37 అన్న నంబర్ వుంది.

దానిని పరీక్షగా చూశాడు ధర్మేంద్ర!

“మిష్టర్ రవీంద్ర! మీరు దోషి అని నిర్ణయించుకోవడానికి యీ కాయిన్ చాలదా! మేము అన్వేషించే దుండగుల ముఠాకు సంబంధించినది యీ కాయిన్!” తీవ్రంగా చూస్తూ అన్నాడు ధర్మేంద్ర.

అతని ముఖం పాలిపోయింది. ఏమీ మాట్లాడలేక తల దించుకున్నాడు.

“ఈ కాయిన్ ఏమిటి? కాయిన్ అర్థం ఏమిటి?”

సమాధానమేమీ యివ్వలేదు.

“మిస్టర్ మాకు సమాధానాలు వెంటనే కావాలి! క్విక్ అవి మీ మెంబర్‌షిప్ టోకెన్స్ కదూ?”

"నో. నాకు తెలియదు!"

రంజన్ చేయి గాలిలోకి లేచింది. అతని దవడ అదిరి పోయింది. బళుక్కున గుక్కెడు రక్తం క్రింద కక్కు కున్నాడు.

"అవును!" టక్కున చెప్పాడు.

"వెరీగుడ్! ఎంతమంది వున్నారు మీ రాకెట్‌లో మెంబర్స్?"

"నాకు తెలియదు!"

"మీ రాకెట్ స్థావరం ఎక్కడ?"

"నాకు తెలియదు!"

"మీ గాంగ్ లీడర్ ఎవరు?"

"నాకు తెలియదు!"

"X-లైట్ అంటే ఎవరు?"

"నాకు తెలియదు!"

"నాకు తెలియదు అంటే."

"నాకు తెలియదు!"

ఫెడీలున తన్నాడు ఇనస్పెక్టర్ రంజన్. రెండు పళ్ళు ఊడి క్రింద పడ్డాయి. బళుక్కుమంటూ మళ్ళీ రక్తం క్రింద పడింది.

"యూ డర్టీ బాస్టర్డ్! ఎంత తలతిక్క నీకు? ఇప్పుడు నేనడిగిన ప్రతి ప్రశ్నకు విపులంగా సమాధానం కావాలి. ఐదునిమిషాలు టైం యిస్తున్నాను. ఆ తరువాత నువ్వనుభ వించబోయే చిత్రవధకు నేను బాధ్యుడను కాను," రంజన్ కళ్ళు నిప్పులు కురిపిస్తున్నాయి.

"మిస్టర్ లైట్ 37! నీ కర్తవ్య నిర్వహణకు నా జోహార్లు" చిన్నగా అన్నాడు ధర్మేంద్ర!

ధర్మేంద్రవైపు ఆశ్చర్యంగా చూశాడు ఆ వ్యక్తి.

"వెల్ మిస్టర్ 37! నువ్వే కాదు, నీ స్థానంలో ఎవరు వున్నా యింత స్ట్రిక్ట్‌గానే వుంటారు. అది మెంబర్స్‌కిచ్చే శిక్షణ! అయితే ఒక్క విషయం గుర్తుంచుకో! నువ్వు ఏవో ఆశయాలకు, ఆదర్శాలకు లొంగిపోయి గానీ, లేదా ఏదైనా బలీయమైన వత్తిడికి కానీ లొంగిపోయి రాకెట్లో చేరివుంటావు. అక్కడ చేరిన తరువాత వారి ఆదర్శాలను, ఆశయాలను పాటించక తప్పదు. అయితే నువ్వు ఏ మాత్ర దేశ క్షేమాన్నయితే కాంక్షిస్తూ పనిచేస్తున్నావో, రాకెట్ మూల ఆశయం పవిత్ర భారత వినాశనం!

ఇప్పటికైనా మించిపోయింది లేదు. నువ్వు అప్రూవర్‌గా మారి మాతో సహకరించు. నీకు శిక్ష తగ్గే అవకాశం వుంది. లేదా కఠినశిక్ష తప్పదు! నీచేత రహస్యాలు చెప్పించక మానము. సరిగ్గా ఆలోచించుకో! మూడు నిమిషాల వ్యవధి!" గంభీరంగా చెప్పాడు ధర్మేంద్ర.

అతనేమీ మాట్లాడలేదు. అయితే అతనిలో జరుగుచున్న మానసిక మథనం అదురుతున్న కణతల ద్వారా కన్పిస్తూనే వుంది.

"ఒకటి... రెండు... మూడు" నిమిషాలు గడిచాయి.

అతను మెల్లగా తలయెత్తాడు.

"ఆల్ రైట్! నాకు తెలిసిన విషయాలు చెబుతాను" అన్నాడు చిన్నగా...

23

ఒక్క క్షణం ఊపిరి బిగపట్టాడు మురళి.

ఆ ముగ్గురూ మదించిన ఆబోతుల్లా ముందుకు వస్తున్నారు.

రాగిణి భయంగా మురళి చేతిని మరింత గట్టిగా పట్టుకుంది.

వాళ్ళు ముగ్గురూ బాగా దగ్గరకొచ్చారు.

"మిష్టర్, ఈ అమ్మాయి నీకేమవుతుంది?"

"నువ్వెవరు? నీకెందుకు చెప్పాలి" వెడసరంగానే సమాధానం చెప్పాడు మురళి.

"అవసరం! చెప్పి తీరాలి" గర్జించాడు ఒకడు.

"రాగిణి, నేనూ ప్రేమించుకుంటున్నాం. త్వరలో పెళ్ళికూడా చేసుకోబోతున్నాం!"

ఫెడీలున కొట్టాడా వ్యక్తి.

"యూ రాస్కెల్! పెళ్ళయిన అమ్మాయిని ప్రేమిస్తున్నావా?"

చెంప తడుముకున్నాడు మురళి. అతనిలో కోపం బుసలు కొట్టింది.

"నో! ఆ అమ్మాయికి పెళ్ళికాలేదు" అరిచాడు.

"బ్రూట్! మళ్ళీ ఆ మాట అన్నావంటే..." ముందుకు రాబోయాడు మరోవ్యక్తి.

"ఆగుః" గర్జించాడు మురళి.

ముగ్గురూ చటుక్కున నిలబడిపోయారు.

మురళి చేతులో రివాల్వర్ మెరుస్తోంది.

"మీ నాటకాలు నా దగ్గర చెల్లవు మిష్టర్! ఆడపిల్ల ఒంటరిగా వుందని ఆటలు పట్టిస్తారా? మిమ్మల్నందర్నీ కటకటాల వెనక్కి నెట్టిస్తాను. రాస్కెల్స్!" గట్టిగా అన్నాడు మురళి.

ముగ్గురూ మెత్తబడ్డారు. అందులో ఒకతను కొంచం ముందుకు వచ్చి దీనంగా అన్నాడు.

"సార్, మీరెవరో నిజంగా నాకు తెలియదు. ఆ అమ్మాయి నా భార్య! నన్ను మోసంచేసి యెక్కడికో పారిపోవాలని చూస్తుంది. ఇది నిజం! దయచేసి నా భార్యను నాకు అప్పగించండి."

రాగిణి కంగారుగా మురళివైపు చూసింది.

"రాజాబాబూ! వాడు చెప్పేది అంతా అబద్ధం! అసలు వాడెవరోకూడా నాకు తెలియదు. నాకసలు పెళ్ళికాలేదు. ప్లీజ్ నన్ను ఆ రాక్షసులకు అప్పగించకండి," ఏడుస్తూ అంది.

"ఆల్ రైట్! ఈ వ్యవహారం ఎలా పరిష్కారం చేయాలో నాకు తెలుసు. మిస్టర్, మీరు మీ యిద్దరు స్నేహితులతో పోలీస్ స్టేషన్‌కు రావలసి వుంటుంది. రాగిణీ, నిన్ను పోలీసులకు అప్పచెబుతాను. తరువాత వాళ్ళ యిష్టం!"

బెదురుగా, కసిగా చూశారు ముగ్గురూ. మురళి చేతిలో రివాల్వర్ లేకపోతే ముగ్గురూ మీదపడి మురళిని నామ రూపాలు లేకుండా చేసేవారు.

అదే సమయంలో అక్కడకు పోలీస్ జీప్ వచ్చి ఆగింది.

సబ్ యినస్పెక్టర్ దిగి గబగబ వీరి దగ్గరకు వచ్చాడు.

"ఏమిటీ అల్లరి?" గద్దించి అడిగాడు.

"సబ్ ఇనస్పెక్టర్! అయామ్ డిటెక్టివ్ మురళి! యు నో?" చిన్నగా అడిగాడు.

వెంటనే సబ్ యినస్పెక్టర్ మురళికి సెల్యూట్ చేశాడు.

"ఎస్సార్! మాకు అందరకూ యింటిమేషన్స్ వచ్చాయి. ఇక్కడేదో గొడవ జరుగుతూందని మాకు

ఫోన్ వస్తే వెంటనే బయలుదేరి వచ్చాం. అసలు ఏమిటి సార్ గొడవ?" వినయంగా అడిగాడు సబ్ యిన్‌స్పెక్టర్.

వివరంగా చెప్పాడు మురళి.

"వెధవలు! మక్కెలు విరగదన్నితే సరి!" అంతా విని అన్నాడు సబ్ యినస్పెక్టర్!

"అంతేకాదు సబ్ యినస్పెక్టర్! అసలు ఆ అమ్మాయి కూడా అబద్ధం చెబుతుందని మా అనుమానం. నన్ను బంధించడానికి వీళ్లు ఆడుతున్న నాటకం అయివుండ వచ్చు. ఏది ఏమైనా యీ నలుగురినీ అరెస్ట్ చేసి లాకప్‌లో వుంచండి, నాకు వేరే పని వుంది, అది చూసుకు వస్తాను," చెప్పాడు మురళి.

"ఎస్సార్! కానీ..." సందేహంగా అన్నాడు ఎస్.ఐ.

"వాట్ మిస్టర్? నీ అనుమానం ఏమిటి?"

"మీరుకూడా స్టేషన్‌కు రండి. వీళ్ళ అంతు తేలుద్దాం! మన వూహ నిజమయితే, వారిద్వారా కొన్ని వివరాలు రాబడదాం!" చిన్నగా చెప్పాడు. ఎస్. ఐ. అనుమానం అర్ధం చేసుకున్నాడు.

"అలాగే! పదండి" అన్నాడు మురళి నవ్వుతూ.

సబ్ యినస్పెక్టర్ కానిస్టేబుల్స్‌కు సైగ చేశాడు.

ముగ్గురు కానిస్టేబుల్స్ ఆ ముగ్గురిని పట్టుకొని జీప్ ఎక్కించారు. రాగిణి, మురళి కూడా ఎక్కిన తరువాత జీప్ కదిలింది.

పది నిమిషాలు ప్రయాణం సాఫీగా జరిగిపోయింది.

జీప్ సిటీ లిమిట్స్‌వైపు దూసుకుపోతోంది.

"మిస్టర్ ఎస్. ఐ! జీప్ యిటు వెళుతుందేమిటి?" అనుమానంగా అడిగాడు మురళి.

పకపక నవ్వాడు సబ్ ఇనస్పెక్టర్.

"మిష్టర్ మురళీ! నిన్ను బంధించడానికి యింతకన్నా మాకు ఉపాయం తట్టలేదు."

ఉలిక్కిపడ్డాడు మురళి. చటుక్కున జేబులో చేయి పెట్టబోయాడు. అప్పటికే ఆలశ్యమైపోయింది. అటూ, యిటూ రెండు రివాల్వర్లు డొక్కల్లో గుచ్చుకున్నాయి.

రాగిణి కులాసాగా సిగరెట్ త్రాగుతోంది.

"రాగిణీ!" గట్టిగా అరిచాడు మురళి.

"ష్! అరవకు. నా పేరు రాగిణి కాదు, నాగిణి! ఇప్పుడు నిన్ను కాటు వేయటానికి తీసుకువెళుతున్నాను," విలాసంగా నవ్వుతూ సిగరెట్ పొగను తమాషాగా మురళి పైకి వదిలింది.

ఆ పొగ పీల్చగానే మురళి నేదో మత్తు ఆవహించింది. తల మెల్లగా క్రిందకు వాలిపోయింది.

జీప్ వేగంగా దూసుకుపోతూనే వుంది.

24

కారు సరాసరి హోటల్ హైలాండ్స్ ముంది ఆగింది. కారులోంచి డిటెక్టివ్ ధర్మేంద్ర, ఎస్. బి. డైరెక్టర్ కమల్ నాథ్ క్రిందకు దిగారు. సర్వెంట్ వచ్చి కారును పార్కింగ్ ప్లేస్‌కు తీసుకు వెళ్ళాడు.

ఇరువురూ లోపలకు వెళ్ళారు. ధర్మేంద్ర కౌంటర్ వద్దకు వెళ్ళి రూం గురించి మాట్లాడాడు.

మరో రెండు నిమిషాలలో రూం బోయ్ వచ్చి "రూం నెంబర్ 60 సార్! ఫోర్త్ స్టెయిర్‌లో వుంది" అని చెప్పాడు.

ఇద్దరూ లిఫ్ట్ వైపు నడిచారు.

చెప్పుకోండి చూద్దాం?

1. ఒక వ్యక్తి గొంతును పిసికి చంపి, ఆ శవాన్ని నీటిలో మునిగేటట్లు పడవేశారు. కొన్ని రోజుల తర్వాత ఆ శవాన్ని పోస్టుమార్టం చేస్తే గొంతు నులిమి చంపినట్లు తెలుస్తుందా?

2. కొన్ని బలమైన గాయాలు తగిలి మరణించిన ఒక వ్యక్తి శరీరాన్ని పరీక్షించి, అతనికి ఏగాయం వల్ల ప్రాణాపాయం కలిగిందో తెల్సుకోవచ్చా?

3. హత్య చేయబడిన ఒక హతుడి శరీరంతో పాటు, అక్కడ నేలపై 'కారిన రక్తం మట్టి'ని కూడా పోస్టుమార్టంకు పంపుతారా?

4. 'మోటివ్' లేకుండా హత్య జరుగుతుందా?

5. బలమైన గాయాలు తగిలి స్పృహ కోల్పోయిన ఒక వ్యక్తిని పరీక్షించి, ఆ వ్యక్తికి ఎన్ని గంటల ముందు ఆ ప్రమాదం సంభవించినదో తెల్సుకోవచ్చునా?

6. నేలపై కారిన రక్తాన్ని పరీక్షించి, ఆ రక్తం శరీరంలో ఏ భాగంనుండి కారిందో తెల్సుకోవచ్చునా?

7. చనిపోయిన ఒక వ్యక్తిని వురి భంగిమలో వ్రేలాడ దీస్తే ఆ వ్యక్తి శరీరం నిటారుగా సాగే అవకాశం వుందా?

—కె. చందర్‌రావ్.

జవాబులు:

1. తెలియదు, 2. తెలుసుకోవచ్చును. 3. అవసరమైతే పంపుతారు, 4. జరగదు. 5. తెలుసుకోవచ్చును. 6. తెల్సుకోలేము. 7. వుండదు. మెడమాత్రం సాగుతుంది.

60 నంబర్ రూం చేరుకొనేసరికి రూంబోయ్ రూం నంతా రీ క్లీన్ చేసి సిద్ధంగా నిలబడ్డాడు.

ధర్మేంద్ర రూమ్ బోయ్‌కు ఓ రూపాయి టిప్ యిచ్చి రెండు బోర్నవిటా తెమ్మని పురమాయించాడు.

బోయ్ తల వూపి వెళ్ళిపోయాడు.

ధర్మేంద్ర తలుపులు వేసి బోల్టు బిగించి వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

"వాట్ మిస్టర్ ధర్మేంద్ర! మీ పరిశోధన ఎంత వరకు వచ్చింది?" సిగార్ ముట్టించి పొగ వదులుతూ అన్నాడు కమల్ నాథ్!

"పరిశోధన ప్రాథమిక ఘట్టం పూర్తయింది కమల్ జీ! ఓ అనుమానంమీద మురళిని హైద్రాబాద్ పంపాను. మురళి వస్తే కేసుకు ఆధారం బలపడుతుంది. ఇకపోతే ఇక్కడ ముగ్గురు లైట్ రాకెట్ మెంబర్స్‌ను బంధించి వారి దగ్గరనుండి కొన్ని రహస్యాలు బయట పెట్టించాం. అయితే ముఖ్యమయిన రహస్యాలు మాత్రం చెప్పడంలేదు. ఇకపోతే లైట్ రాకెట్‌లో వుండే ప్రతి మెంబర్‌కు తన సభ్యత్వపు నంబర్ వేసి వున్న వెండి కాయిన్ దగ్గరుంటుంది. అయితే వారి స్థావరం ఎక్కడో అంతు చిక్కడంలేదు. నంబర్ 37 అన్న మెంబర్ చేత కొన్ని విషయాలు చెప్పించగలిగాం. కానీ అతను తమ స్థావరం గురించి చెప్పలేదు. హఠాత్తుగా ఆత్మహత్య చేసు కున్నాడు. అతను చెప్పిన సమాచారం ప్రకారం లైట్ రాకెట్‌లో 500 మంది ఏక్టివ్ మెంబర్స్ వున్నారు.

పోతే మేము ఒక ప్రణాళిక రూపొందించాం. మాకు చిక్కబడిన లైట్ మెంబర్స్ స్థానంలో సి. ఐ. డి. లను

సప్లిమెంట్ పోటీ-18 [ఫలితాలు]

మార్చి' 76 నెల "సప్లిమెంట్ పోటీ-18" కి సరియైన జవాబు:

65	67	66	64	68

పై విధంగా సరియైన జవాబు ఒకే ఒకరు వ్రాశారు. వీరికి జూన్' 76 నెల నుండి ఒక ఏడాది పాటు "సప్లిమెంట్" ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేత:

శ్రీ చాగాపురం నాగేశ్వరరావు,

మల్డకల్-పోస్టు,

గద్వాల-తాలూకా,

మహబూబ్ నగర్ జిల్లా.

ప్రవేశ పెట్టాం. వారికి పూర్తి తర్ఫీదు యిచ్చాం. వారు ఎలాగైనా సరే స్థావరాన్ని గుర్తించి అందులో ప్రవేశిం చాలి. అందుకోసమే అంతా ఎదురుచూస్తున్నాం,'' చెప్పాడు ధర్మేంద్ర విపులంగా.

"థాంక్స్ మిస్టర్ ధర్మేంద్ర! నేను అత్యవసర పని మీద జపాన్ వెళ్ళవలసి వచ్చింది. ఈ విషయం తెలిసి నా కార్యక్రమాన్ని క్లుప్తంగా ముగించుకొని తిరిగి వచ్చాను. మా సి. ఐ. డీలు సమర్పించిన నివేదిక చూశాను. వారు కొద్దిమంది వ్యక్తులను అనుమానించారు కానీ, ఆధారాలను చూపించలేకపోతున్నారు. ప్రత్యే కంగా యీ పనిమీద దేశవ్యాప్తంగా 160 మంది ఏజంట్లు పని చేస్తున్నారు. అందులో పదిహేనుమంది స్పెషల్ స్క్వాడ్ కేవలం X – లైట్ మీదనే కేంద్రీకరించ బడ్డారు!'' ఒక్క నిమిషం ఆగి సిగార్ వెలిగించు కున్నారు.

"మీ ఏజంట్లు అనుమానించిన వ్యక్తుల పేర్లు మీవద్ద వున్నాయా?'' అడిగాడు ధర్మేంద్ర.

"ఆ'' అంటూ కేస్‌లోంచి చిన్న కవర్ తీసియిచ్చాడు ఎస్. బి. డైరెక్టర్ కమల్‌నాథ్.

ధర్మేంద్ర కవర్‌లోంచి కాగితం తీసి చూశాడు. మొత్తం వంద పేర్లున్నాయి. అందులో ఆంధ్రప్రదేశ్‌లో 25 పేర్లు వున్నాయి. అందులో నగరానికి సంబంధించి పదిపేర్లు వున్నాయి. ఆ పదిపేర్లు చదివాడు. ధర్మేంద్ర పెదవులపై చిరునవ్వు నాట్యం చేసింది.

"మీ ఏజంట్ల అభిప్రాయాలు, అనుమానాలు సహే తుకమని భావిస్తున్నాను.''

అపరాధ పరిశోధన పోటీ-92 [ఫలితాలు]

మార్చి' 76 నెల "అపరాధ పరిశోధన పోటీ-92"కి సరియైన సమాధానాలు:

1. తమిళనాడు.
2. సినిమాలు.
3. ప్రగతి పథము.
4. పత్రికలు.
5. కె. విశ్వనాథ్.

పై జవాబుల ప్రకారం ముగ్గురు మాత్రమే ఆల్ కరక్టుగా పంపారు. అయితే వీరిలో శ్రీ కాళంగి మురళి, బి. కాం., 4/7 బ్రాడీపేట, గూంటూరు-2 గారు పంపిన రెండు కూపన్లు పోటీ నిబంధనలకు విరుద్ధంగా పోస్టేజి లేకుండా పంపినందున వారికి బహుమతి ప్రకటించటము లేదు. బహుమతి పొందిన యీ క్రింది ఇరువురు పాఠకులకు జూన్' 76 నెల నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాస పత్రిక ఉచితంగా పంపగలము.

(1) శ్రీ జె. కృష్ణారావు,
6-3-65, అరుండల్ పేట, 3వ లైను,
గుంటూరు.

(2) శ్రీ బి. రమేష్ బాబు,
నక్కనూర్-పోస్టు,
మిర్యాల గూడెం-తాలుకా,
నల్లగొండ జిల్లా.

"ఎందువలన?"

"ఈ లిస్టులో యిప్పటికే యిద్దరిని అరెస్ట్ చేశాం. బహుశా మిగిలినవారుకూడా నేరస్థులే అయివుండవచ్చు!"

"ఇక పోతే నేను యిక్కడకు రావడంలో ఓ ప్రధాన ఉద్దేశ్యం వుంది," చిన్నగా అన్నాడు కమల్ నాథ్.

"నేను ఊహించాను. అయినా చెప్పండి!" నవ్వాడు ధర్మేంద్ర.

"మీరు యీ వలయాన్ని చాలా త్వరగా ఛేదించాలి. ఎందువలనంటే, సరిగ్గా మరో నాలుగురోజులలో నగరంలో 'అఖిలభారత రాజకీయ నాయకుల మహాసభ' జరుగబోతోంది. ఈ సభలో మనదేశంలోని అన్నిపక్షాల నాయకులు పాల్గొంటారు. వీలైతే రాజకీయ నాయకులందరినీ పరలోకగతులను చేయాలని 'లైట్ రాకెట్' ప్లానులు వేస్తున్నట్లు మాకు సూచనగా వార్తలందాయి.

వారి ప్రయత్నాన్ని వమ్ముచేయాలంటే, ఈలోపు ఆ రాకెట్ ను బంధించి, వారిని ససాక్ష్యంగా సభముందు నిలబెట్టాలి."

"అలాగే సార్! నా సర్వశక్తులూ యిందులో కేంద్రీకరిస్తున్నాను. ఇక ఫలితం దైవాధీనం!"

టకటకమని తలుపు చప్పుడయింది.

చటుక్కున లేచి నిలబడ్డాడు ధర్మేంద్ర. రివాల్వర్ పొజిషన్ లో వుంచుకొని మెల్లగా తలుపు తెరిచాడు. బోయ్ రెండు కప్పుల బోర్నవిటా తీసుకొని లోపలకు ప్రవేశించాడు.

చిన్నగా నవ్వుకుంటూ రివాల్వర్ పాకెట్ లోకి జారవిడిచి కప్పు అందుకున్నాడు.

"సార్, ఎవరో ఒకాయన మీకు ఈ చీటీ ఇమ్మన్నాడు

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 లకే మీ ఇంటి దగ్గర అందజేయపడతాయి.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి ముందుగా మీరు రు. 5/- పంపాలి. పైకం మనియార్డరు ద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును.

3. సభ్యులుగా చేరిన వారికి పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 లకే ప్రతినెలా వి. పి. ద్వారాగాని, మాఏజెంట్ ద్వారాగాని పంపుతాము. మీ ఇంటి దగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును.

4. కాపీలు మీకు నెలనెలా రెగ్యులర్‌గా పంపపడతాయి. ఏ నెలలోనైనా కాపీలు తీసుకోకపోతే మీ సభ్యత్వం రద్దవుతుంది. మీ చిరునామా మారినప్పుడల్లా ముందుగా తెలియజేయాలి. సభ్యులకు ఏవైనా పాత కాపీలు కావలిస్తే వాటినికూడా వి.పి.ద్వారా పంపగలము.

5. ప్రస్తుతము ఈ క్రింది సెంటర్లలో ఏజెంట్ హోమ్ డెలివరీ ఏర్పాటు వున్నది: 1. రాజమండ్రి, 2. కాకినాడ, 3. విశాఖపట్టణం, 4. హైద్రాబాదు, 5. అనకాపల్లి, 6. తెనాలి, 7. వరంగల్, 8. కరీంనగర్ 9. సీలేరుప్రాజెక్టు, 10. శ్రీశైలంప్రాజెక్టు, 11. విజయవాడ, 12. హిందూపురం, 13. తాడేపల్లి గూడెం, 14. గుంటూరు, 15. నెల్లూరు, 16. బెల్లంపల్లి.

సార్!" అంటూ ఓ చిన్న కాగితం చేతికి ధర్మేంద్ర యిచ్చాడు.

ఆశ్చర్యంగా ఆ చీటీ అందుకుని చూశాడు ధర్మేంద్ర.

"ఈ చీటీ ఎవరు ఇచ్చారు నీకు?" బోయ్‌ను అడిగాడు.

"అతను నాకు తెలియదు సార్! క్రింద టిఫిన్ చేసి, నాకు రూపాయి టిప్ యిస్తూ ఈ కాగితం రూంనంబర్ 60 లో ఇమ్మన్నారు సార్. అంతేనండి!"

"అతను ఇంకా క్రిందే వున్నాడా?"

"లేదు సార్! అప్పుడే వెళ్ళిపోయాడు సార్!"

"ఆల్ రైట్! మళ్ళీ కనబడితే ఆ వ్యక్తిని గుర్తుపట్టగలవా?"

"ఆఁ. నాకు బాగా గుర్తు వున్నాడు!"

"వెరీగుడ్! అతను మళ్ళీ ఇక్కడకు వస్తే వెంటనే నాకు తెలియపరుచు. నీకు మంచి బహుమానం ఇస్తాను!"

"అలాగే సార్!" అంటూ ఖాళీ కప్పులు తీసుకొని బయటకు వెళ్ళిపోయాడు.

ధర్మేంద్ర డోర్ లాక్ చేసి వచ్చి, సోఫాలో కూర్చొని వున్న కమల్‌నాధ్‌కు అందించాడా చీటీని.

కుతూహలంగా ఆ చీటీని చూశాడు.

"వెంటనే బాత్‌రూంలోకి వెళ్ళు!" చక్కగా ఇంగ్లీషులో వ్రాసి వుంది.

"ఈజిట్ ప్రాక్టికల్ జోక్?"

"ఏమో! చూస్తే కానీ తెలియదు!"

"అనవసరం! ఎవడో సరదాకు వ్రాసి వుంటాడు."

"నో! సరదాకు యిలాంటి పనులు మనదగ్గర చేయరు. ఇది ఏదో సీరియస్ విషయమే! ఆల్ రైట్, నేను వెళ్ళి చూసి వస్తాను. మీరు వుండండి" లేచాడు ధర్మేంద్ర!

అపరాధ పరిశోధన పోటీ-94

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో **75** పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ **75** పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో౦. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు**30-5-'76** తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జులై **'76** నెల సంచికలో ప్రకటిస్తాము. *

1. 'డైనమైట్'ను మొదటిసారిగా కనుగొన్నది ఎవరు? (ఆల్ఫ్రెడ్ నోబెల్, ప్రిన్స్‌డన్.)

2. నేటి నాగరిక మానవుడిలో ఇది కొంత ప్రబలింది? (ఆటవిక తత్వం, రాక్షసత్వం.)

3. ఇవి మనుషులను కుట్టి తమ ప్రాణాలనే పోగొట్టుకుంటాయి___? (చీమ, తేలు.)

4. రోగాన్ని నయం చేసేది___? (డాక్టరు, మందు.)

5. మానవాళికి మొదటి శత్రువు___? (ఎలుకలు, పాములు.)

ఉత్సాహంగా బాత్ రూం వైపు నడిచాడు, ధర్మేంద్ర మస్తిష్కంలో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

"ఈ చీటీ ఎవరు పంపారు? ఎందుకు పంపారు? శత్రువులా? మిత్రులా? మిత్రులైతే సరాసరి వచ్చి కలుసుకో వచ్చు. బాత్ రూంలోకి వెళితే ఏముంటుందక్కడ? ఎవరన్నా తనను కలుసుకుంటారా? ఏమైనా సమాచారం తెలుస్తుందా? లేక తనపై మరల హత్యాప్రయత్నం జరుగుతుందా? అక్కడకు వెళితే ప్రమాదమా?"

రివాల్వర్ పొజిషన్‌లో పట్టుకొని ధైర్యంగా ముందుకు నడిచాడు ధర్మేంద్ర.

25

జీప్ మెల్లగా ఒక చోట ఆగింది.

"నాగిణీ! వీడ్ని ఏంచేద్దాం?" అడిగాడు ఒకతను మురళీని చూపిస్తూ.

"ఇది విశాలమైన మైదానం. ఇక్కడకు ఎవరూ రారు. వీడ్ని ఖండఖండాలుగా నరికి ఆ పొదలలో పడేయండి" కర్కశంగా ఆజ్ఞాపించింది నాగిణి.

చిన్నగా వులిక్కిపడ్డాడు మురళి. సిగరెట్ పొగలో మత్తుమందు కలిసిందని వాసన తెలియగానే శ్వాస బిగపట్టాడు మురళి. రెండు క్షణాల తర్వాత స్పృహ తప్పిపోయినట్లు క్రిందకు వాలిపోయాడు.

తను స్పృహ తప్పిపోయాడని భావించి వాళ్ళు మాట్లాడుకొంటున్న మాటలన్నీ విన్నాడు మురళి. వింటున్నంత సేపు హృదయంలో అగ్నిగోళాలు బ్రద్దలయ్యాయి. ఆవేశం లావాలా ఉప్పొంగింది.

"వీడిని యిలాగే సఫా చేద్దామా? స్పృహ తెప్పించి మరీ చంపుదామా?" ఒకతను అడిగాడు. (సశేషం.)

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండే ట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, ఈ నెల 10వ తేదీలోపల మాకు చేరేట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హో.డె. సభ్యులు తమ నెంబరును స్పష్టంగా వ్రాయాలి. ఇతరులు తమవ్యాఖ్యలతో 30 పైసల స్టాంపులు జతపర్చి పంపాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 20/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు వచ్చే సంచికలో చూడండి. ★

గత నెల పోటీ ఫలితాలు

(1) ఏప్రిల్ '76 నెల "అపరాధ పరిశోధన" మాసపత్రిక ముఖచిత్రాలకు బహుమతిపొందిన వ్యాఖ్య:

చిరిగిన ముక్కల అతుకు!
చివరన ముగిసిన బ్రతుకు!!

పంపినవారు: శ్రీ ఎన్. సత్యానంద్, మెయిన్ రోడ్, బెల్లంపల్లి, ఆదిలాబాద్ జిల్లా.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

రగిలిన పగ!
రక్కసి జాణ!!

పంపినవారు: శ్రీమతి పి. అనంతలక్ష్మి, భర్త పేరు-పి. చటర్జీ, ఎమ్.ఇ., డాబా గార్డెన్స్, విశాఖపట్టణం-4.

లాయరు సలహా

మీ ప్రశ్నలకు, ప్రముఖ న్యాయవాది
శ్రీ పోతుకూచి సాంబశివవుగారి జవాబులు

పి. ప్రభాకరరావు, రామాజిపల్లి.

ప్ర: మీ అనుభవంలో ఇంతవరకు కేసేదైనా మిమ్మల్ని తికమక పరుస్తూ తగిలిందా?

జ: ప్రతీ కేసు తికమకగానే వుంటుంది. అందులో క్రొత్త లాయర్లకు మరీను—పాత లాయర్లకూ క్రొత్త విషయం కేసు తికమకపెడుతూనే వుంటుంది. కేసు తికమకలకంటే ప్రశ్నల తికమకలు నాకు ఎక్కువైపోయాయి.

యస్. యమ్. దస్తగిర్, మందమర్రి.

ప్ర: కానిస్టేబిల్ డ్యూటీలో వుండి త్రాగినట్లయితే అతనికెటువంటి శిక్ష పడుతుంది?

జ: డ్యూటీలో త్రాగడం నేరంకాదు. త్రాగుడు ఫలితం వల్ల డ్యూటీ చెడితే నేరస్థుడిగా పరిగణిస్తారు. యుద్ధంలో సైనికులు తాగి కూడా యుద్ధం చేస్తారు. పోలీసుల్లో ఏ ఉద్యోగి అయినా తాగి డ్యూటీ చెడగొడితే సముచిత శిక్ష అనుభవిస్తారు. కొందరు త్రాగి, వాసన కూడా తెలియకుండా, యింకా చలాకీగా వుంటూ పనిచేస్తే, ఏమనగలం?

సి. హెచ్. గంగారాజమ్, బొంబాయి.

ప్ర: ఒక దేశద్రోహి జైలులో వుంటే, అతని భార్యా